**********************************************************************************************************

**1)మోహన**

ప॥ మాధవ కేశవ మధుసూదన విష్ణు। శ్రీధరా పదనఖమ్ చింతయామి యూయమ్॥

చ॥ వామన గోవింద వాసుదేవ ప్రద్యుమ్న। రామరామ కృష్ణ నారాయణాచ్యుత।
దామోదరానిరుద్ధ దైవ పుణ్డరీకాక్ష। నామత్రయాధీశ నమోనమో॥

చ॥ పురుషోత్తమ పుణ్డరీకాక్ష దివ్య। హరి సంకర్షణ అధోక్షజ।
నరసింహ హృషీకేశ నగధర త్రివిక్రమ। శరణాగత రక్ష జయజయ సేవే॥

చ॥ మహిత జనార్దన మత్స్యకూర్మ వరాహ। సహజ భార్గవ బుద్ధ జయతురగ కల్కి।
విహిత విజ్ఞాన శ్రీవేంకటేశ శుభకరం। అహమిహ తవపద దాస్యం అనిశం భజామి॥

**2)శుద్ధ ధన్యాసి**

ప॥ భావములోన బాహ్యమునందును। గోవిందగోవింద యని కొలువవో మనసా॥

చ॥ హరి యవతారములే అఖిల దేవతలు। హరిలోనివే బ్రహ్మాణ్డములు।
హరినామములే అన్ని మంత్రములు। హరి హరి హరి హరి హరి యనవో మనసా॥

చ॥ విష్ణుని మహిమలే విహిత కర్మములు। విష్ణుని పొగడెడి వేదంబులు।
విష్ణుడొక్కడే విశ్వాంతరాత్ముడు। విష్ణువు విష్ణువని వెదకవో మనసా॥

చ॥ అచ్యుతుడితడే ఆదియు నంత్యము। అచ్యుతుడే అసురాంతకుడు।
అచ్యుతుడు శ్రీవేంకటాద్రి మీద నిదె। అచ్యుత అచ్యుత శరణనవో మనసా॥

**3)మోహన**

ప॥ చేరి యశోదకు శిశువితడు। ధారుణి బ్రహ్మకు తండ్రియు నితడు॥

చ॥ సొలసి జూచినను సూర్యచంద్రులను। లలివెదజల్లెడు లక్షణుడు।
నిలిచిన నిలువున నిఖిల దేవతల। కలిగించు సురల గనివో యితడు॥

చ॥ మాటలాడినను మరియజాణ్డములు। కోటులు వొడమెటి గుణరాశి।
నీటుగ నూర్పుల నిఖిల వేదములు। చాటువ నూరెటి సముద్రుడితడు॥

చ॥ ముంగిట పొలసిన మోహన మాత్మల। పొంగించే ఘన పురుషుడు।
సంగతి మావంటి శరణాగతులకు। అంగము శ్రీవేంకటాధిపుడితడు॥

**4)ఆభేరి**

ప॥ పలుకు తేనియల తల్లి పవళించెను। కలికి తనముల విభుని కలిసినది గాన॥

చ॥ నిగనిగని మోముపై నెరులు గెలకుల చెదర। పగలైన దాక చెలి పవళించెను।
తెగని పరిణతులతో తెల్లవారిన దాక। జగదేక పతి మనసు జట్టిగొనె గాన॥

చ॥ కొంగు జారిన మెరుగు గుబ్బ లొలయగ తరుణి। బంగారు మేడపై పవళించెను।
చెంగలువ కనుగొనల సింగారములు దొలక। అంగజగురునితోడ అలసినది గాన॥

చ॥ మురిపెంపు నటనలతో ముత్యాల మలగుపై। పరవశంబున తరుణి పవళించెను।
తిరువేంకటాచలాధిపుని కౌగిట గలసి। అరవిరైనను చెమట నంటినదిగాన॥

**5)మణిరంగు**

ప॥ జయజయ రామ సమర విజయరామ। భవహర నిజభక్తి పారీణరామ॥

చ॥ జలధి బంధించిన సౌమిత్రిరామ।సెలవిల్లు విరచిన సీతారామ।
అల సుగ్రీవు నేలిన అయోధ్య రామ। కలిగి యజ్ఞము గాచే కౌసల్య రామ॥

చ॥ అరి రావణాంతక ఆదిత్య కులరామ। గురుమౌనులను గాచే కోదణ్డరామ।
ధర నహల్యపాలిటి దశరథ రామ। హరురాణి నుతుల లోకాభిరామ॥

చ॥ అతి ప్రతాపముల మాయామృగాంతక రామ। నుత కుశలవ ప్రియ సుగుణరామ।
వితత మహిమల శ్రీవేంకటాద్రి రామ। మతిలోన బాయని మనువంశ రామ॥జయ॥

**********************************************************************************************************

**6) కురంజి**

ప॥ ముద్దుగారే యశోద ముంగిట ముత్యము వీడు। తిద్దరాని మహిమల దేవకీ సుతుడు॥

చ॥ అంత నింత గొల్లెతల అరచేతి మాణిక్యము। పంతమాడే కంసునిపాలి వజ్రము।
కాంతుల మూడు లోకాల గరుడ పచ్చపూస। చెంతల మాలోనున్న చిన్నికృష్ణుడు॥

చ॥ రతికేళి రుక్మిణికి రంగుమోవి పగడము। మితి గోవర్ధనపు గోమేధికము।
సతమై శంఖ చక్రాల సందుల వైడూర్యము। గతియై మమ్ముగాచే(టి) కమలాక్షుడు॥

చ॥ కాళింగుని తలలపై కప్పిన పుష్యరాగము। ఏలేటి శ్రీవేంకటాద్రి యింద్ర నీలము।
పాలజల నిధిలోని పాయని దివ్యరత్నము। బాలుని వలె తిరిగీ పద్మనాభుడు॥

**7) హుసేని**

ప॥ వెనకేదో ముందేదో వెర్రినేను నా। మనసు మరులుదేర మందేదొకో॥

చ॥ చేరి మీదటి జన్మము సిరులకు నోమేగాని। యేరూపై పుట్టుదునో యెరుగనేను।
కోరి నిద్రించబరచుకొన నుద్యోగింతు గాని। సారెలేతునో లేపనో జాడ తెలియ నేను॥

చ॥ తెల్లవారినప్పుడెల్లా తెలిసితినేగాని। కల్లయేదో నిజమేదో కాననేను।
వల్ల చూచి కామినుల పంపించెగాని। మెల్లమై నా మేను ముదిసిన దెరుగ

చ॥ పాపాలు చేసి మరచి బ్రదుకు చున్నాడగాని। వైపుగ చిత్రగుప్తుడు వ్రాయు టెరుగ।
యేపున శ్రీవేంకటేశుడెక్కడో వెదకే గాని। నా పాలి దైవమని నన్నుగాచుటెరుగ

**8) ముఖారి**

ప॥ పలుమరు పుట్ల పండగను। చిలుకు చిడక్కని చిందగను॥

చ॥ ఊళ్ళ వీధుల పుట్ల కృష్ణుడు। తాళ్ళు తెగిపడ తన్నగను।
పెళ్ళు కతిల్లుపెఠిళ్ళు చిఠిల్లని। పెళ్ళుగ మ్రోసెపెనురవము॥

చ॥ బంగరు బిందెల పాలుపెరుగులు। ముంగిట నెగయుచు మోదగను।
కంగు కళింగు కఠింగు ఖణింగని। రంగు మీరపెనురవములై॥

చ॥ నిగ్గగు వేంకట నిలయుడిటు పా। లగ్గలిక పగుల అడువగను।
బగ్గు బగ్గిలని పరమామృతములు। గుగ్గిలి పదనుగ గురియగను॥

**9) తోడి**

ప॥ విరహపు రాజదె విడిదికి రాగా। సిరుల జేసెనిదె సింగారములు॥

చ॥ నెలత నుదుటిపై నీలపు కురులనె। తొలుతనె గట్టెను తోరణము।
మొలక చెమటలనె ముత్యపు (మ్రుగ్గులు)। అలరిచె మదనుండిదె చెలిమేన॥

చ॥ దట్టముగ చింతా లతనే వడి। బెట్టె చప్పరము పెనుగొనగా।
పట్టిన మై తావులు పరిమళములు। కట్టించెను చెంగట వలరాజు॥

చ॥ విందగు వేంకట విభుని ప్రేమచే। పొందగ బెట్టెను బోనాలు।
ఇందు వదనికి ఇందిరా విభుని। కందుదేర నలుకలు చవిజేసె॥

**10) ఖరహరప్రియ**

ప॥ ఒకపరి కొకపరి కొయ్యారమై। మొకమున కళలెల్ల మొలసినట్లుండె॥

చ॥ జగదేక పతిమేన చల్లిన కర్పూర ధూళి। జిగిగొని నలువంక చిందగాను।
మొగి చంద్రముఖి నురమున నిలిపె గాను। పొగరు వెన్నెల దిగిపోసినట్లుండె॥

చ॥ పొరిమెరుగు చెక్కుల పూసిన తట్టు పునుగు। కరిగి యిరుదెసల కారగాను।
కరిగమన విభుడు గనుక మోహ మదముల। తొరిగి సామజ సిరి తొలకి నట్టుండె॥

చ॥ నెరయు శ్రీవేంకటేశు మేన సింగారముగాను। తరచైన సొమ్ములు ధరియించగా।
మెరుగు బోడీ అలమేలు మంగయు తాను। మెరుపు మేఘము గూడి మెరసినట్టుండె॥

************************************************************************************************************

**11) రాగమాలిక**

ప॥ అలర చంచలమైన ఆత్మలందుండ నీ యలవాటు చేసె నీవుయ్యాల। -- (ఆనందభైరవి)
పలుమారు నుచ్ఛ్వాస పవనమందుండ నీ భవంబు దెలిపె నీ వుయ్యాల॥

చ॥ ఉదాయాస్త శైలంబు లొనర కంభములైన వుడుమండలము మోచె నుయ్యాల। -- (కేదార)
అదన ఆకాశపదము అడ్డదూలంబైన అఖిలంబు నిండె నీ వుయ్యాల॥

చ॥ పదిలముగ వేదములు బంగారు చేరులై పట్టి వెరపై తోచె వుయ్యాల। -- (మలయమారుత)
వదలకిటు ధర్మదేవత పీఠమై మిగుల వర్ణింప నరుదాయె వుయ్యాల॥

చ॥ మేలు కట్లయి మీకు మేఘమణ్డలమెల్ల మెరుగునకు మెరుగాయె వుయ్యాల। -- (రీతిగౌళ)
నీల శైలమువంటి నీ మేనికాంతికి నిజమైన తొడవాయె వుయ్యాల॥

చ॥ పాలిండ్లు కదలగా పయ్యదలు రాపాడ భామినులు వడినూచు వుయ్యాల। -- (నీలాంబరి)
వోలి బ్రహ్మాణ్డములు వొరగువో యని భీతి నొయ్య నొయ్యనైరి వూచిరుయ్యాల॥

చ॥ కమలకును భూపతికి కదలు కదలకు మిమ్ము కౌగలింపగజేసె నుయ్యాల। -- (శ్రీరాగమ్)
అమరాంగనలకు నీ హాస భావ విలాస మందంద చూపె నీ వుయ్యాల॥

చ॥ కమలాసనాదులకు కన్నుల పండుగై గణుతింప నరుదాయె వుయ్యాల। -- (సురటి)
కమనీయ మూర్తి వేంకటశైలపతి నీకు కడువేడుకై వుండె వుయ్యాల॥

**12) యదుకులకాంభోజి**

ప॥ కొలని దోపరికి గొబ్బిళ్ళో యదు। కుల స్వామికిని గొబ్బిళ్ళో॥

చ॥ కొండ గొడుగుగా గోవుల గాచిన। కొండొక శిశువునకు గొబ్బిళ్ళో।
దండగంపు దైత్యుల కెల్లను తల। గుండు గండనికి గొబ్బిళ్ళో॥

చ॥ పాప విధుల శిశుపాలుని తిట్టుల। కోపగానికిని గొబ్బిళ్ళో।
యేపున కంసుని యిడుమల బెట్టిన। గోప బాలునికి గొబ్బిళ్ళో॥

చ॥ దండివైరులను తరిమిన దనుజుల। గుండె దిగులునకు గొబ్బిళ్ళో।
వెండిపైడి యగు వేంకట గిరిపై। కొండలయ్యకును గొబ్బిళ్ళో॥

**13) ఆనందభైరవి**

ప॥ ఇట్టి ముద్దులాడి బాలుడేడవాడు వాని। పట్టి తెచ్చి పొట్టనిండ పాలు వోయరే॥

చ॥ కామిడై పారిదెంచి కాగెడి వెన్నలోన। చేమ పూవు కడియాల చేయి పెట్టి।
చీమ గుట్టెనని చెక్కిట కన్నీరు జార। వేమరు వాపోయె వాని వెడ్డువెట్టరే॥

చ॥ ముచ్చువలె వచ్చి తన ముంగిట మురువులచేయి। తచ్చెడిపెరుగులోన తగవెట్టి।
నొచ్చెనని చేయిదీసి నోరనెల్ల జొల్లుగార। వొచ్చెలి వాపోవువాని నూరడించరే॥

చ॥ ఎప్పుడు వచ్చెనో మా యిల్లు జొచ్చి పెట్టెలోని। చెప్పరాని వుంగరాల చేయి పెట్టి।
అప్పడైన వేంకటేశుడా సపాలకుడు గాన। తప్పకుండ బెట్టివాని తలకెత్తరే॥

**14) మధ్యమావతి**

ప॥ ఉయ్యాల బాలునూచెదరు కడు। నొయ్య నొయ్య నొయ్యనుచు॥

చ॥ బాల యవ్వనులు పసిడి వుయ్యాల। బాలుని వద్ద పాడేరు।
లాలి లాలి లాలి లాలెమ్మ। లాలి లాలి లాలి లాలనుచు॥

చ॥ తమ్మిరేకు గనుదమ్ముల నవ్వుల। వమ్ముజూపుల బాడేరు।
కొమ్మలు మట్టెల గునుకుల నడవుల। ధిమ్మి ధిమ్మి ధిమ్మి ధిమ్మనుచు॥

చ॥ చల్లుజూపుల జవరాండ్లు। రేపల్లె బాలుని బాడేరు।
బల్లిదు వేంకటపతి జేరనందెలు ఘల్లు ఘల్లు ఘల్లు ఘల్లనుచు॥

**15) ఖమాచ్**

పll ఉగ్గువెట్టరే వోయమ్మా। చేయుగ్గీ నిదె శిశువోయమ్మా॥
చll కడుపులోని లోకమ్ములు గదిలీ। నొడలూచకురే వోయమ్మా।
తొడికెడి సరగున తొలగదీయరే। పుడికెడి పాలివి వోయమ్మా॥
చll చప్పలు పట్టుక సన్నపు బాలుని। నుప్పర మెత్తకు రోయమ్మా।
అప్పుడె సకలము నదిమీ నోరనె। వొప్పదు తియ్యరె వోయమ్మా॥
చll తొయ్యలు లిటు చేతుల నలగించక। వుయ్యల నిడరే వోయమ్మా।
కొయ్యమాటలను కొండల తిమ్మని। వొయ్యన తిట్టకు రోరమ్మా॥

**16) మలహరి**

పll కోరుదు నామది ననిశము గుణధరు నిర్గుణు కృష్ణుని। నారాయణు విశ్వంభరు నవనీతాహారుని॥
చll కుండలి మణిమయ భూషణు కువలదళ వర్ణాంగుని। అణ్డజపతి వాహనుని అగణిత భవహరుని।
మణ్డన చోదకదమనుని మాలాలంకృత వక్షుని। నిండు కృపాంబుధి చంద్రుని నిత్యానందుని॥
చll ఆగమపుంజ పదార్థుని ఆపత్సఖ సంభూతుని। నాగేంద్రాయుత తల్పుని నానా కల్పుని।
వాగుబ్రహ్మ మయాఖ్యుని సంతతగాన విలోలుని। వాగీశ సంస్తోత్రుని వైకుంఠోత్తముని॥
చll కుంకుమ వసంతకాముని గోపాంగన కుచలిప్తుని। శంకర సతీమణి నుతుని సర్వాత్ముని సముని।
శంఖ నినాద మృదంగుని చక్రాయుధ విదీప్తుని। వేంకటగిరి నిజవాసుని విభవ విధాయకుని॥

**17) భైరవి**

పll ఎవ్వరి భాగ్యంబెట్టున్నదో। దవ్వు చేరువకు తానే గురుతు॥
చll పరమ మంగళము భగవన్నామము। సురలకు నరులకు శుభకరము।
ఇరువుగ నెరిగిన యెదుటనె వున్నది। వరుసల మరచిన వారికి మాయ॥
చll వేదాంత సారము విష్ణు భక్తియిది। అది మునుల మతమైనది।
సాధించు వారికి సర్వసాధనము। కాదని తొలగిన కడు శూన్యంబు॥
చll చేతి నిధానము శ్రీవేంకటపతి। ఏతల జూచిన నిందరికి।
నీతియు నిదియే నిజసేవకులకు। పాతకులకు అది భవసాగరము॥

**18) భుజంగిణి**

పll ఎదుటనున్నాడు వీడె ఈ బాలుడు। మదిదెలియమమ్మ ఏమరులోగాని॥
చll పరమ పురుషుడట పసులగాచెనట। సరవులెంచిన విన సంగతా యిది।
హరియె తానట ముద్దులందరికి జేసెనట। యిరవాయ నమ్మ సుద్దులేటివోగాని॥
చll వేదాల కొడయడట వెన్నలు దొంగిలెనట। నాదాన్ని విన్నవారికి నమ్మికాయిది।
ఆదిమూల మితడట ఆడికెల చాతలట। కాదమ్మ యీ సుద్దులెట్టికతలో గాని॥
చll అల బ్రహ్మ తండ్రియట యశోదకు బిడ్డడట। కొలదొకరికి చెప్ప కూడునా యిది।
తెలిసి శ్రీ వేంకటాద్రి దేవుడై విలిచెనట। కలదమ్మ తనకెంత కరుణోగాని॥

**19) పూర్వీకల్యాణి**

పll ఘుమ్మని యెడి శ్రుతి గూడగాను। కమ్మని నేతుల కాగగచెలగె॥
చll నీలవర్ణుడని నీరజాక్షుడని। బాలుని నతివలు పాడేరో।
పాలుపిదుకుచును బానల కాగుల। సోలి పెరుగు త్రచ్చుచు చెలరేగి॥
చll మంధరధరుడని మాధవుడని గో। విందుని పాడేరు వెలదులిదే।
నందవ్రజమునను నలుగడనావుల। మందలపేయల మంచి రసముల॥
చll వేంకట పతియని వేదనిలయుడని। పంకజనాభుని పాడేరో।
అంకుల చేతను అలరు రవంబుల। బింకపు మాటల బృందావనమున॥

**20) ఆనందభైరవి**

ప॥ కంటి శుక్రవారము గడియ లేడింట। అంటి అలమేల్మంగ అండనుండే స్వామిని॥
చ॥ సొమ్ములన్నీ కడపెట్టి సొంపుతో గోణముగట్టి। కమ్మని కదంబము కప్పు కన్నీరు।
చెమ్మతోను వేష్టువలు రొమ్ముతల మొలజుట్టి। తుమ్మెద మైచాయతోన నెమ్మదినుండే స్వామిని॥
చ॥ పచ్చకప్పురమే నూరిపసిడి గిన్నెలనించి। తెచ్చి శిరసాదిగ దిగనలది।
అచ్చెరపడి చూడనందరి కనులకింపై। నిచ్చమల్లె పూవువలె నిటుతానుండే స్వామిని॥
చ॥ తట్టుపునుగే కూరిచిచట్టులు చేరిచినిప్పు। పట్టి కరిగించు వెండి పళ్యాలనించి।
దట్టముగ మేను నిండపట్టించి దిద్ది। బిట్టు వేడుక మురియు చుండేబిత్తరి స్వామిని॥

**21) ఖమాచ్**

ప॥ సింగారమూరితివి చిత్తజు గురుడవు। చక్కగ జూచేరు మిము సాసముఖా॥
చ॥ పూవుల తెప్పలమీద పొలతులు నీవునెక్కి। పూవులు ఆకసము మోప పూచిచల్లుచు।
దేవదుందుభులు మ్రోయ దేవతలు కొలువగా। సావధానమగు నీకు సాసముఖా॥
చ॥ అంగరంగవైభవాల అమరకామినులాడ। నింగినుండి దేవతలు నినుజూడగా।
సంగీత తాళవాద్య చతురతలు మెరయ। సంగడిదేలేటి నీకు సాసముఖా॥
చ॥ పరగ కోనేటిలోన పసిడి మేడనుండి। అరిది యిందిరయు నీవు ఆరగించి।
గరిమ శ్రీవేంకటేశ కన్నుల పండువకాగ। సరవి నోలాడు సాసముఖా॥

**22) ముఖారి**

ప॥ ఇన్ని చదువనేల ఇంత వెదకనేల। కన్ను తెరచుటొకటి కనుమూయుటొకటి॥
చ॥ వలెననేదొకమాట వలదనేదొక మాట। సిలుగులీ రెంటికిని చిత్తమే గురియౌను।
వలెనంటె బంధము వలదంటె మోక్షము। తెలిసి విజ్ఞానులకు తెరువిది యొకటే॥
చ॥ పుట్టెడిదొకటే పోయెడిదొకటే। తిట్టమై రెంటికిని దేహమే గురియౌను।
పుట్టుట సంశయము పోవుట నిశ్చయము। వొట్టి విజ్ఞానులకు వుపమిది వొకటే॥
చ॥ పరమనేదొకటే ప్రపంచమొకటే। సిరుల నీరెంటికిని జీవుడే గురియౌను।
ఇరవు వేంకటేశుడిహ పరములకర్త। శరణాగతులకెల్ల సతమితడొకడే॥

**23) నీలాంబరి**

ప॥ దీనుడను నేను దేవుడవు నీవు। నీ నిజరూపమే నెరపుటగాక॥
చ॥ మతి జననమెరుగ మరణంబెరుగను। యితవుగ నినునింక నెరిగేనా।
క్షితి బుట్టించిన శ్రీపతివి నీవు। గతి నాపై దయ దలతువు గాక॥
చ॥ తలచపాపమని తలచపుణ్యమని। తలపున యిక నిన్ను దలచలేనా॥
అలరిననాలో అంతర్యామివి। కలుషమెడయ నను గాతువుగాక॥
చ॥ తడవనాహేయము తడవనా మలినము। తడయక నీమేలు తడవేనా।
విడువలేని శ్రీవేంకట విభుడవు। కడదాక నికగాతువు గాక॥

**24) కల్యాణి**

ప॥ రామ రామ రామ కృష్ణ రాజీవ లోచన నీకు। దీమువంటి బంటననే తేజమే నాది॥
చ॥ వారిధి దాటి మెప్పించ వాయుజుడనే గాను। సారె చవుల మెప్పించ శబరి గాను।
బిరాన సీతనిచ్చి మెప్పించ జనకుండ గాను। ఏరీతి మెప్పింతు నన్నెట్లు గాచేవో॥
చ॥ ఘనమై మోచి మెప్పించ గరుడనేగాను। కొనకామ సుఖమిచ్చు గోపిక గాను।
వినుతించి మెప్పించ వేయినోళ్ళ భోగిగాను। నిన్నెట్లు మెప్పింతు నన్ను గాచేదెట్లా॥
చ॥ నవ్వుచు పాడి మెప్పించ నారదుడనేగాను। అవ్వల ప్రాణమీయ జటాయువుగాను।
ఇవ్వల శ్రీవేంకటేశ యిటునీకు శరణంటి। అవ్వల నాతెరువిదే రక్షించేదెట్లా॥

**25) హిందోళ**

**************************************************************************************************

ప॥ అదివో అల్లదివో శ్రీహరివాసము। పదివేల శేషుల పడగల మయము॥

చ॥ అదె వేంకటాచల మఖిలోన్నతము। అదివో బ్రహ్మాదుల కపురూపము।
అదివో నిత్య నివాసమఖిల మునులకు। అదె చూడడదె మ్రొక్కుడా నందమయము॥

చ॥ చెంగట నల్లదివో శేషాచలము। నింగినున్న దేవతల నిజనివాసము।
ముంగిట నల్లదివో మూలనున్న ధనము। బంగారు శిఖరాల బహు బ్రహ్మమయము॥

చ॥ కైవల్య పదము వేంకట నగమదివో। శ్రీవేంకటపతికి సిరులైనది।
భావింప సకల సంపద రూపమదివో। పావనములకెల్ల పావనమయము॥

**26)రేవతి**

ప॥ నానాటి బతుకు నాటకము। కానక కన్నది కైవల్యము॥

చ॥ పుట్టుటయు నిజము పోవుటయు నిజము। నట్టనడిమిపని నాటకము।
ఎట్టనెదుట గలదీ ప్రపంచము। కట్టకడపటిది కైవల్యము॥

చ॥ కుడిచేదన్నము కోకచుట్టెడిది। నడమంత్రపు పని నాటకము।
వొడిగట్టుకొనిన వుభయ కర్మములు। గడిదాటినపుడె కైవల్యము॥

చ॥ తెగదు పాపము తీరదు పుణ్యము। నగి నగి కాలము నాటకము।
ఎగువనే శ్రీ వేంకటేశ్వరుడేలిక। గగనము మీదిది కైవల్యము॥

**27)ఝుంఝూటి**

ప॥ శరణు శరణు సురేంద్ర సన్నుత। శరణు శ్రీసతి వల్లభ।
శరణు రాక్షస గర్వ సంహర। శరణు వేంకట నాయక॥

చ॥ కమల ధరుడును కమల మిత్రుడు। కమల శత్రుడు పుత్రుడు।
క్రమముతో మీకొలువు కిప్పుడు। కాచినారెచ్చరికయా॥

చ॥ అనిమిషేంద్రులు మునులు దిక్పతులు। అమర కిన్నర సిద్ధులు।
ఘనతతో రంభాది కాంతలు। కాచినారెచ్చరికయా॥

చ॥ ఎన్నగల ప్రహ్లాద ముఖ్యులు। నిన్ను కొలువగా వచ్చిరి।
విన్నపము వినవయ్య తిరుపతి। వేంకటాచల నాయక॥

**28)శంకరాభరణం**

ప॥ ఎటువంటి మచ్చికలో యేటి తరితీపులో। చిటుకనే వినేను చెవుల పండుగలు॥

చ॥ చలరేగి యాపె నీకు చెప్పెనిందాక సుద్దులు। వెలలేని వేడుకతో వింటివి నీవు।
తలపున బట్టెనా తమి నీకు బుట్టెనా। అలర యా సంతోషము లాస తియ్యవయ్య॥

చ॥ పలుమారు నీయెదుట పాడెనాపె పాటలు। తలయూచి మెచ్చితివి దానికినీవు।
కలిగెనా నీకు మేలు కలిగెనా నీకు గుండె। ఎలుగెత్తి నాకు కొంత యెరిగించవయ్య॥

చ॥ ఎలిమి నీతోనాపై యేకతము లెల్లనాడె। వలపులు చల్లితివి వద్దనుండి।
నిలిచి శ్రీవేంకటేశ నేనలమేల్మంగను। కలిసితి వెచ్చరించు కలవెల్ల నాకును॥

**29)తోడి**

ప॥ నీదాసుల భంగములు నీవుజూతురా। ఏదని జూచేవు నీకు నెచ్చరించవలెనా॥

చ॥ పాల సముద్రము మీద పవ్వళించ్చినట్టి నీకు। బేలలై సురలు మొరవెట్టిన యట్టు।
వేళతో మామనువులు విన్నవించితిమి నీకు। ఏల నిద్దిరించేవు మమ్మిట్టే రక్షించరాద॥

చ॥ ద్వారకా నగరములో తగ నెత్తమాడే నీకు। బిరాన ద్రౌపది మొరవెట్టిన యట్టు।
ఘోరపు రాజసభల కుంది విన్నవించితిమి। ఏరీతి పరాకు నీకు నింక రక్షించరాద॥

చ॥ ఎనసి వైకుంఠములో నిందిర గూడున్న నీకు। పెనగి గజము మొరవెట్టిన యట్టు।
చనువుతో మాకోరికె సారె విన్నవించితిమి। విని శ్రీవేంకటేశుండ వేగ రక్షించరాద॥

**************************************************************************************************

**30) శుద్ధధన్యాసి**

ప॥ పరమాత్ముడైన హరి పట్టపురాణివి నీవు। ధరమము విచారించ తగునీకు అమ్మ॥
చ॥ కమలజుగన్న తల్లివి కామునిగన్న తల్లి। అమరులగన్న తల్లి ఆదిమ లక్ష్మి।
విమలపు నీపతికి విన్నపము జేసి మమ్ము। నెమకి ఏలితి దయ నీకే తగునమ్మ॥
చ॥ కామధేను తోబుట్టుగ కల్పకము తోబుట్టుగ। దోమటి చల్లిన చంద్రు తోబుట్టుగ।
నీమగని పంపునను నిజసిరులిచ్చితివి। నేమపు వితరణము నీకే తగునమ్మ॥
చ॥ పాలజలధి కన్యవు పద్మాసినివి నీవు। పాలపండే శ్రీవేంకటపతి దేవివి।
ఏలిన యితని బంట్లకు యిహపరాలిచ్చి మా। పాల గలిగితివి సంబంధము మేలమ్మ॥

**31) భైరవి**

ప॥ అలుమేలమంగ నీవభినవ రూపము। జలజాక్షు కన్నులకు చలువలిచ్చేవమ్మ॥
చ॥ గరుడాచలాధీశు ఘనవక్షముననుండి। పరమానంద సంభరితవై।
నెరతనములు జూపి నిరంతరము నాథుని। హర్షింపగా జేసితిగదమ్మ॥
చ॥ శశికిరణములకు చలువలచూపులు। విశదముగా మది వెదజల్లుచు।
రసికతపెంపున కరగించి యెప్పుడు నీ। వశముజేసుకొంటి వల్లభునోయమ్మ॥
చ॥ రట్టడి శ్రీవేంకట రాయనికి నీవు। పట్టపురాణివై పరగుచు।
వట్టిమాకులిగిరించు వలపులమాటలవిభు। జట్టిగొని పురమున సతమైతివమ్మ॥

**32) కల్యాణి**

ప॥ వలదన నొరులకు వశమటనే। తలచినట్లనిది దైవమెచేసె॥
చ॥ తరుణికుచములను తామరమొగుడలు। విరిసెనోయని వెరపునను।
సరగున పతిసఖ చంద్రశకలములు। దరులుగలుగనిది దైవమెచేసె॥
చ॥ పొలతివదనమను పున్నమచంద్రుడు। బలిమినెగయునని భయమునను।
మెలుతచికురధ మ్మిల్లపురాహువు। తలచెదరగనిది దైవమెచేసె॥
చ॥ వనితకువాడునొ వలపుతాపమున। తనులతికయనుచు తమకమున।
ఘనవేంకటపతి కౌగిటచమటల। తనివి దీర్చనిది దైవమెచేసె॥

**33) రేవగుప్తి**

ప॥ పురుషోత్తముడవీవు పురుషాధముడనేను। ధరలోన నాయందు మంచితనమేది॥
చ॥ అనంతాపరాధములు అటునేము సేసేవి। అనంతమైనదయ అదినీది।
నినునెరగకుండేటి నీచగుణము నాది। ననునెడయకుండేటి గుణమునీది॥
చ॥ సకలయాచకమే సరుసనాకుపని। సకలరక్షకత్వము సరి నీపని।
ప్రకటించినిన్ను దూరేపలుకే నాకెప్పుడూను। వెకలివైనను గాచేవిధము నీది॥
చ॥ నేరమింతయు నాది నేరుపింతయు నీది। సారెకు అజ్ఞాని నేను జ్ఞానివి నీవు।
ఈరీతి వేంకటేశ యిట్టేనను నేలితివి। ధారుణిలో నిండెను ప్రతాపము నీది॥

**34) సామంతం/ ఖరహరప్రియ**

ప॥ ఎంతచేసిన తనకేది తుద। చింత శ్రీహరిపై జిక్కుటే చాలు॥
చ॥ ఎడపక పుణ్యాలెన్ని చేసినా। గడమే కాకిక గడయేది।
తడబడ హరియే దైవమనుచు మది। విడువకవుండిన వెరవే చాలు॥
చ॥ యెన్నితపములివి యెట్లజేసినా। అన్నువ కధికము అలపేది।
వన్నెల గలగక వనజాక్షునిపై। వున్న చిత్తమది వొక్కటే చాలు॥
చ॥ యిందరి వాదములెల్ల గెలిచినా। కందే గాకిక గరిమేది।
యిందరినేలిన యీవేంకటపతి। పొందుగ మహిమల పొడవే చాలు॥

**35) తిల్లాంగ్**

ప॥ ఏమొకో చిగురుటధరమున ఎడనెడకస్తూరి నిండెను। భామిని విభునకు వ్రాసిన పత్రికకాదుకదా॥

చ॥ కలికి చకోరాక్షికి కడకన్నుల కెంపైతోచిన। చెలువంబిప్పుడిదేమో చింతింపరేచెలులు।
సలుపునప్రాణేశ్వరుపై నాటినయాకొనచూపులు। నిలువునపెరుకగనంటిన నెత్తురుకాదుకదా॥

చ॥ పడతికి చనుగవమెరుగులు పైపై పయ్యెదవెలుపల। కడుమించిన విధమేమో కనుగొనరే చెలులు।
వుడుగనివేడుకతో ప్రియుడొత్తిన నఖశశిరేఖలు। వెడాలగవేసవికాలపు వెన్నెలకాదుకదా॥

చ॥ ముద్దియ చెక్కుల కెలకుల ముత్యపు జల్లుల చేర్పుల। వొద్దికలాగులివేమో ఊహింపరే చెలులు।
గద్దరి తిరువేంకటపతి కౌగిటయధరామృతముల। అద్దిన సురతపు చెమటల అందము కాదుకదా॥

**36) శంకరాభరణం**

ప॥ తెలిసినవారికి దేవుండితడే। వలవని దుష్టుల వాదములేల॥

చ॥ పురుషులలోపల పురుషోత్తముడు। నరులలోన నరనారాయణుడు।
పరదైవములకు పరమేశ్వరుడు। వరుసమూఢుల కెవ్వరోయితడు॥

చ॥ పలుబ్రహ్మలకును పరబ్రహ్మము। మలయునీశులకు మహేశుడితడు।
ఇలనాత్మలలో నిటుపరమాత్ముడు। ఖలులకెట్లుండునో కానము యితడు॥

చ॥ వేదంబులలో వేదాంతవేద్యుడు। సోదించకరిగాచుచో నాదిమూలము।
ఈదెస శ్రీవేంకటేశుడిందరికి। గాదిలిమతులను గైకొనడితడు॥

**37) కేదార**

ప॥ కొలిచిన వారల కొంగుపైడితడు। బలిమి తారక బ్రహ్మమీతడు॥

చ॥ ఇనవంశాంబుధి నెగసిన తేజము। ఘనయజ్ఞంబుల గల ఫలము।
మనుజరూపమున మనియెడి బ్రహ్మము। నినువుల రఘుకుల నిధానమీతడు॥

చ॥ పరమాన్నములోపలి సారపుజవి। పరగినదివిజుల భయహరము।
మరిగినసీతా మంగళసూత్రము। ధరలో రామావతారంబితడు॥

చ॥ చకితదానవుల సంహారచక్రము। సకల వనచరుల జయకరము।
వికసితమగు శ్రీవేంకట నిలయము। ప్రకటిత దశరథ భాగ్యంబితడు॥

**38) హుసేని**

ప॥ అంతరంగమెల్ల శ్రీహరికి ఒప్పించుకుంటె। వింతవింత విధముల వీడునా బంధములు॥

చ॥ మనుజుడై ఫలమేది మరిజ్ఞాని యౌదాకా। తనువెత్తి ఫలమేది దయగలుగుదాకా।
ధనికుడై ఫలమేది ధర్మముసేయుదాకా। పనిమాలి ముదిసితే పాసెనా భవము॥

చ॥ చదివియు ఫలమేది శాంతము కలుగుదాకా। పెదవెత్తి ఫలమేది ప్రియమాడు దాకా।
మదిగల్గి ఫలమేది మాధవుదలచు దాకా। ఎదుట తాను రాజైతే ఏలెనాపరము॥

చ॥ పావనుడై ఫలమేది భక్తి కలిగినదాకా। జీవించి ఫలమేది చింత దీరుదాకా।
వేవేల ఫలమేది వేంకటేశు గన్నదాకా। భావించితా దేవుడైతే ప్రత్యక్షమౌనా॥

**39) శహన**

ప॥ భక్తినీపై దొకటె పరమసుఖము। యుక్తిజూచిన నిజంబొక్కటేలేదు॥

చ॥ కులమెంత గలిగెనది కూడించు గర్వంబు। చలమెంత గలిగెనది జగడమే రేచు।
తలపెంత పెంచినా తగిలించు కోరికలు। ఎలమి విజ్ఞానంబు యేమిటాలేదు॥

చ॥ ధనమెంత గలిగెనది దట్టమౌలోభంబు। మొనయు చక్కదనంబు మోహముల రేచు।
ఘనవిద్య గలిగినను కప్పుపైపై మదము। యెనయగ పరమపద మించుకయులేదు॥

చ॥ తరుణులెందరు అయిన తాపములు సమకూడు। సిరులెన్ని గలిగినను చింతలేపెరుగు।
ఇరవయిన శ్రీవేంకటేశ నినుకొలువగా। పెరిగె నానందంబు బెళుకులికలేవు॥

**40) ముఖారి**

ప॥ విశ్వరూపమిదివో విష్ణురూపమిదివో। శాశ్వతులమైతిమింక జయము నాజన్మము॥
చ॥ కొండవంటి హరిరూపు గురుతైనతిరుమల। పండిన వృక్షములే కల్పతరువులు।
నిండిన మృగాదులెల్ల నిత్యముక్త జనములు। మెండుగ ప్రత్యక్షమాయె మేలువో నాజన్మము॥
చ॥ మేడవంటి హరిరూపు మించైనపైడిగోపురము। ఆడనే వాలిన పక్షులమరులు॥
వాడల కోనేటిచుట్ల వైకుంఠ నగరము। ఈడమాకు పొడచూపె ఇహమేపో పరము॥
చ॥ కోటిమదనులవంటి గుడిలో చక్కనిమూర్తి। ఈటులేని శ్రీవేంకటేశుడితడు।
వాటపు సొమ్ములు ముద్ర వక్షపుటలమేల్మంగ। కూటువైనన్నేలితి యెక్కువవో నాతపము॥

**41) ఖమాచ్**

ప॥ అవధారు రఘుపతి అందరిని చిత్తగించు। ఇవలనుండే కొలువిదెనదె సముఖాన॥
చ॥ రామరాఘవరామ రామచంద్రప్రభో। శ్రీమదయోధ్యాపతి సీతాపతి।
ప్రేమనారదుడు పాడిపెక్కు రంభాదులాడేరు। మోమెత్తి కవులెల్ల మ్రొక్కేరదివో॥
చ॥ ఇనవంశకుల జాత ఇక్ష్వాకుకుల తిలక। ఘనదశరథసుత కౌశికప్రియ।
మునులు దీవించేరు ముందట భరతుడదె। వెనకలక్ష్మణుడు సేవించె వింజామర॥
చ॥ కందువకౌసల్యాగర్భ రత్నాకర। చెందిన శ్రీవేంకటాద్రి శ్రీనివాస।
సందడి కుశలవులు చదివేరు వొకవంక। చెంది నీరాజనము చెప్పరాదు రామ॥

**42) ద్విజావంతి / శ్రీరాగం**

ప॥ రామచంద్రుడితడు రఘువీరుడు। కామితఫలములీయ గలిగెనందరికి॥
చ॥ గౌతము భార్యపాలిటి కామధేనువితడు। ఘాతల కౌశికుపాలి కల్పవృక్షము।
సీతాదేవి పాలిటి చింతామణి యితడు। యీతడు దాసుల పాలిటి యిహపరదైవము॥
చ॥ పరగసుగ్రీవుపాలి పరమ బంధువితడు। సరిహనుమంతుపాలి సామ్రాజ్యము।
నిరతి విభీషణునిపాలి నిధానము యీతడు। గరిమజనకు పాలి ఘనపారిజాతము॥
చ॥ తలప శబరిపాలి తత్త్వపురహస్యము। అలరిగుహునిపాలి ఆదిమూలము।
కలడన్నవారిపాలి కన్నులెదుటి మూర్తి। వెలయశ్రీవేంకటాద్రి విభుడీతడు॥

**43) షణ్ముఖప్రియ**

ప॥ పలువిచారములేల పరమాత్మ నీవునాకు। కలవుకలవు ఉన్న కడమలేమిటికి॥
చ॥ నీపాదముల చెంత నిబిడమైతే చాలు। ఏపాతకములైన యేమిసేసును।
ఏపార నీభక్తి ఇంతగలిగిన చాలు। పైపై సిరిలచ్చట పాదుకొని నిలుచు॥
చ॥ సొరిదినీ శరణము జొచ్చితినంటే చాలు। కరుణించి యప్పుడట్టే కాతువునీవు।
సరుస నీముద్రలు భుజములనుంటే చాలు। అరుదుగా చేతనుండు అఖిలలోకములు॥
చ॥ నేరకవేసిన చాలు నీమీద పువ్వు। కోరిన కోరికలెల్ల కొనసాగును।
మేరతో శ్రీవేంకటేశ నిన్నుగొలిచితి నేను। ఏరీతినుండిన గాని యిన్నిటా ఘనుడను॥

**44) శంకరాభరణం**

ప॥ శతాపరాధములు సహస్రదండన లేదు। గతి నీవని వుండగ కావకుండగారాదు॥
చ॥ తలచి నీకు మొక్కగా దయజూడకుండరాదు। కొలిచి బంటుననగా కోపించరాదు।
నిలిచి భయస్తుడనై నీయెదుట దైన్యమే। పలుక గావకుండ బాడిగాదు నీకు॥
చ॥ శరణు చొరగ నీకు సారె నాజ్ఞపెట్టరాదు। సరి బూరి గరవగ చంపరాదు।
అరయ జగద్రోహినౌదు నైనా నీనామము। గరిమె నుచ్చరించగ గరగక పోదు॥
చ॥ దిక్కు నీవని నమ్మగా దిగవిడువగరాదు। యెక్కువ నీలెంకగాగా యేమనరాదు।
తక్కక శ్రీవేంకటేశ తప్పులెల్లా జేసి వచ్చి। యిక్కడ నీదాసినైతి నింక దోయరాదు॥

**************************************************************************************************

**********************************************************************************************************************

**45) మాయామాళవగౌళ**

ప॥ నారాయాణాచ్యుత గోవింద హరి। సారముగ నీకునే శరణంటిని॥

చ॥ చలువయును వేడియును నటల సంసారంబు। తొలకు సుఖమొకవేళ దుఃఖమొకవేళ।
ఫలములివె యీరెండు పాపములు పుణ్యములు। పులుసు దీపును గలిపి భుజియించినట్లు॥

చ॥ పగలు రాత్రులరీతి బహుజన్మ మరణాలు। తగుమేను పొడచూపు తనుదానె తొలగు।
నగియించు నొకవేళ నలగించు నొకవేళ। వొగరు కారపు విడెము ఉబ్బించినట్లు॥

చ॥ ఇహము పరమును వలెనే యెదిటికల్లయు నిజము। విహరించు భ్రాంతియును విభ్రాంతియును మతిని।
సహజ శ్రీవేంకటేశ్వర నన్ను కరుణింప। బహువిధంబుల నన్ను పాలించవే॥

**46) వరాళి**

ప॥ ఏటిసుఖము మరి యేటిసుఖము। ఒకమాట మాత్రము నటమటమైన సుఖము॥

చ॥ కొనసాగు దురితములె కూడైన సుఖము। తనువిచారములలో దాకొన్న సుఖము।
పనిలేనియాసలకు బట్టయిన సుఖము। వెనుక ముందర జూడ వెరగైన సుఖము॥

చ॥ నిందలకు లోనైన నీరసపు సుఖము। బొందికిని లంచంబు పుణికేటి సుఖము।
కిందపడి పరులముంగిలి గాచుసుఖము। పందివలె తనుదానె బ్రతికేటి సుఖము॥

చ॥ ధృతిమాలి యిందరికి దీనుడగు సుఖము। మతిమాలి భంగములు మరపించు సుఖము।
పతి వేంకటేశు కృప పడసినది సుఖము। ఇతరంబులన్నియును ఏపాటి సుఖము॥

**47) ఝుంఝూటి**

ప॥ నవనీతచోర నమోనమో। నవమహిమార్ణవ నమోనమో॥

చ॥ హరినారాయణ కేశవాచ్యుతకృష్ణ। నరసింహ వామన నమోనమో।
మురహర పద్మనాభ ముకుంద గోవింద। నరనారాయణ నమోనమో॥

చ॥ నిగమగోచర విష్ణు నీరజాక్ష వాసుదేవ। నగధర నందగోప నమోనమో।
త్రిగుణాతీతదేవ త్రివిక్రమ ద్వారక। నగరాధినాయక నమోనమో॥

చ॥ వైకుంఠ రుక్మిణీ వల్లభ చక్రధర। నాకేశవందిత నమోనమో।
శ్రీకర గుణనిధి శ్రీవేంకటేశ్వర। నాకజననుత నమోనమో॥

**48) కుంతలవరాళి**

ప॥ ఆలాగు పొందులును అటువంటికూటములు। ఈలాగులౌట నేడిదె చూడనైతి॥

చ॥ అడియాస చూపులకు నాసగించితిగాని। వెడమాయలని లోను వెదకలేనైతి।
కడువేడుకల దగిలి గాసి పొందితిగాని। యెడలేని పరితాప మేరుగలేనైతి॥

చ॥ చిరునగవుమాటలకు చిత్తగించితిగాని। తరితీపులని లోను తలపలేనైతి।
వరుస మోహపు బసలవలల చిక్కితిగాని। గరువంపు పొలయలుక గానలేనతి॥

చ॥ శ్రీవేంకటేశ్వరుని చింతజేసితిగాని। దేవోత్తమునిలాగు తెలియలేనైతి।
ఈ వైభవముపై నిచ్చగించితి గాని। యీ వైభవానంద మిది పొందనైతి॥

**49) ముఖారి**

ప॥ రాముడు లోకాభిరాముడు త్రైలోక్య। ధాముడు రణరంగ భీముడు వాడే॥

చ॥ వరుడు సీతకు, ఫలాధరుడు మహోగ్రపు। శరుడు రాక్షస సంహరుడు వాడే॥
స్థిరుడు సర్వగుణాకరుడు కోదణ్డ దీక్షా। గురుడు సేవకశుభకరుడు వాడే॥

చ॥ ధీరుడు లోకైకవీరుడు సకలా। ధారుడు భవబంధదూరుడు వాడే।
శూరుడు ధర్మవిచారుడు రఘువంశ। సారుడు బ్రహ్మసాకారుడు వాడే॥

చ॥ బలుడు యిన్నిటా రవికులుడు భావించ, ని। ర్మలుడు నిశ్చలుడవికలుడు వాడే।
వెలసి శ్రీవేంకటాద్రి నిజనగరములోన। తలకొనె పుణ్యపాదతలుడు వాడే॥

**********************************************************************************************************************

**50) ఖమాచ్**

ప॥ కొలనిలోన మును గోపికలు। మొలక నవ్వులతో మ్రొక్కిరినీకు॥

చ॥ పిరుదులు దాటిన పింఛపు టలకల। తురుములు వీడగ తొయ్యలులు।
అరిది నితంబులందునె దాచుక। మురిపెపు కరముల మ్రొక్కిరినీకు॥

చ॥ నిద్దపు మానము నెలతలు లోగుచు। గద్దరి తొడలనె గట్టుచును।
ముద్దుటుంగరంబుల కరములతో। ముద్దులు గునియుచు మ్రొక్కిరినీకు॥

చ॥ పాలిండ్ల పెనుభారంబుల। మూలపు మెరుగులు ముంచగను।
వేలపు ప్రియముల వేంకటేశనిను। మూలకుపిలచుచు మ్రొక్కిరినీకు॥

**51) హరికాంభోజి**

ప॥ హరి యవతార మీతడు అన్నమయ్య। అరయ మా గురుడీతడు అన్నమయ్య।

చ॥ వైకుంఠ నాథుని వద్ద వడి పడు చున్న వాడు। ఆకరమై తాళ్ళపాక అన్నమయ్య।
ఆకసపు విష్ణు పాదమందు నిత్యమై ఉన్న వాడు। ఆకడీకడ తాళ్ళపాక అన్నమయ్య॥

చ॥ ఈవల సంసార లీల ఇందిరేశుతో నున్న వాడు। ఆవటించి తాళ్ళపాక అన్నమయ్య।
భావింప శ్రీవేంకటేశు పదములందే యున్నవాడు। హావ భావమై తాళ్ళపాక అన్నమయ్య॥

చ॥ క్షీరాబ్ధిశాయి బట్టి సేవింపుచు నున్నవాడు। ఆరితేరి తాళ్ళపాక అన్నమయ్య।
ధీరుడై సూర్యమణ్డల తేజము వద్ద నున్నవాడు। ఆరీతుల తాళ్ళపాక అన్నమయ్య॥

**52) లలిత**

ప॥ అన్ని మన్త్రములు నిందే యావహించెను। వెన్నతో నాకు గలిగె వేంకటేశు మన్త్రము॥

చ॥ నారదుడు జపియించె నారాయణ మన్త్రము। చేరె ప్రహ్లాదుడు నారసింహ మన్త్రము।
కోరి విభీషణుడు చేకొనె రామ మన్త్రము। వేరె నాకు గలిగె వేంకటేశు మన్త్రము॥

చ॥ రంగగు వాసుదేవ మన్త్రము ధృవుండు జపించె। సంగవించె కృష్ణ మన్త్రము అర్జునుడును।
ముంగిట విష్ణు మన్త్రము మొగి శుకుడు పఠియించె। వింగడమై నాకు నబ్బె వేంకటేశు మన్త్రము॥

చ॥ ఇన్ని మన్త్రముల కెల్ల ఇన్దిరానాథుడె గురి। పన్నిన దిదియే పరబ్రహ్మ మన్త్రము।
నన్ను గావ గలిగేబో నాకు గురుడియ్యగాను। వెన్నెల వంటిది శ్రీవేంకటేశు మన్త్రము॥

**53) భూపాళం**

ప॥ విన్నపాలు వినవలె వింత వింతలు। పన్నగపు దోమ తెర పైఎత్త వేలయ్యా॥

చ॥ తెల్లవారె జామెక్కె దేవతలు మునులు। అల్లనల్ల నంతనింత నదిగోవారే।
చల్లని తమ్మిరేకుల సారసపు గన్నులు। మెల్లమెల్లనె విచ్చి మేలుకొనవేలయ్య॥

చ॥ గరుడ కిన్నర యక్ష కామినులు గములై। విరహపు గీతముల వింతాలాపాల।
పరి పరి విధముల పాడేరు నిన్నదివో। సిరి మొగము దెరచి చిత్తగించవేలయ్య॥

చ॥ పొంకపు శేషాదులు తుంబురు నారదాదులు। పంకజ భవాదులు నీ పాదాలు చేరి।
అంకెలనున్నారు లేచి అలమేలు మంగను। వేంకటేశుడా రెప్పలు విచ్చి చూచి లేవయ్య॥

**54) సామంతం**

ప॥ కొండలలో నెలకొన్న కోనేటి రాయడు వాడు। కొండలంత వరములు గుప్పెడువాడు॥

చ॥ కుమ్మర దాసుడైన కురువరతినంబి।యిమ్మన్న వరములెల్ల నిచ్చినవాడు।
దొమ్ములు సేసినయట్టి తొండమాం చక్కురవర్తి। రమ్మన్న చోటికి వచ్చి నమ్మినవాడు॥

చ॥ అచ్చపు వేడుకతోడ ననంతాళువారికి। ముచ్చిలి వెట్టికి మన్ను మోచినవాడు।
మచ్చిక దొలక దిరుమలనంబి తోడుత। నిచ్చనిచ్చ మాటలాడి నొచ్చినవాడు॥

చ॥ కంచిలోన నుండ దిరుకచ్చినంబి మీద। కరుణించి తనయెడకు రప్పించిన వాడు।
ఎంచి యెక్కుడైన వేంకటేశుడు మనలకు। మంచివాడై కరుణ బాలించినవాడు॥

*****************************************************************************************************

**55) బౌళి**

ప॥ తందనాన ఆహి తందనాన పురె। తందనాన భళా తందనాన॥

చ॥ బ్రహ్మ మొకటే పరబ్రహ్మ మొకటే। పరబ్రహ్మ మొకటే పరబ్రహ్మ మొకటే॥

చ॥ కందువగు హీనాధికము లిందు లేవు। అందరికి శ్రీహరే అంతరాత్మ।
ఇందులో జంతుకులమింతా నొకటే। అందరికి శ్రీహరే అంతరాత్మ॥

చ॥ నిండార రాజు నిద్రించు నిద్రయు నొకటే। అండనే బంటునిద్ర అదియు నొకటే।
మెండైన బ్రాహ్మణుడు మెట్టుభూమి యొకటే। చండాలు డుండేటి సరిభూమి యొకటే॥

చ॥ అనుగుదేవతలకును అలకామ సుఖమొకటే। ఘనకీట పశువులకు కామ సుఖమొకటే।
దినమహో రాత్రములు తెగి ధనాఢ్యునకొకటే। వొనర నిరుపేదకును వొక్కటే అవియు॥

చ॥ కొరలి శిష్టాన్నములు గొను నాకలొకటే। తిరుగు దుష్టాన్నములు తిను నాకలొకటే।
పరగ దుర్గంధములపై వాయువొకటే। వరుస బరిమళముపై వాయువొకటే॥

చ॥ కడగి యేనుగు మీద గాయు యెండొకటే। పుడమి శునకము మీద బొలయు నెండొకటే।
కడు బుణ్యులను బాప కర్ములను సరిగావ। జడియు శ్రీవేంకటేశ్వర నామమొకటే॥

**56) పూర్వీకల్యాణి**

ప॥ నల్లని మేని నగవు చూపుల వాడు। తెల్లని కన్నుల దేవుడు॥

చ॥ బిరుసైన దనుజుల పింఛమణచినట్టి। తిరుపు కైదువ తోడి దేవుడు।
సరిపడ్డ జగమెల్ల చక్క ఛాయకు దెచ్చి। తెరవు చూపినట్టి దేవుడు॥

చ॥ నీటగలసినట్టి నిండిన చదువులు। తేట పరచినట్టి దేవుడు।
పాటిమాలినట్టి ప్రాణుల దురితపు। తీట రాసినట్టి దేవుడు॥

చ॥ గురుతువెట్టగరాని గుణముల నెలకొన్న। తిరువేంకటాద్రిపై దేవుడు।
తిరముగ ధృవునికి దివ్యపదంబిచ్చి। తెరచి రాజన్నట్టి దేవుడు॥

**57) కాపి**

ప॥ జో అచ్యుతానంద జో జో ముకుందా। రావె పరమానంద రామ గోవిందా॥

చ॥ అంగజునిగన్న మా యన్న యిటు రారా। బంగారు గిన్నెలో పాలు పోసేరా।
దొంగ నీవని సతులు పొంగుచున్నారా। ముంగిటనాడరా మోహనాకారా॥

చ॥ గోవర్ధనంబెల్ల గొడుగుగాగ పట్టి। కావరమ్మున నున్న కంసు పడగొట్టి।
నీవుమధురాపురము నేల చేబట్టి। ఠీవితోనేలిన దేవకీ పట్టి॥

**58) నాట**

ప॥ నమో నమో రఘుకుల నాయక దివిజవంద్య। నమో నమో శంకర నగజానుత॥

చ॥ విహిత ధర్మ పాలక వీర దశరథ రామ। గహన వాసిని తాటక మర్దన-।
అహల్యా శాప విమోచన అసురకుల భంజన। సహజ విశ్వామిత్ర సవన రక్షక॥

చ॥ హర కోదణ్డ హర సీతాంగనా వల్లభ। ఖర దూషణారి వాలి గర్వాపహ।
ధరణి దనుజాది దనుజుల పాలక। శరధి రంగ కృత్య సౌమిత్రి సమేత॥

చ॥ బిరుద రావణ శిరో భేదక విభీషణ వరద। సాకేత పురవాస రాఘవ నిరుపమ।
శ్రీవేంకట నిలయ-నిజ సకల। పురవర విహార, పుండరీకాక్ష॥

**59) బౌళి**

ప॥ శ్రీమన్నారాయణ శ్రీమన్నారాయణ। శ్రీమన్నారాయణ నీ శ్రీపాదమే శరణు॥

చ॥ కమలాసతీ ముఖకమల కమలహిత। కమలప్రియ కమలేక్షణ।
కమలాసనహిత గరుడగమన శ్రీ। కమలనాభ నీపదకమలమే శరణు॥

చ॥ పరమయోగిజన భాగధేయ శ్రీ। పరమపూరుష పరాత్పర

****************************************************************************************************

పరమాత్మ పరమాణురూప శ్రీ తిరువేంకటగిరి దేవ శరణు॥

**60)సౌరాష్ట్రం**

ప॥ శోభనమే శోభనమే వై- । భవముల పావన మూర్తికి॥

చ॥ అరుదుగ మును నరకాసురుడు। సిరులతో జెరలు దెచ్చిన సతుల।
పరువపు వయసుల బదారు వేలను। సొరిది బెండ్లాడిన సుముఖునికి॥

చ॥ చెందిన వేడుక శిశుపాలుడు। అంది పెండ్లాడగ నవగళించి।
విందువలెనె తా విచ్చేసి రుకుమిణి। సందడి బెండ్లాడిన సరసునకి॥

చ॥ దేవదానవుల ధీరతను। దావతిపడి వార్ధి దరుపగను।
శ్రీవనితామణి జెలగి పెండ్లాడిన। శ్రీవేంకటగిరి శ్రీనిధికి॥

**61)శంకరాభరణం**

ప॥ అలరులు కురియగ నాడెనదే। అలుకల గులుకుల నలమేల్మంగ॥

చ॥ అరవిరి సొబగుల నతివలు మెచ్చగ। అరతెర మరగున నాడెనదే।
వరుస పూర్వదువాళపు తిరుపుల। హరిగరగింపుచు నలమేల్మంగ॥

చ॥ మట్టపు మలపుల మట్టెల కెలపుల। తట్టెడి నడపుల దాటెనదే।
పెట్టిన వజ్రపు పెండెపు తళుకులు। అట్టిట్టు చిమ్ముచు నలమేల్మంగ॥

చ॥ చిందుల పాటల సిరి పొలయాటల। అందెల మోతల నాడెనదే।
కందువ తిరువేంకటపతి మెచ్చగ। అందపు తిరుపుల నలమేల్మంగ॥

**62)శ్రీరాగం**

ప॥ అదిగాక నిజమతంబది గాక యాజకం- । బదిగాక హృదయసుఖ మదిగాక పరము॥

చ॥ అమలమగు విజ్ఞానమను మహాధ్వరమునకు- । నమరినది సంకల్పమను మహాపశువు।
ప్రమదమను యూపగంబమున వికసింపించి। విమలేంద్రియాహుతులు వేల్పంగవలదా॥

చ॥ అరయ నిర్మమకార మాచార్యుడై చెలగ। వరుసతో ధర్మదేవత బ్రహ్మ గాగ।
దొరకొన్న శమదమాదులు దానధర్మ। భాస్వరగుణాదులు విప్రసమితి గావలదా॥

చ॥ తిరువేంకటాచలాధిపు నిజధ్యానంబు। నరులకును సోమపానంబు గావలదా।
పరగ నాతనికృపా పరిపూర్ణజలధిలో। నర్థులై యవభృథం బాడంగవలదా॥

**63)ముఖారి**

ప॥ బ్రహ్మకడిగిన పాదము। బ్రహ్మము దానె నీ పాదము॥

చ॥ చెలగి వసుధ గొలిచిన నీ పాదము। బలితల మోపిన పాదము।
తలకక గగనము తన్నిన పాదము। బలరిపు గాచిన పాదము॥

చ॥ కామిని పాపము కడిగిన పాదము। పాముతల నిడిన పాదము।
ప్రేమపు శ్రీసతి పిసికెడి పాదము। పామిడి తురగపు పాదము॥

చ॥ పరమ యోగులకు పరి పరి విధముల। వర మొసగెడి నీ పాదము।
తిరు వేంకటగిరి తిరమని చూపిన। పరమ పదము నీ పాదము॥

**64)అఠాణ**

ప॥ నగు మొగము తోడి వో నరకేసరి। నగ రూప గరుడాద్రి నరకేసరి॥

చ॥ అమిత దానవ హరణ ఆదినరకేసరి। అమిత బ్రహ్మాది సుర నరకేసరి।
కమలాగ్ర వామాంక కనక నరకేసరి। నమో నమో పరమేశ నరకేసరి॥

చ॥ రవిచంద్ర శిఖ నేత్ర రౌద్ర నర కేసరి। నవ నారసింహ నమో నర కేసరి।
భవనాశినీ తీర భవ్య నర కేసరి। నవరసాలంకార నర కేసరి॥

చ॥ శరణాగత త్రాణ సౌమ్య నరకేసరి। నరక మోచన నామ నరకేసరి।

హరి నమో శ్రీవేంకటాద్రి నరకేసరి। నరసింహ జయ జయతు నరకేసరి॥

**65) కురంజి**

ప॥ క్షీరాబ్ధి కన్యకకు శ్రీ మహాలక్ష్మికిని। నీరజాలయమునకు నీరాజనమ్॥

చ॥ జలజాక్షి మోమునకు జక్కవకుచంబులకు। నెలకొన్న కప్పురపు నీరాజనమ్।
అలివేణి తురుమునకు హస్త కమలంబులకు। నిలువు మాణిక్యముల నీరాజనమ్॥

చ॥ చరణ కిసలయములకు సకియలంభోరులకు। నిరతమగు ముత్తేల నీరాజనమ్।
అరిది జఘనంబునకు నతివ నిజ నాభికిని। నిరతి నానావర్ణ నీరాజనమ్॥

చ॥ పగటు శ్రీవేంకటేశు పట్టపురాణియై। నెగడు సతికళలకును నీరాజనమ్।
జగతి నలమేల్మంగ జక్క దనముల కెల్ల। నిగుడు నిజ శోభనపు నీరాజనమ్॥

**66) లలిత**

ప॥ షోడశ కళానిధికి షోడశోపచారములు। జాడ తోడ నిచ్చలును సమర్పయామి॥

చ॥ అలరు విశ్వాత్మకున కావాహనమిదే। సర్వ నిలయున కాసనము నెమ్మినిదే।
అలగంగా జనకున కర్ఘ్య పాద్యాచమనాలు। జలధి శాయికిని మజ్జనమిదే॥

చ॥ వరపీతాంబరునకు వస్త్రాలంకార మిదే। సరి శ్రీ మంతునకు భూషణములివే।
ధరణీ ధరునకు గంధ పుష్ప ధూపములు। తిరమిదే కోటి సూర్య తేజునకు దీపము।

చ॥ అమృత మథనునకు నదివో నైవేద్యము। రవిచంద్ర నేత్రునకు గప్రవిడెము।
అమరిన శ్రీవేంకటాద్రి మీది దేవునికి। తమితో ప్రదక్షిణాలు దండములు నివిగో॥

**67) సురటి**

ప॥ మాధవునకు మంగళం। సాధు ప్రియునకు జయ మంగళం॥

చ॥ మదన గురునకు మంగళము మా। మతిలేలె హరికిని మంగళము।
మధురిపు హరునకు మంగళము। చటువులుమూర్తికి మంగళము॥

చ॥ మహిమాధికుణకు మంగళము। మహామహునకు మంగళము।
మహీధవునకు మంగళము। సహజ తేజునకు మంగళము॥

చ॥ మాయారహితునికి మంగళము। మాయింటి పతికిని మంగళము।
యీ యెడ శ్రీవేంకటేశ్వరు దీటు। ఛాయ శ్రీపతికి మంగళము॥

**68) ఖమాచ్**

ప॥ డోలాయాం చల డొలాయాం హరే డొలాయామ్॥

చ॥ మీన కూర్మ వరాహ మృగపతి అవతార। దానవారే గుణశౌరే ధరణీధర మరుజనక॥

చ॥ వామన రామ రామ వరకృష్ణ అవతార। శ్యామలాంగా రంగ రంగ సామజవరద మురహరణ॥

చ॥ దారుణ బుద్ధ కలికి దశవిధ అవతార। శీరపాణే గోసమాణే శ్రీవేంకటగిరి కూటనిలయా॥

**69) మధ్యమావతి**

ప॥ మరలి మరలి జయ మంగళము। సొరిది నిచ్చల్లును శుభ మంగళము॥

చ॥ కమలా రమణికి కమలాక్షునకును। మమతల జయ జయ మంగళము
అమర జననికిని అమరవంద్యునకు। సుముహూర్తముతో శుభ మంగళము॥

చ॥ జలధికన్యకును జలధిశాయికిని। మలయుచును శుభ మంగళము।
కలిమికాంతకా కలికి విభునికి। సుళువులయారతి శుభ మంగళము॥

చ॥ చిత్తజు తల్లికి శ్రీవేంకటపతికి। మత్తిల్లిన జయ మంగళము।
ఇత్తల నత్తల ఇరువురకౌగిట। జొత్తుల రతులకు శుభ మంగళము॥

**70) సావేరి**

ప॥ దేవ యీ తగవు దీర్చవయ్యా। వేవేలకు నిది విన్నపమయ్యా॥

చ॥ తనువున బొడమినతతి నింద్రియములు। పొనిగి యెక్కడికి బోవునయా।
పెనగి తల్లికడ బిడ్డలు భువిలో। యెనగొని యెక్కడి కేగుదురయ్యా॥

చ॥ పొడుగుచు మనమున బొడమిన యాసలు। అదన నెక్కడికి నరుగునయా।
వొదుగుచు జలములనుండు మత్స్యములు। పదపడి యేగతి బాసీనయ్యా॥

చ॥ లలి నొకటొకటికి లంకెలు నివే। అలరుచు నేమని యందునయా।
బలు శ్రీవేంకటపతి నాయాత్మను। గలిగితి నెక్కడి కలుషములయ్యా॥

**71) రాగమాలిక**

ప॥ అమరాంగనలదె ఆడేరు। ప్రమదంబుననదె పాడేరు॥

చ॥ గరుడవాహనుడు కనకరథముపై। ఇరువుగ వీధుల నేగేని।
సురలును మునులును సొంపుగ మొకులు। తెరలిచి తెరలిచి తీసేరు॥

చ॥ ఇలధరుడదివో ఇంద్రరథముపై। కెలయుచు దిక్కులు గెలిచేని।
బలు శేషాదులు బ్రహ్మశివాదులు। చెలగి సేవలటు సేసేరు॥

చ॥ అలమేల్మంగతో నటు శ్రీ వేంకట। నిలయుడరదమున నెగడేని।
నలుగడ ముక్తులు నారదాదులును। పొలుపుమీర కడు పొగడేరు॥

**72) ఆనందభైరవి**

ప॥ పసిడియక్షింతలివె పట్టరో వేగమే రారారో। దెసల పేరంటాండ్లు దేవుని పెండ్లికిని॥

చ॥ శ్రీవేంకటేశ్వరునికి శ్రీమహాలక్ష్మికి। దైవికపు పెండ్లిముహూర్తము నేడు।
కావించి భేరులు మ్రోసె గరుడధ్వజంబెక్కె। దేవతలు రారో దేవుని పెండ్లికిని॥

చ॥ కందర్ప జనకునికి కమలాదేవికి పెండ్లి। పందిలిలోపల తలంబాలు నేడు।
గంధమూ విడెమిచ్చేరు కలుపడాలు గట్టిరి। అందుక మునులు రారో హరి పెండ్లికిని॥

చ॥ అదె శ్రీవేంకటపతికి అలమేలు మంగకును। మొదలి తిరుణాళ్ళకు మ్రొక్కేము నేడు।
ఎదుట నేగేరు వీరెయిచ్చేరు వరములివె। కదలిరారో పురుష ఘనులు పెండ్లికిని॥

**73) నాదనామక్రియ**

ప॥ పాపపుణ్యముల రూపము దేహమిది దీని। దీపసంబరగింప తెరవెందు లేదు॥

చ॥ అతిశయంబైన దేహాభిమానము దీర। గతిగాని పుణ్యసంగతి బొందరాదు।
మతిలోని దేహాభిమానంబు విడుమటకు। రతిపరాజ్ముఖుడు గాక రవణంబు లేదు॥

చ॥ సరిలేని మమకార జలధి దాటినగాని। అరుదైన నిజసౌఖ్యమిది వొందరాదు।
తిరువేంకటాధిపుని గొలిచినగాని। పరగు బ్రహ్మానంద పరుడుతాకాడు॥

**74) బహుదారి**

ప॥ సకల శాంతికరము సర్వేశ నీపై భక్తిసర్వేశ॥

అనుప॥ ప్రకటమై మాకునబ్బె బతికించు నిదియె సర్వేశ॥

చ॥ మనసులో పాపబుద్ధి మరియెంత దలచిన। నినుదలచినంతనే నీరౌను।
కనుగొన్న పాపములు కడలేనివైనను। ఘనుడనిన్ను జూచితే కడకు దొలగును॥

చ॥ చేతనంటిపాతకాలు సేనగానే చేసినాను।ఆతల నీకు మ్రొక్కితే నన్నియు బాయు।
ఘాతలజెవుల వినగా నంటిన పాపము। నీతితో నీ కథవింటే నిమిషానబాయును॥

చ॥ కాయమున జేసేటి కర్మపు పాపములెల్ల। కాయవు నీ ముద్రలచే గ్రక్కున వీడు।
యేయెడ వేంకటేశ యేయేపాతకమైనా। ఆయమైన నీ శరణాగతిచే నణగు॥

**75) కేదారగౌళ**

ప॥ చాలునుచాలును భోగసమయమున మైమరపు॥

అనుప॥ పాలుపడునట యేటి బ్రతుకురా ఒరీ॥

చ॥ ఇందుముఖి నిను కౌగిలించి లోపలి జగము। కందునని నీ బిగువ కౌగిలి వదలె।
పొందైన వారితో పొసగ కౌగిట జేర్ప। పొందుగాదట యేటి పొందురా ఓరీ॥

చ॥ నెలత నీవాలు కన్నులు మూసి జగమెల్ల। కలయ చీకట్లైన గక్కనను వదలె।
వలచిన అంగనలు తమ వలసిన విలాసముల। వలను నెరపనిదేటి వలపురా ఓరీ॥

చ॥ కొమ్మ నీ ఉరముపై గోరు దివియుచు నాత్మ। నిమ్మైన నినుతాక నిద్దరినితాకె।
దిమ్మరివి కోనేటి తిమ్మ నీపై ప్రియము। కుమ్మరించని దేటి కోర్కెరా ఓరీ॥

**76)శంకరాభరణం**

ప॥ తరుణినీయలుక కెంతటిది ఇంతి నీవేళ। కరుణించగదర వేంకటశైలనాథ॥

చ॥ ఒకమారు సంసారమెల్ల బొమ్మని తలచు। ఒకమారు విధిసేతలూహించి పొగడు।
ఒకమారు తనుజూచి వూరకే తలవూచు। నొకమారు హర్షమున నొంది మేమరచు॥

చ॥ నినుజూచి నొకమారు నిలువెల్ల పులకించు। తనుజూచి నొకమారు తలపోసి నగును।
కనుదెరచి నినుజూచి కడు సిగ్గుపడి నిలిచి। యిన్నియును తలపోసి యింతలో మరచు॥

చ॥ వదలైన మొలనూలు గదియించు నొకమారు। చెదరిన కురులెల్ల చెరగునొకమారు।
అదనెరిగి తిరువేంకటాధీశ పొందితివి। చదురుడవునిను బాయ జాలదొకమారు॥

**77)శుభాళి**

ప॥ ఆకటివేళల అలుపైనవేళలను। తేకువ హరినామమే దిక్కుమరి లేదు॥

చ॥ కొరమాలియున్నవేళ కులముచెడినవేళ। చెరపడి వొరులచే జిక్కినవేళ।
వొరపైన హరినామ మొక్కటే గతిగాక। మరచి తప్పిననైన మరిలేదు తెరగు।

చ॥ ఆపదవచ్చిన వేళ యూరడిబడినవేళ। పాపపు వేళల భయపడిన వేళ।
వోపినంత హరినామ మొక్కటే గతిగాక। మాపుదాక బొరలిన మరిలేదు తెరగు

చ॥ సంకెళ బెట్టిన వేళ చంపబలిచిన వేళ। అంకిలిగా నప్పుల వారాగిన వేళ।
వేంకటేశు నామమే విడిపించు గతిగాక। మంకుబుద్ధి పొరలిన మరిలేదు తెరగు॥

**78)మోహన**

ప॥ అదె చూడరే మోహన రూపం। పది కోట్లుగల భావజ రూపం॥

చ॥ వెలయగ పదారువేల మగువలను। అలమిన ఘన మోహన రూపం।
వలచిన నంద వ్రజము గొల్లెతల। కులుకు చూపులకు గురియగు రూపం॥

చ॥ ఇందిరా వనిత నెప్పుడు తన ఉర।మందు నిలిపిన మోహన రూపం।
కందువ భూపతి కౌగిట సొంపుల। విందులు మరిగిన వేడుక రూపం॥

చ॥ త్రిపురసతుల బోధించి రమించిన। అపురూపపు మోహన రూపం।
కపురుల శ్రీవేంకటపతి యైయిల। ఉపమించగ రాని ఉన్నత రూపం॥

**79)నాట**

ప॥ నారాయణతే నమో నమో। నారద సన్నుత నమో నమో॥

చ॥ మురహర భవహర ముకుంద మాధవ। గరుడగమన పంకజనాభ।
పరమ పురుష భవబంధ విమోచన। నరమృగ శరీర నమో నమో॥

చ॥ జలధి శయన రవిచంద్ర విలోచన। జలరుహ భవనుత చరణయుగ।
బలిబంధన గోప వధూ వల్లభ। నళినోదరతే నమో నమో॥

చ॥ ఆదిదేవ సకలాగమ పూజిత। యాదవకుల మోహనరూప।
వేదోద్ధర శ్రీవేంకటనాయక। నాద ప్రియతే నమో నమో॥

**80)సురటి**

ప॥ ప్రతిలేని పూజ దలపంగ కోటి మణుగులై। అతివ పరవశము బ్రహ్మానందమాయె॥

చ॥ మానినీమణి మనసు మంచి యాసనమాయె। ఆనందబాష్ప జలమర్ఘ్యాదులాయె।
మీనాక్షి కనుదోయి మించు దీపములాయె। ఆనన సుధారసంబు అభిషేకమాయె॥
చ॥ మగువ చిరునగవులే మంచి క్రొవ్విరులాయె। తగుమేని తావి చందనమలదుటాయె।
నిగనిగ నీతనుకాంతి నీరాజనంబాయె। జగడంపుటలుకలు ఉపచారంబులాయె॥
చ॥ ననుపైన పొందులె నైవేద్య తతులాయె। తనివోని వేడుకలు తాంబూలమాయె।
వనిత శ్రీవేంకటేశ్వరుని కౌగిట జేయు। వినయ వివరంబు లరవిరి మ్రొక్కులాయె॥

**81) కీరవాణి**

ప॥ సకలం హే సఖి జానామి తత। ప్రకట విలాసం పరమం ధధసే॥
చ॥ అలిక మృగమద మయ మషీకల నో- । జ్జ్వలతాం హే సఖి జానామి।
లలితం తవ పల్లవి తమనసి ని- । శ్చలతర మేఘ శ్యామం ధధసే॥
చ॥ చారు కపోలస్థల కరాంచిత వి- । చారం హే సఖి జానామి।
నారాయణ మహినాయక శయనం। శ్రీరమణం తవ చిత్తే ధధసే॥
చ॥ ఘనకుచ శైలాగ్ర స్థిత విధుమణి। జననం హే సఖి జానామి।

**82) ఆహిరి**

ప॥ మూసిన ముత్యాల కేలే మొరగులు। ఆసల చిత్తాన కేలే అలవోకలు॥
చ॥ కందులేని మోము కేలే కస్తూరి। చిందు నీకొప్పున కేలే సీమంతులు।
మందయానమున కేలే మట్టెల మోత। గందమేలే పైపై కమ్మని నీమేనికి॥
చ॥ భారపు గుబ్బల కేలే పయ్యద నీ। బీరపు జూపుల కేలే పెడమోము।
జీరల బుజాల కేలే చెమటలు నీ। గోరంట గోళ్ళ కేలే కొనవాండ్లు॥
చ॥ ముద్దుల మాటల కేలే ముదములు నీ। యద్దపు జెక్కుల కేలే అరవిరులు।
వొద్దిక మాటల కేలే వూర్పులు నీకు। నద్దమేలే తిరువేంకటాద్రీశు గూడి॥

**83) ఆనందభైరవి**

ప॥ ఆపన్నుల పాలి దైవమాతడే గతి తక్క। ఏ ప్రొద్దును భజియించక నితరుడు మరి కలడా॥
చ॥ నిరుపాధిక నిజ బంధుడు నిరతిశయానందుడు। కరి వరదుడితడే కాక ఘనుడధికుడు కలడా॥
చ॥ సంతత గుణ సంపన్నుడు సాధులకు బ్రసన్నుడు। అంతర్యామితడే కాక అధికుడు మరి కలడా॥
చ॥ పరమాత్ముడు పరమ పురుషుడు పరికింపగ గృపాలుడు। తిరువేంకట విభుడే కాక దేవుడు మరి కలడా॥

**84) పాడి**

ప॥ చక్కని తల్లికి చాంగు బళా తన। చక్కెర మోవికి చాంగు బళా॥
చ॥ కులికేటి మురిపెపు గుమ్మరింపు దన। సళుపు జూపులకు చాంగు బళా।
పలుకుల సొంపుల బతితో కసరెడి। చలముల యలుకకు చాంగు బళా॥
చ॥ కిన్నెరతో బతి కెలన నిలుచు దన। చన్ను మెరుగులకు చాంగు బళా।
ఉన్నతి బతిపై నొరగి నిలుచు దన। సన్నపు నడిమికి చాంగు బళా॥
చ॥ జందెపు ముత్యపు సరుల హారముల। చందన గంధికి చాంగు బళా।
విందై వేంకటవిభు బెనచిన తన। సంది దండలకు చాంగు బళా॥

**85) ఖరహరప్రియ**

ప॥ అభయము అభయమో హరి నీవు। విభుడ వింతటికి వెర వికనేది॥
చ॥ జడిగొని మదిలో శాంతము నిలువదు। కడుగడు దుస్సంగతి వలన।
ఇడుమలేని సుఖ మించుక గానము। ఆడియాసల నా-యలమట వలన॥
చ॥ తలపులోన నీ తత్వము నిలువదు। పలులంపటముల భ్రమ వలన।
కలిగిన విజ్ఞాన గతియును దాగెను। వెలి విషయపు సిరిపీకుల వలన॥

చ॥ పక్కన పాపపు బంధము లూడెను। చిక్కక నిను దలచిన వలన।
చిక్కులు వాసెను శ్రీవేంకటపతి। నిక్కము నాకిదే నీ కృప వలన॥

**86)శ్రీరాగం**

ప॥ అది బ్రహ్మాణ్డంబిది పిణ్డాణ్డంబు- । దుటు జీవులము వున్నారమిదివో॥
చ॥ ఉదయాస్తమయము లొనరిన వలెనే। నిదురలు మేల్కను నియమములు।
కదిసి తిరిసంధ్యా కాలంబులవలె। గుదిగొను దేహికి గుణత్రయములు॥
చ॥ పుడమి సస్యములు పొదలిన వలెనే। వొడలి రోగములన్న విపే।
ఉడుగని వెలుపటి వుద్యోగమువలె। కొడిసాగెడి మితి కోరికలు॥
చ॥ వెలుపలగల శ్రీవేంకట విభుడే। కలడాతుమలో ఘనుడితడే।
చలమున నీతని శరణాగతియే। ఫలమును భాగ్యము బహు సంపదలు॥

**87)మోహన**

ప॥ ఆది మునుల సిద్ధాంజనము। యేదెస చూచిన నిదివో వీడే॥
చ॥ నగినసెలవి బడు నాలుగు। జగములు మొగమున జూపే మోహనము
చ॥ కనుదెరచిన నలుగడ నమృతములటు। అనువున గురిసీ నపారము
వనితలు నంద వ్రజమున జెలగగ। మనికిక నిరవై మలసీ వీడే॥
చ॥ పరమునకును దా బరమై వెలసిన। పరిపూర్ణ పరాత్పరుడు
సరస రుక్మిణికి సత్య భమకును। వరుడగు వేంకట వరదుడే వీడు॥

**88)నాట**

ప॥ ఆదిపురుషా అఖిలాంతరంగా। భూదేవతా రమణ భోగీంద్ర శయనా॥
చ॥ భవ పాథోనిధి బాడబానల। భవజీముత ప్రభంజనా
భవపర్వత ప్రళయ భయద నిర్ఘాత దు- । ర్భవ కాలకూటభవ బహువిశ్వరూప॥
చ॥ భవ ఘోర తిమిర దుర్భవ కాల మార్తాణ్డ। భవ భద్రమాతంగ పంచానన
భవ కమలభవ మాధవరూప శేషాద్రి। భవ వేంకటనాథ భవరోగ వైద్య॥

**89)హిందోళ**

ప॥ ఆదిదేవ పరమాత్మా వేద। వేదాంత వేద్య నమో నమో॥
అనుప॥ పరాత్పరా భక్త భవ భంజన। చరాచర లోక జనక నమో నమో॥
చ॥ గదాధరా వేంకటగిరి నిలయా। సదానంద ప్రసన్న నమో నమో॥

**90)కేదారగౌళ**

ప॥ అతిశయమగు సౌఖ్య మనుభవింపుమన్న। హితవు చేకొన నొల్లరిందరు॥
చ॥ కడలేని విజ్ఞానగతికి దోడుగారు। యెడపులవారలె యిందరు।
అడరిన మోక్ష సహాయు లెవ్వరు లేరు। ఇడుమపాట్ల వారె యిందరు॥
చ॥ తిరమైన పుణ్యము బోధించేవారు లేరు। యెరవులవారే యిందరు।
తిరువేంకటాచలాధిపుని మీదిచిత్త- । మిరవు సేయక పోయిరిందరు॥

**91)సింధుభైరవి**

ప॥ అప్పులేని సంసార మైనపాటే చాలు। తప్పులేని జీతమొక్క తారమైన జాలు॥
చ॥ కంతలేని గుడిసొక్క గంపంతైన జాలు। చింతలేని యంబలొక్క చేరెడే చాలు।
జంతగాని తరుణి యేజాతైన నాదె చాలు। వింతలేని సంపదొక్క వీసమే చాలు॥
చ॥ తిట్టులేని బ్రదుకొక్క దినమైన నదే చాలు। ముట్టులేని కూడొక్క ముద్దడే చాలు।
గుట్టుచెడి మనుకంటే కొంచెపు మేలైన చాలు। వట్టిజాలి బడుకంటే వచ్చినంతే చాలు॥
చ॥ లంపటపడని మేలు లవలేసమే చాలు। రొంపికంబమొకంటె రోయుటే చాలు।

రంపపు గోరికకంటే రతి వేంకటపతి। పంపున నాతని జేరే భవమే చాలు॥

**92) కాంభోజి**

ప॥ అప్పులవారే అందరును। కప్పగ దిప్పగ గర్తలు వేరీ॥

చ॥ ఎక్కడ చూచిన నీ ప్రపంచమున। జిక్కులు సిలుగులు జింతలునే।
దిక్కెవ్వరు ఈతిదీపులలో। దిక్కుముక్కులకు దేవుడేగాక॥

చ॥ ఏది తలంచిన నేకాలంబును। సూదుల మూటల సుఖము లివి।
కాదన నౌనన గడ గనిపించగ। పోదికాడు తలపున గల డొకడే॥

చ॥ ఎన్నడు వీడీ నెప్పుడు వాసీ। బన్నిన తమ తమ బంధములు
ఉన్నతి సేయగ వొప్పులు నెరపగ। వెన్నుడు వేంకట విభుడే కలడు॥

**93) వరాళి**

ప॥ ఆపదల సంపదల నలయుటేమిట మాను। రూపింప నిన్నిటను రోసినను గాక॥

చ॥ కడలేని దేహ రోగంబులేమిట మాను। జడను విడిపించు నౌషధ సేవగాక।
విడవ కడియాస తను వేమటేమిట మాను। వొడలి కలగుణమెల్ల నుడిగినను గాక॥

చ॥ దురిత సంగ్రహమైన దుఃఖమేమిట మాను। సరిలేని సౌఖ్యంబు చవికొన్న గాక।
కరుకైన మోహాంధకార మేమిటి మాను। అరిది తేజోమార్గ మలవడిన గాక॥

చ॥ చావులో బెనగొన్న జన్మ మేమిటి మాను। యీవలావలి కర్మమెడసిన గాక।
భావింప నరుదైన బంధమేమిటి మాను। శ్రీవేంకటేశ్వరుని సేవచే గాక॥

**94) ఆనందభైరవి**

ప॥ అంతయు నీవే హరి పుండరీకాక్ష। చెంత నాకు నీవే శ్రీరఘురామ॥

చ॥ కులమును నీవే గోవిందుడా నా। కలిమియు నీవే కరుణానిధి।
తలపును నీవే ధరణీధర నా। నెలవును నీవే నీరజనాభ॥

చ॥ తనువును నీవే దామోదర నా। మనికియు నీవే మధుసూదన।
వినికియు నీవే విట్ఠలుడా నా। వెనకముందు నీవే విష్ణు దేవుడా॥

చ॥ పుట్టుగు నీవే పురుషోత్తమ। కొన నట్టనడుము నీవే నారాయణ।
ఇట్టే శ్రీవెంకటేశ్వరుడా నాకు। నెట్టన గతి ఇంక నీవే నీవే॥

**95) ఆభోగి**

ప॥ అంతర్యామి అలసితి సొలసితి। ఇంతట నీ శరణిదె జొచ్చితిని॥

చ॥ కోరిన కోర్కులు కోయని కట్లు। తీరవు నీవవి తెంచక।
భారపు బగ్గాలు పాప పుణ్యములు। నేరుపుల బోనీవు నీవు వద్దనక॥

చ॥ జనుల సంగముల జక్క రోగములు। విను విడువవు నీవు విడిపించక।
వినయపు దైన్యము విడువని కర్మము। చనదది నీవిటు శాంతపరచక॥

చ॥ మదిలో చింతలు మైలలు మణుగులు। వదలవు నీవవి వద్దనక।
ఎదుటనె శ్రీవెంకటేశ్వర నీవదె। అదన గాచితివి అట్టిట్టనక॥

**96) మధ్యమావతి**

ప॥ అందరికాధారమైన ఆది పురుషుడీతడు। విందై మున్నారగించె విదురునికడ నీతుడు॥

చ॥ సనకాదులు కొనియాడెడి సర్వాత్మకుడీతడు। వనజ భవాదులకును దైవంబై నతడీతడు।
ఇనమండలమున జెలగేటిహితమై భవుడితడు। మునుపుట్టిన దేవతలకు మూలభూతి యీతడు॥

చ॥ సిరులొసగి యశోదయింట శిశువైనత డీతడు। ధరనావుల మందలలో తగ జరించె నీతడు।
సరసతలను గొల్లెతలకు జనవులొసగె నీతడు। ఆరసి కుచేలుని యడుకులు ఆరగించెనీతడు॥

చ॥ పంకజభవునకును బ్రహ్మ పద మొసగెను యీతుడు। సంకీర్తన లాద్యులచే జట్టి గొనియెనీతడు।

తెంకిగ నేకాలము పరదేవుడైన యీతడు। వేంకటగిరి మీద ప్రభల వెలసిన ఘనుడీతడు॥

**97) బౌళి**

ప॥ ఆనంద నిలయ ప్రహ్లాద వరదా। భాను శశి నేత్ర జయ ప్రహ్లాద వరదా॥

చ॥ పరమ పురుష నిత్య ప్రహ్లాద వరదా। హరి అచ్యుతానంద ప్రహ్లాద వరదా।
పరిపూర్ణ గోవింద ప్రహ్లాద వరదా। భరిత కల్యాణగుణ ప్రహ్లాద వరదా॥

చ॥ భవరోగ సంహరణ ప్రహ్లాద వరదా। అవిరళ కేశవ ప్రహ్లాద వరదా।
పవమాన నుత కీర్తి ప్రహ్లాద వరదా। భవ పితామహ వంద్య ప్రహ్లాద వరదా॥

చ॥ బల యుక్త నరసింహ ప్రహ్లాద వరదా। లలిత శ్రీవేంకటాద్రి ప్రహ్లాద వరదా।
ఫలిత కరుణారస ప్రహ్లాద వరదా। బలి వంశ కారణ ప్రహ్లాద వరదా॥

**98) ధన్యాసి**

ప॥ భావయామి గోపాలబాలం మన-।స్సేవితం తత్పదం చింతయేహం సదా॥

చ॥ కటి ఘటిత మేఖలా ఖచిత మణి ఘంటికా-। పటల నినదేన విభ్రాజమానం।
కుటిల పద ఘటిత సంకుల శింజితానతం। చటుల నటనా సముజ్జ్వల విలాసం॥

చ॥ నిరతకర కలితనవనీతం బ్రహ్మాది-। సుర నికర భావనా శోభిత పదం।
తిరువేంకటాచల స్థిత మనుపమం హరిం। పరమ పురుషం గోపాలబాలం॥

**99) హరికాంభోజి**

ప॥ ఇతడొకడే సర్వేశ్వరుడు। సిత కమలాక్షుడు శ్రీవేంకటేశుడు॥

చ॥ పరమ యోగులకు భావ నిధానము। అరయ నింద్రాదుల కైశ్వర్యము।
గరిమ గొల్లెతల కౌగిట సౌఖ్యము। సిరులొసగేటి శ్రీవేంకటేశుడు॥

చ॥ కలికి యశోదకు కన్న మాణికము తలచిన కరికిని తగుదిక్కు।
అల ద్రౌపదికిని ఆపద్బంధుడు। చలరేగిన శ్రీవేంకటేశుడు॥

చ॥ తగిలిన మునులకు తపము సత్ఫలము। ముగురు వేల్పులకు మూలమీతడే।
వొగిసలమేల్మంగ కొసరిన పతియితడు। జిగిమించిన యీ సర్వేశుడు॥

**100) షణ్ముఖప్రియ**

ప॥ భోగిశయనమును బుసకొట్టెడిని। యోగ నిద్ర పాయును మేల్కొనవే॥

చ॥ కన్నులు దెరవక కమల బాంధవుడు। వెన్నెల రేఖవు వెలయ దిదే।
అన్నువ మలసీ నరుణోదయమిదే। మిన్నక నీవిటు మేలు కొనవే॥

చ॥ తెల్లని కన్నులు దెరవక విరియగ। నొల్లక జలజము లున్న విపే।
కల్ల నిదుర నిను గవియగనియ్యక। మెల్లనాయ నిటు మేలు కొనవే॥

చ॥ తెరవగు రెప్పల దెల్లవారవలె। తెరవక చీకటి దీరే దీదే।
తెరగు వేంకటాధిప నీ వెరుగుదు। మెరుగులు చల్లుచు మేలుకొనవే॥

**101) ముఖారి**

ప॥ భోగీంద్రులును మీరు బోయి రండు। వేగగ మీదటి విభవాలకు॥

చ॥ హరుడ పోయిరా అజుడ నీవును బోయి। తిరిగిరా మీదటి తిరునాళ్ళకు।
సురలు మునులును భూసురలు బోయిరండు। అరవిరి నిన్నాళ్ళు నలసితిరి॥

చ॥ జముడ పోయిరా శశియు నీవును బోయి। సుముఖుడవై రా సురల గూడి।
గుములై దిక్పతులు దిక్కులకు బోయిరండు। ప్రమదాన నిన్నాళ్ళు బడలితిరి॥

చ॥ నారద సనక సనందాదులు। భూరివిభవముల బోయిరండు।
దూరముగా బోకిట్టే తొరలి వేంకటగిరి। జేరి నన్నిట్లనే సేవించుడీ॥

**102) ఖరహరప్రియ**

ప॥ బృవంతి బౌద్ధా బుద్ధ ఇతి। స్తువంతి భక్తా సులభ ఇతి॥
చ॥ గదంతికిల సాంఖ్యాస్త్వాం పురుషం। పద వాక్యజా పదమితి చ।
విదంతి త్వా వేదాంతిన- । స్సదా బ్రహ్మ లసత్పదమితి చ॥
చ॥ జపంతి మీమాంసకా స్త్వాంచ। విపుల కర్మణో విభవ ఇతి।
లపంతి నయన సకలా- । స్సతతం కృపాళు కర్తా కేవలమితి చ॥
చ॥ భణంతి వెంకటపతే మునయో। హ్యణిమాదిప్రద మతులమితి।
గుణవంతం నిర్గుణం పునరితి। గృణంతి సర్వే కేవలమితి చ॥

**103)రామక్రియ**

ప॥ భక్తికొలది వాడే పరమాత్ముడు। భుక్తి ముక్తి తానె ఇచ్చు భువి పరమాత్ముడు॥
చ॥ పట్టిన వారిచే బిడ్డ పరమాత్ముడు। పట్టబయటి ధనము పరమాత్ముడు।
పట్ట పగటి వెలుగు పరమాత్ముడు। యెట్ట నెదుటనే వున్నాడిదె పరమాత్ముడు॥
చ॥ పచ్చి పాలలోన వెన్న పరమాత్ముడు। బచ్చెన వాసిన రూపు పరమాత్ముడు।
బచ్చు చేతివొరగల్లు పరమాత్ముడు। ఇచ్చకొలది వాడువో యీ పరమాత్ముడు॥
చ॥ పలుకులలోని తేట పరమాత్ముడు। ఫలియించు నిందరికి పరమాత్ముడు।
బలిమి శ్రీవేంకటాద్రి పరమాత్ముడు। యెలమి జీవుల ప్రాణమీ పరమాత్ముడు॥

**104)సామంతం**

ప॥ చక్కదనముల వారసతులార। యెక్కువ తక్కువల మీరు ఏందుబోయేరికను॥
చ॥ ఒప్పుగా నరకము మాకు బలిచ్చి మనమెల్ల। కప్పము గొంటిరిగా అంగనలార।
అప్పుడే గోవిందునికి ఆహివెట్టితి జిత్తము। యిప్పుడు యెమ్మెల మీరేమి సేసేరికను॥
చ॥ పంచమహా పాతకాలబారి దోసి మాసిగ్గులు। లంచము గొంటిరిగా నెలతలారా।
వంచనతోడుత హరివారమైతి మికమీ- । యించుక గుట్టుల మీరెందు జొచ్చేరికను॥
చ॥ దొంగిలి మాగుట్టులెల్ల దోవ వేసి మరుబారి। భంగపెట్టితిరిగా వో భామలార।
చెంగలించి వెంకటేశు సేవకు జొచ్చితిమి। యెంగిలి మోపులను మీరేడబడే రికను॥

**105)సింధుభైరవి**

ప॥ చాలదా బ్రహ్మ మిది సంకీర్తనం మీకు। జాలెల్ల నడగించు సంకీర్తనం॥
చ॥ సంతోష కరమైన సంకీర్తనం। సంతాప మణగించు సంకీర్తనం।
జంతువుల రక్షించు సంకీర్తనం। సంతతము దలచుడీ సంకీర్తనం॥
చ॥ సామజము గాంచినది సంకీర్తనం। సామమున కెక్కుడీ సంకీర్తనం।
సామీప్య మిందరికి సంకీర్తనం। సామాన్యమా విష్ణు సంకీర్తనం॥
చ॥ జముబారి విడిపించు సంకీర్తనం। సమ బుద్ధి వొడమించు సంకీర్తనం।
జమళి సౌఖ్యములిచ్చు సంకీర్తనం। శమదమాదుల జేయు సంకీర్తనం॥
చ॥ జలజాసనుని నోరి సంకీర్తనం। చలిగొండ సుతదలచు సంకీర్తనం।
చలువ గడు నాలుకకు సంకీర్తనం। చలపట్టి తలచుడీ సంకీర్తనం॥
చ॥ సరవి సంపదలిచ్చు సంకీర్తనం। సరిలేని దిదియపో సంకీర్తనం।
సరుస వేంకట విభుని సంకీర్తనం। సరుగనను దలచుడీ సంకీర్తనం॥

**106)శ్రీరాగం**

ప॥ చాలదా హరి నామ సౌఖ్యామృతము దమకు। చాలదా హితవైన చవులెల్లను నొసగ॥
చ॥ ఇది యొకటి హరి నామ మింతైన జాలదా। చెదరకీ జన్మముల చెరలు విడిపించ।
మదినొకటె హరినామ మంత్రమది చాలదా। పదివేల నరక కూపముల వెడలించ॥
చ॥ కలదొకటి హరినామ కనకాద్రి చాలదా। తొలగుమని దారిద్ర్యదోషంబు చెరుచ।

***************************************************************************************************

తెలివొకటి హరినామదీప మది చాలదా। కలుషంపు కఠిన చీకటి పారద్రోల॥
చ॥ తగువేంకటేశు కీర్తనమొకటి చాలదా। జగములో కల్పభూజంబు వలె నుండ।
సొగసి యీవిభుని దాసుల కరుణ చాలదా। నగవు జూపులను నున్నతమెపుడు జూప॥

**107)సింధుభైరవి**

ప॥ చలపాది రోగమీ సంసారము నేడు। బలువైన మందు విష్ణు భక్తి జీవులకు॥
చ॥ కీడౌట మదినెరింగియు మోహ మెడలదిది। పాడైన విధికృతము బలవంతము।
ఈడనే ఇది మాన్ప హితవైన వజ్రాంగి। జోడువో హరి దలంచుట జీవులకును॥
చ॥ హేయమని తెలిసి తా నిచ్చగించీ యాత్మ। పాయదీ రతి సుఖము బలవంతము।
మాయ నుగ్గులు చేయ మాధవుని దంచనపు। రాయివో వైరాగ్య రచన జీవులకు॥
చ॥ పొలయు దురితంపు రొంపులు దన్ను వడి ముంచ। పలుమారు జన్మమీ బలవంతము।
నెలవుకొని సకలంబు నిర్మలముగా కడుగు। జలధివో వేంకటేశ్వరుడు జీవులకు॥

**108)ఆందోళిక**

ప॥ ఆదిమ పురుషుడు అహోబలమను। వేదాద్రి గుహలో వెలసీవాడే॥
చ॥ ఉదయించే నదిగో ఉక్కు కంబమున। చెదరక శ్రీనరసింహుడు।
కదిసి హిరణ్యుని ఖండించి ప్రహ్లాదు నెదుట గద్దెపై నిరవై నిలిచే॥
చ॥ పొడ చూపెనదిగో భువి దేవతలకు। చిడుముడి శ్రీనరసింహుడు।
అదర నందరికి నభయంబొసగుచు। నిడుకొనె తొడపైన తిరము॥
చ॥ సేవలు గొన్నాడె చెలగి సురలచే। శ్రీవేంకట నరసింహుడు।
దైవమై మమ్మేలి దాసుల రక్షించే। తావు కనగ నిటు దయతో జూచి॥

**109)శ్రీరాగం**

ప॥ చేరి కొల్వరో ఈతడు శ్రీదేవుడు। యీ రీతి శ్రీవేంకటాద్రి నిరవైన దేవుడు॥
చ॥ అలమేలుమంగ నురమందిడు కొన్న దేవుడు। చెలగి శంఖ చక్రాల చేతి దేవుడు।
కల వరద హస్తము గటి హస్తపు దేవుడు। మలసీ శ్రీవత్స వనమాలికల దేవుడు॥
చ॥ ఘన మకర కుణ్డల కర్ణముల దేవుడు। కనక పీతాంబర శృంగార దేవుడు।
ననిచి బ్రహ్మాదుల నాభి గన్న దేవుడు। జనించె బాదాల గంగ సంగతైన దేవుడు॥
చ॥ కోటి మన్మథాకార సంకులమైన దేవుడు। జూటుపు కిరీటపు మించుల దేవుడు।
వాటపు సొమ్ముల తోడి వసుధాపతి దేవుడు। యీటులేని శ్రీవేంకటేశుడైన దేవుడు॥

**110)ఖరహరప్రియ**

ప॥ చూడరెవ్వరు దీనిసోద్యంబు పరికించి। చూడజూడగ గాని సుఖమెరుగ రాదు॥
చ॥ ఎడతెగనిమమత వేయగరానిపెను మోపు। కడలేని ఆశ చీకటి దవ్వుకొనుట।
నిడివైనకనుచూపు నీడనుండిన ఎండ। వడి చెడని తమకంబు వట్టితాపంబు॥
చ॥ బుద్ధి మానిన చింత పోని యూరికి దెరువు। పొద్దు వోవని వలపు పొట్ట పొంకంబు।
ఎద్దుబట్టిన శివంబెరుక మాలిన ప్రియము-। లొద్దిక విహారంబు లుబ్బు గవణంబు॥
చ॥ తీపు లోపలి తీపు తిరు వేంకటేశ్వరుని। చూపు పొడగనని చూపులో చూపు।
ఆపదలువాయు నెయ్యపు దలపులీ తలపు। రూపైన రుచిలోని రుచి వివేకంబు॥

**111)బౌళి**

ప॥ ఎక్కడి మానుష జన్మం బెత్తిన ఫలమే మున్నది। నిక్కము నిన్నే నమ్మితి నీ చిత్తంబికను॥
చ॥ మరవను ఆహారంబును మరవను సంసార సుఖము। మరవను యింద్రియ భోగము మాధవ నీ మాయ।
మరచెద జ్ఞానంబును మరచెద తత్త్వ రహశ్యము। మరచెద గురువును దైవము మాధవ నీ మాయ॥
చ॥ విడువను పాపము పుణ్యము విడువను నా దుర్గుణములు। విడువను మిక్కిలి యాసలు విష్ణుడ నీమాయ।

***************************************************************************************************

విడిచెద షట్కర్మంబులు విడిచెద వైరాగ్యంబును। విడిచెద నాచారంబును విష్ణుడ నీమాయ॥

చ॥ తగిలెద బహు లంపటముల తగిలెద బహు బంధముల। తగులను మోక్షపు మార్గము తలపున యెంతైనా।
అగపడి శ్రీవేంకటేశ్వర అంతర్యామివై। నగి నగి నను నీవేలితి నాకా యీమాయ॥

**112)దేవగాంధారి**

ప॥ అమరాంగనలదె నాడేరు। ప్రమదంబున నదె పాడేరు॥

చ॥ గరుడ వాహనుడు కనక రథముపై। ఇరువుగ వీధుల నేగినీ।
సురులును మునులును సొంపుగ మోకులు। తెరలిచి తెరలిచి తీసేరు॥

చ॥ ఇలధరు డదివో ఇంద్రరథముపై। కెలయుచు దిక్కులు గెలిచేని।
బలు శేషాదులు బ్రహ్మ శివాదులు। చెలగి సేవలటు చేసేరు॥

చ॥ అలమేల్మంగతో నటు శ్రీవేంకట। నిలయుడు రథమున నెగడీని।
నలుగడ ముక్తులు నారదాదులును। పొలుపు మిగులగడు బొగడేరు॥

**113)నీలాంబరి**

ప॥ అన్న లంటా తమ్ములంటా ఆండ్లంటా బిడ్డలంటా। వన్నెల నప్పులు గొన్న వారువో వీరు॥

చ॥ తెగనీక అప్పులెల్లా దీసి తీసి వారు। తగిలిన బెట్టలేక దాగిదాగి।
వెగటున బారిపోగా వెంట వెంట పెక్కు। వగల నప్పులు గొన్న వారువో వీరు॥

చ॥ సేయరాని పనులెల్ల చేసి చేసి తమ। రాయడికి లోలోనె రాసి రాసి।
కాయములో చొచ్చి చొచ్చి కాచి కాచి మున్ను। వ్రాయని పత్రాలకాగే వారువో వీరు॥

చ॥ దొరయై యప్పుల వారి దోసి తోసి యీ। పరిభవములనెల్ల బాసి పాసి।
సిరుల వేంకటపతి జేరి చేరి యిట్టి। వరుసనే గెలిచిన వారువో వీరు॥

**114)మధ్యమావతి**

ప॥ అంగనలీరే హారతులు అంగజగురునకు నారతులు॥

చ॥ శ్రీదేవి తోడుత జెలగుచు నవ్వే। ఆదిమ పురుషుని కారతులు।
మేదినీ రమణి మేలము లాడేటి। ఆదిత్య తేజున కారతులు॥

చ॥ సురలకు నమృతము సొరది నొసంగిన। హరి కివో పసిడారతులు।
తరమిది దుష్టుల దనుజుల నడచిన। అరి భయంకరున కారతులు॥

చ॥ నిచ్చలు కల్యాణ నిధియై యేగేటి। అచ్యుతునకు నివె యారతులు।
చొచ్చి శ్రీవేంకటేశుడు నలమేల్మంగ। యచ్చుగ నిలిచిరి యారతులు॥

**115)సామంతం**

ప॥ ఇందరికి నభయంబు లిచ్చు చేయి। కందువగు మంచి బంగారు చేయి॥

చ॥ వెలలేని వేదములు వెదికి దెచ్చిన చేయి। చిలుకు గుబ్బలి కింద జేర్చు చేయి।
కలికియగు భూకాంత కౌగిలించిన చేయి। వలనైన కొనగోళ్ళ వాడిచేయి॥

చ॥ తనివోక బలిచేత దానమడిగిన చేయి। వొనరంగ భూదాన మొసగు చేయి।
మొనసి జలనిధి యమ్ము మొనకు దెచ్చిన చేయి। యెనయ నాగేలు ధరియించు చేయి॥

చ॥ పురసతుల మానముల పొల్లసేసిన చేయి। తురగంబు బరపెడి దొడ్డచేయి।
తిరు వేంకటాచలాధీశుడై మోక్షంబు। తెరువు ప్రాణులకెల్ల దెలిపెడి చేయి॥

**116)భూపాలం**

ప॥ ఇప్పుడిటు కలగంటి నెల్లలోకములకు। నప్పడపు తిరువేంకటాద్రీశు గంటి॥

చ॥ అతిశయంబైన శేషాద్రి శిఖరము గంటి। ప్రతిలేని గోపురప్రభలు గంటి।
శతకోటి సూర్యతేజములు వెలుగగ గంటి। చతురాస్యు బొడకంటి చయ్యన మేలుకంటి॥

చ॥ కనకరత్న కిరీటకాంతు లిరుగడ గంటి। ఘనమైన దీప సంఘములు గంటి।

అనుపమ మణిమయమగు కిరీటము గంటి। కనకాంబరము గంటి గక్కున మేలుకంటి॥
చ॥ అరుదైన శంఖచక్రాదు లిరుగడ గంటి। సరిలేని అభయ హస్తము గంటిని।
తిరువేంకటాచలాధిపుని జూడగ గంటి। హరి గంటి గురు గంటి నంతట మేలుకంటి॥

**117) శుభపంతువరాళి**

ప॥ కలలోని సుఖమే కలియుగమా- వెన్న। కలిలో నెక్కడిదె కలియుగమా॥
చ॥ కడిగడి గండమై కాలము గడిపేవు। కడుగ గడుగ రొంపి కలియుగమా।
బడలికె వాపవు పరమేదొ చూపవు। గడిచీటియును నీవు కలియుగమా॥
చ॥ కరపేవు కరతలే మరపేవు మమతలే। కరకర విడువవు కలియుగమా।
తెరచీర మరగింతే తెరువేల మూసేవు। గరుసేల దాటేవో కలియుగమా॥
చ॥ కానిదె మెచ్చేవు కపటాలే యిచ్చేవు। కానీలే కానీలే కలియుగమా।
పైనిదే వేంకటపతి దాసులుండగ। కానవా నీవిదేమి కలియుగమా॥

**118) శ్రీరాగం**

ప॥ వందే వాసుదేవం। బృందారకాధీశ వందిత పదాబ్జం॥
చ॥ ఇందీవరశ్యామ మిందిరాకుచతటీ- । చందనాంకిత లసత్చారు దేహం।
మందార మాలికామకుట సంశోభితం। కందర్పజనక మరవిందనాభం॥
చ॥ ధగధగ కౌస్తుభ ధరణ వక్షస్థలం। ఖగరాజ వాహనం కమలనయనం।
నిగమాదిసేవితం నిజరూపశేషప- । న్నగరాజ శాయినం ఘననివాసం॥
చ॥ కరిపురనాథసంరక్షణే తత్పరం। కరిరాజవరద సంగతకరాబ్జం।
సరసీరుహాననం చక్రవిభ్రాజితం। తిరు వేంకటాచలాధీశం భజే॥

**119) హంసధ్వని**

ప॥ వందేహం జగద్వల్లభం దుర్లభం। మందర ధరం గురుం మాధవం భూధవం॥
చ॥ నరహరిం మురహరం నారాయణం పరం। హరిం అచ్యుతం ఘనవిహంగ వాహనం।
పురుషోత్తమం పరం పుండరీకేక్షణం। కరుణాభరణం కలయామి శరణం॥
చ॥ నంద నిజనందనం నందక గదాధరం। ఇందిరానాథ మరవిందనాభం।
ఇందురవి లోచనం హితదాసపదం ము- । కుందం యదుకులం గోపగోవిందం॥
చ॥ రామానామం యజ్ఞరక్షణం లక్షణం। వామనం కామితం వాసుదేవం।
శ్రీమదావాసినం శ్రీవేంకటేశ్వరం। శ్యామలం కోమలం శాంతమూర్తిం॥

**120) అసావేరి**

ప॥ నందకధర నంద గోపనందన। కందర్ప జనక కరుణాత్మన్॥
చ॥ ముకుంద కేశవ మురహర। సకలాధిప పరమేశ్వర దేవేశ।
శుకవరద సవితృ సుధాంశు లోచన। ప్రకట విభవ నమో పరమాత్మన్॥
చ॥ ధృవపాంచాలీ స్తుతివత్సల మా- । ధవ మధుసూదన ధరణీధరా।
భువనత్రయ పరిపోషణ తత్పర। నవనీతప్రియ నాదాత్మన్॥
చ॥ శ్రీమాన్ వేంకట శిఖరనివాస మ- । హామహిమాన్ నిఖిలాణ్డపతే।
కామిత ఫల భోగప్రదతే నమో। స్వామిన్ భూమన్ సర్వాత్మన్॥

**121) నాట**

ప॥ తనకేడ చదువులు తనకేడ శాస్త్రాలు। మనసు చంచల బుద్ధి మానీనా॥
చ॥ జడ్డు మానవుడు చదువ జదువు నాస। వడ్డివారుగాక వదలీనా।
గుడ్డికుక్క సంతకుబోయి తిరిగిన। దుడ్డుపెట్లే కాక దొరకేనా॥
చ॥ దేవదూషకుడై తిరిగేటి వానికి। దేవతాంతరము తెలిసీనా।

శ్రీవేంకటేశ్వరు సేవాపరుడుగాక। పావనమతియై పరగీనా॥

**122) ఆభేరి**

ప॥ దేవదేవం భజే దివ్య ప్రభావం। రావణాసురవైరి రఘు పుంగవం॥

చ॥ రాజవర శేఖరం రవికుల సుధాకరం। ఆజాను బాహుం నీలాభ్ర కాయం।
రాజారి కోదండ రాజదీక్షా గురుం। రాజీవ లోచనం రామచంద్రం॥

చ॥ నీలజీమూత సన్నిభ శరీరం ఘన వి- । శాల వక్షసం విమల జలజ నాభం।
కాలాహి నగ హరం ధర్మ సంస్థాపనం। భూ లలనాధిపం భోగశయనం॥

చ॥ పంకజాసన వినుత పరమ నారాయణం। శంక రార్జిత జనక చాప దళనం।
లంకా విశోషణం లాలిత విభీషణం। వేంకటేశం సాధు విబుధ వినుతం॥

**123) మాళవశ్రీ**

ప॥ నమామ్యహం మానవ సింహం। ప్రమదాంక మహోబల నరసింహం॥

చ॥ దానవ దైత్య విదారణ సింహం। నానాయుధ కర నరసింహం।
భూ నభోంత రాపూరిత సింహం। ఆనన వహ్ని లయాంతక సింహం॥

చ॥ ప్రళయ నృసింహం బహుముఖ సింహం। సలలిత గరుడాచల సింహం।
కులిశ నఖర ముఖ ఘోషిత సింహం। తిలకిత బహురవి దీపిత సింహం॥

చ॥ శాంత నృసింహం శౌర్య నృసింహం। సంతత కరుణా జయ సింహం।
కాంత శ్రీ వేంకట గిరి సింహం। చింతిత ఘన సంసిద్ధి నృసింహం॥

**124) మణిరంగు**

ప॥ రామ మిందీవర శ్యామం పరాత్పర। ధామం సుర సార్వభౌమం భజే॥

చ॥ సీతావనితా సమేతం। పీత (స్ఫీత) వానర బలవ్రాతం।
పూత కౌసల్యా సంజాతం। వీత భీత మౌని విద్యోతం॥

చ॥ వీర రణరంగ ధీరం। సారకులోద్ధారం।
క్రూర దానవ సంహారం। శూరాధారాచార సుగుణోదారం॥

చ॥ పావనం భక్త సేవనం। దైవిక విహగపథావనం।
రావణానుజ సంజీవనం। శ్రీ వేంకట పరిచిత భావనం॥

**125) జోగియా**

ప॥ అయమేవ అయమేవ ఆదిపురుషో। జయకరం తమహం శరణం భజామి॥

చ॥ అయమేవ ఖలుపురా అవనీధరస్తుసో। వ్యయమేవ వటదళాగ్రాధీశయనః।
అయమేవ దశవిట్ట రవతార రూపైచ్య। నయమార్గ భువిరక్షణం కరోతి॥

చ॥ అయమేవ సతతం శ్రియఃపతి దేవేషు। అయమేవ దుష్టదైత్యాంత కస్తు।
అయమేవ సకల భూతాంతరేష్ణు క్రమ్య। ప్రియభక్తపోషణం పిదృత్పనోతు॥

చ॥ అయమేవ శ్రీవేంకటాద్రి విరాజితే। అయమేవ వరదోప్యాచకానా।
అయమేవ వేదవేదాంతశ్చ సూచితో। అయమేవ వైకుంఠాధీశ్వరస్తు॥

**126) భాగేశ్వరి**

ప॥ నమిత దేవం భజే నారసింహం। సుముఖ కరుణేక్షణం సులభ నరసింహం॥

చ॥ విజయ నరసింహం వీర నరసింహం। భుజబల పరాక్రమ స్ఫుట నరసింహం।
రజని చర విదళన విరాజిత నృసింహం। సుజన రక్షక మహాశూర నరసింహం॥

చ॥ దారుణ నరసింహం ప్రతాప నరసింహం। చారు కల్యాణ నిశ్చల నృసింహం।
ధీర చిత్తావాస దివ్య నరసింహం। సార యోగానంద చతుర నరసింహం॥

చ॥ విమల నరసింహం విక్రమ నృసింహం। కమనీయ గుణగణాకర నృసింహం।

అమిత సుశ్రీవేంకటాద్రి నరసింహం। రమణీయ భూషాభిరామ నరసింహం॥

**127)బైరాగీ భైరవి**

ప॥ మాధవా భూధవా మదన జనక। సాధు రక్షణ చతుర శరణు శరణు॥

చ॥ నారాయణాచ్యుతానంత గోవింద శ్రీ। నారసింహా కృష్ణ నాగశయన।
వారాహ వామన వాసుదేవ మురారి। శౌరీ జయజయతు శరణు శరణు॥

చ॥ పుండరీకేక్షణ భువన పూర్ణగుణ। అండజగమన నిత్యహరి ముకుంద।
పండరి రమణ రామ బలరామ పరమ పురుష। చండభార్గవ రామ శరణు శరణు॥

చ॥ దేవదేవోత్తమ దివ్యావతార నిజ। భావ భావనాతీత పద్మనాభ।
శ్రీవేంకటాచల శృంగారమూర్తి నవ। సావయవ సారూప్య శరణు శరణు॥

**128)నవరోజ్**

ప॥ జయజయ నృసింహ సర్వేశ। భయహర వీర ప్రహ్లాద వరద॥

చ॥ మిహిర శశినయన మృగనర వేష। బహి రంతస్థల పరిపూర్ణ।
అహి నాయక సింహాసన రాజిత। బహుళ గుణ గణ ప్రహ్లాద వరద॥

చ॥ చటుల పరాక్రమ సమఘన విరహిత। నిటుల నేత్ర మౌని ప్రణుత।
కుటిల దైత్య తతి కుక్షి విదారణ। పటు వజ్రనఖ ప్రహ్లాద వరద॥

చ॥ శ్రీ వనితా సంశ్రిత వామాంక। భావజ కోటి ప్రతిమాన।
శ్రీ వేంకటగిరి శిఖర నివాస। పావన చరిత ప్రహ్లాద వరద॥

**129)శుద్ధ వసంతం**

ప॥ కడలుడిసి నీరాడగా దలచువారలకు। కడలేని మనసునకు గడమ యెక్కడిది॥

చ॥ దాహమణగిన వెనక తత్త్వమెరి గెదనన్న। దాహమేలణగు తా తత్త్వమేమెరుగు।
దేహంబుగల యన్ని దినములకు పదార్థ। మోహమేలుడుగుదా ముదమేల కలుగు॥

చ॥ ముందరెరిగిన వెనుకమొదలు మరచెదనన్న। ముందరేమెరుగుదా మొదలేల మరచు॥
అందముగ దిరువేంకటాద్రీశు మన్ననల। కందు వెరిగిన మేలు కలనైన లేదు॥

**130)ధన్యాసి**

ప॥ నంద నందన వేణునాద వినోదము-। కుంద కుంద దంతహాస గోవర్ధన ధరా॥

చ॥ రామ రామ గోవింద రవిచంద్ర లోచన। కామ కామ కలుష వికార విదూరా।
ధామ ధామ విభవత్ప్రతాప రూప దనుజ ని-। ర్ధూమ ధామ కరణ చతుర భవభంజనా॥

చ॥ కమల కమలవాస కమలా రమణ దేవో-। త్తమ తమోగుణ సతత విదూర।
ప్రమదత్ప్రమదానుభవ భావ కరణ। సుముఖ సుధానంద శుభరంజనా॥

చ॥ పరమ పరాత్పర పరమేశ్వరా। వరద వరదామల వాసుదేవ।
చిర చిర ఘననగ శ్రీవేంకటేశ్వర। నరహరి నామ పన్నగ శయనా॥

**131)శ్రీరాగం/ అఠాణ**

ప॥ ఫాలనేత్రానల ప్రబల విద్యుల్లతా। కేళీ విహార లక్ష్మీనారసింహా॥

చ॥ ప్రళయమారుత ఘోర భస్త్రీకాపూత్కార। లలిత నిశ్వాసడోలా రచనయా।
కూలశైలకుంభినీ కుముదహిత రవిగగన-। చలన విధినిపుణ నిశ్చల నారసింహా॥

చ॥ వివరఘనవదన దుర్విధహసన నిష్ఠ్యూత-। లవదివ్య పరుష లాలాఘటనయా।
వివిధ జంతు వ్రాతభువన మగ్నోకరణ। నవనవప్రియ గుణార్ణవ నారసింహా॥

చ॥ దారుణోజ్జ్వల ధగద్ధగిత దంష్ట్రానల వి-। కార స్ఫులింగ సంగక్రీడయా।
వైరిదానవ ఘోరవంశ భస్మీకరణ-। కారణ ప్రకట వేంకట నారసింహా॥

**132)మాళవిగౌళ**

ప॥ నిత్య పూజలివివో నేరిచిన నోహో। ప్రత్యక్షమైనట్టి పరమాత్మునికి॥
చ॥ తనువే గుడియట తలయే శిఖరమట। పెనుహృదయమే హరి పీఠమట।
కనుగొన చూపులే ఘనదీపము లట। తనలోపలి యంతర్యామికి॥
చ॥ పలుకే మంత్రమట పాడైననాలుకే। కలకలమను పిడి ఘంటమట।
నలువైన రుచులే నైవేద్యములట। తలపులోపల నున్న దైవమునకు॥
చ॥ గమన చేష్టలే యంగరంగ గతియట। తమిగల జీవుడే దాసుడటా।
అమరిన వూర్పులే యాలవట్టము లట। క్రమముతో శ్రీవేంకటరాయనికి॥

**133)దేసాళం/ హరికాంభోజి**

ప॥ ఇదిగో మా యజ్ఞాన మెప్పుడును సహజమే। కదిసి నీవే కరుణించవయ్యా॥
చ॥ తల్లిచంకనున్న బిడ్డ తమితో జన్నుదాగు తా- । నొల్లడు తండ్రి యెత్తుకొన బోతేను।
మల్లడి నీ మాయలో మరిగిన జీవములు। మెల్లనె మీసేవజేసి మిమ్ము జేరజాలము॥
చ॥ రెక్కల మరుగుపక్షి రెక్కలక్రిందనే కాని। యెక్కడు వద్దనే మేడ యెంతవున్నను।
ప్రక్కన జన్మమెత్తిన ప్రపంచపు జీవులము। యెక్కుడైన వైకుంఠ మిది గోరజాలము॥
చ॥ నీరులో నుండేటి కప్ప నీటిలో వుండుగాని। వూరకే పరుపు మీద నుండదెంతైనను॥
అరయ సంసారములో అజ్ఞానపు జీవులము। బోరన శ్రీవేంకటేశ బుద్ధి చెప్పికావవె॥

**134)మాళవి**

ప॥ ఇదియే వేదాంత మిందుకంటె లేదు। ఇదియే శ్రీవేంకటేశుని మతము॥
చ॥ విరతియే లాభము విరతియే సౌఖ్యము। విరతియేపో విజ్ఞానము।
విరతిచే ఘనులైరి వెనుక వారెల్ల। విరతి బొందకున్న వీడదు భయము॥
చ॥ చిత్తమే పాపము చిత్తమే పుణ్యము। చిత్తమే మోక్షసిద్ధియును।
చిత్తమువలనే శ్రీహరి నిలుచును। చిత్తశాంతిలేక చేరదు పరము॥
చ॥ ఎంత చదివినా యెంత వెదికినా। యింతకంటె మరియిక లేదు।
ఇంతట శ్రీవేంకటేశు దాసులౌట। యెంతవారికైన యిదియే తెరవు॥

**135)శంకరాభరణం**

ప॥ ఇన్ని చేతలును దేవుడిచ్చినవే। ఉన్నవారి యీపులెల్ల నొద్దికయ్యీనా॥
చ॥ తెగని యాపదలకు దేవుడే కలడుగాక। వగలుడుప బరుల వసమయ్యీనా।
నొగలి యితరులకు నోళ్ళు దెరచిన। నగుబాటేకాక మానగ బొయ్యీనా॥
చ॥ అగ్గలపు దురితాలు హరియే మానుపుగాక। బగ్గన నొక్కరు వచ్చి పాప బొయ్యేరా।
తగ్గుమగ్గులైనవేళ తలచినవారెల్ల। సిగ్గుబాటేకాక తమ్ము జేరవచ్చేరా॥
చ॥ ఎట్టుసేసినను వేంకటేశుడే నేరుచుగాక। కట్టకడ వారెల్ల గరుణించేరా।
ఇట్టే యేమడిగిన నితడే యొసగుగాక। వుట్టివడి యెవ్వరైనా నూరడించేరా॥

**136)శ్రీరాగం**

ప॥ ఇన్ని జన్మములేటికి హరిదాసు- । లున్న వూర దానుండిన జాలు॥
చ॥ హరిభక్తుల యింటి యన్నము గొనువారి। వరువుడై యుండవలెనన్న జాలు।
పరమభాగవత భవనంబుల జెడ్డ। పురువు దానయి పొడమిన జాలు॥
చ॥ వాసుదేవుని భక్తవరుల దాసులు మున్ను। రోసిన యెంగిలి రుచిగొన్న జాలు।
శ్రీసతీశుని దలచినవారి దాసాను- । దాసుడైవుండ దలచినజాలు॥
చ॥ శ్రీవేంకటేశు జూచినవారి శ్రీపాద। సేవకుడై యుండజేరిన జాలు॥
ఈ విభుదాసుల హితుల పాదధూళి। పావనమై సోకి బ్రదికిన జాలు॥

**137)సామంతం/ తోడి**

ప॥ ఎంత సదివిననేమి నేమి వినిన తన। చింతయేల మాను సిరులేల కలుగు॥

చ॥ ఇతర దూషణముల యెడసిన గక। అతికాముకుడుగాని యప్పుడుగాక।
మతి చంచలము గొంత మానినగాని। గతియేల కలుగు దుర్గతి లేలమాను॥

చ॥ పరధనముల ఆస పాసిన గాక। అరిది నిందలు లేనియప్పుడు గాక।
విరగువర్తనములు విడచిన గాక। పరమేల కలుగు నాపద లేలమాను॥

చ॥ వేంకటపతి నాత్మ వెదికిన గాక। కింక మనసున దొలగిన గాక।
బొంకుమాట లెడసిపోయిన గాక। శంక యేలమాను జయమేల కలుగు॥

**138)గౌళ**

ప॥ ఊరకే దొరకునా వున్నతోన్నత సుఖము। సారంబు దెలిసెగా జయము చేకొనుట॥

చ॥ తలపులోని చింత దాటినప్పుదు గదా। అలరిదైవంబు ప్రత్యక్షమౌట।
కలుషంపు దుర్మదము గడచినప్పుడు గదా। తలకొన్న మోక్షంబు తనకు చేకొనుట॥

చ॥ కర్మంబు కసటువో గడిగినప్పుడు గదా। నిర్మల జ్ఞానంబు నెరవేరుట।
మర్మంబు శ్రీహరి నీమరగు జొచ్చినగదా। కూర్మి దనజన్మమెక్కుడు కెక్కుడౌట॥

చ॥ తనశాంత మాత్మలో దగలినప్పుడు గదా। పనిగొన్న తనచదువు ఫలియించుట।
యెనలేని శ్రీవేంకటేశ్వరుని దాస్యంబు। తనకు నబ్బినగదా దరిచేరిమనుట॥

**139)శ్రీరాగం**

ప॥ తిరువీధుల మెరసీ దేవదేవుడు। గరిమల మించిన సింగారములతోడను॥

చ॥ తిరుదండలపై నేగీ దేవుడిదె తొలునాడు। సిరుల రెండవనాడు శేషుని మీద।
మురిపాల మూడవనాడు ముత్యాల పందిరిక్రింద। పొరినాలుగవనాడు పువ్వు గోవిలలోను॥

చ॥ గ్రక్కున నైదవనాడు గరుడునిమీద। యెక్కెను నారవనాడు యేనుగుమీద।
చొక్కమై యేడవనాడు సూర్యప్రభలోనను। యిక్కువ దేరును గుర్రమెనిమిదవనాడు॥

చ॥ కనకపుటందలము కదిసి తొమ్మిదవనాడు। పెనచి పదోనాడు పెండ్లిపీట।
యెనసి శ్రీవేంకటేశు డింతి యలమేల్మంగతో। వనితల నడుమను వాహనాలమీదను॥

**140)దేశి**

ప॥ కానరటె పెంచరటె కటకట బిడ్డలను। నేను మీవలెనే కంటి నెయ్యమైన బిడ్డని॥

చ॥ బాయిట బారవేసిన పాలు వెన్నలును। చేయి వెట్టకుందురా చిన్ని బిడ్డలు।
మీయిండ్లు జతనాలు మీరుసేసికొనక। పాయక దూరేరేల ప్రతిలేని బిడ్డను॥

చ॥ మూసిన కాగులనే యీముంగిట పెరుగులూ। ఆసపడకుందురా ఆబిడ్డలు।
వోసరించి మోసపోక వుండలేక మీరు। సేసేరింతేని దూరు చెప్పరాని బిడ్డని॥

చ॥ చొక్కమైన కొప్పెరల జున్నులు జిన్నులును। చిక్కిన విడుతురా చిన్ని బిడ్డలు।
మిక్కిలి పూజలుసేసి మెచ్చించదగదా। యెక్కువైన తిరువేంకటేశుడైన బిడ్డని॥

**141)శ్రీరాగం**

ప॥ కూడు వండుట గంజికొరకా తనకు। వేడుకలు గల సుఖము వెదుకుటకు గాక॥

చ॥ కుప్ప నురుచుట కసవుకొరకా తనువు। గొప్పయవుటిది మదము కొరక।
ఒప్పయిన వేడుకల నొరసి మనసు। నెప్పునకు రాదివియ నేరవలె గాక॥

చ॥ కొలుచు దంచుట పొట్టకొరకా తా-। గులజుడై మూఢుండౌ కొరకా।
తలపోసి యిన్నిట దగిలి మీదు। తెలిసి సుఖదుఃఖముల దెలియవలెగాక॥

చ॥ కొండ దవ్వుట యెలుకకొరకా తా-। గొండ యెక్కుట దిగుట కొరకా।
కొండల కోనేటిపతి గొలిచి తనకు। నిండి నాపదలెల్ల నీగవలె గాక॥

**142)దేవగాంధారి**

ప॥ కొలువై వున్నాడు వీడె గోవిందరాజు। కొలకొలనేగి వచ్చె గోవిందరాజు॥
చ॥ గొడుగుల నీడల గోవిందరాజు। గుడిగొన్న పడగల గోవిందరాజు।
కుడియెడమ కాంతల గోవిందరాజు। కొడిసాగే పవుజుల గోవిందరాజు॥
చ॥ గొప్ప గొప్ప పూదండల గోవిందరాజు। గుప్పేటి వింజామరల గోవిందరాజు।
కొప్పుపై చుంగులతోడి గోవిందరాజు। కుప్పికటారము తోడి గోవిందరాజు॥
చ॥ గొరబుసింగరాల గోవిందరాజు। కురులు దువ్వించుకొని గోవిందరాజు।
తిరుపతిలోనను తిరమై శ్రీవేంకటాద్రి। గురిసీ వరములెల్ల గోవిందరాజు॥

**143) శంకరాభరణం**

ప॥ కొనరో కొనరో మీరు కూరిమి మందు। వునికి మనికి కెల్ల నొక్కటే మందు॥
చ॥ ధృవుడు గొనినమందు తొల్లియు బ్రహ్లాదుడు। చవిగా గొనినమందు చల్లని మందు।
భవరోగములు వీడి పారగ బెద్దలు మున్ను। జవకట్టికొనిన నిచ్చలమైన మందు॥
చ॥ నిలిచి నారదుండు గొనినమందు జనకుండు। గెలుపుతో గొని బ్రదికిన యామందు।
మొలచి నాలుగుయుగముల రాజులు ఘనులు। కలకాలము గొని కడగన్నమందు॥
చ॥ అజునకు బరమాయువై యొసగినమందు। నిజమై లోకములెల్ల నిండినమందు।
త్రిజగములు నెరుగ తిరువేంకటాద్రిపై। ధ్వజ మెత్తె గోనేటిదరి నున్నమందు॥

**144) సావేరి / సాళంగ**

ప॥ జ్ఞానులాల యోగులాల సకలవిరక్తులాలా। నానావిధాల నమ్మేరు సుండి॥
చ॥ అలరి యింతుల అధరామృతము లివియెల్ల। కాలకూట విషము కరణి సుండి।
శీలముతో వీరల చెట్టలు పట్టుట లెల్లా। బాలనాగాల దొడికి పట్టుట సుండి॥
చ॥ కాంతలు నవ్వుచునైనా గన్నుల చూచిన చూపు। పంతమున నలుగుల పాతర సుండి।
బంతుల నెదుటనున్న పడతుల చన్నులివి। కంతల నొడ్డిన బండిగండ్లు సుమ్మీ॥
చ॥ జవ్వనపుగామినుల సరసపు మాటలెల్లా। మవ్వమైన యట్టి చొక్కు మంత్రాలు సుండి।
ఇవ్వలను శ్రీవేంకటేశ్వరు దాసుల కివి। చివ్వన జెప్పినట్టు చేసేవి సుండి॥

**145) కాంభోజి**

ప॥ కంటిమి నేడిదె గరుడాచలపతి। ఇంటి వేలుపగు యీశ్వరుండు॥
చ॥ శ్రీనరసింహుడు చిన్మయకాంతుడు। దానవాంతకుడు దయానిధి।
నానా మహిమల నమ్మిన వారిని। పూనుకు కాచె పోషకుడితడు॥
చ॥ దేవాది దేవుడు దినకర తేజుడు। జీవాంత రంగుడు శ్రీవిభుడు।
దైవ శిఖామణి తలచిన వారిని। సేవలు గొనికాచె విభుడితడు॥
చ॥ పరమమూర్తి హరి ప్రహ్లాద వరదుడు। కరుణానిధి బుధకల్పకము।
పరగు శ్రీవేంకట పతి తనదాసుల। నరదుగ గాచేయన ఘనుండితండు॥

**146) లలిత**

ప॥ కరుణించు మికనైనా కాపురమా। కరికరి బెట్టకుమీ కాపురమా॥
చ॥ కలలోని సుఖమైన కాపురమా। కలుషమే చవియైన కాపురమా।
కలను బేహారపు కాపురమా। కలడు మాకిదే హరి కాపురమా॥
చ॥ గంట వెంటలో తగులు కాపురమా। కంట వత్తివెట్టి కాచే కాపురమా।
గంటు గిందుగా బొరలే కాపురమా। కంటిమి శ్రీపతి కాపురమా॥
చ॥ కావిరి వెర్రిచేరాయి కాపురమా। కావలసినట్లయ్యే కాపురమా।
శ్రీవేంకటేశ్వరుడు చేరి నిన్ను నన్ను నొక్క। కైవసము సేసెగదో కాపురమా॥

**147) గుజ్జరి**

ప॥ నాపాలిఘన దైవమవు నీవే నన్ను। నీపాల నిడుకొంటి నీవే నీవే॥
చ॥ ఒలిసి నన్నేలే దేవుడవు, యెందు। దొలగని నిజబంధుడవు నీవే।
పలు సుఖమిచ్చే సంపదవు నీవే, యిట్టే। వెలయ నిన్నియు నీవే నీవే॥
చ॥ పొదిగి పాయని యాప్తుడవు నీవే, నాకు। నదన దోడగు దేహమవు నీవే।
మదమువాపెడి నామతియు నీవే, నాకు। వెదక నన్నియును నీవే నీవే॥
చ॥ ఇంకా లోకములకు నెప్పుడు నీవే, యీ- । పంకజభవాది దేవపతివి నీవే।
అంకిలి వాపగ నంతకు నీవే, తిరు- । వేంకటేశ్వరుడవు నీవే నీవే॥

**148) జగన్మోహిని/ సామంతం**

ప॥ సులభమా మనుజులకు హరిభక్తి। వలనొంది మరికదా వైష్ణవుడౌట॥
చ॥ కొదలేని తపములు కోటాన గోటులు। నదన నాచరించి యటమీద।
పదిలమైన కర్మల బంధములన్నియు। వదిలించుకొని కదా వైష్ణవుడౌట॥
చ॥ తనివోని యాగతంత్రములు లక్షలసంఖ్య। అనఘుడై చేసిన యటమీదట।
జననములన్నిట జనియించి పరమ పా- । వనుడై మరికద వైష్ణవుడౌట॥
చ॥ తిరిగి తిరిగి పెక్కుతీర్థములన్నియు। నరలేక సెవించినమీదట।
తిరువేంకటాచలాధిపుడైన కరిరాజ- । వరదుని కృపగద వైష్ణవుడౌట॥

**149) ఆహిరి**

ప॥ మదమత్సరము మనసుపేదైపో। పదరిన యాసలవాడవో వైష్ణవుడు॥
చ॥ ఇట్టునట్టు దిరిగాడి యేమైనా జెడనాడి। పెట్టరంటా బోయరంటా బెక్కులాడి।
యెట్టివారినైనా దూరి యెవ్వరినైన జేరి। వట్టియాసల బడనివాడువో వైష్ణవుడు॥
చ॥ గడనకొరకు జిక్కి కాముకివిద్యల జొక్కి। నిడివి నేమైనా గని నిక్కి నిక్కి।
వొడలిగుణముతోడ వుదుట విద్యల జాల। వడదాకి బడలనివాడవో వైష్ణవుడు॥
చ॥ ఆవల వొరుల జెడనాడగ వినివిని। చేవమీర యెవ్వరిని జెడనాడక।
కోవిదు శ్రీవేంకటేశు గొలిచిపెద్దలకృప। వానివర్తనల వాడువో వైష్ణవుడు॥

**150) శ్రీరాగం**

ప॥ ఇదివొ సంసార మెంతసుఖమోకని। తుదలేనిదుఃఖమను తొడవు గడియించె॥
చ॥ పంచేంద్రియంబులను పాతకులు దనుదెచ్చి। కొంచెపుసుఖంబునకు గూర్పగాను।
మించి కామంబనెడి మేటితనయుండు జని- । యించి దురితధనమెల్ల గడియించె॥
చ॥ పాయమనియెడి మహాపాతకుడు తను దెచ్చి। మాయంపుసుఖమునకు మరువగాను।
సోయగపు మోహమను సుతుడేచి గుణమెల్ల। బోయి యీనరకమను పురము గడియించె॥
చ॥ అతిశయుండగు వేంకటాధీశుడను మహా- । హితుడు చిత్తములోన నెనయగాను।
మతిలోపల విరక్తిమగువ జనియించి య- । ప్రతియయి మోక్షసంపదలు గడియించె॥

**151) బంగాళ**

ప॥ భావించి తెలుసుకొంటే భాగ్యఫలము। ఆవలీవలి ఫలము లంగజ జనకుడె॥
చ॥ దానములలో ఫలము, తపములలో ఫలము। మోసములలో ఫలము ముకుందుడె।
జ్ఞానములలో ఫలము జపములలో ఫలము। నానా ఫలములును నారాయణుడె॥
చ॥ విమతులలో ఫలము వేదములలో ఫలము। మనసులోని ఫలము మాధవుడె।
దినములలో ఫలము తీర్థ యాత్రల ఫలము। ఘనపుణ్య ఫలము కరుణాకరుడె॥
చ॥ సతత యోగఫలము చదువులలో ఫలము। అతిశయోన్నత ఫలము యచ్యుతుడె।
యతులలోని ఫలము జితకామిత ఫలము। క్షితి మోక్షము ఫలము శ్రీవేంకటేశుడె॥

**152) నారాయణి**

ప॥ అనాది జగమునకౌ భళము। అనేకాద్భుతంబౌ భళము॥

చ॥ హరి నివాస మియౌ భళము। అరిది పరమ పదమౌ భళము।
అరిదైత్యాంతకమౌ భళము। హరముఖ సేవితమౌ భళము॥

చ॥ అమలరమాకరమౌ భళము। అమితమునీంద్రంబౌ భళము।
అమరవందితంబౌ భళము। అమరె బుణ్యములనౌ భళము॥

చ॥ అగరాజంబీయౌ భళము। అగణిత తీర్థంబౌ భళము।
తగు శ్రీవేంక ధామ విహారం-। బగు శుభాంచితంబౌ భళము॥

**153)నారాయణి**

ప॥ హరి శరణాగతి యాతుమది। సరుస నిదియెపో సతమయ్యెడిది॥

చ॥ దిన దిన రుచులివి దేహము వి-। చెనకెటి కోరిక చిత్తముది-।
యెనసెటి కాంతులు యింద్రియంబులవి। పనివి యాత్మకిని పసిలేదయ్యా॥

చ॥ పదరెటి కోపము పాపముది। అదవ గాలములు అనాదివి।
నిదుర తమోగుణ నిలయముది। యెదుట నాత్మకివి యెవరయ్యా॥

చ॥ కాయపు జననము కర్మముది। మాయ లంపటము మమతలది।
యేయెడ శ్రీవేంకటేశుడితని కృప। పాయని యాత్మకు బ్రమాణమయ్యా॥

**154)కేదారగౌళ**

ప॥ భామ శృంగారించు భావమే యందము। కాముని రతిసాటి కాంతులీలాగు॥

చ॥ పూవొకటి వికసించె పున్నమి చంద్రుని వలెనే। పూవుమీద మరిరెండు పూలుబూసె।
రెండు పూవుల నడుమ పూసెనొకపువ్వు। పూవు కింద ముప్పదిరెండు మొగ్గలెత్తె॥

చ॥ పక్షి యొక్కటి వాలె భద్రేభమనగాను। పక్షిమీదను రెండు పక్షులాయెను।
రెండు పక్షుల నడుమనే వ్రాలె నొక పక్షి। పక్షితో జోడుగా పలికే నొకపక్షి॥

చ॥ చిగురునే రెంటి చెందామరో యనగ। చిగురు మీదను రెండు చిగురులెత్తె।
చిగురుబోణి యింట శ్రీవేంకటేశుడు। చిగురు లోపలి తేనె చెలగి చవిచూచె॥

**155)సామంతం**

ప॥ ఆదిదేవుం డనంగ మొదల నవతరించి జలధి సొచ్చి। వేదములును శాస్త్రములను వెదకి తెచ్చె నితండు॥

చ॥ వాలి తిరుగునట్టి దైత్యవరుల మోహవతులనెల్ల। మూలమూలం ద్రోసి ముసుగుపాలుసేసె నితండు।
వేలసంఖ్యనైన సతుల వేడుక లలరంజేసి వొంటి। నాలిమగని రీతిగూడి యనుభవించె నితండు॥

చ॥ కడుపులోని జగములనెల్ల గదలకుండం బాపరేని। పడకనొక్క మనసుతోడం బవ్వళించె నితండు।
అడుగు క్రింద లోకమెల్ల నడంచదలంచి గురుతుమీర। పొడవు వెరిగి మిన్ను జలము పొడిచి తెచ్చి నితండు॥

చ॥ కొండెవయసువాడు మంచి గోపసతుల మనములెల్ల। ఆడికెలకు నోపి కొల్లలాడి బ్రదికె నితండు।
వేడుకలర వేంకటాద్రి వెలసి భూతకోటి దన్నుం-। జాడుం డనుచు మోక్షపదము చూరవిడిచి నితండు॥

**156)లలిత**

ప॥ తెప్పగా మర్రాకు మీద తేలాడువాడు। ఎప్పుడు లోకములెల్ల నేలేటివాడు॥

చ॥ మోతనీటి మడుగులో యీతగరచినవాడు। పాతగిలే నూతిక్రింద బాయనివాడు।
మూతిదోసిపట్టి మంటిముద్దపెల్లగించువాడు। రోతయైన పేగులపేరులు గలవాడు॥

చ॥ కోడికూత నోరివాని కుర్రతమ్ముడైనవాడు। బూడిద బూసినవాని బుద్ధులవాడు।
మాడవన్నె లేడివెంట మాయలబడినవాడు। దూడల నావులగాచి దొరయైనవాడు॥

చ॥ ఆకసానబారే పూరి అతివల మానములు। కాకుసేయువాడు తురగముపైవాడు।
ఏకమై వేంకటగిరి నిందిరారమణి గూడి। యేకాలముబాయని యెనలేనివాడు॥

**157)గుండక్రియ**

ప॥ తెలియ చీకటికి దీపమెత్తక, పెద్ద। వెలుగు లోపలికి వెలుగేలా॥

చ॥ అరయ నాపన్నుని కభయ మీవలెగాక। ఇరవైన సుఖి గావనేలా।
వరుత బోయెడువానివడి దీయవలె గాక। దరివాని దివియగ దానేలా॥

చ॥ ఘనకర్మారంభుని కట్లు విడవలె గాక। యెనసి ముక్తుని గావనేలా।
అనయము దుర్బలుని కన్న మిడవలెగాక। తనిసిన వానికి దానేలా॥

చ॥ మితిలేని పాపకర్మికి దావలె గాక। హిత మెరుగు పుణ్యునికి నేలా।
ధృతిహీను గృపజూచి తిరువేంకటేశ్వరుడు। తతి గావకుండిన తానేలా॥

**158)దేసాక్షి / రేవతి**

ప॥ పోయబోయ గాలమెల్ల పూట పూటకు। రోయని రోతలు చూచి రుచి చూరబోయ॥

చ॥ తాడిమానెక్కేటివాని తడయక పట్టి పట్టి। తోడ దోడ నెందాకా దోయవచ్చును।
కాడువడ్డ చిత్తమిది కలకాలము నిట్టే। ఆడి కెలకులోనై తనియకపాయ॥

చ॥ మన్నుదిని యేటిదూడ మానుమంటూ మొత్తి మొత్తి। కన్నిగట్టి యెందాక గాయవచ్చును।
సన్నపుటాసలమీద చరిబడ్డ దేహమిది। కన్నపుగత్తుల చూపు కట్టరాకపోయ॥

చ॥ హేయము దొక్కకుమన్న యేచితి నేననేవాడు। చాయకు రాకున్న నేమి సేయవచ్చును।
మాయల వేంకటపతి మచ్చుచల్ల నాయాత్మ। పాయక యాతని జేరి భయమెల్లబోయ॥

**159)హిందోళవసంతం**

ప॥ మూడేమాటలు మూడుమూండ్లు తొమ్మిది। వేడుకొని చదవరో వేదాంత రహస్యము॥

చ॥ జీవస్వరూపము చింతించి యంతటాను। దేవుని వైభవము తెలిసి।
భావించి ప్రకృతి సంపదయిది యెరుగుడే। వేవేలు విధముల వేదాంత రహస్యము॥

చ॥ తనలోని విజ్ఞానము తప్పకుండా దలబోసి। పనితోడ నందువల్ల భక్తినిలిపి।
మనికిగా వైరాగ్యము మరవకుండుతే। వినవలసిన యట్టి వేదాంత రహస్యము॥

చ॥ వేడుకతో నాచార్య విశ్వాసము గలిగి। జాడల శరణాగతి సాధనముతో।
కూడి శ్రీవేంకటేశుగొలిచి దాసుడౌటే। వీడని బ్రహ్మానంద వేదాంత రహస్యము॥

**160)వరాళి**

ప॥ మోపుల చిగురుల చిమ్ములవేదము। ఆవుల మందలలోని ఆవేదము॥

చ॥ మంచముపై చదివేది మరవకుమీ। కొంచెపు లేబలుకుల కొనవేదము।
పించపు శిరసుతోడ బిన్ననాడే చదివిన। తుంచి తుంచిన మాటల తొలివేదము॥

చ॥ చల్లలమ్మే గొల్లెతల చక్కని జంకెనలకు। గొల్లపల్లెలోన దొరకొన్న వేదము।
తల్లి బిడ్డ లనక యందరి నొక్క వావిగా। పిల్లగ్రోవి నేరిపిన పెనువేదము॥

చ॥ పంకజభవాదులు బడిబడి జదివించే। లంకెలు చెలగిన మెలపువేదము।
వేంకటనగము మీద వెలయు నిందిరగూడి। కొంకొక చదివిన చొక్కుల వేదము॥

**161)సావేరి**

ప॥ మెచ్చెనొక రాగంబు మీద మీద కడు। నిచ్చె నొక రాగంబు యింతులకు నెల్ల॥

చ॥ చేసె నొక రాగంబు చెలియెదుట గన్నులనె। మూసె నొక రాగంబు ముదిత మతినె।
పూసె నొక రాగంబు పొలతి పులకలమేన। వ్రాసె నొక రాగంబు వనిత నినుబాసి॥

చ॥ పట్టె నొక రాగంబు ప్రాణములపై నలిగి। తిట్టె నొక రాగంబు తిరిగి తిరిగి।
పుట్టె నొక రాగంబు పొలతి డెందమునకును। మెట్టె నొక రాగంబు మెరయుచునె కదలి॥

చ॥ కురిసె నొక రాగంబు కొప్పు పువ్వులనె సతి। మురిసె నొక రాగంబు మించి మేన।
తిరువేంకటేశ్వరుడ తెలిసికో నినుబొంది। పొరసె నొక రాగంబు పొలతి కుచములనే॥

**162)భైరవి**

ప॥ మొదలుండ గొనలకు మోచి నీళ్ళు వోయనేల। యెదలో నీవుండగా నితరము లేలా॥

చ॥ నిగమ మార్గముల నే నడచే నంటే। నిగము లెల్లను నీమహిమే।
జగము లోకుల జూచి జరిగెద నంటే। జగములు నీ మాయ జనకములు॥

చ॥ మనసెల్ల నడ్డపెట్టి మట్టున నుండే నంటే। మనసు కోరికెలు నీ మతకాలు।
తనువు నింద్రియములు తగ గెలెచే నంటే। తనువు నింద్రియములు దైవము నీ మహిమా॥

చ॥ ఇంతలోని పనికిగా యిందు నందు జొరనేల। చెంత నిండు చెరువుండ చెలమ లేలా।
పంతాన శ్రీవేంకటేశ పట్టి నీకే శరణంటి। సంత కూటాల ధర్మపు సంగతి నాకేలా॥

**163) కాంభోజి**

ప॥ మొత్తకురే అమ్మలాల ముద్దులాడు వీడె। ముత్తెమువలె నున్నాడు ముద్దులాడు॥

చ॥ చక్కని యశోద తన్ను సలిగతో మొత్తరాగా। మొక్కబోయీ గాళ్ళకు ముద్దులాడు।
వెక్కసాన రేపల్లె వెన్నెలెల్ల మాపుదాక। ముక్కున వయ్యగ దిన్న ముద్దులాడు॥

చ॥ రువ్వెడి రాళ్ళ దల్లి రోలదన్ను గట్టినంట। మువ్వల గంటల తోడి ముద్దులాడు।
సవ్వెడి జెక్కుల నిండ నమ్మిక బాలునివలె। మువ్వరిలో నెక్కుడైన ముద్దులాడు॥

చ॥ వేల సంఖ్యల సతుల వెంటబెట్టుకొని రాగా। మూల జన్ను గుడిచీని ముద్దులాడు।
మేలిమి వేంకటగిరిమీద నున్నాడిదెవచ్చి। మూలభూతి దానైన ముద్దులాడు॥

**164) శ్రీరాగం**

ప॥ వనిత పాలికిని దేవరవు నీవు। వనమె జవ్వనమిందె వరమియ్యవలెను॥

చ॥ ముదితకు నీతోపాటు మోహన మంత్రము। చదరపు నీపురము జపశాల।
మదిలోన నీరూపు మరవని ధ్యానము। వదల రా దిక నీవు వరమియ్యవలెను॥

చ॥ పడతికి నీశయ్య బలు పుణ్యక్షేత్రము। వడలి చెమట నీపై హోమకృత్యము।
అడరు మోవితేనలు ఆరగింపు నైవేద్యాలు। వడి జేకొనిక నీవు వరమియ్యవలెను॥

చ॥ కామినికి నీకూటమి ఘన దివ్యయోగము। నేమపు బరవశము నిజానందము।
ఆముక శ్రీవేంకటేశ ఆపె నీవు గూడితివి। వాములుగా నిట్టె వరమియ్యవలెను॥

**165) ఆహిరి / కురంజి**

ప॥ సిరుత నవ్వులవాడు సిన్నెకా వీడు। వెరపెరుగడు సూడవే సిన్నెకా॥

చ॥ పొలసు మేనివాడు బోరవీపు వాడు। సెలసు మోరవాడు సిన్నెకా।
గొలుసుల వంకల కోరలతోబూమి। వెలిసినాడు సూడవే సిన్నెకా॥

చ॥ మేటి కురుచవాడు మెడమీది గొడ్డలి। సీటకాలవాడు సిన్నెకా।
ఆటదానిబాసి అడవిలో రాకాశి। వేటలాడీ జూడవే సిన్నెకా॥

చ॥ బింకపు మోతల పిల్లగోవివాడు। సింక సూపులవాడు సిన్నెకా।
కొంకక కలికియై కొసరి కూడె నన్ను। వేంకటేశుడు సూడవే సిన్నెకా॥

**166) శంకరాభరణం**

ప॥ కదిసి యాతడు మమ్ము గాచుగాక। అదె యాతనికె శరణంటే నంటినేను॥

చ॥ ఎవ్వని వుదరమున నిన్నిలోకములుండు। ఎవ్వని పాదము మోచె నిల యలను।
ఎవ్వడు రక్షకుడాయనీ జంతుకోట్లకు। అవ్విభునికి శరణంటే నంటి నిప్పుడు॥

చ॥ సభలో ద్రౌపదిగాచె సర్వేశు డెవ్వడు। అభయ హస్తమొసగె నాతడెవ్వడు।
ఇభ వరదు డెవ్వడు యీతనికి వొడిగట్టి। అభినవముగ శరణంటే నంటి నిప్పుడు॥

చ॥ శరణు చొచ్చిన విభీషణు గాచె నెవ్వడు। అరిది యజుని తండ్రి యాతడెవ్వడు।
ఇరవై శ్రీవేంకటాద్రి యెక్కి నాతడితడే। అరిసి యితనికే శరణంటే నంటి నిప్పుడు॥

**167) కన్నడగౌళ**

****************************************************************************************************

పII కామయాగము చేసెగలికి తన। ప్రేమమే దేవతా ప్రీతిగాను॥
చII పొలుపలర సురత తాంబూల రసపానంబు। నళినాక్షి సోమపానంబు గాను।
కలకలంబుల మంచి గళరవంబులమోత। తలకొన్న వేద మంత్రములుగాను॥
చII పడతి తనవిరహ తాపమున బుట్టినయగ్ని। అడరి దరికొన్న హోమాగ్నిగాను।
ఒడబడిక సమరతుల నుదయించిన చెమట। దడియుటే యవబృథంబుగాను॥
చII తనరగుచముల రుచులు దంతాక్షతక్రీడ। నునుపైన పశుబంధనంబుగాను।
యెనసి శ్రీవేంకటేశ్వరుని పొందు। ఘనమైన దివ్య భోగంబుగాను॥

**168)దేసాక్షి / పూర్వీకల్యాణి**

పII వేదవేద్యులు వెదికేటి మందు। ఆదినంత్యము లేని ఆమందు॥
చII అడవిమందులు గషాయములు నెల్లవారు। కడగానక కొనగాను।
తొడబడ నొకమందు దొరకె మాకు భువి- । నడియాలమైనట్టి మందు॥
చII లలిత రసములు దైలములు నెల్లవారు। కలకాలము గొనగాను।
చెలువైన దొకమందు చేరె మాకు భువి- । నలవిమీరిన యట్టియామందు॥
చII కదిసి జన్మరోగముల నెల్లవారు। కదలలేక వుండగాను।
అదన శ్రీతిరువేంకటాద్రి మీదిమందు। అదివో మాగురు డిచ్చె నామందు॥

**169)దేసాక్షి**

పII హీనదశలబొంది యిట్లు నుండుటకంటె। నానావిధులను నున్ననాడే మేలు॥
చII అరుదైన క్రిమికీటకాదులందు బుట్టి। పరిభవములనెల్ల బడితిగాని।
ఇరవైనచింత నాడింతలేదు యీ- । నరజన్మముకంటె నాడే మేలు॥
చII తొలగక హేయజంతువులయందు బుట్టి। పలువేదనలనెల్ల బడితిగాని।
కలిమియు లేమియు గాన నేడెరిగి। నలగి తిరుగకుంటె నాడే మేలు॥
చII కూపనరకమున గుంగి వెనకకు నే- । బాపపువిధులనెల్ల బడితిగాని।
యేపున దిరువేంకటేశ నాకిటువలె। నాపాలగలిగిననాడే మేలు॥

**170)సామంతం**

పII ఏవం శ్రుతిమత మిదమేవ త- । ద్భావయితు మతఃపరం నాస్తి॥
చII అతులజన్మభోగాసక్తానాం। హితవైభవసుఖ మిదమేవ।
సతతం శ్రీహరి సంకీర్తనం త- । ద్వ్యతిరిక్తసుఖం వక్తుం నాస్తి॥
చII బహుళమరణ పరిభవచిత్తానా- । మిహపరసాధన మిదమేవ।
అహిశయనమనోహరసేవా త- । ద్విహరణంవినా విధిరపి నాస్తి॥
చII సంసారదురితజాడ్యపరాణాం। హింసావిరహిత మిదమేవ।
కంసాంతకవేంకటగిరిపతేః ప్ర- ।శంసైనానాంపశ్చాదిహ నాస్తి॥

**171)పాడి**

పII వేదం బెవ్వని వెదకెడివి। ఆదేవుని గొనియాడుడీ॥
చII అలరిన చైతన్యాత్మకు డెవ్వడు। కలడెవ్వ డెచట గలడనిన।
తలతు రెవ్వనిని దనువియోగదశ। యిల నాతని భజియించుడీ॥
చII కడగి సకలరక్షకు డిందెవ్వడు। వడి నింతయు నెవ్వనిమయము।
పిడికిట తృప్తులు పితరు లెవ్వనిని। దడవిన ఘనుడాతని గనుడు॥
చII కదసి సకలలోకంబుల వారలు। యిదివో కొలిచెద రెవ్వనిని।
త్రిదశవంద్యుడగు తిరువేంకటపతి। వెదకి వెదకి సేవించుడీ॥

**172)శ్రీరాగం**

ప|| బయలు పందిలి వెట్టి పరగ జిత్తము గలిగె। దయమాలి తిరుగ నాత్మ డొక్కడు గలిగె॥

చ|| కనుచూపు వలన నుడుగని కోరికలు గలిగె। తనుకాంక్ష వలన బరితాపంబు గలిగె।
అనుభవమువలన మోహాంధకారము గలిగె। తనివిదీరమి వలన తలపోత గలిగె॥

చ|| అడియాసవలన పాయనివలంబును గలిగె। కడుమమత వలన చీకటి దవ్వ గలిగె।
కడలేని తమకమున గాతాళమును గలిగె। నడుమ నంతటికి మాననిప్రేమ గలిగె॥

చ|| తరితీపువలన చిత్తభ్రాంతి తగ గలిగె। విరహంబువలన పురవేదనలు గలిగె।
తిరువేంకటాచలాధిపుని కరుణామృతము। పరిపూర్ణమైన యాపద నీద గలిగె॥

**173) గుండక్రియ**

ప|| మానుషము గాదు మరి దైవికము గాని। రానున్నా అది రాకుమన్న బోదు॥

చ|| అనుభవముకు బ్రాప్తమైనది। తనకుదానె వచ్చి తగిలికాని పోదు॥

చ|| తిరువేంకటగిరి దేవుని। కరుణచేత గాని కలుషమింతయు బోదు॥

**174) శుద్ధవసంతం**

ప|| సదా సకలము సంపదలే। తుద దెలియగవలె దొలగగవలయు॥

చ|| అహర్నిశలు నాపదలే। సహించిన నవి సౌఖ్యములే।
ఇహముననవి యిందరికిని। మహిమ దెలియవలె మానగవలెను॥

చ|| దురంతము లివి దోషములే। పరంపర లివి బంధములు।
విరసములౌ నరవిభవములౌ- । సిరులే మరులౌ చిరసుఖ మవును॥

చ|| గతి యలమేల్మంగ నాంచారికి। బతియగువేంకటపతి దలచి।
గతు లెరుగగవలె రవణము వలెను। హిత మెరుగగవలె నిదె తనకు॥

**175) శుద్ధవసంతం**

ప|| ఇందిరానామ మిందరికి। కుందనపుముద్ద వోగోవింద॥

చ|| అచ్చుతనామము అనంతనామము। ఇచ్చినసంపద లిందరికి।
నచ్చినసిరులు నాలుకతుదలు- । కొచ్చికొచ్చీ నోగోవింద॥

చ|| వైకుంఠనామము వరదనామము। ఈకడనాకడ నిందరికి।
నాకుదెరవులు వన్నెలు లోకాల। గూకులు వత్తులు నోగోవింద॥

చ|| పండరినామము పరమనామము। ఎండలునాపెడి దిందరికి।
నిండునిధానమై నిలిచినపేరు। కొండల కోనేటివో గోవింద॥

**176) సామంతం**

ప|| సహజవైష్ణవాచారవర్తనుల- । సహవాసమె మాసంధ్య॥

చ|| అతిశయమగు శ్రీహరిసంకీర్తన। సతతంబును మాసంధ్య।
మతి రామానుజమతమే మాకును। చతురత మెరసిన సంధ్య॥

చ|| పరమభాగవత పదసేవనయే। సరవి నెన్న మాసంధ్య।
సిరివరుమహిమలు చెలువొందగ వే- ।సరక వినుటె మాసంధ్య॥

చ|| మంతుకెక్క తిరుమంత్ర పఠనమే। సంతతమును మాసంధ్య।
కంతుగురుడు వేంకటగిరిరాయని। సంతర్పణమే మాసంధ్య॥

**177) బౌళి**

ప|| ఎవ్వరి గాదన్న నిది నిన్ను గాదంట। యెవ్వరి గొలిచిన నిది నీకొలువు॥

చ|| అవయవములలో నది గాదిది గా- । దని మేలివి మేలన నేలా।
భువియు బాతాళము దివియు నందలి జంతు- । నివహ మింతయునూ నీదేహమేకాన॥

చ|| నీవు లేనిచోటు నిజముగ దెలిపిన। ఆవల నది గాదనవచ్చును।

శ్రీవేంకటగిరి శ్రీనాథ సకలము। భావింప నీవే పరిపూర్ణుడవుగాన॥

**178)భూపాలం**

ప॥ సువ్వి సువ్వి సువ్వలమ్మ। నవ్వుచు దేవకి నందనుగనియె॥

చ॥ శశివొడచె అలసంబులు గడచె। దిశల దేవతల దిగుళ్ళు విడిచె॥

చ॥ కావిరి విరిసి కంసుడు గినిసె। వావిరిబువ్వుల వానలు గురిసె॥

చ॥ గతిసేనే అటు గాడిదలు గూసె। కుతిల కుడిచి జనకుడు నోరుమూసె॥

చ॥ గగురు పొడిచె లోకము విధి విడిచె। మొగులు గురియగ యమునపై నడచె॥

చ॥ కలిజారె వెంకటపతి మీరె। అలుమేల్మంగ నాచారలుకలు దీరె॥

**179)దేసాళం**

ప॥ కులుకక నడవరో కొమ్మలారా। జలజల రాలీను జాజులు మాయమ్మకు॥

చ॥ ఒయ్యనేమేను గదలీ నొప్పుగానడవరో। గయ్యాళి శ్రీపాదతాకు కాంతలాలా।
పయ్యెద చెరగు జారీ భారపు గుబ్బలమీద। అయ్యో చెమరించె మాయమ్మకు నెన్నుదురు॥

చ॥ చల్లెడి గందవొడిమైజారీ నిలువరో। పల్లకి వట్టిన ముద్దు వనితలారా।
మొల్లమైన కుందనపు ముత్యాల కుచ్చులదర। గల్లనుచు గంకణాలు కదలీ మాయమ్మకు॥

చ॥ జమళి ముత్యాలతోడి చమ్మాళిగలిడరో। రమనికి మణుల నారతులెత్తరో।

**180)సౌరాష్ట్ర/ రాగమాలిక**

ప॥ చందమామ రావో జాబిల్లి రావో మంచి।
కుందనపుపైడికోర వెన్నబాలు దేవో॥

చ॥ నగుమోము చక్కని యయ్యకు నలువ బుట్టించిన తండ్రికి।
నిగమములందుండే యప్పకు మానీలవర్ణునికి।
జగమెల్లనేలిన స్వామికి జక్కని యిందిర మగనికి।
ముగురికి మొదలైన ఘనునికి మాముద్దుల మురారి బాలునికి॥

చ॥ తెలిదమ్మి కన్నులమేటికి మంచితియ్యని మాటల గుమ్మకు।
కలికి చేతల కోడెకు మాకతలకారి యీబిడ్డకు।
కులముద్ధరించిన పట్టెకు మంచి గుణములు గలిగిన కోడెకు।
నిలువెల్ల నిండువయ్యారికి నవవిధుల చూపులజాచే సుగుణునకు॥

చ॥ సురలగాచిన దేవరకు చుంచుగరుడుని నెక్కిన గబ్బికి।
నెరవాది బుద్ధులపెద్దకు మానీటు చేతలపట్టికి।
విరులవింటి వాని యయ్యకు వేవేల రూపుల స్వామికి।
సిరిమించు నెరవాది జాణకు మా శ్రీవేంకటనాథునకు॥

**181)బౌళి/ రాగమాలిక**

ప॥ అన్నిట నీ వంతర్యామివి అవుట ధర్మమే అయినాను।
యెన్నగ నీవొక్కడవేగతియని యెంచికొలుచుటే ప్రపన్న సంగతి॥

చ॥ ఏకాంతంబున నుండినపతివి యెనసిరమించుటే సతిధర్మంబు।
లోకమురచ్చలోనుండినపతి లోగొనిపైకొనరానట్లు।
యీకొలదులనే సర్వదేవతలయిన్నిరూపులై నీవున్నప్పుడు।
కైకొని నిను బహుముఖముల గొలుచుట గాదు పతివ్రత ధర్మంబు॥

చ॥ పూనినబ్రాహ్మణులలోపలనే నిను బూజించుట వేదోక్తధర్మము।
శ్వానకుక్కుటాదులలోపల నిను సరి బూజించగరానట్లు।
యీనియమములనె ప్రాకృతజనులను యీశ్వర నీశరణాగతజనులను।

కానక, వొక్కట సరిగాజూచుట కాద వివేకధర్మంబు॥

చ॥ శ్రీవేంకటపతి గురువనుమతినే సేవే నాకును శిష్యధర్మము।
ఆవలనీవల నితరమార్గముల యాత్మలోన రుచిగానట్లు।
భావింపగ సకలప్రపంచమును బ్రహ్మం సత్యజ్ఞానమనంతము।
కైవశమై యిన్నిటా వెనుతగులు కాద వివేకధర్మంబు॥

**182) బౌళి**

ప॥ గరుడ గమన గరుడధ్వజ। నరహరి నమోనమో నమో॥

చ॥ కమలాపతి కమలనాభా। కమలజ జన్మకారణిక।
కమలనయన కమలాప్తకుల। నమోనమో హరి నమో నమో॥

చ॥ జలధి బంధన జలధిశయన। జలనిధి మధ్య జంతుకల।
జలధిజామాత జలధిగంభీర। హలధర నమో హరి నమో॥

చ॥ ఘనదివ్యరూప ఘనమహిమాంక। ఘనఘనా ఘనకాయ వర్ణ।
అనఘ శ్రీవేంకటాధిపతేహం। నమో నమోహరి నమో నమో॥

**183) బౌళి / రాగమాలిక**

ప॥ ఎంతమాత్రమున నెవ్వరు దలచిన అంతమాత్రమే నీవు।
అంతరాంతరములెంచిచూడ పిండంతేనిప్పటియన్నట్లు॥

చ॥ కొలుతురు మిమువైష్ణవులు కూరిమితో విష్ణుడని।
పలుకుదురు మిము వేదాంతులు పరబ్రహ్మంబనుచు।
తలతురు మిము శైవులు తగినభక్తులను శివుడనుచు।
అలరిపొగడుదురు కాపాలికులు ఆది భైరవుడవనుచు॥

చ॥ సరినెన్నుదురు శాక్తేయులు శక్తిరూపు నీవనుచు।
దరిశనములు మిము నానావిధులను తలపుల కొలదుల భజింతురు।
సిరులమిమ్మునే యల్పబుద్ధి దలచిన వారికి నల్పంబవుదువు।
గరిమల మిమునే ఘనమని తలచిన ఘనబుద్ధులకు ఘనుడవు॥

చ॥ నీవలన గొరతేలేదు మరి నీరుకొలది తామెరవు।
ఆవల భాగీరథిదరి బావుల ఆజలమే వూరినట్లు।
శ్రీవేంకటపతి నీవైతే మము జేకొని వున్నదైవమని
యీవలనే నీశరణని యెదను యిదియే పరతత్త్వమునాకు॥

**184) కేదారగౌళ**

ప॥ కొలువుడీ భక్తి కొండలకోనేటి- । నిలయుని శ్రీనిధి యైనవాని॥

చ॥ ఆదిదేవుని నభవుని సామ- । వేదనాద వినోదుని నెర- ।
వాది జితప్రియు నిర్మలతత్త్వ- । వాదులజీవనమైన వాని॥

చ॥ దేవదేవుడైన దివ్యుని సర్వ- । భావాతీత స్వభావుని।
శ్రీవేంకటగిరి దేవుడైన పర- । దేవుని భూదేవతత్పరుని॥

**185) లలిత**

ప॥ నటనల భ్రమయకు నా మనసా। ఘటియించు హరియే కలవాడు॥

చ॥ ముంచిన జగమిది మోహినీ గజము। పొంచిన యాస పుట్టించేది।
వంచనల నిజమువలెనే వుండును। మంచులు మాయలె మరునాడు॥

చ॥ సరి సంసారము సంతలకూటమి। సొరిది బజారము చూపేది।
గరిమ నెప్పుడు గలకల మనుచుండును। మరులగు విధమే మాపటికి॥

చ॥ కందువ దేహముగాని ముదియదిది। అందిన రూప మాడేదిది।
యెందును శ్రీవేంకటేశ్వరుండును। డిందు పడగనిదె తెరమరుగు॥

**186)మోహన**

ప॥ రాజీవ నేత్రాయ రాఘవాయ నమో। సౌజన్య నిలయాయ జానకీశాయ॥

చ॥ దశరథ తనూజాయ తాటక దమనాయ। కుశిక సంభవ యజ్ఞ గోపనాయ।
పశుపతి మహా ధనుర్భంజనాయ నమో। విశద భార్గవరామ విజయ కరుణాయ॥

చ॥ భరిత ధర్మాయ శుర్పణఖాంగ హరణాయ। ఖరదూషణాయ రిపు ఖండనాయ।
తరణి సంభవసైన్య రక్షకాయనమో। నిరుపమ మహా వారినిధి బంధనాయ॥

చ॥ హత రావణాయ సంయమి నాథ వరదాయ। అతులిత అయోధ్యా పురాధిపాయ।
హితకర శ్రీవేంకటేశ్వరాయ నమో। వితత వావిలిపాటి వీర రామాయ॥

**187)మలహరి**

ప॥ కలిగినది యొక్కటే కమలాపతిసేవ। తెలుప కొంగిచ్చేను దిబ్బెము దొడికేను॥

చ॥ హరియే పరతత్త్వ మతడొక్కడే గతి। ధరలోన దేవతలెందరైనా గలుగనీ।
మురహరనామము ముంచి యొక్కటే యెక్కుడు। యిరవైన మంత్రము లెన్నియైనా నుండనీ॥

చ॥ గోవిందుదాసులే పెక్కువఘను లిందరిలో। వేవేలు పెద్దలటు వేలసంఖ్య లుండనీ।
కైవసపు విష్ణు కైంకర్యమే సాధనము। యీవలనావల పుణ్యమెంతైన గలుగనీ॥

చ॥ పట్టిన శ్రీవేంకటేశు భక్తియొక్కటే ఘనము। యిట్టే శాస్త్రజ్ఞాన మెట్లున్నను।
వొట్టినయాతని ముద్రలొక్కటికి మూలము। యెట్టి లాంఛనములిల నెన్నియైనా నుండనీ॥

**188)బిలహరి**

ప॥ పృథుల హేమ కౌపీన ధరః। ప్రథిత వటుర్మే బలం పాతు॥

చ॥ సూపా సప్తః శుచిస్సులభః। కోప విదూరః కులాధికః।
పాప భంజనః పరాత్ప రోయం। గోపా లోమే గుణం పాతు॥

చ॥ తరుణః ఛత్రీ దండ కమండలు। ధరః పవిత్రీ దయాపరః।
సురాణాం సంస్తుతి మనోహరః। స్థిరస్సుధీర్మే ధృతిం పాతు॥

చ॥ త్రివిక్రమః శ్రీతిరువేంకటగిరి। నివాసోయం నిరంతరం।
ప్రవిమల మసృణ కబళ ప్రియోమే। దివా నిశాయాం ధియం పాతు॥

**189)ఝుంఝూటి**

ప॥ ఎండగాని నీడగాని యేమైనగాని। కొండల రాయడె మాకులదైవము॥

చ॥ తేలుగాని పాముగాని దేవపట్టయినగాని। గాలిగాని ధూళిగాని కానియేమైన।
కాలకూటవిషమైనా గ్రక్కున మింగిన నాటి-। నీలవర్ణుడేమా నిజదైవము॥

చ॥ చీమగాని దోమగాని చెలది యేమైనగాని। గాముగాని నాముగాని కానియేమైన।
పాములనిన్నిటి మ్రింగె బలుతేజిపై నెక్కు। ధూమకేతువేమో దొరదైవము॥

చ॥ పిల్లిగాని నల్లిగాని పిన్న యెలుకైన గాని। కల్లగని నల్లిగాని కానియేమైన।
బల్లిదుడై వేంకటాద్రిపైనున్న యాతడి। మమ్మేల్ల కాలము నేలేటి యింటిదైవము॥

**190)బిలహరి**

ప॥ ఇతడే పరబ్రహ్మ మిదియె రామకథ। శతకోటి విస్తరము సర్వపుణ్య ఫలము॥

చ॥ ధరలో రాముడు పుట్టె ధరణిజ బెండ్లాడె। అరణ్య వాసులకెల్ల నభయమిచ్చె।
సొరిది ముక్కుజెవులు చుప్పనాతికిని గోసె। ఖరదూషణులను ఖండించి వేసె॥

చ॥ కినిసి వాలి జంపి కిష్కింద సుగ్రీవుకిచ్చె।వనధి బంధించి దాటె వానరులతో।
కవలి రావణ కుంభకర్ణాదులను జంపి। వనిత జేకొని మళ్ళివచ్చె నయోధ్యకును॥

చ॥ సౌమిత్రియు భరతుడు శత్రుఘ్నుడు గొలువగ। భూమి యేలె కుశలవ పుత్రుల గాంచె।
శ్రీమంతుడై నిలిచె శ్రీవేంకటాద్రి మీద। కామించి విభీషణు లంకకు బట్టముగట్టె॥

**191) పాడి / రాగమాలిక**

ప॥ అందరి బ్రదుకులు నాతనివే। కందువెల్ల శ్రీకాంతునిదే॥
చ॥ వేమరు జదివెడి విప్రుల వేదము। సోమకవైరి యశో విభవం।
శ్రీమించు నమరుల జీవనమెల్ల సు- । ధామ ధనుని సంతత కరుణే॥
చ॥ హితవగు నిలలో నీసుఖమెల్లను। దితి సుత దమనుడు దెచ్చినదే।
తతి తల్లి దండ్రి తానై కాచిన। రతి ప్రహ్లాద వరదుని కృపే॥
చ॥ అలరిన యమరేంద్రాదుల బ్రదుకులు। బలి బంధను కృప బరగినవే॥
బలసి మునుల యాపదలు వాపుటకు। బలునృప భంజను పరిణతలే॥
చ॥ పూని యనాథుల పొందుగ గాచిన। జానకీ విభుని సరసతలే।
నానా భూభరణంబులు నందుని। సూనుడు చేసిన సుకృతములే॥
చ॥ తలకొని ధర్మము తానై నిలుపుట। కలుష విదూరుని గర్వములే।
నిలిచి లోకములు నిలిపిన ఘనుడగు। కలియుగమున వేంకటపతివే॥

**192) హుసేని**

ప॥ కొమ్మ దన ముత్యాలకొంగు జారగ బగటు। కుమ్మరింపుచుం దెచ్చుకొన్నది వలపు॥
చ॥ ఒయ్యారమున విభుని వోరపు గనుంగొని రెప్ప। ముయ్యనేరక మహామురిపెమునను।
కయ్యపుం గూటమికి కాలుద్రువ్వుచు నెంత। కొయ్యతనమునం దెచ్చుకొన్నది వలపు॥
చ॥ పైపైనె ఆరగింపకుము పన్నీరు గడు। తాపమవునని చెలులు దలంక గానె।
తొప్పలియుచుం గెంపు తొలంకు గన్నులకొనల। కోపగింపుచుం దెచ్చుకొన్నది వలపు॥
చ॥ ఎప్పుడునుం బతితోడ నింతేసి మేలములు। వొప్పరని చెలిగోర నొత్తంగానె।
యెప్పుడో తిరువేంకటేశు కౌగిటం గూడి। వొకొప్పు గులుకుచుం దెచ్చుకొన్నది వలపు॥

**193) లలిత**

ప॥ అన్నిటికి నిదె పరమౌషధము। వెన్నుని నామము విమలౌషధము॥
చ॥ చిత్త శాంతికిని శ్రీపతి నామమె। హత్తిన నిజ దివ్యౌషధము।
మొత్తపు బంధ విమోచనంబునకు। చిత్తజ గురుడే సిద్ధౌషధము॥
చ॥ పరిపరి విధముల భవరోగములకు। హరి పాద జలమె యౌషధము।
దురిత కర్మముల దొలగించుటకును। మురహరు పూజే ముఖ్యౌషధము॥
చ॥ ఇల నిహ పరముల నిందిరా విభుని। నలరి భజింపుటె యౌషధము।
కలిగిన శ్రీవేంకటపతి శరణమె। నిలిచిన మాకిది నిత్యౌషధము॥

**194) లలిత**

ప॥ కన్నులెదిటిదే ఘన వైకుంఠము। వెన్నుని గొలిచిన విజ్ఞానికిని॥
చ॥ తలచిన దెల్లా తత్త్వ రహశ్యమె। తెలిసిన యోగికి దిన దినము।
పలికిన దెల్లా పరమ మంత్రములె। ఫలియించిన హరి భక్తునికి॥
చ॥ పట్టిన దెల్లా బ్రహ్మాత్మకమే। పుట్టును గెలిచిన పుణ్యునికి।
మెట్టిన దెల్లా మిన్నేటి నిధులె। రట్టడి తెగువ మెరయు వానికిని॥
చ॥ వినినవి యెల్లా వేదాంతములే। ఘనుడగు శరణాగతునికిని।
యెనసిన శ్రీవేంకటేశుడె యింతా। కొనకెక్కిన నిజకోవిదునికిని॥

**195) దేసాక్షి / బిలహరి**

ప॥ కంటి నఖిలాండ తతి కర్తనధికుని గంటి। కంటి నఘములు వీడుకొంటి నిజమూర్తి గంటి॥

*************************************************************************************************

చ॥ మహనీయ ఘన ఫణామణుల శైలము గంటి। బహు విభవముల మంటపములు గంటి।
సహజ నవరత్న కాంచన వేదికలు గంటి। రహి వహించిన గోపురములవె కంటి॥

చ॥ పావనంబైన పాపవినాశము గంటి। కైవశంబగు గగన గంగ గంటి।
దైవికపు పుణ్యతీర్థములెల్ల బొడగంటి। కోవిదులు గొనియాడు కోనేరి గంటి॥

చ॥ పరమ యోగీంద్రులకు భావగోచరమైన। సరిలేని పాదాంబుజముల గంటి।
తిరమైన గిరిచూపు దివ్యహస్తము గంటి। తిరు వేంకటాచలాధిపు జూడగంటి॥

**196) శంకరాభరణం**

ప॥ వినుడిదె రఘుపతి విజయములు। పనుపడి రాక్ష బాధలుడిగెను॥

చ॥ కులగిరులదరెను కుంభినివడకెను। ఇల రాముడు రథమెక్కినను।
కలగె వారిధులు కంపించె జగములు। బలు విలునమ్ములు పట్టినను॥

చ॥ పిడుగులు దొరిగెను పెనుగాలి విసరె। తొడిబడ బాణము దొడిగినను।
ముడివడె దిక్కులు మొగ్గె దిగ్గజములు। యెడవక రావణునేసినను॥

చ॥ చుక్కలు దుల్లెను స్రుక్కె భూతములు। తొక్కి యసురతల దుంచినను।
గక్కన శ్రీవేంకటగిరి నిలువగ। అక్కజమగు శుభమందరి కొదవె॥

**197) నాట**

ప॥ ఘోర విదారణ నారసింహనీ। నీ రూపముతో నెట్లుండితివో॥

చ॥ ఉడికెడి కోపపుటూర్పుల గొండలు। పొడిపొడియై నభమున కెగయ।
బెడిదపు రవమున పిడుగులు దొరుగగ। యెడనెడ నీవపుడెట్లుండితివో॥

చ॥ కాలానలములు గక్కన యన। జ్వాలల నిప్పులు చల్లుచును।
ఫాలాక్షముతో బ్రహ్మాణ్డ కోట్ల। కేలికపై నేవెటులుండితివో॥

చ॥ గుటగుట రవములు కుత్తిక గులుకుచు। గిటగిట బండ్లు గీటుచును।
తటతట బెదవులు దవడల వణకగ। ఇటువలె నీవపుడెట్లుండితివో॥

చ॥ గోళ్ళ మెరుగుల కొంకుల పెదపెద। వేళ్ళ దిక్కులు వెదుకుచును।
నీళ్ళ తీగలు విగుడగ నోరను-। చ్చిళ్ళు గమ్మగ నెట్లుండితివో॥

చ॥ హిరణ్యకశిపుని నేపడచి భయం-। కర రూపముతో గడుమెరసి।
తిరు వేంకట గిరి దేవుడ నీవిక। యిరవు కొన్న నాడెట్లుండితివో॥

**198) శంకరాభరణం**

ప॥ ఏమని పొగడుదుమే యికనిను। ఆమని సొబగుల అలమేల్మంగ॥

చ॥ తెలికన్నుల నీ తేటలే కదవే। వెలయగ విభునికి వెన్నెలలు।
పులకల మొలకల పొదులివి గదవే। పలుమరు బువ్వుల పానుపులు॥

చ॥ తియ్యపు నీమోవి తేనెలే కదవే। వియ్యపు రమణుని విందులివి।
ముయ్యక మూసిన మొలక నవ్వు గదె। నెయ్యపు గప్పురపు నెరి బాగాలు॥

చ॥ కైవసమగు నీ కౌగిలే కదవే। శ్రీవేంకటేశ్వరుని సిరి నగరు।
తావు కొన్న మీ తమకములే కదే। కావించిన కల్యాణములు॥

**199) సామంతం/ ఖరహరప్రియ**

ప॥ నిగమనిగమాంతవర్ణిత మనోహర రూప-। నగరాజధరుడ శ్రీనారయణా॥

చ॥ దీపించు వైరాగ్యదివ్య సౌఖ్యం బియ్య-। నోపకరా నన్ను నొడబరపుచు।
పైపైనె సంసారబంధముల గట్టేవు। నాపలుకు చెల్లునా నారాయణా॥

చ॥ చికాకుపడిన నా చిత్తశాంతము సేయ-। లేకకా నీవు బహులీల నన్ను।
కాకుసేసెదవు బహుకర్మల బడువారు। నాకొలదివారలా నారాయణా॥

********************************************************************************

చ॥ వివివిధ నిర్బంధముల వెడలద్రోయక నన్ను। భవసాగరముల నడబడ జేతురా।
దివిజేంద్రవంద్య శ్రీతిరువేంకటాద్రీశ। నవనీత చోర శ్రీనారాయణా॥

**200)శ్రీరాగం**

ప॥ నమో నారాయణాయ నమః। సమధికానందాయ సర్వేశ్వరాయ॥

చ॥ ధరణీసతీఘన స్తనశైలపరిరంభ- । పరిమళ శ్రమజల ప్రమదాయ।
సరసిజ నివాసినీ సరసప్రణామయుత- । చరణాయతే నమో సకలాత్మకాయ॥

చ॥ సత్యభామాముఖాంచన పత్రవల్లికా- । నిత్య రచనక్రియా నిపుణాయ।
కాత్యాయనీ స్తోత్రకామాయ తే నమో। ప్రత్యక్ష నిజపరబ్రహ్మ రూపాయ॥

చ॥ దేవతాధిప మకుటదివ్య రత్నాంశుసం- । భావితామల పాదపంకజాయ।
కైవల్య కామినీకాంతాయ తే నమో। శ్రీవేంకటాచల శ్రీనివాసాయ॥

**201)సామంతం/ ఆరభి**

ప॥ నగధర నందగోప నరసింహ వో- । నగజవరద శ్రీనారసింహ॥

చ॥ నరసింహ పరంజ్యోతి నరసింహా వీర- । నరసింహ లక్ష్మీనారసింహా।
నరసుఖ బహుముఖ నారసింహా వో- । నరకాంతక జేజే నారసింహా॥

చ॥ నమో నమో పుణ్డరీక నారసింహ వో- । నమిత సురాసుర నారసింహా।
నమకచమకహిత నారసింహా వో- । నముచిసూదన వంద్య నారసింహా॥

చ॥ నవరసాలంకార నారసింహా వో- । నవనీతచోర శ్రీనారసింహా।
నవగుణ వేంకట నారసింహా వో- । నవమూర్తి మండెము నారసింహా॥

**202)సామంతం**

ప॥ తానే కాకెవ్వరు మాకు దాతయు దైవము తన- । లోన బెట్టుకొని మాకు లోనైనవాడు॥

చ॥ చదివించి కూడువెట్టి జారకుండ నిల్లుగట్టి। బెదురులేని బుద్ధి పిన్ననాడే చెప్పి।
యెదిరి నడిగి ద్రవ్యమిది గొమ్మనుచు నిచ్చి। పదిలమై తమ్ము బాలించినవాడు॥

చ॥ మోహవియోగమ్ము మోహానురాగమ్ము। దేహవిభాగంబు దెలిపిన కలికి।
ఐహికమున వేంకటాధీశుడై సర్వ- । దేహరక్షకుడై తిరుగుచున్నాడు॥

**203)కన్నడగౌళ**

ప॥ పోయ గాలం బడవికి గాయు వెన్నెలకరణిని। శ్రీయుతు దలచుడీ నరులు మాయబడి చెడక॥

చ॥ చిత్తము చేకూర్చుకొని చిత్తైకాగ్రతను। చిత్తజగురుని దలచుడీ చిత్తజ జౌరనీక॥

చ॥ బూరుగుమాకున జెందినకీరము చందమున। ఆరయ నిష్ఫలమగు మరి యన్యుల జేరినను॥

చ॥ కూరిమి మాతిరువేంకటగిరిగురు శ్రీపాదములు। చేరినవారికి భవములు చెంద వెపుడు నటుగాన॥

**204)నాట**

ప॥ లంకెలూడుటే లాభము యీ- । కింకరులను నలగెడికంటెను॥

చ॥ జంపుల జంపక సరగునబాసేటి- । లంపటమేపో లాభము।
కంపుమోపుతో గనలి శరీరపు- । కొంపలోనవేగుటకంటెను॥

చ॥ ఈవలనావల నేనేటియాసల- । లావు దిగుటేపో లాభము।
యేవగింతలకు నిరవగు నరకపు- । కోపులబడి మునుగుటకంటెను॥

చ॥ తివిరి వేంకటాధిపుదాసులకృప- । లవలేశమెపో లాభము।
చవులని నోరికి సకలము దినితిని। భవకూపంబుల బడుటకంటెను॥

**205)ఆనందభైరవి/ సామంతం**

ప॥ సకలభూతదయ చాలగ గలుగుట। ప్రకటించి దేహసంభవమైనఫలము॥

చ॥ తలకొన్న ఫలవాంఛ దిగులకుండగ జిత్త- । మలవరించుట కర్మియైనఫలము।

పలుకర్మములలోన బ్రహ్మార్పణపుబుద్ధి। గలుగుట హరికృపగలిగినఫలము॥
చ॥ ఎప్పుడు దిరువేంకటేశు సేవకుడౌట। తప్పక జీవుడు దానైన ఫలము।
కప్పినసౌఖ్యదుఃఖమ్ములు సమముగా। నొప్పుట విజ్ఞానమొదవిన ఫలము॥

**206)శ్రీరాగం**

ప॥ అంగడి నెవ్వరు నంటకురో యీ-। దొంగలగూడిన ద్రోహులను॥
చ॥ దోసము దోసము తొలరో శ్రీహరి-। దాసానదాసుల దగ్గరక
ఆసలనాసల హరినెరుగక చెడి। వీసరపోయిన వెర్రులము॥
చ॥ పాపము పాపము పాయరో కర్మపు-। దాపువారము దగ్గరక।
చేపట్టి వేదపు శ్రీహరి కథలు। యేపొద్దు విననిహీనులము॥
చ॥ పంకము పంకము పైకొనిరాకురో। కొంకుగొసరులకూళలము।
వేంకటగిరిపై విభునిపుణ్యకథ। లంకెల విననియన్యులము॥

**207)వరాళి**

ప॥ ఏమిసేయువార మికను। ఆమనిచేలపచ్చలాయ బ్రదుకు॥
చ॥ దీపనమనియెడి తీరనియాస। రేపుమాపు బెడరేచగా।
తోపుసేయగరాక దురితపుతరవుల-। కాపదలకు లోనాయ బ్రదుకు॥
చ॥ వేడుకనెడిపెద్దవిడువనితరవు। వోడ కెపుడు వొద్దనుండగా।
జోడు విడువరాక చులుకదనంబున-। కాడికెలకు లోనాయ బ్రదుకు॥
చ॥ మమకారమనియెడి మాయతరవు। తిమిర మెక్కించుక తియ్యగా।
విమలమూరితియైన వేంకటగిరిపతి। అమర జేరక యెరువాయ బ్రదుకు॥

**208)సామంతం**

ప॥ నారాయణ నీనామము బుద్ధి-। జేరినా జాలు సిరు లేమిబాతి॥
చ॥ ననుపైనశ్రీవిష్ణునామము పేరు-। కొనగానే తేకువమీరగా।
ఘనమైనపుణ్యాలు గలుగగా తమ-। కనయము బర మది యేమిబాతి॥
చ॥ నలువైన శ్రీహరినామము మతి-। దలచిన నాబంధము లూడగా।
యెలమి దీని బఠియించినా యీ-। కలుషములేల కలుగు నెవ్వరికి॥
చ॥ వేంకటపతినామవిభవము కర్మ-। పంకములెల్ల బరిమార్చగా।
బింకమై తలపెడి ప్రియులకు యెందు-। నింక నీసుఖ మిది యేమిబాతి॥

**209)బౌళి రామక్రియ**

ప॥ పలికెటి వేదమె ప్రమాణము। తలచిన వారికి తత్త్వము సుండి॥
చ॥ నరహరి యజాండ నాయకుడు। సురలితనినె సంస్తుతించిరి।
పురుషోత్తముడిదె భూమికి యీ। హరి గొలువని వారసురలు సుండి॥
చ॥ కమలా రమణుడె ఘనుడు। అమరులె మ్రొక్కుదు రాతనికి।
విమతుల దునిమె విష్ణుడు। తమి బూజించక తగు గతి లేదు॥
చ॥ భావజ జనకుడు బ్రహ్మము। పోవగ గొలిచిరి శుకాదులు।
శ్రీ వేంకటపతి చెలువుడు। దైవ శిఖామణి దలచరొ బుధులు॥

**210)దేవగాంధారి**

ప॥ దేవరగుణములు దెలియవు। నీవే మాకును నేరుప వయ్యా॥
చ॥ వదలక నీతో వాసికి బెనగిన। యెదుటనె నీ మన సెట్టుండునో।
కదిసి నీరీతికి గడు దమకించిన। యిది వేసాలని యెంతువో నీవు॥
చ॥ చెనకగ నీ యెడ సిగ్గులు నెరపిన। పనులవి యేమని భావింతువో।

నసిచి నీ యెదుట నవ్వులు నవ్విన। తనివి లేనిదని తగ నాడుదువో॥
చ॥ కూడుదు నిన్నిట గుబ్బల నొత్తిన। వోడ దనుచు గో రూదుదువో।
యీడనె శ్రీవేంకటేశ యేలితివి। వీడెమిచ్చితే వెరగందుదువో॥

**211) ఆహిరి**

ప॥ మోహము విడుచుటే మోక్ష మది। దేహ మెరుగుటే తెలివి నదే॥
చ॥ ననిచినతనజన్మము గర్మము దన- । పనియు నెరుగుటే పరమ మది।
తనకు విధినిషేధములు బుణ్యముల- । ఘనత యెరుగుటే కలిమి యది॥
చ॥ తరిదరి బ్రేమపు తల్లిదండ్రులను। యెరుగనిదే కులహీన తది।
చరుల బొరలి యాచారధర్మములు। మరచినదే తనమలిన మది॥
చ॥ కమ్మర గమ్మర గామభోగములు। నమ్మి తిరుగుటే నరక మది।
నెమ్మది వేంకటనిలయుని దాసుల- । సొమ్మయి నిలుచుట సుకృత మది॥

**212) నాట**

ప॥ మాన డెన్నడు శరీరి దు- । ర్మానసబోధితుడుగాన॥
చ॥ పంచభూతవికారంబులు। పంచేంద్రియములూ।
పంచమహాపాతకములకును। పంచివేసినవిగాన॥
చ॥ త్రైగుణ్యవికారంబులు। త్రైగుణ్యపుదనువులు।
శ్రీగురుడగు శ్రీవేంకటపతి- । భోగయోగ్యములుగాన॥

**213) దేవగాంధారి**

ప॥ ఆదిదేవ పరమాతుమా। వేదవేదాంతవేద్య నమో నమో॥
చ॥ పరాత్పరా భక్తభవభంజనా। చరాచరలోకజనక నమో నమో॥
చ॥ గదాధరా వేంకటగిరినిలయా। సదానంద ప్రసన్న నమో నమో॥

**214) భైరవి**

ప॥ హరి గొలిచియు మరీ నపరములా। తిరముగ నతనినే తెలియుటగాకా॥
చ॥ పంకజనాభునిపాదములు దలచి। యింకా మరియొక యితరములా।
అంకెల నతనివే ఆతనిదాసులనే। కొంకొక నిజముగ గొలుచుటగాకా॥
చ॥ పన్నగశయనునిబంట్లకు బంటై। కొన్నిటిపై మరి కోరికెలా।
యిన్నికోరికలు యిదియే తనకని। కొన్నదికోలై కోరుటగాకా॥
చ॥ వీనుల వేంకటవిభునామామృత- । మూనిన మతి మరియును రుచులా।
తేనెలుగారెడితీపు లతనినుతి। నానారుచులై ననుచుటగాకా॥

**215) పాడి**

ప॥ బలువగు దనరూపము చూపెన్। కలదింతయు దనఘన తెరిగించెన్॥
చ॥ పాండవ రక్షణపరుడై నరునకు। నండనే తెలిపె మహామహిమ।
దండి విడిచి తనదయతో నర్జును- । డుండగ మగటిమి నొడబడ బలికె॥
చ॥ మగుడగ కులధర్మములు బుణ్యములు। తెగి పార్థున కుపదేశించెన్।
నగుచు నతనితో నానాగతులను। నిగమమునియమమునిజ మెరిగించెన్॥
చ॥ వెరవుమిగుల నావిజయునిమనుమని। పరీక్షిత్తు దగ బ్రదికించెన్।
తిరువేంకటగిరిదేవుడు దానై। గరిమల భారతకథ గలిగించెన్॥

**216) ముఖారి**

ప॥ సేవింతురే యితని జెలగి పరులిట్లనే। కావించి మమ్ము నెక్కడిదైవ మితడు॥
చ॥ పాఅలచవి యితడెరుగు పాల బవళింప గో- । పాలుడని నే మితని భజియించగా।

పాలుపడి తల్లిచనుబాలు సహితంబు నే- । కాలమును బాపె నెక్కడిదైవ మితడు॥

చ॥ పుట్టింప దానె మరి పురుషోత్తముడు మంచి- । పుట్టు వొసగిననుచు బూజించగా।
పట్టుకొని మము దెచ్చి బలిమి బుట్టువులెల్ల। గట్టిపెట్టించె నెక్కడిదైవ మితడు॥

చ॥ కర్మకర్తారుడని కడలేని పుణ్యముల- । కర్మఫలములు దనకు గైకొలువగా।
కర్మగతి దెచ్చి వేంకటవిభుడు మావుభయ- । కర్మముల జెరిచె నెక్కడిదైవ మితడు॥

**217) నాట**

ప॥ ఏదియునులేని దేటిజన్మము। వేదాంతవిద్యావివేకి గావలెను॥

చ॥ పరమమూర్తి ధ్యానపరుడు గావలె నొండె। పరమానంద సంపదలొందవలెను।
పరమార్థముగ నాత్మభావింపవలె నొండె। పరమే తానై పరగుండవలెను॥

చ॥ వేదశాస్త్రార్థకోవిదుడుగావలె నొండె। వేదాంతవిదుల సేవించవలెను।
కాదనక పుణ్యసత్కర్మి గావలె నొండె। మోదమున హరిభక్తిమొగినుండవలెను॥

చ॥ సతతభూతదయావిచారి గావలె నొండె। జితమైనయింద్రియస్థిరుడు గావలెను।
అతిశయంబగు వేంకటాద్రీశు సేవకులై। గతియనుచు తనబుద్ధి గలిగుండవలెను॥

**218) బౌళి**

ప॥ చిత్తమో కర్మమో జీవుడో దేవుడో। వొత్తినయీచేత లొకరివి గావు॥

చ॥ పదిలమైన మోహపాశంబులు దెచ్చి। మెదలకుండగ నాకు మెడ జుట్టి।
యెదిరివారు నవ్వ నింటింట దిరిగించి। తుదలేనియాసల దుఃఖాంతరుని జేసె॥

చ॥ కొలదిమీర జన్మకోట్ల బెనగొని। తొలగని నాలోని దురితము।
తొలగింప నాలుకతుదకు నీపేరిచ్చి। తెలుపు మింతియు చాలు దిరువేంకటేశా॥

**219) శ్రీరాగం**

ప॥ త్వమేవ శరణం త్వమేవ శరణం। కమలోదర శ్రీజన్నాథా॥

చ॥ వాసుదేవ కృష్ణ వామన నరసింహ। శ్రీసతీశ సరసిజనేత్రా।
భూసురవల్లభ పురుషోత్తమ పీత- । కౌశేయవసన జగ్నాన్నాథా॥

చ॥ బలభద్రానుజ పరమపురుష దుగ్ధ- । జలధివిహార కుంజరవరద।
సులభ సుభద్రాసుముఖ సురేశ్వర। కలిదోషహరణ జగన్నాథా॥

చ॥ వటపత్రశయన భువనపాలన జంతు- । ఘటకారకరణ శృంగారాధిపా।
పటుతర నిత్యవైభవరాయ తిరువేం- । కటగిరినిలయ జగన్నాథా॥

**220) వరాళి**

ప॥ ఏమిగల దిందు నెంతపెనగిన వృథా। కాముకపుమనసునకు కడమొదలు లేదు॥

చ॥ పత్తిలోపలి నూనెవంటిది జీవనము। విత్తుమీదటి పొల్లువిధము దేహంబు।
బత్తిసేయుట యేమి పాసిపోవుట యేమి। పొత్తులసుఖంబులకు పొరలుటలుగాక॥

చ॥ ఆకాశపాకాశ మరుదైనకూటంబు। లోకరంజకంబు తమలోని సమ్మతము।
చాకిమణుగులజాడ చంచలపుసంపదలు। చేకొనిననేమి యివి చెదిరినను నేమి॥

చ॥ గాదెపోసినకొలుచు కర్మిసంసారంబు। వేదువిడువనికూడు పెడమాయబదుకు।
వేదనల నెడతెగుట వేంకటేశ్వరుకృపా- । మోదంబు వడసినను మోక్షంబు గనుట॥

**221) కన్నడగౌళ**

ప॥ కరుణానిధిం గదాధరం। శరణాగతవత్సలం భజే।

చ॥ శుకవరదం కౌస్తుభాభరణం। అకారణప్రియ మనేకదం।
సకలరక్షకం జయాధికం సే- । వకపాలక మేవం భజే॥

చ॥ పురగశయనం మహోజ్జ్వలం తం। గరుడారూఢం కమనీయం।

పరమపదేశం పరమం భవ్యం। హరిం దనుజభయదం భజే॥

చ॥ లంకాహరణం లక్ష్మీరమణం। పంకజసంభవప్రియం।
వేంకటేశం వేదనిలయం శు- । భాంకం లోకమయం భజే॥

**222) ధన్యాసి**

ప॥ ఘోరదురితములచే గుణవికారములచే- । నీరీతిబడునాకు నేది దెరువు॥

చ॥ హరి జగన్నాథు లోకారాధ్యు- । నెరగలేనివాని కేది దెరువు।
పరమపురుషుని జగద్భరితు నంతర్వ్యాప్తి- । నిరవుకొలుపనివాని కేది దెరువు॥

చ॥ శ్రీవేంకటేశు దలచినవెనుక సకలంబు- । నేవగింపనివాని కేది దెరువు।
దేవోత్తముని మహిమ దెలిసితెలియగలేని- । యీవివేకంబునకు నేది దెరువు॥

**223) లలిత**

ప॥ సకల సంగ్రహము సకల సంచయము। అకృతసుకృత మిది హరినామం॥

చ॥ సకలవేదశాస్త్రములసార మిది। సకలమంత్రరాజంబు నిది।
సకలపురాణ రసములమధుర మిది। అకుటిలపావనం హరినామం॥

చ॥ సకలతత్త్వ సంశయఖండన మిది। సకలకర్మ నిశ్చయము నిది।
సకలవిధి రహస్యప్రధాన మిది। అకారణహితం హరినామం॥

చ॥ సకలదేవతా స్వామిప్రియం బిది। సకలలోక రక్షణము నిది।
ప్రకటం వేంకటపతి నామాంకిత- । మకించనధనం హరినామం॥

**224) కన్నడగౌళ**

ప॥ విశ్వప్రకాశునకు వెలియేడ లోనేడ। శాశ్వతునకు కూహింప జన్మ మిక నేడ॥

చ॥ సర్వపరిపూర్ణునకు సంచార మిక నేడ। నిర్వాణమూర్తికిని నిలయ మిక నేడ।
వుర్వీధరునకు గాలూద నొకచోటేడ। పార్వతీస్తుత్యునకు భావ మిక నేడ॥

చ॥ నానాప్రభావునకు నడుమేడ మొదలేడ। ఆననసహస్రునకు నవ్వలివ్వలేడ।
మౌనిహృదయస్థునకు మాటేడ పలుకేడ। జ్ఞానస్వరూపునకు గాన విన నేడ॥

చ॥ పరమయోగీంద్రునకు పరులేడ తానేడ। దురితదూరునకు సంస్తుతినింద లేడ।
తిరువేంకటేశునకు దివ్యవిగ్రహమేడ। హరికి నారాయణున కవుగాములేడ॥

**225) వసంతం**

ప॥ తలపులోపలితలపు దైవమితడు। పలుమారు బదియును బదియైనతలపు॥

చ॥ సవతైనచదువులు సరుగ దెచ్చినతలపు। రవళి దరిగుబ్బలిని రంజిల్లుతలపు।
కవగూడి గోరు భూకాంతముంగిటితలపు। తివిరి దూషకు గోళ్ళ దెగటార్చుతలపు॥

చ॥ గొడుగువట్టినవాని గోరి యడగినతలపు। తడబడక విప్రులకు దానమిడుతలపు।
వొడసి జలనిధిని గడగూర్చి తెచ్చినతలపు। జడియక హలాయుధము జళిపించుతలపు॥

చ॥ వలపించి పురసతులవ్రతము చెరిచినతలపు। కలికితనములు చూపగలిగున్నతలపు।
యిల వేంకటాద్రిపై నిరవుకొన్నతలపు। కలుషహరమై మోక్షగతిచూపుతలపు॥

**226) ఆహిరి**

ప॥ అస్మదాదీనాం అన్యేషాం। తస్మిన్ తస్మిన్ తత్ర చ పునశ్చ॥

చ॥ సతతాధ్యయననిష్ఠాపరాణాం దృఢ- । వ్రతినాం యతీనాం వనవాసినాం।
గతిరిహ స్మర్తుం కా జగత్యాం పర- । స్థితిరియం కా విష్ణుసేవా పునశ్చ॥

చ॥ మోహినామత్యంతముష్కరాణాం గుణ- । గ్రాహిణాం భువనైక కఠినానాం।
దేహసంక్షాళన విదేశకోవా సదా। శ్రీహరిస్మరణవిశేషః పునశ్చ॥

చ॥ కింకుర్వాణదుఃఖితజీవినాం। పంకిలమనోభ్భయభ్రాంతానాం।

శంకాం నిరురుతి స్సరసా కా, శ్రీ- । వేంకటాచలపతేర్వినుతిః పునశ్చ॥

**227)సామంతం**

ప॥ దొరకునా యితనికృప తుదిపదంబు। అరిదివిభవము లొల్లమనినా బొదలు॥

చ॥ సొంపలర నితడు కృపజూచు టరుదనికాక। యింపు సామాన్యమా యితనికరుణ।
లంటమైనఘనమైన లక్ష్మీకటాక్షములు। సంపదలు తోడనే చల్లువెదలాడు॥

చ॥ తగ నితనిపై భక్తితగులు టరుదనికాక। నగుట సామాన్యమా ననిచి యితడు।
జగదేకహితములుగ సరసతలు సౌఖ్యములు। దిగులువాయగ నితడు దిప్పు దీరాడు॥

చ॥ తిరువేంకటాద్రి సిద్ధించు టరుదనికాక। మరుగ దను నిచ్చునా మరియొకరిని।
యిరవైన భోగములు యిష్టసామ్రాజ్యములు। విరివిగొని యితనిదయవెంటనే తిరుగు॥

**228)శ్రీరాగం**

ప॥ అణురేణుపరిపూర్ణుడైన శ్రీవల్లభుని। బ్రణుతించువారువో బ్రాహ్మలు॥

చ॥ హరినామములనె సంధ్యాదివిధు లొనరించు- । పరిపూర్ణమతులువో బ్రాహ్మలు।
హరిమంత్ర వేదపారాయణులు హరిభక్తి- । పరులైన వారువో బ్రాహ్మలు॥

చ॥ ఏవిచూచినను హరి యిన్నిటా గలడనుచు- । భావించువారువో బ్రాహ్మలు।
దేవకీనందనుడె దేవుడని మతిదెలియు- । పావనులు వారువో బ్రాహ్మలు॥

చ॥ ఆదినారాయణుని ననయంబు దమయాత్మ। బాదుకొలిపనవారు బ్రాహ్మలు।
వేదరక్షకుడైన వేంకటగిరీశ్వరుని- । పాదసేవకులువో బ్రాహ్మలు॥

**229)దేసాక్షి/అఠాణ**

ప॥ సీతాశోకవిఘాతక వో-। పాతాళలంకాపతివిభాళా॥

చ॥ హనుమప్పురాయ అంజనీతనయ వో- । వనధిలంఘనగాత్ర వాయుపుత్రా।
యినకులాధిపనిజహిత జగన్నుత- । వనజోదరసేవక సత్వధనికా॥

చ॥ ప్రళయాంతికరూప బలదీప రవిఫల- । గిళనప్రతాప సుగ్రీవప్రియా।
కుళికదానవసంకులవిదారణ। భళిభళి జగత్పతిబలుబంటా।

చ॥ పంకజాసనుదివ్యపదవైభవ వో- । లంకిణీప్రాణవిలంఘున।
వేంకటేశ్వరుసేవావీర మహాధీర। కింకరరాయ సుఖీభవా॥

**230)ముఖారి**

ప॥ చిరంతనుడు శ్రీవరుడు। పరమం భవ్యం పావనం॥

చ॥ వేదమయుడు కోవిదు డమలుడు పరు- । డాదిపురుషుడు మహామహుడు।
యేదెస నేమని యేది దలచిన న- । భేద మవాది మఖిలసమ్మతం॥

చ॥ నిఖిలనిలయుడు మునివరదు డధికుడు। మఖముఖశుకాభిమతరతుడు।
శిఖరం శివం సుశీలన మతిశయ। ముఖరం ముఖ్యం మూలమిదం॥

చ॥ అనేకప్రదు డనాదినిధనుడు। ఘను డీతిరువేంకటవిభుడు।
దినందినం సముదితరవికోటిభ- । జనం సిద్ధాంజనం ధనం॥

**231)రామక్రియ**

ప॥ ఓహో డేండేం వొగి బ్రహ్మ మిదియని। సాహసమున శ్రుతి దాటెడిని॥

చ॥ పరమున నరము బ్రకృతియు ననగా। వెరవుదెలియుటే వివేకము।
పరము దేవుడును అపరము జీవుడు। తిరమైన ప్రకృతియె దేహము॥

చ॥ జ్ఞానము జ్ఞేయము జ్ఞానగమ్యమును। పూని తెలియుటే యోగము।
జ్ఞానము దేహాత్మ, జ్ఞేయము పరమాత్మ। జ్ఞానగమ్యమే సాధించుమనసు॥

చ॥ క్షరము నక్షరమును సాక్షి పురుషుడని। సరవి దెలియుటే సాత్వికము।

క్షరము ప్రపంచ, మక్షరము కూటస్థుడు। సిరిపురుషోత్తముడే శ్రీవేంకటేశుడు॥

**232)గుండక్రియ**

ప॥ మరిగి వీరెపో మాదైవంబులు। కెరలిన హరిసంకీర్తనపరులు॥

చ॥ వినియెడివీనులు విష్ణుకథలకే। పనిగొందురు మాప్రపన్నులు।
కనియెడి కన్నులు కమలాక్షునియం-। దనువుపరతు రటు హరిసేవకులు॥

చ॥ పలికెడి పలుకులు పరమాత్మునికై। యలవరుతురు శరణాగతులు।
తలచేటి తలపులు ధరణీధరుపై। తలచెడి రతిదివ్యులు॥

చ॥ కరముల శ్రీపతికైంకర్యములే। మురియుచు జేతురు ముముక్షువులు।
యిరవుగ శ్రీవేంకటేశ్వరుమతమే। సిరుల నమ్మెదురు శ్రీవైష్ణవులు॥

**233)వరాళి**

ప॥ చెలియరో నీవే కదే సృష్టికర్తవు। నిలువున నీ మగడు మెచ్చె నమ్మా॥

చ॥ బొమ్మల జంకించితేనే పొద్దు గుంకినట్లెను। కమ్మి నీవు నవ్వితేనే కాయు వెన్నెల।
సొమ్మల మోవి చూపితే చుక్కలు నిండుకొనును। నెమ్మది నీ రమణుడు నిను మెచ్చెనమ్మా॥

చ॥ పొలితి నీవు చూచితే వొద్దు వొడుచు నప్పుడే। పొలయలుకల నెండ పొడచూపును।
తిలకించి నిలిచితేదిష్టమౌను లోకమెల్ల। నెలకొని నీ విభుడు నిన్ను మెచ్చెనమ్మా॥

చ॥ ఎక్కువై నీవు గూడితే నిరు సంజలును దోచు। మొక్కిన నీతురుముకు మూగు మేఘాలు।
వొక్కటై నీ రతులను వోలార్చగా నేడు। నిక్కి శ్రీవేంకటేశుడు నిన్ను మెచ్చెనమ్మా॥

**234)మాళవిగౌళ**

ప॥ చెలులారా చూడరే యీ చెలి భాగ్యము। అలమేలుమంగ యీకె కబ్బెను యీ భాగ్యము॥

చ॥ పతిదయ కలిగిన పడతిదీ భాగ్యము। అతడు మాట మీరనీదది భాగ్యము।
సతతముబాయక జంటై వుండేది భాగ్యము। అతివలందరు గల్లా నది యేమి చెప్పరే॥

చ॥ మగడు మన్నించిన మగువది భాగ్యము। సొగసి యాతడు మోహించుట భాగ్యము।
వెగటులేని రతుల వేసర నిది భాగ్యము। మగువల వలపుల మరి యేమి భాగ్యము॥

చ॥ శ్రీవేంకటేశుడేలే మచ్చిక నీ సతిది భాగ్య-। మావేళ నాతడు మెచ్చినది భాగ్యము।
తావుకొని యెప్పుడూ దనవాడౌటే భాగ్యము। యేవనితల నేరుపులిక నేమి చెప్పరే॥

**235)పాడి**

ప॥ సత్యభామ సరసపు నగవు। నిత్యము హరి మదినే నెలవు॥

చ॥ రుకుమిణి దేవికి రూపయవ్వనికి। సకల విభవముల సౌఖ్యతలు।
చికురాంబరమున జెదరిన యలకలు। వికచాబ్జ ముఖము వెయి వేలాయె॥

చ॥ తొడవుల శ్రీసతి తొలిమెరుగులమై। నడపులమురిపెపు నగుమోము।
తడయక వారిధి దచ్చిన హరికిని। బడలికవాపను పరమంబాయ॥

చ॥ అనుదినమునను నీ యలుమేలుమంగ। కనుగవ జంకెన గర్వములు।
దినదినంబులును తిరువేంకటపతి। చనువుల సొబగుల సంపదలాయ॥

**236)దేవగాంధారి**

ప॥ ఖారమైన వేపమాను పాలువోసి పెంచినాను। తీరని చేదేకాక దియ్యనుండీనా॥

చ॥ పాయదీసి కుక్కతోక బద్దలు వెట్టి బిగిసి। చాయ కెంతగట్టినాను చక్కనుండీనా।
కాయపు వికారమిది కలకాలము జెప్పినా। పోయిన పోకలే కాక బుద్ధి వినీనా॥

చ॥ ముంచిముంచి నీటిలోన మూల నానబెట్టుకొన్నా। మించిన గొడ్డలి నేడు మెత్తనయ్యీ నా।
పంచమహాపాతకాల బారి బడ్డచిత్తమిది। దంచి దంచి చెప్పినాను తాకి వంగీనా॥

చ॥ కూరిమితో దేలుదెచ్చి కోకలోన బెట్టుకొన్నా। సారె సారె గుట్టుగాక చక్కనుండీనా।

***********************************************************************************

వేరులేని మహిమల వేంకటవిభుని కృప। ఘోరమైన ఆస మేలుకోర సోకీనా॥

**237)ధన్యాసి**

ప॥ బండి విరచి పిన్నపాపలతో నాడి। దుండగీడు వచ్చె దోబూచి॥

చ॥ వెరుగు వెన్నలు బ్రియమున వే- । మరు ముచ్చిలించు మాయకాడు।
వెరవున్నాదన విధము దాచుకొని। దొరదొంగ వచ్చె దోబూచి॥

చ॥ పడచు గుబ్బెత పరపుపైపోక। ముడి గొంగు నిద్రముంపునను।
పడియు దా వద్ద బవళించినట్టి। తోడుకు దొంగ వచ్చె దోబూచి॥

చ॥ గొల్లెపల్లెలో యిల్లిల్లూ చొచ్చి। కొల్లెలాడిన కోడెకాడు।
యెల్లయినా వేంకటేశుడు ఇదే। తొల్లిటి దొంగ వచ్చె దోబూచి॥

**238)దేసాళం**

ప॥ నెయ్యములలో నేరెళ్ళో। వొయ్యన వూరెడి వువ్విళ్ళో॥

చ॥ పలచని చెమటల బాహుమూలముల। చెలములలోనా జెలువములే।
ధళధళమను ముత్యపు జెరగు సురటి। దులిపేటి నీళ్ళ తుంపిళ్ళో॥

చ॥ తొటతొత గన్నుల దొరిగేటినీళ్ళ। చిటిపొటి యలుకలు చిరునగవే।
వట ఫలంబు నీ వన్నెల మోవికి। గుటుకల లోనా గుక్కిళ్ళో॥

చ॥ గరిగరికల వేంకటపతి కౌగిట। పరిమళములలో బచ్చనలు।
మరునివింటి కమ్మనియంప విరుల। గురితాకులినుప గుగ్గిళ్ళో॥

**239)సౌరాష్ట్రం**

ప॥ ఊరులేని పొలిమేర పేరు పెంపులేని బ్రతుకు। గారవంబులేని ప్రియము కదియనేటికే॥

చ॥ ఉండరాని విరహవేదన వుండని సురతసుఖమేల। యెండలేని నాటి నీడ యేమిసేయనే।
దండిగలుగు తమకమనెడి దండలేని తాలిమేల। రెండు నొకటిగాని రచన ప్రియములేటికే॥

చ॥ మెచ్చులేని చోట మంచిమేలు కలిగినేమి సెలవు। మచ్చికలేని చోట మంచిమాట లేటికే।
పెచ్చుపెరగలేని చోట ప్రియముగలిగి యేమి ఫలము। ఇచ్చలేనినాటి సొబగులేమి సేయనే॥

చ॥ బొంకులేని చెలిమిగాని పొందులేల మనసులోన। శంకలేక కదియలేని చదువులేటికే।
కొంకు గొసరులేని మంచికూటమలర నిట్లుగూడి। వేంకటాద్రి విభుడు లేని వేడుకేటికే॥

**240)సామంతం**

ప॥ ఎక్కువకులజుడైన హీనకులజుడైన। నిక్కమెరిగిన మహానిత్యుడే ఘనుడు॥

చ॥ వేదములు చదివియు విముఖుడై హరిభక్తి। యాదరించలేని సోమయాజికంటె।
యేదియునులేని కులహీనుడైనను విష్ణు। పాదములు సేవించు భక్తుడే ఘనుడు॥

చ॥ పరమమగు వేదాంత పఠన దొరికియు సదా। హరిభక్తిలేని సన్యాసికంటె।
సరవి మాలిన యంత్యజాతి కులజుడైన। నరసి విష్ణు వెదుకునాతడే ఘనుడు॥

చ॥ వినియు జదివియును శ్రీవిభుని దాసుడుగాక। తనువు వేపుచునుండు తపసికంటె।
ఎనలేని తిరువేంకటేశు ప్రసాదాన్న- । మనుభవించిన యాతడప్పుడే ఘనుడు॥

**241)ధన్యాసి**

ప॥ సామాన్యమా పూర్వ సంగ్రహంబగు ఫలము। నేమమున బెనగొనియె నేడు నీవనక॥

చ॥ జగతి బ్రాణులకెల్ల సంసారబంధంబు। తగుల బంధించు దురితంపు గర్మమున।
మగుడ మారుకుమారు మగువ నీయురముపై। తెగి కట్టిరెవ్వరో దేవుండ వనక॥

చ॥ పనిలేని జీవులను భవసాగరంబులో మునుగ లేవగ జేయు మోహదోషమున।
పనిపూని జలధిలో బండబెట్టిరి నిన్ను। వెనకెవ్వరో మొదలి వేలువనక॥

చ॥ ఉండనీయక జీవనోపాయమున మమ్ము। కొండలను గొబల దతి గొని త్రిప్పుఫలము।

కొండలను నెలకొన్న కోనేటి పతి వనగ। నుండవలసెను నీకు నోపలేవనక॥

**242)కేదారగౌళ**

ప॥ సువ్వి సువ్వి సువ్వి సువ్వని। సుదతులు దంచెద రోలాల॥

చ॥ వనితలు మనసులు కుందెన చేసిటు। వలపులు తగనించోలాల।
కనుచూపు లనెడు రోకండ్లను। కన్నెలు దంచెద రోలాల॥

చ॥ బంగరు చెరుగుల పట్టు పుట్టములు। కొంగులు దూలగ నోలాల।
అంగనలందరు నతివేడుకతో। సంగడి దంచెద రోలాల॥

చ॥ కురులు దూలగ మంచి గుబ్బచనులపై। సరులు దూలాడగ నోలాల।
అరవిరి బాగుల నతివలు ముద్దులు। గురియుచు దంచెద రోలాల॥

చ॥ ఘల్లు ఘల్లుమను కంకణరవముల। పల్లవపాణుల నోలాల।
అల్లన నడుములు అసియాడుచు సతు। లొల్లనె దంచెద రోలాల॥

చ॥ కప్పురగంధులు కమ్మనిపువ్వుల। చప్పరములలో నోలాల।
తెప్పలుగా రతి దేలుచు గోనే-। టప్పని బాడెద రోలాల॥

**243)శంకరాభరణం**

ప॥ మలసీ జూడరో మగసింహము। అలవి మీరిన మాయల సింహము॥

చ॥ అదివో చూడరో ఆదిమ పురుషుని। పెద యౌబళముమీదిపెనుసింహము।
వెదికి బ్రహ్మాదులు వేదాంతతతులు। కదిసి కానగ లేని ఘనసింహము॥

చ॥ మెచ్చి మెచ్చి చూడరో మితిమీరినయట్టి। చిచ్చరకంటితోడి జిగిసింహము।
తచ్చిన వారిధిలోని తరుణిగౌగిటజేర్చి। నచ్చిన గోళ్ళ శ్రీనరసింహము॥

చ॥ బింకమున జూడరో పిరితీయక నేడు। అంకపుదనుజ సంహార సింహము।
వేంకటనగముపై వేదాచలముపై। కింకలేక వడి బెరిగిన సింహము॥

**244)కాంభోజి**

ప॥ ఏల రాడమ్మా యింతిరో వా-। డేలరాడమ్మా నన్నేలినవాడు॥

చ॥ పచ్చని పులుగుల బండిమీద నుండు। పచ్చవింటి పిన్నబాలుని తండ్రి।
పచ్చని చాయల బాయని బంగారు। పచ్చడముగట్టిన బాగైనవాడు॥

చ॥ తెల్లని పులుగుపై తిరుగ మరిగినట్టి। తెల్లని సతిపాలి దేవరతండ్రి।
తెల్లని పరపుపై తేలి పొరలువెట్టు। తెల్లని కన్నుల దెలివైనవాడు॥

చ॥ కొండవింటివాని గుత్తగొనినయట్టి। కొండుకప్రాయపు గూతురుతండ్రి।
కొండలరాయడు కోనేటి తిమ్మయ్య। కొండ తల నెత్తి గురుతైన వాడు॥

**245)కాంభోజి**

ప॥ దిబ్బలు వెట్టుచు దేలిన దిదివో। ఉబ్బు నీటిపై నొక హంస॥

చ॥ అనువున గమల విహారమె నెలవై। ఒనరియున్న దిదె ఒక హంస।
మనియెడి జీవుల మానస సరసుల। వునికి నున్న దిదె ఒక హంస॥

చ॥ పాలు నీరు నేర్పరచి పాలలో। నోలలాడె నిదె యొక హంస।
పాలుపడిన యీ పరమహంసముల। ఓలి నున్న దిదె యొక హంస॥

చ॥ తడవి రోమరంధ్రంబుల గ్రుడ్ల। నుడుగక పొదిగీ నొక హంస।
కడు వేడుక వేంకటగిరి మీదట। నొడలు పెంచెనిదె యొక హంస॥

**246)సాళంగనాట**

ప॥ అన్నిట నేరుపరిగా అలమేలు మంగ నీకు। చిన్నచిన్న ముద్దులనే విడిపించెను॥

చ॥ చనవు మెరసి నిన్ను సారెసారె చేరుకుని। మనసు దనియ నాపె మాటలాడెను।

కనుసన్న చూపులనె కప్పుర విడెములిచ్చె। దనువు దనియ నీపై తలబాలు వోసెను॥

చ॥ పన్నుగడ తొడనే పానుపు చేరువనే। కన్నులు దనియగ దగ్గర నిలచెను।
మన్ననలు దైవార మచ్చికలు పెడరేచి। విన్నవీనుల దనియ విన్నపాలు సేసెను॥

చ॥ మాగిన మోవి యిచ్చి మనసు గరచి యిట్టే। కౌగిలి దనియ నీకు కప్పె పయ్యెద॥
వీగక శ్రీవేంకటేశు వెలది గూడితివిట్టె। రాగి వయసి దనియ రతి కేళి సేసెను॥

**247) నాట**

ప॥ పారి నీకును విరిగి పోయిన దానవులు। బిరుదులుడిగి వోడ బేహారులైరి॥

చ॥ మకుటాలుతీసి జటామకుటాలు గట్టుకొని। వెకలిరిపులు ముని వేషులైరి।
మొకములను సోమపు మొకములు పెట్టుకొని। అకటా కొందరు రిపులాట వారైరి॥

చ॥ పేరులు విడిచి సంకుబేరులు మెడవేసుక। సారెకు కొందరు శివ సత్తులైరి।
బీరపు సాములు మాని పెద్దగడ సామునేర్చి। తోరపు బగతులెల్ల దొమ్మరులైరి॥

చ॥ నాదించ వెరచి సింగి నాదాలూదు కొంటాను। సోదించేరటాగొందరు జోగులైరి।
ఈదెస శ్రీవేంకటేశ యున్నియు మానికొందరు। దాదాతని శరణనీ దాసులైరి॥

**248) పాడి / కదనకుతూహలం**

ప॥ రావే కోడల రట్టడి కోడల। పోవే పోవే అత్తయ్యపొందులు నీతో చాలును॥

చ॥ రంకెలు వేయుచు రాజులెదుట నీవు। కొంకు కోసరు లేనికోడల।
పంకజ ముఖినీవు పలుదొడ్ల వారిండ్ల। అంకెల దిరిగేవు అత్తయ్యా॥

చ॥ ఈడాడ నలుగురు నేగురు మొగలతో। కూడి సిగ్గులేని కోడల।
వాడకబదుగురి వలపించు కొని నీవు। ఆడాడదిరి గేవు అత్తయ్యా॥

చ॥ బొడ్డున బుట్టిన పూపనికే నిన్ను। గొడ్డేరు తెస్తినే కోడల।
గుడ్డము పయినున్న కోనేటి రాయని। నడ్డగించు కుంటి నత్తయ్యా॥

**249) మాళవశ్రీ**

ప॥ ఇందుకుగా నాయెరగమి నేమని దూరుదును। అందియు నినునే దెలియక అయ్యోనేనిపుడు॥

చ॥ ఆతుమ లోన నుండి యఖిలోపాయములు। చేతనునకు నీవే చింతించగాను।
కాతుర పడి నేను కర్తననుచు బనులు। యాతల జెప్పగబూనే విస్సిరో॥

చ॥ తనువిటు నీవొసగి తగుభాగ్యము నీవై। అనువుగ జీవునినీ యటు నీవేలగను।
తనియక నేనొరులు దాతలనుచుబోయి। కనుగొని వేడగ దొడగేకటకటా॥

చ॥ శ్రీవేంకటాద్రిపై నుండి చేరి కన్నులెదుటను। సేవగొని యిటేకృపసేయ గాను।
సేవలగన్న వారెల్ల జుట్టములంట నేను। జీవులతోబొందు సేసేజెల్లబో॥

**250) ఆహిరి / శుభపంతువరాళి**

ప॥ విడువారా దెంతైన వెర్రివాడనైన నీకు। కడవారు నవ్వ కుండాగాచుకో నన్నును॥

చ॥ జ్ఞానమునే నెరుగ నజ్ఞానము నేనెరుగను। మానను విషయములు మరిగింతైనా।
నీ నామము నొడిగి నీ దాసుడ ననుకొందు। దీనినే వహించు కొని తిద్దుకో నన్నును॥

చ॥ అకర్మము నెరుగను సుకర్మము నెరుగను। ప్రకట సంసారముపై పాటు మానను।
వొకపని వాడవై పూని ముద్ర ధారినైతి। మొకమోడి యిందుకే గోమున నేలు నన్నును॥

చ॥ వెనుకగానను ముందు విచారించి కానను। నినుపై దేహ ధారినై నీకు మొక్కేను।
ఘనుడ శ్రీవేంకటేశ కన్నులెదుట బడితి। కనిపో విడువరాదు కరుణించి నన్నును॥

**251) బౌళి**

ప॥ ఇందిరా రమణుదెచ్చి యియ్యరో మాకిటువలె। పొంది యీతనిబూజింప బొద్దాయనిప్పుడు॥

చ॥ ధారుణి మైరావణు దండించి రాముదెచ్చి। నేరుపున మించిన యంజనీ తనయా।

ఘోరనాగ పాశముల గొట్టివేసీ యీతని। కారుణ్యమంది నట్టి ఖగరాజు గరుడా॥
చ॥ నానాదేవతలకు నరసింహగంభములో। పానిపట్టి చూపినట్టి ప్రహ్లాదుడా।
మానవుడై కృష్ణ మహిమల విశ్వరూపు। పూని బండి నుంచుకొన్న పోటు బండ యర్జునా॥
చ॥ శ్రీ వల్లభునకు నశేష కైంకర్యముల। శ్రీవేంకటాద్రివైన శేషమూరితీ।
కైవసమైన యట్టి కార్త వీర్యార్జునుడా యీ- । దేవుని నీవేల నిట్టితెచ్చి మాకు నియ్యరే॥

**252)భైరవి**

ప॥ గంధము పూసేవేలే కమ్మని మేనయీ। గందము నీ మేనితావి కంటి నెక్కుడా॥
చ॥ అద్దము చూచే వేలే అప్పటికిని। అద్దము నీ మోముకంటె నపురూపమా।
ఒద్దిక తామర విరి నొత్తేవు కన్నులు నీ। గద్దరి కన్నుల కంటె కమలము ఘనమా॥
చ॥ బంగారు పెట్టేవేలే పడతి నీమెయినిండా। బంగారు నీతనుకాంతి ప్రతివచ్చీనా॥
ఉంగరాలేటికి నే వొడికపు వేళ్ళ। వెంగలి మణుల నీ వేలిగోరబోలునా॥
చ॥ సవర మేటికినే జడియు నీనెరులకు। సవరము నీకొప్పుసరి వచ్చీనా।
యివలజవులు నీకు నేలే వేంకటపతి। సవరని కెమ్మోవి చవికెంటేనా॥

**253)ముఖారి**

ప॥ ఇదిగాక సౌభాగ్యమిదిగాక తపము మరి। యిదిగాక వైభవం బికనొకటి కలదా॥
చ॥ అతివ జన్మము సఫలమై పరమ యోగివలె। నితర మోహాపేక్షలిన్నియును విడచె।
సతి కోరికలు మహాశాంతమై యిదెచూడ। సతత విజ్ఞాన వాసన వోలె నుండె॥
చ॥ తరుణి హృదయము కృతార్థతబొంది విభుమీది। పరవశానంద సంపదకు నిరవాయి।
సరసిజాసన మనోజయమంది యింతలో। సరి లేక మనసు నిశ్చల భావమాయ॥
చ॥ శ్రీవేంకటేశ్వరుని జింతించి పరతత్త్వ। భావంబు నిజము గాబట్టి జెలియాత్మ।
దేవోత్తముని కృపాధీనురాలై యిపుడు। లావణ్యవతికి నుల్లంబు తిరుమాయ॥

**254)సామంతం**

ప॥ నిందలేని పతివిదె నీవు నాసొమ్ము। కందువ సొమ్ముల మీద గలిగెను సొమ్ము॥
చ॥ సూటిగా నీవు చూచేటి చూపు నాసొమ్ము। పాటించి నీవు పలికే పలుకు నాసొమ్ము।
కూటమి రతుల కొనగోరు నాసొమ్మును। యీటున నీమేని సొమ్ము లిఛ్ఛెవు నాకు॥
చ॥ చవిగా నాడే నీ సరసము నాసొమ్ము। జవకట్టక యిచ్చే నీచనువు నాసొమ్ము।
నవకమైన నీ నవ్వు నాసొమ్ము। యివల నింకా సొమ్ములిచ్చేవు నాకు॥
చ॥ కింకలేని దిది నీకౌగిలి నాసొమ్ము। లంకెలైన నీమతి వలపు నాసొమ్ము।
అంకెల శ్రీవేంకటేశ అట్టె నన్నుగూడితివి। యింకా సొమ్ములిచ్చేవు యెన్నియైన నీవు॥

**255)రామక్రియ**

ప॥ ఆకెవో నాప్రాణ మోహనపు రాణి। దాకొని వేవేలు కాంతలలోన నున్నది॥
చ॥ ముదిత కురులనెల్లా ముత్యములు మాణిక్యాలు। గుదిగుచ్చి కలుగంటు గొన్నది।
సదరపు పసిడి వజ్రాలచనుకట్టుది। అదెపైడి పూవుల పయ్యెద వల్లెవాటుది॥
చ॥ పచ్చలు దాచిన యట్టి పాదుకలు మెట్టినది। లచ్చన మొగవుల మొలనూళ్ళది।
అచ్చపు టుంగరముల అందెలు బాయవట్టాలు। గుచ్చుల ముంజేతుల కంకణ సూడిగేలది॥
చ॥ నానాభూషణముల నానా సింగరాల। పానిపట్టి నాదిక్కేతప్పక చూచేది।
ఆనకపుశ్రీవేంకటాద్రి పతినైన నన్ను। తానె వచ్చి కూడి నాదగ్గరనె వున్నది॥

**256)శ్రీరాగం**

ప॥ పిడికిట తలంబ్రాల పెండ్లి కూతురు కొంత। పడమరలి నవ్వీనె పెండ్లి కూతురు॥
చ॥ పేరుకల జవరాలె పెండ్లి కూతురు పెద్ద। పేరుల ముత్యాల మేడ పెండ్లి కూతురు।

పేరంటాండ్ల నడిమి పెండ్లి కూతురు విభు। పేరుకుచ్చు సిగ్గువడీ బెండ్లి కూతురు॥

చ॥ బిరుదు పెండము వెట్టె బెండ్లి కూతురు నెర। బిరుదు మగని కంటె బెండ్లి కూతురు।
పిరిదూరి నప్పుడే పెండ్లి కూతురూ పతి। బెరరేచీ నిదివో పెండ్లి కూతురు॥

చ॥ పెట్టినే పెద్ద తురుము పెండ్లి కూతురు నేడె। పెట్టెడు చీరలు గట్టి పెండ్లి కూతురు।
గట్టిగ వేంకటపతి కౌగిటను। పెట్టిన నిధానమయిన పెండ్లి కూతురు॥

**257) శ్రీరాగం**

ప॥ ఈ పాదమే కదా యిల యెల్లగొలిచినది। ఈ పాదమే కదా యిందిరా హస్తముల కితవైనది॥

చ॥ ఈ పాదమే కదా యిందరును మ్రొక్కెడిది। యీపాదమే కదా యీ గగన గంగ పుట్టినది।
యీపాదమే కదా యెలమి బొంపొందినది। యీపాదమే కదా యిన్నిటికి నెక్కుడైనది॥

చ॥ ఈ పదమే కదా యిభరాజు దలచినది। యీపదమే కదా యింద్రాదు లెల్ల వెదకినది।
యీపాదమే కదా యీబ్రహ్మ కడిగినది। యీపాదమే కదా యెగసి బ్రహ్మాండ మంటినది॥

చ॥ ఈ పాదమే కదా యిహపరము లొసగెడిది। యీపాదమే కదా యిల నహల్యకు గోరికైనది।
యీపాదమే కదా యీక్షింప దుర్లభము। యీపాదమే కదా యీ వేంకటాద్రిపై నిరవైనది॥

**258) శుద్ధ వసంతం**

ప॥ నిచ్చనిచ్చ సోబనాలు నెలమూడు సోబనాలు। హెచ్చునీకు నింతలోను ఇవి గదవయ్యా॥

చ॥ చెలియ మొహములే సేసపాలు। వెలచు సిగ్గులే మీకు పెండ్లితెర।
కలగోను చూపులే కంకణాలు। సులబాన నీకు నబ్బె సుఖియించవయ్యా॥

చ॥ మగువ మాటలే నీకు మంత్రాలు। పొగరు మోవి తేనెలు బువ్వాలు।
వెగటు బొమ్మ జంకెలే విడేలు। జిగినీకు నేడబ్బె చిత్తగించ వయ్యా॥

చ॥ కాంత సరసములే కప్పురాలు। పొంతనున్న కుచములే పూజకుండలు।
చెంతల గూడితి విట్టె శ్రీవేంకటేశా యివి। సంతస మాయను నీకు జయమందవయ్యా॥

**259) శంకరాభరణం**

ప॥ పొడగంటిమయ్య మిమ్ము పురుషోత్తమా, మమ్ము। నెడయకవయ్య కోనేటిరాయడా॥

చ॥ కోరి మమ్ము నేలినట్టి కులదైవమా, చాల। నేరిచి పెద్ద లిచ్చిన నిధానమా।
గారవించి దప్పిదీర్చు కాలమేఘమా, మాకు। చేరువ జిత్తములోని శ్రీనివాసుడా॥

చ॥ భావింప గైవసమైన పారిజాతమా, మమ్ము। చేవదేర గాచినట్టి చింతామణీ।
కామించి కోరికలిచ్చే కామధేనువా, మమ్ము। తాపై రక్షించేటి ధరణీధరా॥

చ॥ చెడనీక బ్రదికించే సిద్ధమంత్రమా, రోగా-। లడచి రక్షించే దివ్యౌషధమా।
బడి బాయక తిరిగే ప్రాణబంధుడా, మమ్ము। గడియించినట్టి శ్రీవేంకటనాథుడా॥

**260) గుండక్రియ**

ప॥ దేవునికి దేవికిని తెప్పల కోనేటమ్మ। వేవేల మొక్కులు లోకపావని నీకమ్మా॥

చ॥ ధర్మార్థకామ మోక్షతతులు నీ సోపానాలు। అర్మిలి నాలుగువేదాలదె నీ దరులు।
నిర్మలపు నీ జలము నిండు సప్తసాగరాలు। కూర్మము నీ లోతు వోకోనేరమ్మా॥

చ తగని గంగాది తీర్థమ్ములు నీకడళ్ళు। జగతి దేవతలు నీ జల జంతును।
గగనపు బుణ్యలోకాలు నీ దరిమేడలు। మొగి నీచుట్టు మాకులు మునులోయమ్మా॥

చ॥ వైకుంఠ నగరము వాకిలే నీ యాకారము। చేకొను పుణ్యములే నీ జీవభావము।
యేకడను శ్రీవేంకటేశుడే నీ వునికి। దీకొని నీ తీర్థమాడితిమి కావవమ్మా॥

**261) వరాళి**

ప॥ వేంకటగిరి గోవిందుడా। యింకా నొకరో యిద్దరో మీరు॥

చ॥ పచ్చలు దాచిన బాహుపురులతో। అచ్చపు గరముల అందముతో।

అచ్చలు నిచ్చలు నలరుదురిదివో। నిచ్చలు నీవో నీవో కానీ॥
చ॥ నిలుచుండుటయును నెరి బవళింపుచు। నలరుటయును మీరటునిటును।
జలజాక్షులు దొడ చరచగ నొరపుల। వెలయగ నిద్రో విభవమిదో॥
చ॥ తిరువేంకటగిరి దిగువ తిరుపతిని। పరమానందపు బహుసిరులు।
అరుదుగ బొందుచు అధికము లందుచు। ఉరగశయనుడవొ వొడయడవో॥

**262)మోహన**

ప॥ ప్రలపనవచనైః ఫలమిహకిం। చల చల కుడ్య క్షాళనయాకిం॥
చ॥ ఇతర వధూమోహితం త్వాంప్రతి। హితవచనై రిహ ఫలమివోకిం।
సతతం తవానుసరణ మిదం మమ। గతజల సేతుకరణ మిదానీం॥
చ॥ వికల వినయ దుర్విటం త్వా ప్రతి। సుకుమారాద్రస్తుత్యాకిం।
ప్రకట బహల కోపనం మమతే। సకలం చర్విత చర్వత చర్వణమేవ॥
చ॥ శిరసానత సుస్థిరం త్వాంప్రతి। విరసాలాపన విధి నాకిలం।
తిరువేంకటగిరి దేవత్వదీయ। విరహ విలసనం వృథా చరణం॥

**263)దేసాక్షి**

ప॥ ఎవ్వరివాడో ఈ దేహి। యివ్వల నవ్వల నీ దేహి॥
చ॥ కామించు నూరకే కలవియు లేనివి। యేమిగట్టుకొనె నీ దేహి।
వాములాయ నిరువదియొక వావులు। యేమని తెలిసెనో యీ దేహి॥
చ॥ కందువ నిజములు గల్లలునడపి। యెందుకు నెక్కెనో యీ దేహి।
ముందర నున్నవి మొగిదనపాట్లు। యిందె భ్రమసీ నీ దేహి॥
చ॥ పంచేంద్రియముల పాలాయ జన్మము। యించుక యెరుగడు యీదేహి।
అంచెల శ్రీవేంకటాధీశ నీకృప। వంచగ గెలిచెను వడి నీ దేహి॥

**264)దేవగాంధారి**

ప॥ ఈ జీవునకు నేది గడపల తనకు। నేజాతియును లేక యిట్లున్నవాడు॥
చ॥ బహుదేహ కవచముల బొరవేసినవాడు। బహుస్వతంత్రముల నాపదనొందినాడు।
బహుకాలముల మింగి పరవశంబైనవాడు। బహు యోనికూపములబడి వెడలినాడు॥
చ॥ పెక్కుబాసలు నేర్చి పెంపుమిగిలినవాడు। పెక్కునామములచే బిలువబడినాడు।
పెక్కుకాంతలతోడ పెక్కుపురుషులతోడ। పెక్కులాగుల బెనగి చెండుపడినాడు॥
చ॥ ఉండనెన్నడు దనకు ఊరటెన్నడులేక। యెండలకు నీడలకు యెడతాకినాడు।
కొండలలో నెలకొన్న కోనేటిరాయని। యండ జేరెదననుచు నాసపడినాడు॥

**265)దేవగాంధారి**

ప॥ కలిగినమతి వృథాగాకుండా। అలరుటె పుణ్యంబగు ఫలము॥
చ॥ ఒనరిన ఈ భవ ముసు రనకుండ। ఘనుడే జీవుడు గల ఫలము।
తనువుమోచి చైతన్యాత్ముని మతి। గనుటే వివేకముగల మతి॥
చ॥ చేసిన పుణ్యము చెడిపోకుండ। శ్రీసంపద మెరసిన ఫలము।
ఈసుల రేసుల యితర దూషణల। బొసుటె అపురూపపు ఫలము॥
చ॥ హరి గొలిచియు మిథ్యగాకుండ। విరసముడిచి చదివిన ఫలము।
తిరువేంకటగిరి దేవుని సరిగా। పరుల గొలవనిదె బహుఫలము॥

**266)శుద్ధవసంతం**

ప॥ ఘను డీతడొకడు గలుగగగదా వేదములు। జననములు గులము లాచారములు గలిగె॥
చ॥ కలుషభంజను డితడు గలుగగగదా జగతి। గలిగె నిందరిజన్మగతులనెలవు।

మలసి యితడొకడు వొడమగగదా యిందరికి। నిలువ నీడలు గలిగె నిధినిధానములై॥
చ॥ కమలాక్షు డితడు గలుగగగదా దేవతలు। గుమిగూడి రిందరును గండిగడచి।
ప్రమదమున నితడూ నిలుపగగదా సస్యములు। అమర ఫలియించె లోకానందమగుచు॥
చ॥ గరిమె వేంకటవిభుడొకడు గలుగగగదా। ధరయు నభమును రసాతలము గలిగె।
పరమాత్ముడితడు లోపల గలుగగగదా। అరిది చవులును హితవు లన్నియును గలిగె॥

**267)భైరవి**

ప॥ చూడు డిందరికి సులభుడు హరి- । తోడునీడయగుదొరముని యితడు॥
చ॥ కైవల్యమునకు గనకపుతాపల- । త్రోవై శ్రుతులకు దుదిపదమై।
పావన మొకరూపమై విరజకు। నావైయున్నాడిదె యితడు॥
చ॥ కాపాడగ లోకములకు సుజ్ఞాన- । దీపమై జగతికి దేజమై।
పాపా లడపగ భవపయోధులకు। తేపైయున్నాడిదే యితడు॥
చ॥ కరుణానిధిరంగపతికి గాంచీ- । వరునకు వేంకటగిరిపతికి।
నిరతి నహోబలనృకేసరికి ద- ।త్పరుడగు శఠగోపముని యితడు॥

**268)మాళవి / కురంజి**

ప॥ బాపు దైవమా మాపాలిభవమా। తీపు రాకాసినెత్తురు దీం దోందోం దోందోం దోందోం॥
చ॥ కాలనేమిపునుకిది కంచువలె లెస్స వాగీ। తాళ మొత్తరే తత్త తత తత్తత్త।
కాలమెల్ల మాభూతగణమెల్ల వీడె కాచె। నేలబడి నేడును ధీం ధీం ధీం ధీం ధీం ధీం ధీం॥
చ॥ పగగొని మానక పచ్చినెత్తు రెప్పుడును। తెగి కొను దానె తిత్తి తిత్తి తిత్తితి।
తగుమహోదరువీవు ధణధణమని వాగీ। బిగియించరో తోలు బింభిం బింభిం బింభింభిం॥
చ॥ మురదనుజనిపెద్దమొదలియెముక దీసి। తురులూదరే తుత్తు తుత్తు తుత్తుత్తు।
తిరువేంకటగిరిదేవుడు గెలిచిన స- । మరమునను మమ్మ మమ్మ మమ్మ మమ్మమ్మ॥

**269)ఆహిరి**

ప॥ తోరణములే దోవెల్లా। మూరట బారట ముంచినలతల॥
చ॥ కూరిమిమటములు గోపురంబులును। తేరుపడగెలే తెరువెల్లా।
కోరినపండ్లుగురి సేటితరువులు। తోరములైన వెదురుజొంపములు॥
చ॥ ఆటలు దిరుపులు నందపుటురుపులు। పాటలు వనవైభవమెల్లా।
కూటువనెమళ్ళ కోవిలగుంపుల।పేటల దేటలపెనుగూటములు॥
చ॥ వింజామరలును విసనకర్రలును। గొంజెగొడుగులే కొండెల్లా।
అంజనగిరిరాయడు వేంకటపతి। సంజీవని పరుషల కొదవగను॥

**270)భూపాళం**

ప॥ ఎమో తెలిసెగాని యీజీవుడు। నేమంపునెరవిద్య నేరడాయ॥
చ॥ కపటాలె నేరిచెగానీ జీవుడు। యెపుడైనా నిజసుఖ మెరుగడాయ।
కపురులే చవిగొనెగానీ జీవుడు। అపరిమితామృత మానడాయ॥
చ॥ కడలనే తిరిగీగానీ జీవుడు। నడుమ మొదలు జూచి నడవడాయ।
కడుపుకూటికే పోయీగానీ జీవుడు। చెడనిజీతముపొంత జేరడాయ॥
చ॥ కనియు గానకపోయగానీ జీవుడు। దివము వేంకటపతి దెలియడాయ।
కనుమాయలనె చొక్కెగానీ జీవుడు। తనియ నిట్టే మంచిదరి జేరడాయ॥

**271)సామంతం**

ప॥ ఆదిదైవుడై అందరిపాలిటి- । కీ దేవుడై వచ్చె నితడు॥
చ॥ కోరినపరమయోగులచిత్తములలోన। యేరీతినుండెనో యీతడు।

చేరవచ్చినయాశ్రితులనెల్ల బ్రోవ। యిరీతి నున్న వాడీతడు॥
చ॥ కుటిలదానవుల కోటానుగోట్ల। యెటువలె ద్రుంచెనో యీతడు।
ఘటియించి యిటువంటికారుణ్యరూపుడై। యిటువలె నున్న వా డితడు॥
చ॥ తక్కక బ్రహ్మాండతతులెల్ల మోచి తా- । నెక్కడ నుండెనో యీతడు।
దిక్కుల వెలసినతిరువేంకటేశుడై। యిక్కడ నున్న వాడీతడు॥

**272) కల్యాణి**

ప॥ పరమ పురుష హరి పరాత్పర। పరరిపు భంజన పరిపూర్ణ నమో॥
చ॥ కమలా పతి కమల నాభ కమలాసన వంద్య। కమల హితానంత కోటి ఘన సముదయ తేజా।
కమలామల పత్రనేత్ర కమలవైరి వర్ణగాత్ర । కమలషట్క యోగీశ్వర హృదయతేహం నమో నమో॥
చ॥ జలనిధి మథన జలనిధి బంధన జలధి మధ్య శయనా। జలధి యంతర విహార మచ్ఛకచ్ఛప యవతారా।
జలనిధి జామాత జలనిధి శోషణ జలనిధి సప్తకగమన। జలనిధి కారుణ్య నమో తేహం జలనిధి గంభీర నమో నమో॥
చ॥ నగధర నగరిపు నందిత నగచర యూథపనాథా। నగ పారిజాత హర సారస పన్నగ పతిరాజ శయనా।
నగకుల విజయ శ్రీవేంకట నగ నాయక భక్త విధేయా। నగధీరాహంతే సర్వేశ్వర నారాయణ నమో నమో॥

**273) దేవగాంధారి**

ప॥ ఒరసి చూడబోతే నొకటీ నిజము లేదు। పొరల మేను ధరించి పొరలగ బట్టెను॥
చ॥ పాతకములటకొన్ని బలు పుణ్యాలట కొన్ని। యీతల స్వర్గనరకాలిచ్చేనట।
యేతుల నందుగొన్నాళ్ళు యిందు గొన్నాళ్ళు దేహికి। పోతరించి కాతరించి పొరలనే పట్టెను॥
చ॥ పొలతులట కొందరు పురుషులట కొందరు। వెలుగును జీకట్లు విహారమట।
కలవరింతలుగొంత ఘన సంసారము గొంత। పొలసి జీవులు రెంటా బొరలగ బట్టెను॥
చ॥ ఒక్కవంక జ్ఞానమట వొక్కవంక గర్మమట। మొక్కి యిహపరాలకు మూలమిదట।
తక్కక శ్రీవేంకటేశు దాసులై గెలిచిరట। పుక్కిట నిన్నాళ్ళు రెంటా బొరలగ బట్టెను॥

**274) మణిరంగు**

ప॥ ఏది చూచిన తమకు యిన్నియును నిటువలెనె। వేదు విడిచిన కూడు వెదికినను లేదు॥
చ॥ ఏకాంత సౌఖ్యములు ఎక్కడివి ప్రాణులకు। పై కొన్న దుఃఖముల పాలుపడి గాకా।
ఏకమగు పుణ్యంబు లేడగల విందరికి। గై కొన్న దురితములు కలపాటి గాక॥
చ॥ హితవైన మమకార మెందుగల దిందరికి। ప్రతిలేని విరహ తాపము కొలది గాకా।
మతిలోని వేడుకలు మరియేవి మనుజులకు। జితమైన దైవ మిచ్చిన పాటిగాక॥
చ॥ ఇరవైన దైవ కృప ఏల దొరకును తమకు। పరమైన కర్మంబు పరిపాటి గాక।
ఎరవైనపెను బంధమేల వీడును నాత్మ। తిరు వేంకటేశు కృప తిరమైన గాక॥

**275) వరాళి**

ప॥ చూడ జూడ మాణిక్యాలు చుక్కలవలె నున్నవి। యీడులేని కన్నులెన్నులవె యినచంద్రులు॥
చ॥ కంటి గంటి వాడె వాడె ఘనమైనముత్యాల। కంటమాలలవే పదకములు నవె।
మింటిపొడవై నట్టిమించుగిరీటం బదె। జంటల వెలుగు శంఖచక్రాలవె॥
చ॥ మొక్కు మొక్కు వాడె వాడె ముందరనే వున్నాడు। చెక్కులవే నగవుతో జిగిమోమదె।
పుక్కిట లోకములవె భుజకీర్తులును నవె। చక్కనమ్మ అలమేలు జవరాలదె॥
చ॥ ముంగైమురాలును నవె మొల కఠారును నదె। బంగారునిగ్గులవన్నె పచ్చబట్టదె।
ఇంగితమెరిగి వేంకటేశుడిదె కన్నులకు। ముంగిట నిధానమైన మూలభూత మదే॥

**276) నాదరామక్రియ**

ప॥ ఈకెకు నీకు దగు నీడు జోడులు। వాకుచ్చి మిమ్ము బొగడ వసమా యొరులకు॥
చ॥ జట్టిగొన్న నీదేవులు చంద్రముఖి గనక। అట్టె నిన్ను రామచంద్రుడనదగును।

చుట్టమై కృష్ణయ్యపు చూపుల యాపె గనక। చుట్టుకొని నిన్ను కృష్ణుడనదగును॥
చ॥ చందమైన వామలోచని యాపెయౌగనక। అందరు నిన్ను వామనుడనదగును।
చెంది యాకె యెప్పటికిని సింహ మధ్య గనక। అంది నిన్ను నరసింహుడని పిల్వదగును॥
చ॥ చెలువమైన యాపె శ్రీదేవి యగుగనక। అల శ్రీవత్సుడవని యాడదగును।
అలమేల్మంగ యహిరోమావళి గలదిగన। యిల శేషాద్రి శ్రీవేంకటేశు డనదగును॥

**277) పాడి**

ప॥ చెలులాల యీమేలు చెలువుడే చూచుగాని। యెలమి తోడుత మొక్కి యెరిగించరే॥
చ॥ వనిత జవ్వనపు వసంతకాలములోనే। వెనుకొని విరహపు వేసవి మించె।
ననిచె బెంజెమట వానకాలము నంతలోనె। వినయముతో బతికి విన్నవించరే॥
చ॥ కాంత పులకల శరత్కాలము నదె తోచె। చింతల మంచులతో హేమంతము ముంచె।
చెంత గోర్కులెన్నులెత్తి శిశిరవేళ యేతెంచె। యింతకు నీకె విభుని దోడి తేరె॥
చ॥ చెలియకు గొప్పవీడె చీఅటికాలము నందె। నెలకొన సిగ్గుల వెన్నెలకాలము।
అలమె శ్రీవేంకటేశుడంతలోనె తానెవచ్చె। పిలిచి సారెకునిట్టె ప్రేమరేచరే॥

**278) ముఖారి**

ప॥ దొరకెగా పూజ కందువ పూజ నీ। విరహపు తనుతావి విరవాది పూజ॥
చ॥ కలికి నీ కనుచూపు కలువరేకుల పూజ। లలన నీ నగవు మొల్లల పూజ।
తలపోత చింత చిత్తపు గమలపు పూజ। చలివేడి వూర్పు నీ సంపంగి పూజ॥
చ॥ కనుల జెక్కిన జేయి కరపల్లవపు పూజ। తను పులకలు జాజి ననల పూజ।
తనరు నీ వలపులు దొంతర పూవుల పూజ। యెనయు జెమట మల్లె మొగ్గల పూజ॥
చ॥ చెనకు నీగోళ్ళే చిరి గేదగుల పూజ। గునియు గుబ్బలు పూవు గుత్తుల పూజ।
ఘనతమై గూడి వేంకటపతి మోము సో- । కిన నీదు మోవి మంకెన పూవు పూజ॥

**279) దేశి**

ప॥ నవరసములదీ నళినాక్షి। జవకట్టి నీకు జవిసేసీని॥
చ॥ శృంగార రసము చెలియ మొకంబున। సంగతి వీరరసము గోళ్ళ।
రంగగు కరుణరసము పెదవులను। అంగపు గుచముల నద్భుత రసము॥
చ॥ చెలి హాస్యరసము చెలవుల నిండీ। పలుచని నడుమున భయరసము।
కలికి వాడుగన్నుల భీభత్సము। అల బొమ జంకెనల నదె రౌద్రంబు॥
చ॥ రతి మరపుల శాంతరసంబదె। అతి మోహము పదియవరసము।
ఇత్వుగ శ్రీవేంకటేశ కూడితివి సతమై యీపెకు సంతోస రసము॥

**280) ఖరహరప్రియ / నాదరామక్రియ**

ప॥ నెలత చక్కదనమే నిండు బండారము నీకు। గలిగె గనకలక్ష్మీ కాంతుడవైతివి॥
చ॥ పడతి నెమ్మోమునకు బంగారు కళలుదేరీ। వెడలేసెలవి నవ్వే వెండిగనులు।
అడియాలమగు మోవినదె పగడపుదీగె। నిడువాలుదనమే నీలముల రాశి॥
చ॥ తరుణి పాదపు గోళ్ళు తళుకుల వజ్రములు। పరగు జేతిగోళ్ళె పద్మరాగాలు।
అంది కన్నుల తేటలాణి ముత్తెపు సరులు। సరి బచ్చల కొండలు చనుమొనలు॥
చ॥ చెలితేనె మాటలు జిగి బుష్యరాగాలు। వలపు తెరసిగ్గులు వైడూర్యాలు।
తొలకు ననురాగాలే దొడ్డ గోమేధికాలు। కలసితికెను శ్రీవేంకటేశు కౌగిటను॥

**281) హుసేని / శుద్ధరామక్రియ**

ప॥ అన్నిరాసుల యునికి యింతి చెలువపు రాశి। కన్నె నీ రాశి కూటమి గలిగిన రాశి॥
చ॥ కలికి బొమ విండ్లుగల కాంతకును ధనురాశి। మెలయు మినాక్షికిని మీనరాశి।

కులుకు కుచకుంభముల కొమ్మకును కుంభరాశి। చెలగు హరిమధ్యకును సింహరాశి॥
చ॥ చిన్ని మకరంకపు బయ్యెద చేడెకు మకరరాశి। కన్నె పాయపు సతికి కన్నెరాశి।
వన్నెమైపైడి తులదూగు వనితకు దులారాశి। తిన్నని వాడి గోళ్ళ సతికి వృశ్చికరాశి॥
చ॥ ఆముకొని నొరపుల మెరయు నతివకు వృషభరాశి। గామిడి గుట్టుమూల సతి కర్కాటకరాశి।
కోమలపు చిగురుమోవి కొమలికి మేషరాశి।ప్రేమ వేంకటపతి గలిసె ప్రియ మిథునరాశి॥

**282) బౌళి**

ప॥ సేసపెట్టవయ్యా యిట్టి చెలిమీదను। ఆసలమీకిద్దరికి నన్నిటా నమరును॥
చ॥ గ్రక్కన జెట్టవట్టితే కంకణము వంటిదాపె। దక్కి వురమెక్కితేను తాళి వంటిది।
మొక్కలాన దొడ దొక్కితే మొలనూలు వంటిది। అక్కజమై నీకు నాపె నన్నిటా నమరును॥
చ॥ చేరి విన్నవించితే చెవి పోగుల వంటిది। నీరతికి వద్దనుంటే నీడవంటిది।
కోరి పానుపుపై పెండ్లి కూతురు వంటిదేపొద్దు। ఆరీతి ఆపెకు నీకు నన్నిటా నమరును॥
చ॥ పాదాల సేవ సేసితే పావకోళ్ళ వంటిది। సోదించి చూచితేను సొమ్ము వంటిది।
యీదెస శ్రీవేంకటేశ యింతి నీవు గూడితివి। ఆదిగొని నీకు నాపె కన్నిటా నమరును॥

**283) ద్విజావంతి / సాళగభైరవి**

ప॥ ఒకటి బోలిచిన వేరొకటి తోచీని। సకలము బోలిచేము సుదతి సింగారాలు॥
చ॥ కలువలు జకోరాలు గండుమీలు దామరలు। చలిముత్తెపు జిప్పలు సతికన్నులు।
అలలు నీలమణులంధకారము మేఘము। నలుపు రాశివో నలినాక్షి తురుము॥
చ॥ జక్కవలు నిమ్మపండ్లు సరి బూగుత్తులు గొండ। లెక్కువ మరిమిద్దెలు యింతి చన్నులు।
చుక్కలు సురవొన్నలు సూది వజ్రాల గోళ్ళు। అక్కర యేనుగ తోండాలరంట్లే తొడలు॥
చ॥ సోగ తీగెలు తూండ్లు సుదతి బాహువులిదె। చేగ చిగురు లత్తిక చెలి పాదాలు।
యీగతి శ్రీవేంకటేశ యింతి నీవురము మీద। బాగుగ నమరిపైడి పతిమ బోలినవి॥

**284) సాళంగనాట / మోహన**

ప॥ సతి చక్కదనమెంతో సరసుని మోహమెంతో। చతురలింక సరి జూడరమ్మా॥
చ॥ కాంత కన్నులు వ్రాసి కడలు వ్రాయగ రాక। చింత తోడ దలవంచె జెలి విభుడు।
పంతపు నడుము వ్రాసిబయలు వ్రాయగ రాక। కొంత దడ వుస్సురనె గోమలి ప్రాణేశుడు॥
చ॥ కలికి కుచాలు వ్రాసి కఠినము వ్రాయలేక। తలపోయ దొడగె బంతపు విభుడు।
నళినాక్షి మోము వ్రాసి నవ్వులు వ్రాయగరాక। నిలువున వెరగందె నెలత రమణుడు॥
చ॥ వనిత కౌగిట దన్ను వ్రశి రతి వ్రాయలేక। తనువెల్ల మరచెను తమకమున।
వెనక ముందర వ్రాసి వేడుక వ్రాయగరాక। చినుకు జెమట వ్రాసె శ్రీవేంకటేశుడు॥

**285) కాపి**

ప॥ నిన్ను బాసినయట్లు నెలతకు వియోగదశ। లెన్నడును దోప విదియేమోకాని॥
చ॥ నిను దలచి లలితాంగి నీరూపమాత్మలో। గని నీవు సవి బయలు కౌగలించినది।
తనర నాకాశ తత్త్వము నీమహాత్త్వమని। వనిత యెవ్వరి చేత వినెనో కాని॥
చ॥ నిను బొగడి నీరూపు కనుదోయి కెదురైన। తనివిదీరక బయలు తగ జూడ దొడగె।
మునుకొన్న సర్వతోముఖుడ వనగా నిన్ను। వెనకకే భావమున వినెనోకాని॥
చ॥ తలపునను వాక్కునను తలప దలపగ నీవు। కలసి యాకమలాక్షి గౌగలించితివి।
తెలిసితిమి వేంకటాధిపతి నీ విన్నింట। గలవనెడి మాట నిక్కంబులో కాని॥

**286) కేదారగౌళ**

ప॥ వేసరించేదానగాను వేగినంతా నిన్నును। రాశికెక్క మీకృపనే రతి జెలగుదును॥
చ॥ నట్టనడుమనే నీవు నావాడవై వుంటేజాలు। అట్టే నే నెంతటి నైనా నౌదును।

గుట్టుతోడ నీవునాకు గొలువిచ్చితే జాలు। నెట్టన లోకమునకు నేనే రాజౌదును॥
చ॥ కందువ నీవు నన్ను గన్నుల జూచితేజాలు। అందపు సిరుల నోలలాడుదును।
మందలించి నాతో నొక మాటలాడితే చాలు। పందెమాడి నీచే తుదిపదము చేకొందును॥
చ॥ చేరి శ్రీవేంకటేశ్వరసెలవి నవ్వితే జాలు। కోరి నీవలపులకు గురి యౌదును।
సారె నలమేల్మంగను సతి నీకు నైతే జాలు। మేరతో గూడితిని మేలెల్లా సాదింతును॥

**287) కల్యాణి**

ప॥ ఎవ్వరికిగలదమ్మ యింత సౌభాగ్యము। యివ్వల నీతో సరి యెంచరాదే నొరుల॥
చ॥ వీడిన తురముతోడ విరులపైపై రాల। వాడిక కన్నులతోడ వచ్చేనేమి॥
చ॥ వడియు జెమటతోడ వత్తివంటి మోవితోడా। నడపు మురిపెములతోడ నవ్వేవేమే॥
చ॥ నిద్దుర కన్నులతోడ నిండుబులకలతోడ। ముద్దుగారే మోముతోడ మురిసేవేమే।
వొద్దనే శ్రీవేంకటేశుడొగిగూడు తెరుగమే। ముద్దురాల నేడు నీ మోహ మెంచరాదే॥

**288) దేసాళం**

ప॥ మేడలెక్కి నిన్ను జూచి కూడెననే యాసతోడ।
వాడు దేరి వుస్సురందురా వెంకటేశ॥
అప॥ యాడానుంటి విందాకనురా॥
చ॥ పిక్కటిల్లు చమ్ములపై చొక్కపు నీ వుంగరము।
గక్కన నే నద్దుకొందురా వెంకటేశ।
లక్కవలె ముద్ర లంటెరా॥
చ॥ నిండ బూచిన మావిపై గండు గోవిల గూయగా।
నిండిన నీయెలు గంటాను వెంకటేశ।
అండకు నిన్ను రమ్మంటినా॥
చ॥ నీవు వలచిన వలపు- లాకలొత్తె నామతిని।
వాకున నేజెప్ప జాలరా వెంకటేశ।
లోకమెల్ల నెరిగినదే॥
చ॥ పాయము నీకొకనికే చాయగా మీదెత్తితిని।
యీయెడ గైవాలకుండాను వెంకటేశ।
మాయింటనే పాయకుండరా॥
చ॥ ముమ్మాటికి నీ బాసలే నమ్మివున్నదాన నేను।
కుమ్మరించరా నీకరుణ వెంకటేశ।
చిమ్ము జీకటెల్ల బాయను॥

**289) బౌళి**

ప॥ పసిడి చీరవాడావు పాలు దచ్చితివి గాన। పసిడి బోలినది చేపట్టెను నీ కరము॥
చ॥ తొలుతనే చందురుని తోడబుట్టు గనుక। పొలుపు జందురు మోము పోలికైనది।
కళల చింతామణి కందువ చెల్లెలు గాన। తళుకుమానికపు దంతముల బోలినది॥
చ॥ మంచి యైరావతముతో మగువ సైదోడు గాన। ముంచిన కరిగమనము బోలినది।
పంచల బారిజాతపు భావపు సోదరి గాన। యెంచగ చిగురుబోలె నీకె పాదములు॥
చ॥ తామెర తొట్టెలలోన తగిలి తానుండు గాన। తామెర కన్నులబోలి తనరినది।
యీమేర నిన్నిటాబోలి యిన్ని లక్షణములతో। నీమేన శ్రీవేంకటేశ నెలవై నిల్చినది॥

**290) రామక్రియ**

ప॥ విచ్చేయవమ్మా వెన్నెలబొమ్మా। మచ్చిక మరుని ఢాక మగువ నీ రాక॥

చ॥ పంచల పసిండి నిగ్గు పచ్చిదేరె సిగ్గు। వంచన వలపు తీపు వాలుక చూపు।
కంచపుం బొలకూడు కాకల నీవాడు। మంచపు నీ తలబ్రాలు మట్టెల పాదాలు॥

చ॥ కోవిల కొసరుబాట కొమ్మరో నీమాట। తావుల చెంగావి నీ తళుకు మోవి।
గోవ జవ్వాది కరంగు గుబ్బల నీ మెరంగు। భవజుడాడి రొదలు పొఅద్పు నీ కదలు॥

చ॥ ముద్దుల నీ నగవు చిమ్ముల రతి బిగవు। అద్దలింపు గసరు మోహంపు గొసరు।
గద్దరి నీ యలపు వెంకటపతి తలపు। అద్దపు నీ మోము మోహన రతిసాము॥

**291)దేవగాంధారి**

ప॥ మిక్కిలి మేలుది అలమేలుమంగ। అక్కరతో నిన్ను జూచీ నలమేలుమంగ॥

చ॥ కొచ్చి కొచ్చి యాలాపించి కూరిమితో బాడగాను। మెచ్చీ నిన్నునిదె యలమేలుమంగ।
నెచ్చెలులతోడ నెల్లా నీగుణాలు సారె సారె। అచ్చలాన నాడుకొనీ నలమేలుమంగ॥

చ॥ వాడల వాడల నీవు వయ్యాళి దోలగాను। మేడలెక్కి చూచీ నలమేలుమంగ।
వీడెము చేతబట్టుక వెస నీవు పిలువగా। ఆడనుండి వచ్చె నీకడ కలమేలుమంగ॥

చ॥ ఈలీల శ్రీవేంకటేశ ఇంత చనవియ్యగాను। మేలములాడీ నలమేలుమంగ।
యేలిన నీ రతులను ఇదె తన నేరుపెల్లా। ఆలోచనలు సేసీ నలమేలుమంగా॥

**292)సాళంగనాట**

ప॥ మెరుగు వంటిది యలమేలుమంగ। అరిమురి నవ్వీని అలమేలుమంగ॥

చ॥ పలుచని యెలుగున బాడీ నీ మీది పాట। మెలుపు గూరిమి నలమేలుమంగ।
చెలులతో నీ సుద్ది చెప్పిచెప్పి కరగీని। అలయుచు సొలయుచు నలమేలుమంగ॥

చ॥ ఈడుగా నీ రాకకు నెదురెదురుచూచీ। మేడ మీద నుండి యలమేలుమంగ।
వాడు మోముతో నీపై వలపు చల్లి చల్లి। ఆడీ నాట్యము సారె నలమేలుమంగ॥

చ॥ పేరుకొని పిలిచీని ప్రియములు చెప్పి చెప్పి। మేరమీర నిన్ను నలమేలుమంగ।
యీరీతి శ్రీవేంకటేశ నిన్ను గూడె నేడు। ఆరితేరి నన్నిటాను అలమేలుమంగ॥

**293)లలిత**

ప॥ కలదింతె మాట కంతుని యాట। తెలుసుకో నీలోనిదియె పూట పూట॥

చ॥ అలమేలుమంగా హరియంతరంగా। కలితనాట్యరంగ కరుణాపాంగ।
చెలువుడు వీడె చేకొను నేడె। వలరాజు తూపులివి వాడిమీద వాడి॥

చ॥ అలినీలవేణి యంబుజ పాణి। వెలయంగ జగదేక విభునిరాణి।
కలయు నీపతి వచ్చె గక్కన నిన్నిదె మెచ్చె। పలికీని చిలుకలు పచ్చిమీదబచ్చి॥

చ॥ సిత చంద్రవదనా సింగారసదనా। చతుర దాడిమ బీజచయరదనా।
యితవైన శ్రీవేంకటేశుడు నిన్నిదె కూడె। తతి దలపోతలు తలకూడెగూడె॥

**294)సామంతం**

ప॥ ఎంత జాణరో యీకలికి। కాంతుడ నీ భోగములకే తగునూ॥

చ॥ చెలి నీ కౌగిట చెమటలజేసెను। చలువగ నిప్పుడు జలకేళి।
అలరుచు గుచముల నదుముచు జేసెను। పలుమరు ముదముల బర్వతకేళి॥

చ॥ పైపై బెనగుచు బాహులతలనే। వైపుగ జేసెను వనకేళి।
చూపుల నీపయి సొలయుచు జేసెను। పూప వసంతము పూవులకేళి॥

చ॥ అరుదుగ నట్టివి యధరామృతముల। సరిజేసెను భోజనకేళి।
కరగుచు శ్రీవేంకటేశ నేసేను। పరగిన రతులనె పరిణయ కేళి॥

**295)శ్రీరాగం**

ప॥ చిత్తజు వేడుకొనరే చెలియలా। తత్తరించి పతిమీది తలపోత నున్నది॥

చ॥ అతివపై మదనుడు అనలాస్త్రమేయబోలు। కతలుగ విరహాగ్నిగాగీనదే।
యితవుగా వరుణాస్త్రమేయబోలు నప్పటిని। తతి జెమటవానల దడియుచునున్నది॥
చ॥ అమరగ నంతలో వాయవ్యాస్త్రమేయబోలు। వుమరబడి నిట్టూర్పులొగి రేగెను।
జమళిగూడగ నట్టి శైలాస్త్రమేయబోలు। భ్రమసి చనుగొండలు బాయిటగాన్పించెను॥
చ॥ మునుకొని పంతాన సమ్మోహనాస్త్రమేయబోలు। మనసు పరవశాన మరపందెను।
అనిశము రక్షగా నారాయణాస్త్రమేయబోలు। ఘన శ్రీవేంకటేశుడు కాగిటిలోగూడెను॥

**296) బౌళి**

ప॥ అన్నిటా భాగ్యవంతుడవుదువయ్యా। పన్నినందుకల్లా వచ్చు భామ నీకు నిపుడు॥
చ॥ పడాతి మోహరసము పన్నీటి మజ్జనము। కడలేని యాపెసిగ్గు కప్పురకాపు।
నిడుద కన్ను చూపులు నించిన తట్టు పునుగు। తొడిబడ సులభాన దొరకె నీకిపుడు॥
చ॥ కామిని కెమ్మోవికాంతి కట్టుకొనే చంద్రగావి। ఆముకొన్న మోహకళలాభరణాలు।
దోమటి మాటల విందు ధూప దీప నైవేద్యాలు। కామించి నటువలెనె కలిగె నీకిపుడు॥
చ॥ అలమేలుమంగ నవ్వులంగపు నవ్వు దండలు। కలసి వురాన నీకే కట్టిన తాళి।
చలపట్టి యీకె రతి సకల సంపదలు। యిలవచ్చె శ్రీవేంకటేశ నీకు నిపుడు॥

**297) వరాళి**

ప॥ నెలమూడు శోభనాలు నీకు నతనికిదగు। కలకాలమును నిచ్చకల్యాణమమ్మా॥
చ॥ రామనామమతనిది రామవు నీవైతేను। చామన వర్ణమతడు చామవు నీవు।
వామనుడందురతని వామనయనవు నీవు। ప్రేమపుమీ యిద్దరికి పేరుబలమొకటే॥
చ॥ హరి పేరాతనికి హరిణేక్షణవు నీవు। కరిగాచెదాను నీవు కరియానవు।
సరి జలధిశాయి జలధికన్యవు నీవు। బెరసి మీయిద్దరికి బేరుబలమొకటే॥
చ॥ జలజ నాభుడతడు జలజముఖివి నీవు। అలమేలుమంగవు నిన్నేలమెదాను।
ఇలలో శ్రీవేంకటేశుడిటు నిన్ను రానమోచె। పిలిచి పేరుచెప్పెబేరుబలమొకటే॥

**298) శ్రీరాగం**

ప॥ చెల్లునంటా వచ్చివచ్చి చెట్టా పట్టేవు। తొల్లియు నెందరి నిట్టే దొమ్ముల బెట్టితివో॥
చ॥ ఆపరాని తమకాన నానచేసేగాక యింత। మాపుదాణ నీ తోడి మాటలేలరా-।
దాపరాని మదన ముద్రలు మేననవే నీకు। నేపుచు భ్రమల బెట్టి యెవ్వతె సేసినవో॥
చ॥ ఉండలేక నీవద్దనే వుసురంటి గాక యింత। బండు బండు సేసిన యీప్రాణమేలరా।
వుండుగాగ జిత్తమెల్లా ఒక్కజేసితివి నా। యండనుండే యెవ్వతెకు నమ్ముడు వోయితివో॥
చ॥ తనివొక నిన్నింత దగ్గర నిచ్చితి గాక। చనువున నిన్ను జేయి చాచనిత్తునా।
ఘనుడు వేంకటరాయ కమ్మని యీవిరులు। మునుప నెచ్చతో నీపైముడిచి వేసినవో॥

**299) ఆహిరి**

ప॥ కామించి నీవరుగగలయు నాయకుడ నే-। డేమి భాగ్యము సేసెనే తరుణి॥
చ॥ కాగిన గుబ్బల మీద కమ్మజెమటలదొప్ప। దోగిన పయ్యెద కొంగు దూలగును।
వేగైన కొప్పున క్రొవ్విరులు దురిమి విర్ర-। వీగుచు నీవెటు వొయ్యేవే తరుణి॥
చ॥ ఒప్పైన శిరసు మీదగుప్పరించిన జవ్వాది। చిప్పిలి చెక్కుల వెంటబొందగను।
అప్పళించిన కస్తూరిలప్పలు రాలగ నీ-। విప్పుడెక్కడికి నేగేవో తరుణి॥
చ॥ వీడినది మొలనూలు విరుల చెదరె కొంత। వాడినది కెమ్మోని వన్నెలై।
ఈడులేని తిరువేంకటేశుడిదె నిన్ను గూడె। యీాడ గొత్తలివి యేటివే వోతరుణి॥

**300) హుసేని**

ప॥ పొద్దికనెన్నడు వొడుచునో పోయిన చెలిరాదాయను। నిదుర కంటికిదోపదు నిముషం బొకడు॥

చ॥ కన్నుల నవ్వేడి నవ్వులు గబ్బితనంబులు మాటలు। నున్నవి యొయ్యారంబులు నొచ్చిన చూపులును।
విన్నదనంబుల మరపులు వేడుక మీరిన యలపులు। సన్నపు జెమటలుదలచిన ఝల్లనె నామనసు॥
చ॥ ఆగిన రెప్పల నీరును నగ్గలమగు పన్నీటను। దోగియుందోగాని భావము దోచిన పయ్యెదయు।
కాగిన దేహపుసెకలను కప్పిన పువ్వుల సోరబులు। వేగిని చెలితాపమునకు వెన్నెల మండెడిని॥
చ॥ దేవ శిఖామణి తిరుమల దేవునిదలచిన బాయక। భావించిన యీకామిని భాములోపలను।
ఆ విభుడే తానుండిక నాతడె తానెరుగగవలె। నావెలదికిగల విరహంబేమని చెప్పదము॥

**301) బలహంస**

ప॥ వింతలేల సేసేవే విభుడు నీకు నితడు। చెంత నీ మతి యాతని చిత్తముగాదా॥
చ॥ చిప్పిల మోవి ఇమ్మంటే సిగ్గువడనేటికే। చొప్పున నివి యాతని సొమ్ముగాదా।
కొప్పునీకు బెట్టేనంటే గొణగగ నేటికే। యెప్పుడూ నితని సేస కిరవుగాదా॥
చ॥ చన్నులు చూపుమంటేను జంకించ నేటికే। పన్ని యీతనికి చేపట్లు గావా।
పన్నీట నోలార్చే నంటే పలు నవ్వులేటికే। అన్నిటా నీమెనితని కరుడు తీగెకాదా॥
చ॥ మొలనూలు వెట్టరాగా మొక్కేవిదేటికే। పొలుపు శ్రీవేంకటేశు పొలముగాదా।
అలరి నిన్నురమెక్కుమనగా గొంకనేటికే। నెలత నీవే యతని నిండు సొమ్ముగాదా॥

**302) ఆహిరి / హిందోళ**

ప॥ మోహంపు రతిముదము ముద్దుజూపుల మదము। దేహంపు సొబగెల్లదెలిపె సదమదము॥
చ॥ మించు మట్టెల గిలుకు మెరుగు గుబ్బల కులుకు। వంచు జూపుల చిలుకు వసివాడు బలుకు।
మంచుజెమటల తళుకు మనసు లోపలి యళుకు। అంచుటదరపు బెళుకు అలమేటి జళుకు॥
చ॥ కరమూలములగరగు కదలు బయ్యెద చెరగు। సిరుల చెలువపు మొరగు చెక్కుపై మరగు।
గరిగరికె తతులెరుగు ఘాతలంటిన తెరగు। గరిమతో చెలియునికి కప్పురపుటరగు॥
చ॥ కలికి తనము పోగు కమ్మదావుల వేగు। వలపు తమకముల పరవశము పెనుజాగు।
కలకంటి బాగు వేంకటపతి జెలరేగు। చెలియ సమరతుల మించిన వింతబాగు॥

**303) గుండక్రియ**

ప॥ కడు జంచలములు కడు నధ్రువములు। కడునల్పములని కాదందురు॥
చ॥ కర్మబోధవికారంబులు। ధర్మతంత్రసంధానములు।
దుర్మదైకసందోహములు। కర్మదూరులివి గాదందుదురు॥
చ॥ పరమభాగవతభవ్యమతులు। పరమబోధసంభావకులు।
తిరువేంకటగిరిదేవుసేవకులు। కరుణాధికులివి గాదందురు॥

**304) లలిత**

ప॥ పనిలేనిధనవాంఛ బడిపొరలిన నిట్టి-। కనుమాయలేకాక కడ నేమిగలదు॥
చ॥ కనుచూపుకాకల గలయట వెడయాస-। లనుభవింపుటగాక యందేమిగలదు।
తనువల్లిసోకుల దగులుట మమతల-। నెనయగోరుటగాక యిందేమిగలదు॥
చ॥ ఎలమి నధర మానుటెరిగి యెంగిలి నోర-। నలుముకొనుట గాక యందేమిగలదు।
పలులంపటములచే బడుట దుఃఖంబులు। తలజుట్టుటేకాక తనకేమి గలదు॥
చ॥ శ్రీవేంకటాద్రీశు జేరనిపనులెల్ల। నేవగింతలేకాక యిందేమిగలదు।
ఆవల సురతభోగ మనుభవింపబోయి। రావలయుటగాక రచనేమిగలదు॥

**305) దేసాక్షి / భైరవి**

ప॥ ఒప్పులై నొప్పులై వుండుగాన। అప్పటికి జూడ నదియేకా నిజము॥
చ॥ కన్నుల కిన్నియు జూడ కలలై వలలై। వున్నతాలు నడ్డాలై వుండుగాన।
చిన్నచిన్న చిటిపొటి చిమ్ముదొమ్ముదిమ్ములవి। వున్నవన్నియు జూడ నొకటేకా నిజము॥

****************************************************************************************************

చ॥ సారెకు నోరికి జూడ చవులై నవ్వులై। పూరటమాటలై వుండుగాన।
తారుమారు తాకుసోకు తప్పుదోపులన్నియు। వోరపారులేనివెల్ల నొక్కటేకా నిజము॥

చ॥ మేనికి నిన్నియు జూడ మృదువై పొదువై। పూని సంపదలై వుండుగాన।
తేనై తీపై తిరువేంకటేశ నిన్ను। కానవచినదే నొక్కటేకా నిజము॥

**306)నాట**

ప॥ మందులేదు దీనికి మంత్రమేమియు లేదు। మందు మంత్రము దనమతిలోనే కలదు॥

చ॥ కదలకుండగ దన్ను గట్టివేసిన గట్టు। వదలించుకొన గొంత వలదా।
వదలించబోయిన వడిగొనిపైపైనే। కదియుగాని తన్ను వదలదేమియును॥

చ॥ మనసులోపలనుండి మరి మీద దానుండి। యెనసినతిరువేంకటేశుని।
తనరినతలపున దలప దుష్కృతములు। తనకుదానే వీడు దలకవలదుగాన॥

**307)కన్నడగౌళ**

ప॥ ఆటవారి గూడితౌరా॥

అనుప॥ ఆటవారిగూడి అన్నిచోట్ల బొమ్మ-।
లాట లాడించ నధికుండవైతివి॥

చ॥ గురుతరమగు పెద్ద కొట్టాములోపల।
తిరుమైన పెనుమాయ దెరగట్టి।
అరయ నజ్ఞానములవి యడ్డముగజేసి।
పరగ సుజ్ఞానదీపములు ముట్టించి॥

చ॥ తోలుబొమ్మల దొరకొని గడియించి।
గాలిచేత వాని గదలించి।
తూలేటి రసములు తొమ్మిది గడియించి।
నాలుగుముఖముల నలువున నాడించ॥

చ॥ నిన్నే మెత్తురుగాని నీకేమి నీలేరు।
మన్నించుదాతలు మరి లేరు।
యెన్నగ దిరువేంకటేశ్వర నీదాసు-।
లున్నతులై నిన్ను నుబ్బించి పొగడగ॥

**308)సామంతం**

ప॥ సతతం శ్రీశం। హితం పరాత్పర మీడే॥

చ॥ గదాధరం మేఘగంభీరని-। నదం పరమోన్నతశుభదం।
మృదుతరగమనం మేదినీధరం। హృదయనిలయ మహ మీడే॥

చ॥ నందకధరం జనార్దనం గో-। విందం చారుముకుందం।
నందగోపవరనందనకందం। యిందురవినయన మీడే॥

చ॥ గరుడగమన మురగశయన మధికం। పరమపదేశం పావనం।
తిరువేంకటగిరిదేవ మతులం మ-। హిరమణం స్థిర మీడే॥

**309)ఆహిరి**

ప॥ ఇన్నిలాగులచేత లివియపో కడు-। నెన్నికకెక్కిన చేతులివియపో॥

చ॥ గునియుచు దనునెత్తికొమ్మని తల్లిపై-। నెనయజాచిన చేతులివియపో।
కినిసి గోవర్ధనగిరి వెల్లగించిన। యినుమువంటి చేతులివియపో॥

చ॥ పిసికి పూతకిచన్ను బిగియించిపట్టిన। యిసుమంతలు చేతులివియపో।
పసుల గాచుచు గొల్లపడచుల యమునలో। యిసుకచల్లిన చేతులివియపో॥

చ॥ పరమచైతన్యమై ప్రాణులకెల్లను। యెరవులిచ్చిన చేతులివియపో।
తిరువేంకటగిరి దేవుడై ముక్తికి- । నిరవుచూపెడు చేతులివియపో॥

**310) లలిత**

ప॥ ఆశాబద్ధుడనై యలసి నిన్ను గడు- । గాసి బేట్టినవాడ గాను॥

చ॥ ఘనకర్మపరుడనై కర్మరూపుని జేయ। నిను దూరి భారము నీకు గట్టినవాడ గాను।
పనిలేని దుఃఖలంపటుడనై దుఃఖము। గనుపించకుమని కడు వేడినవాడ గాను॥

చ॥ శ్రీవేంకటగిరిదేవేశ నాకిది। గావలెననువాడ గాను।
కావలసినయవి గదిసిన నవి నాకు। గావనుమనుజుండ గాను॥

**311) లలిత**

ప॥ మనసున నెప్పుడు మానదిది। దినబాధెటువలె దీరీనో॥

చ॥ చిత్తవికారము జీవులపాపము। తత్తరపరచక తడయదిది।
కత్తులబో నీకాయపువయసున- । నెత్తినమదమున కేదిగతో॥

చ॥ అసలుగంబ మీయాశాదోషము। విసిగిన నూరక విడువదిది।
వసులమూట మోవగ బడవేయగ। వసము గాని దెటువలెనౌనో॥

చ॥ పాముచెలిమి రంపపుసంసారము। గాములమోచినగంప యిది।
కామించుచు వేంకటపతి దలపక। యేమరి వుండిన నేమౌనో॥

**312) పాడి / హరికాంభోజి**

ప॥ చక్రమా హరిచక్రమా। వక్రమైనదనుజుల వక్కలించవో॥

చ॥ చుట్టిచుట్టి పాతాళముచొచ్చి హిరణ్యాక్షుని। చట్టలు చీరిన వోచక్రమా।
పట్టిన శ్రీహరిచేత బాయక యీజగములు। వొట్టుకొని కావగదవో వోచక్రమా॥

చ॥ పానుకొని దనుజులబలుకిరీటమణుల। సానలదీరిన వోచక్రమా।
నానాజీవముల ప్రాణములుగాచి ధర్మ- । మూని నిలుపగదవో వోచక్రమా॥

చ॥ వెరచి బ్రహ్మాదులు వేదమంత్రములని- । పురట్లు గొనియాడే రోచక్రమా।
అరిమురి దిరువేంకటాద్రీశు వీథుల। వొరవుల మెరయుదువో వోచక్రమా॥

**313) రామక్రియ**

ప॥ కుడుచుగాక తనకొలదిగాని మేలు। దడవీనా నోరు తగినయెంతయును॥

చ॥ చంపవచ్చిన కర్మసంగ్రహంబగు బుద్ధి। గంప గమ్మక తన్ను గాచీనీ।
పంపుడు దయ్యమై బాధ బెట్టెడుయాస।కొంపలోన నుండ నీగోరీనా॥

చ॥ శ్రీవేంకటగిరి శ్రీనాథుడిందరి। గావబ్రోవగ నున్నఘనుడు।
దేవోత్తముని నాత్మ దెలియ కితరములయిన। త్రోవ లెన్నిన మేలు దొరికీనా॥

**314) ముఖారి**

ప॥ ఎట్టు దరించీ నిదె యీజీవుడు। బట్టబయలుగా బరచీ నొకటి॥

చ॥ చెడనిమట్టిలో జేసినముద్దే। నడుమ ముంచుకొన్నది నొకటి।
తడియనినీరై తడివొడమింపుచు। పడిసీని వేవుర వడితో నొకటి॥

చ॥ పాయనితనుదీపనములుగా నటు। చేయుచు మది వేచీ నొకటి।
కాయపుచుట్టరికమ్ములు చేయుచు। రేయిబగలు విహరించీ నొకటి॥

చ॥ ఇన్నియు దానే యేచి కపటములు। పన్నీ నిదె లోపల నొకటి।
వెన్నెలచూపుల వేంకటేశ నిను। యెన్నికతో గడు నెదిరీ నొకటి॥

**315) బౌళి**

ప॥ చెదరక వెలుగే చేనుమేయగజొచ్చె। అదలించి తగదు నీకనువారు వేరీ॥

********************************************************************************

చ॥ చిత్త మింద్రియములచే జిక్కి కడు మద- । మెత్తిన వద్దన నిక వేరీ।
హత్తినమనసు మోహాదులతో గూడి। తత్తరించిన మాన్పదగువారు వేరీ॥

చ॥ జీవుడిన్నిటికి దాజిక్కి పోయినత్రోవ। బోవజొచ్చిన బుద్ధిపాలమేది।
శ్రీవేంకటేశుని చింతాపరత గాని। కావగ నాత్మకు గతి దానేది॥

**316)పాడి / ఆభోగి**

ప॥ ఏటికి నెవ్వరిపొందు యిస్సిరో చీచీ। నాటకములాల చీచీ నమ్మితిగా మిమ్మును॥

చ॥ జవ్వనమదమ చీచీ చక్కదనమరో చీచీ। రవ్వైన రాజసగర్వమరో చీచీ।
కొవ్వినమదమ చీచీ కూరిమియాసరో చీచీ। నవ్వులదేహమ చీచీ నమ్మితిగా మిమ్మును॥

చ॥ ముచ్చటమమత చీచీ ముచ్చుమురిపెమ చీచీ। బచ్చురవణములోనిబచ్చన చీచీ।
తెచ్చుకోలు తాలిములదిట్టతనమరో చీచీ। పుచ్చినపోకరో చీచీ పోయగా మీకాలము॥

చ॥ సిరులచీకటి చీచీ సిలుగుసంపద చీచీ। పరవిభవమ చీచీ వాసిరో చీచీ।
కరుణించె దిరువేంకటగిరిపతి నన్ను। విరసవర్తన చీచీ వీడెగా మీభారము॥

**317)భైరవి**

ప॥ సడిబెట్టె గటకటా సంసారము చూడ। జలధిలోపలియీత సంసారము॥

చ॥ జమునోరిలో బ్రదుకు సంసారము చూడ। చమురుదీసినదివ్వె సంసారము।
సమయించుబెనుదెవులు సంసారము చూడ। సమరంబులో నునికి సంసారము॥

చ॥ సందిగట్టినతాడు సంసారము చూడ। సందికంతలతోవ సంసారము।
చందురునిజీవనము సంసారము చూడ। చంద మేవలెనుండు సంసారము॥

చ॥ చలువలోపలివేడి సంసారము చూడ। జలపూతబంగారు సంసారము।
యిలలోన దిరువేంకటేశ నీదాసులకు। చలువలకు గడుచలువ సంసారము॥

**318)మాళవి / సావేరి**

ప॥ అది నాయపరాధ మిది నాయపరాధ- । మదియు నిదియు నాయపరాధము॥

చ॥ నెరయ రూపములెల్ల నీరూపమేకా- । నరయనియది నాయపరాధము।
పరిపూర్ణుడగునిన్ను బరిచ్ఛిన్నునిగా- ।నరయుట యది నాయపరాధము॥

చ॥ జీవాత్మునిగా జింతింప దలచుట। యేవంక నది నాయపరాధము।
సేవించి నిను నాత్మ జింతింపకుండుట। ఆవల నిది నాయపరాధము॥

చ॥ ఈడెరగక వేంకటేశుడ నిను గొని- । యాడుట యది నాయపరాధము।
యేడ జూచిన నాయెదుర నుండగ నిన్ను- । నాడనీడ వెదకుటపరాధము॥

**319)ముఖారి / దేశి**

ప॥ శ్రీశోऽయం సుస్థిరోऽయం। కౌశికమఖరక్షకోऽయం॥

చ॥ నిగమనిధినిర్మలోऽయం। జగన్మోహనసతీపతి- ।
విగత భయోऽయం విజయసఖోऽయం। భృగుముని సంప్రీతోऽయం॥

చ॥ సకలపతి శ్శాశ్వతోऽయం। శుకముకమునిజనసులభోऽయం।
ప్రకటబహుళశోభనాధికోऽయం। వికచరుక్మిణీవీక్షణోऽయం॥

చ॥ సరసోऽయం। పరిసరప్రియోऽయం। తిరువేంకటాధిపోऽయం।
చిరంతనోऽయం చిదాత్మకోऽయం। శరణాగతవత్సలోऽయం॥

**320)శుద్ధవసంతం / బిలహరి**

ప॥ కిం కరిష్యామి కిం కరోమి బహుళ- । శంకాసమాధానజాడ్యం వహామి॥

చ॥ నారాయణం జగన్నాథం త్రిలోకైక- । పారాయణం భక్తపావనం।
దూరీకరోమ్యహం దురితదూరేణ సం- । సారసాగరమగ్న చంచలత్వేన॥

********************************************************************************

చ॥ తిరువేంకటాచలాధీశ్వరం కరిరాజ- । వరదం శరణాగతవత్సలం।
పరమపురుషం కృపాభరణం న భజామి। మరణభవదేహాభిమానం వహామి॥

**321) కురంజి**

ప॥ మందరధర మధుసూదన। నందగోపనందనా॥

చ॥ నరసింహ గోవింద నవనీతానంద। హరిముకుంద నయనారవింద।
కరివరద గరుడగమనరూప- । గురుచాపా యదుకులదీపా॥

చ॥ భవదూర భయహర పరిపూర్ణామృత। భువనపాలన సురపాలన।
భువనభూషణ పరమపురుష పురాతన। నవభోగా కరుణాయోగా॥

చ॥ పంకజాసననుత భవ్యనిర్మలపాద- । పంకజ పరమ పరాత్పర।
వేంకటశైలనివేశ శు- । భంకరా క్షేమంకరా॥

**322) లలిత**

ప॥ దైవమా పరదైవమా। యేవగింతలు నాకు నెట్టు దెచ్చేవో॥

చ॥ పాపకర్ముని దెచ్చి పరమియ్యదలచిన। మేపులకే పోక మెయికొనీనా।
తీపులు రూపులు దివిరి నావెనువెంట- । నేపొద్దు నీవేడ దెచ్చేవో॥

చ॥ అధమాధముని దెచ్చి యధికుని జేసేనంటే। విధినిషేధములు వివరించునా।
నిధినిధానములు నిచ్చనిచ్చలు బెక్కు- । విధముల నెటువలె వెదచల్లెదవో॥

చ॥ అతికష్టుడగునాకు నలవిగానియీా- । మత మొసగిన నేను మరిగేనా।
ప్రతిలేని వేంకటపతి నీదునామా- । మృత మిచ్చి నను నీవే మెరయింతుగాక॥

**323) శ్రీ / రాగమాలిక**

ప॥ నమో నారాయణాయ। నమో నారాయణాయ॥

అనుప॥ నారాయణాయ సగుణబ్రహ్మణే సర్వ-। పారాయణాయ శోభనమూర్తయే నమో॥

చ॥ నిత్యాయ విబుధసంస్తుత్యాయ నిత్యాధి- । పత్యాయ మునిగణ ప్రత్యయాయ।
సత్యాయ ప్రత్యక్షాయ సన్మానససాం- । గత్యాయ జగదావనకృత్యాయ తే నమో॥

చ॥ ఆక్రమోద్ధతబాహువిక్రమాతిక్రాంత- । శుక్రశిష్యోన్మూలనక్రమాయ।
శక్రాదిగీర్వాణవక్రభయభంగని- । ర్వక్రాయ నిహతారిచక్రాయ తే నమో॥

చ॥ అక్షరాయాతినిరపేక్షాయ పుండరీ- । కాక్షాయ శ్రీవత్సలక్షణాయ।
అక్షీణవిజ్ఞానదక్షయోగీంద్రసం- । రక్షానుకంపాకటాక్షాయ తే నమో॥

చ॥ కరిరాజవరదాయ కౌస్తుభాభరణాయ। మురవైరిణే జగన్మోహనాయ।
తరుణేందుకోటిరతరుణీ మనస్స్తోత్ర- । పరితోషచిత్తాయ పరమాయ తే నమో॥

చ॥ పాత్రదానోత్సవప్రథిత వేంకటరాయ। ధాత్రీశకామితార్థప్రదాయ।
గోత్రభిన్మణిరుచిరగాత్రాయ రవిచంద్ర- । నేత్రాయ శేషాద్రినిలయాయ తే నమో॥

**324) కన్నడగౌళ / కేదారగౌళ**

ప॥ నీమహత్త్వంబు లోనికి వెలుపలికి గప్పి। కామింప నిట్టిదని కానారా దటుగాన॥

చ॥ నిండి యిన్నిటిలోన నీవు గలవని భ్రాంతి- । నుండుదువుగాని నీ వొకటియును గావు।
దండిగలగిరి ప్రతిధ్వని దోచుగాని యది। కొండలోపల లేదు కొండయును గాదు॥

చ॥ బలసి యిన్నిటిలోపలను జైతన్యమై। మెలగుదువుగాని యేమిట నీవు లేవు।
పలుదెరగులైన దర్పణమునం దొకనీడ। వొలయుగాకందు దలపోయ నదిలేదు॥

చ॥ వుడుగకన్నిటిలోన నుండుటయు లేదు నీ- । వుడివోయి యందుండకుండుటయు లేదు।
చెడనితేజముగాన శ్రీవేంకటేశ నీ- । పొడవు పరిపూర్ణమై పొలుపొందు॥

**325) శ్రీరాగం**

ప॥ జడమతిరహం కర్మజంతురేకో2హం। జడధినిలయాయ నమో సారసాక్షాయ॥
చ॥ పరమపురుషాయ నిజభక్తజనసులభాయ। దురితదూరాయ సింధురహితాయ।
నరకాంతకాయ శ్రీనారాయణాయ తే। మురహరాయ నమో నమో॥
చ॥ నగసముద్ధరణాయ నందగోపసుతాయ। జగదంతరాత్మాయ సగుణాయ।
మృగనరాంగాయ నిర్మితభవాండాయ ప-। న్నగరాజశయనాయ నమో నమో॥
చ॥ దేవదేవేశాయ దివ్యచరితాయ బహు-। భావనాతీతాయ పరమాయ।
శ్రీవేంకటేశాయ జితదైత్యనికరాయ। భూవల్లభాయ నమో పూర్ణకామాయ॥

**326) బౌళి**

ప॥ అరుదరుదు నీమాయ హరిహరీ। అరసి తెలియరాదు హరిహరీ॥
చ॥ అనంత బ్రహ్మాండములవె రోమకూపముల। అనంతములై వున్నవి హరిహరీ।
పొనిగి కుంగినవొక్క భూమి నీవెత్తినది యే-। మని నుతింతు నిన్ను హరిహరీ॥
చ॥ పొదిగి బ్రహ్మాదులు నీబొడ్డున నేకాలము। అదివో పుట్టుచున్నారు హరిహరీ।
పొదలి యీజీవుడు పుట్టించే యీసామర్థ్యము। అదన నేమనిచెప్పే హరిహరీ॥
చ॥ పావన వైకుంఠము నీపాద మూలమందున్నది। ఆవహించే భక్తిచేత హరిహరీ।
శ్రీవేంకాటాద్రి మీదచేరి నీవిట్టె వుండగా-। నావల వెదకనేల హరిహరీ॥

**327) గుండక్రియ**

ప॥ ఎవ్వరు గర్తలుగారు యిందిరానాథుడే కర్త। నివ్వటిల్లాతనివారై నేమము దప్పకురో॥
చ॥ కర్మమే కర్తయితే కడకు మోక్షము లేదు। అర్మిలి జీవుడు గర్తయైతే బుట్టుగేలేదు।
మర్మపుమాయ గర్తయితే మరి విజ్ఞానమేలేదు। నిర్మితము హరిదింతే నిజమిదెరుగరో॥
చ॥ ప్రపంచమే కర్తయితే పాపపుణ్యములు లేవు। వుపమ మనసు గర్తైయుంటే నాచారమేలేదు।
కపటపు దేహములే కర్తలయితే చావులేదు। నెపము శ్రీహరిదింతే నేరిచి బ్రదుకరో॥
చ॥ పలుశ్రుతులు గర్తలై పరగితే మేరలేదు। అల బట్టబయలు గర్తైతే నాధారము లేదు।
యెలమి నిందరికి గర్త యిదివో శ్రీవేంకటాద్రి-। నిలయపుహరి యింతే నేడే కొలువరో॥

**328) లలిత / బలహంస**

ప॥ అటువంటివాడువో హరిదాసుడు। ఆటమాటలు విడిచినాతడే సుఖి॥
చ॥ తిట్టేటిమాటలును దీవించేమాటలును। అట్టే సరెయని తలచినాతడే సుఖి।
పట్టిచంపేవేళను పట్టముగట్టేవేళ। అట్టునిట్టు చలించని యాతడే సుఖి॥
చ॥ చేరి పంచదారిడిన జేదు దెచ్చిపెట్టినాను। ఆరగించి తనివొందే యతడే సుఖి।
తేరకాండ్ల జూచిన తెగరానిచుట్టముల। నారయ సరిగాజూచే యాతడే సుఖి॥
చ॥ పొంది పుణ్యము వచ్చిన పోరి బాపము వచ్చిన-। నందలి ఫలమొల్లని యాతడే సుఖి।
విందుగా శ్రీవేంకటాద్రి విభునిదాసుల జేరి। అందరానిపద మందిన నాతడే సుఖి॥

**329) భైరవి**

ప॥ నీవేమి సేతువయ్య నీవు దయానిధి వందువు। భావించలేనివారి పాపమింతే కాని॥
చ॥ పరమపద మొసగి పాపమడచేనని। చరమశ్లోకమునందు చాటితివి తొలుతనె।
నిరతిని భూమిలోన నీవల్ల దప్పులేదు। పరగ నమ్మనివారి పాపమింతే కాని॥
చ॥ నీపాదములకు నాకు నెయ్యమైన లంకెని। యేపున ద్వయార్థమున నియ్యకొంటివి తొలుత।
దాపుగా నీవల్ల నింక దప్పలేదు యెంచిచూచి। పైపై నమ్మినవారి పాపమింతే కాని॥
చ॥ బంతి బురాణములను భక్తసులభుడ నని। అంతరాత్మ నీమాట ఆడితివి తొలుతనే।
ఇంతట శ్రీవేంకటేశ యేమిసేతువయ్య నీవు। పంతాన నమ్మినవారి పాపమింతే కాని॥

**330) శంకరాభరణం**

******************************************************************************************

ప॥ నెరవాది సాహసులు నిత్యశూరులు। దురిత విదూరులు ధృవాదులు॥
చ॥ తక్కక శ్రీహరిభక్తితపాలుసేసి యెక్కిరి। చక్కగా వైకుంఠము సనకాదులు।
వొక్కట విష్ణుకథలు వోడసేసుక దాటిరి। పెక్కు సంసారజలధి భీష్మాదులు॥
చ॥ కడువిరక్తి యనేటి కత్తులనే నరకిరి। నడుమ భవపాశముల నారదాదులు।
బడినే హరిదాసులపౌజులు గూడుకొనిరి। నుడివడ కిహమందే శుకాదులు॥
చ॥ పరమశాంతములనే పట్టపేనుగులమీద॥ వరుసల నేగేరు వ్యాసాదులు।
సిరుల శ్రీవేంకటేశు జేరి సుఖము బొందిరి। బెరసి దాస్యమున విభీషణాదులు॥

**331) మలహరి**

ప॥ ఎట్టయినా జేయుము యిక నీచిత్తము। కిట్టిన నీ సంకీర్తనపరుడ॥
చ॥ కొందరు జ్ఞానులు కొందరు భక్తులు। కొందరు వైరాగ్య కోవిదులు।
యిందరిలో నే నెవ్వడ గానిదె। సందడి హరి నీశరణాగతుడ॥
చ॥ జపితలు గొందరు శాస్త్రులు గొందరు। ప్రపత్తి గొందరు బలువులు।
వుపమించగ నిన్నొకడా గానిందు। కపురుల నీడింగరీడ నేను॥
చ॥ ఆచార్యపురుషులు అవ్వల గొందరు। యేచినసమయులై యేర్పడిరి।
కాచేటి శ్రీవేంకటపతి నేనైతే। తాచి నీదాసుల దాసుడను॥

**332) గుండక్రియ**

ప॥ ప్రాణులనేరమి గాదిది బహుజన్మపరంపరచే। ప్రాణులుసేసిన తమతమ పాపఫల్మొగాని॥
చ॥ హరి సకలవ్యాపకుడని అందరు జెప్పగ నెరిగియు। పరదైవంబుల గొలువకపాయరు మానవులు।
నరపతి భూమేలగ భూవరు భజియింపగనొల్లక। పరిసరవర్తులబెంబడి బనిసేసినయట్లు॥
చ॥ పొందుగ తమతమ సేసినపూజలు మ్రొక్కులు గైకొన। అందముగా బురుషోత్తము డాతడే కలడనియు।
అందరు నెరిగియు యితరుల జెందుదు రున్నతశైలము- । నందక చేరునతరువుల నందుకొనినయట్లు॥
చ॥ శ్రీవేంకటపతి యొక్కడె చెప్పగ జగములకెల్లను। దైవము నాతములోపలి ధనమనగా వినియు।
సేవింపరు పామరులీదేవుని మధురంబొల్లక। వావిరి బులుసులు చేదులువలె ననికొనునట్లు॥

**333) లలిత / కల్యాణి**

ప॥ తప్పదు తప్పదు దైవముకృప యిది। ముప్పిరి నింతా ముకుందుడే॥
చ॥ వెక్కసపుమతి వెలుతులుదీరిన- । నెక్కడ చూచిన నీశ్వరుడే।
గుక్కక యాసలు గోసివేసినను। నిక్కమడుగడుగు నిధానమే॥
చ॥ పొంచి శరీరపుభోగము లుడిగిన। చుంచుబాపములు సుకృతములే।
దంచెడి విషయపు తగులము బాసిన। యెంచిచూచినను యిహమే పరము॥
చ॥ శ్రీవేంకటపతి సేవే కలిగిన। వేవేలువగలు వేడుకలే।
చేవదీరె సందియము లేదిదే। భావమునమ్మిన ప్రపన్నులకు॥

**334) రామక్రియ / కాంభోజి**

ప॥ ఇందిరానాయక యిదివో మాపాటు। చెంది నీవే గతి చేకొనవయ్యా॥
చ॥ తీసీ గోరికతీదీపు లొకవంక। లాసీ సంసారలంపటము।
మూసీ గర్మము మునుకొని పరచింత। సేసేదేమిక జెప్పేదేమి॥
చ॥ వంచీ నాసలు వలసినచోటికి। పొంచీ దుర్గుణభోగములు।
ముంచీ యౌవన మోహాంధకారము। యెంచేదేమి సోదించేదేమి॥
చ॥ ఎరిగీ జిత్తము యించుకించుక నిన్ను। మరవని నీపైభక్తి మతినుండగా।
నెరి శ్రీవేంకటపతి నీవే కాతువుగాక। వెరచి నేజేసే విన్నపమేమి॥

**335) రామక్రియ / దేశి**

ప॥ నారాయణాయ నమో నమో నానాత్మనే నమో నమో।
యీరచనలనే యెవ్వరు దలచిన యిహపర మంత్రము లిందరికి॥
చ॥ గోవిందాయ నమో నమో గోపాలాయ నమో నమో।
భావజగురవే నమో నమో ప్రణవాత్మనే నమో నమో।
దేవేశాయ నమో నమో దివ్యగుణాయ నమో యనుచు।
యీవరుసలనే యెవ్వరు దలచిన యిహపర మంత్రము లిందరికి॥
చ॥ దామోదరాయ నమో నమో ధరణీశాయ నమో నమో।
శ్రీమహిళాపతయే నమో శిష్టరక్షిణే నమో నమో।
వామనాయ తే నమో నమో వనజాక్షాయ నమో నమో।
యీమేరలనే యెవ్వరు దలచిన యిహపర మంత్రము లిందరికి॥
చ॥ పరిపూర్ణాయ నమో నమో ప్రణవాగ్రాయ నమో నమో।
చిరంతన శ్రీవేంకటనాయక శేషశాయినే నమో నమో।
నరకధ్వంసే నమో నమో నరసింహాయ నమో నమో।
యిరవుగ నీగతి నెవ్వరు దలచిన యిహపర మంత్రము లిందరికి॥

**336) ఆహిరి / వసంతభైరవి**

ప॥ దేవ నీమాయతిమిర మెట్టిదో నా- । భావము చూచి గొబ్బన గావవే॥
చ॥ వెడదుఃఖమపుడెల్ల వేసరుచుండుదుగాని। తడవి విరతిబొంది తలగలేను।
అడియాసల దిరిగి అలయుచుండుదుగాని। మడి దొసగుల నివి మానలేను॥
చ॥ హేయము స్త్రీసుఖమని యెరుగుచుండుదుగాని। పాయపుమదముచేత బాయలేను।
పాయనిపాపాలు చూచి భయమందుచుందుగాని। వోయమ్మ యివి సేయకుండలేను॥
చ॥ కలకాల మిన్నియును గందువిందు గానిమరి। యెలమి నొక్కటనైన యెచ్చరలేను।
బలిమి శ్రీవేంకటేశ బంధముక్తుని జేసి। తలపులో నెలకొని దయజూడవయ్యా॥

**337) భూపాళం**

ప॥ మిన్నక వేసాలుమాని మేలుకోవయ్యా। సన్నల నీయోగనిద్ర చాలు మేలుకోవయ్యా॥
చ॥ ఆవులు పేయలకుగా నరచీ బిదుకవలె। గోవిందుడ యింక మేలుకోవయ్యా।
ఆవలీవలపడుచు లాటలు మరిగివచ్చి। త్రోవగాచుకున్నారు ప్రొద్దున మేలుకోవయ్యా॥
చ॥ వాడల గోపికలెల్లా వచ్చి నిన్ను ముద్దాడ। గూడియున్నారిదే మేలుకోవయ్యా।
తోడనే యశోద గిన్నెతో బెరుగు వంటకము। యీడకు దెచ్చిపెట్టె నిక మేలుకోవయ్యా॥
చ॥ పిలిచీ నందగోపుడు పేరుకొని యదె కన్ను- । గొలుకులు విచ్చి మేలుకోవయ్యా।
అలరిన శ్రీవేంకటాద్రిమీది బాలకృష్ణ। యిల మామాటలు వింటివిక మేలుకోవయ్యా॥

**338) పాడి / అఠాణ**

ప॥ ఇందునుండ మీకెడ లేదు। సందడిసేయక చనరో మీరు॥
చ॥ నాలుక శ్రీహరినామంబున్నది। తూలుచు బారరో దురితములు।
చాలి భుజంబున చక్రంబున్నది। తాలిమి భవబంధము లటుదలరో॥
చ॥ అంతర్యామై హరి వున్నాడిదె। చింతలు వాయరో చిత్తమున।
వింతల జెవులను విష్ణుకథ లివిగో। పొంత గర్మములు పోరో మీరు॥
చ॥ కాపయి శ్రీవేంకటపతి పేరిదె। నాపై నున్నది నయమునను।
కోపపు కామాది గుణములాల మీ- । రేపున కడగడ నెందైన బోరో॥

**339) భూపాళం**

ప॥ మేదిని జీవుల గావ మేలుకోవయ్యా। నీదయే మాకెల్ల రక్ష నిద్ర మేలుకోవయ్యా॥

చ|| తగుగోపికల కన్నుదామరలు వికసించె। మిగుల సూర్యనేత్రుడ మేలుకోవయ్యా।
తెగువ రాక్షసులనే తిమిరము విరియగ। నెగడిన పరంజ్యోతి నిద్ర మేలుకోవయ్యా॥

చ|| ఘనదురితపు గలువలు వికసించె। మినుకు శశినేత్రుడ మేలుకోవయ్యా।
పనివడి వేదాలనే పక్షులెల్లా బలుకగ। జనక! యాశ్రితపారిజాత మేలుకోవయ్యా॥

చ|| వరలక్ష్మీ కుచచక్రవాకము లొండొంటి రాయ। మెరయుదోషరహిత మేలుకోవయ్యా।
పొరసి నీవు నిత్యభోగములు భోగించ। నిరతి శ్రీవేంకటేశ నేడు మేలుకోవయ్యా॥

**340) రామక్రియ / సావేరి**

ప|| నీయాజ్ఞ దలమోచి నీదేహధారి నైతి। యీయెడ గోవిందుడ నే నీడేరేదెట్లో॥

చ|| తనువు వేసరినాను తలపు వేసరదు। ధనము గడించెడితరితీపున।
చెనకి మగడు విడిచిన మామ విడువని- । పనియాయ హరి నాబదుకుజాడ యెట్లో॥

చ|| పాయము ముదుసినాను భావము ముదియదు। వేయైన సంసార విషయాలను।
వోయయ్య కలివోసినావెట్లదిక్కు చూచేది। మాయదాయ నిక నామనసుజాడెట్లో॥

చ|| కడలేని నావిధులు కన్నులార జూచి నీవు। నడుమ శ్రీవేంకటేశ నన్ను నేలితి ।
నొడుగులు దప్పినాను నోముఫలము దప్పని- । అడియాలమబ్బె నాకు నానతిచ్చితెట్లో॥

**341) లలిత / కురంజి**

ప|| కోరు వంచరో కొటారు। అరసి మనసా అంతరాత్మకు॥

చ|| కొండలపొడవులు కోరికకుప్పలు। పండినపంటలు భవములివి।
నిండినరాసులు నిజకర్మంబులు। అండనె యివె మాయారంభములు॥

చ|| వెలిధాన్యంబులు విషయపు రాసులు। పొలివారేటి వూరుపుగములు।
కలుషపుమదమున కావుగప్పినవి। అలవిమీర మాయారంభములు॥

చ|| బడి నింద్రియములబంతులు నురిపి। కడురతుల దండగట్టలతో।
యెడనెడ శ్రీవేంకటేశు మహిమలవే। అడియాలపు మాయారంభములు॥

**342) బౌళి / తోడి**

ప|| ఏది తుద దీనికేది మొదలు। పాదుకొను హరిమాయ బరగు జీవునికి॥

చ|| ఎన్ని బాధలు దనకు నెన్ని లంపటములు। యెన్ని వేదనలు మరియెన్ని దుఃఖములు।
యెన్ని పరితాపంబు లెన్ని దలపోతలు। యెన్ని చూచిన మరియు నెన్నెనగలవు॥

చ|| యెన్ని కొలువులు దనకు నెన్నియనుచరణలు। యెన్నియాసలు మరియు నెన్ని మోహములు।
యెన్నిగర్వములు దనకెన్ని దైన్యంబులివి। యిన్నియును దలప మరి యెన్నెన గలవు॥

చ|| యెన్నిటికి జింతించు నెన్నటికి హర్షించు। నెన్నిటికి నాసించు నెన్నిటికి దిరుగు।
యిన్నియును దిరువేంకటేశులీలలు గాగ। నెన్ని చూచినను దానెవ్వడును గాడు॥

**343) ముఖారి**

ప|| ఏరీతి నెవ్వరు నిన్ను నెట్టు భావించినాను। వారి వారి పాలికి వరదుడ వౌదువు॥

చ|| చేరి కొల్చినవారికి జేపట్టు గుంచమవు। కోరి నుతించువారి కొంగుపైడివి।
మేరతో దలచువారి మేటినిధానమవు। సారపు వివేకులకు సచ్చిదానందుడవు॥

చ|| కావలెనన్న వారికి కామధేనువు మరి। సేవ చేసేవారికి చింతామణివి।
నీవే గతన్న వారికి నిఖిల రక్షకుడవు। వావిరి శరణు వేడే వారికి భాగ్యరాశివి॥

చ|| నిన్ను బూజించేవారి నిజ పరతత్త్వమవు। యిన్నిటా నీదాసులకు నేలికవు।
యెన్నగ శ్రీవేంకటేశ యిహపరములకును। పన్ని కాచుకున్న వారి ఫలదాయకుడవు॥

**344) లలిత / హిందోళ**

ప|| ఘనుడాతడే మము గాచుగాక హరి। అనిశము నేమిక నతనికె శరణు॥

చ॥ యెవ్వని నాభిని యీ బ్రహ్మాదులు। యెవ్వడు రక్షకుడిన్నిటికి।
యెవ్వని మూలము యీ సచరాచర। మవ్వల నివ్వల నతనికే శరణు॥

చ॥ పురుషోత్తముడని పొగడి రెవ్వరిని। కరి నెవ్వడు గాచె।
ధర యెవ్వడెత్తి దనుజుల బొరిగొనె। అరుదుగ మేమిక నతనికె శరణు॥

చ॥ శ్రీసతి యెవ్వని జేరి వురమునను। భాసిల్లె నెవ్వడు పరమంబై।
దాసుల కొరకై తగు శ్రీవేంకట। మాస చూపి నితడతనికె శరణు॥

**345)దేసాక్షి / పంతువరాళి**

ప॥ సకల జీవులకెల్ల సంజీవి యీమందు। వెకలులై యిందరు సేవించరో యీమందు॥

చ॥ మూడు లోకము లొక్కట ముంచి పెరిగినది। పోడిమి నల్లని కాంతి బొదలినది।
పీడుక కొమ్ములు నాల్గు పెనచి చేయువారినది। వాడే శేషగిరిమీద నాటుకొన్న మందు॥

చ॥ పడిగెలు వేయింటి పాము గాచుకున్నది। కడు వేదశాస్త్రముల గబ్బు వేసీది।
యెడయక వొకకాంత యెక్కుక వుండినది। కడలేని యంజనాద్రి గారుడపు మందు॥

చ॥ బలు శంఖు జక్రముల బదనికెలున్నది। తలచిన వారికెల్ల దత్త్వమైనది।
అలరిన బ్రహ్మరుద్రాదుల బుట్టించినది। వెలుగు తోడుత శ్రీవేంకటాద్రి మందు॥

**346)సామంతం / ధర్మవతి**

ప॥ తానె తానే యిందరి గురుడు। సానబట్టిన భోగి జ్ఞాన యోగి॥

చ॥ అపరిమితములైన యజ్ఞాల వడిజేయ। బ్రపన్నులకు బుద్ధి వచరించి।
తపముగా ఫలత్యాగము సేయించు। కపురుల గరిమల కర్మయోగి॥

చ॥ అన్ని చేతలను బ్రహ్మార్పణవిధి జేయ। మన్నించు బుద్ధులను మరుగజెప్పి॥
ఉన్నతపదమున కొనరగ గరుణించు। పన్నగశయనుడే బ్రహ్మయోగి॥

చ॥ తనరగ గపిలుడై దత్తాత్రేయుడై। ఘనమైన మహిమ శ్రీవేంకటరాయడై।
వినరగ సంసార యోగము గృపసేయు। అనిమిషగతుల నభ్యాసయోగి॥

**347)భూపాళమ్**

ప॥ అలర నుతించరో హరిని। యెలయించి మిము భ్రమయించీనీ గాలము॥

చ॥ సేయరో మనుజులారా చింత హరి నికనైన। రోయరో మీ భుజియించు రుచుల మీద।
కాయమస్థిరము యీకవి యధృవము చాల- । బోయబో యెందుకు గాకపోయ గాలము॥

చ॥ మెచ్చరో మనుజులార మీరే హరికథలు। పుచ్చరో మీ మదిలోని పొరలెల్లాను।
కొచ్చరో మనుజులార కోరిక లెల్లను మీకు। నిచ్చీని శుభములు యివి యెల్లకాలము॥

చ॥ కనరో వేంకటపతి గన్నులు దనియగా। వినరో యీతని స్తుతు వీనులు నిండ।
మనరో శ్రీహరిచేతి మన్ననలు మీరు। తనమీది మదిబుద్ధి దాచీనీ గాలము॥

**348)బౌళి / ఖరహరప్రియ**

ప॥ ఏమి వలసిన నిచ్చు నెప్పుడైనను। ఏమరుక కొలచిన నితడే దైవము॥

చ॥ ఘనముగా నిందరికి గన్నులిచ్చు గాళ్ళిచ్చు। పనిసేయ జేతులిచ్చు బలియుడై।
తనుగొలువమని చిత్తము లిచ్చు గరుణించి। వొనర లోకానకెల్ల నొక్కడే దైవము॥

చ॥ మచ్చిక తనుగొలువ మనసిచ్చు మాటలిచ్చు। కుచ్చితములేని కొడుకుల నిచ్చును।
చొచ్చినచోటే చొచ్చి శుభమిచ్చు సుఖమిచ్చు। నిచ్చలు లోకానకెల్ల నిజమైన దైవము॥

చ॥ పంతమాడి కొలచిన బ్రాణమిచ్చు ప్రాయమిచ్చు। యెంతటి పదవులైన నిట్టె యిచ్చు।
వింతవింత విభవాల వేంకటేశుడిదే మా- । యంతరంగమున నుండే అరచేతిదైవము॥

**349)రామక్రియ / సింహేంద్రమధ్యమం**

ప॥ చాటెద నిదియే సత్యము సుండో। చేటు లేదితని సేవించినను॥

చ॥ హరి నొల్లని వారసురలు సుండో। సురలీతని దాసులు సుండో।
పరమాత్ము డితడె ప్రాణము సుండో। మరుగక మరచిన మరిలేదికను॥
చ॥ వేదరక్షకుడు విష్ణుడు సుండో। సోదించె శుకు డచ్చుగ సుండో।
ఆది బ్రహ్మ గన్నాతడు సుండో। యేదెస వెదికిన నితడే ఘనుడు॥
చ॥ ఇహపర మొసగును యీతడె సుండో। వహి నుతించె బార్వతి సుండో।
రహస్య మిదివో రహి శ్రీవేంకట- । మహీ ధరంబున మనకై నిలిచె॥

**350)భైరవి**

ప॥ హరినామము కడు నానందకరము। మరుగవో మరుగవో మరుగవో మనసా॥
చ॥ నళినాక్షు శ్రీనామము। కలిదోషహరము కైవల్యము।
ఫలసారము బహుబంధ మోచనము। తలచవో తలచవో మనసా॥
చ॥ నగధరు నామము నరకహరణము। జగదేకహితము సమ్మతము।
సగుణ నిర్గుణము సాక్షాత్కారము। పొగడవో పొగడవో పొగడవో మనసా॥
చ॥ కడగి శ్రీవేంకటపతి నామము। ఒడి ఒడినే సంపత్కరము।
అడియాలం బిల నతి సుఖమూలము। తడవవో తడవవో తడవవో మనసా॥

**351)దేసాక్షి / కానడ**

ప॥ ఎన్నడు జెడని యీవులిచ్చీని మాధవుడు। పన్నిన యాస లితనిపైపై నిలుపవో॥
చ॥ కొననాలుకా! హరిగుణములే నుడుగవో। మనసా! ఆతని దివ్య మహిమెంచవో।
తనువా! శ్రీపతి తీర్థదాహమే కోరవో। యెనలేని అడియాస లేటికి నీకికను॥
చ॥ వీనులారా! యేపొద్దు విష్ణుకథలే వినరో। ఆనినచేతు లితనికంది మొక్కరో।
కానుక చూపులాల కమలాక్షు జూడరో। యీ నేటి పాపాల బారినేల పడేరికను॥
చ॥ నలిబాదాలాల! హరి నగరికే నడవరో। కలభక్తి యాతనిపై ఘటియించరో।
చలమా! శ్రీవేంకటేశు సంగతినే వుండవో। యెలయింపు గోరికలకేల పారేవికను॥

**352)హిందోళవసంతం**

ప॥ తలగరో లోకులు తడవకురో మమ్ము। కలిగినదిది మాకాపురము॥
చ॥ నరహరి కీర్తన నానిన జిహ్వా। వొరుల నుతింపగ నోపదు జిహ్వా।
మురహరు పదముల మొక్కిన శిరము। పరుల వందనకు బరగదు శిరము॥
చ॥ శ్రీపతినే పూజించిన కరములు। చోపి యాచనకు జొరవు కరములు।
యేపున హరికడ కేగిన కాళ్ళు। పాపుల యిండ్లకు బారవు కాళ్ళు॥
చ॥ శ్రీ వేంకటపతి జింతించు మనసు। దావతి నితరము దలచదు మనసు।
దేవుడతని యాధీనపు తనువు। తేవల నితరాధీనము గాదు॥

**353)ధన్యాసి**

ప॥ సందడి విడువుము సాసముఖా। మందరధరునకు మజ్జనవేళా॥
చ॥ అమరాధిపులిడు డాలవట్టములు। కమలజ పట్టుము కాళాంజి।
జమలి చామరలు చంద్రుడ సూర్యుడ। అమర నిడుడు పరమాత్మునకు॥
చ॥ అణిమాది సిరులనలరెడు శేషుడ। మణిపాదుకలిడు మతి చెలగా।
ప్రణుతింపు కదిసి భారతీరమణ। గుణాధిపు మరుగురు బలుమరును॥
చ॥ వేదఘోషణము విడువక సేయుడు। ఆదిమునులు నిత్యాధికులు।
శ్రీదేవుండగు శ్రీవేంకటపతి। ఆదరమున సిరు లందీ వాడె॥

**354)కన్నడగౌళ**

ప॥ గాలినే పోయ గలకాలము। తాలిమికి గొంతయు బొద్దులేదు॥

చ॥ అడుసు చొరనే పట్టె నటునిటు గాళ్ళు। గుడుగుకొననే పట్టె గలకాలము।
ఒడలికి జీవుని కొడయడైనహరి। దడవగా గొంతయు బొద్దులేదు॥

చ॥ కలచి చిందనే పట్టె గడవగ నించగ బట్టె। కలుషదేహపుబాధ గలకాలము।
తలపోసి తనపాలి దైవమైన హరి। దలచగా గొంతయు బొద్దులేదు।

చ॥ శిరము ముడువబట్టె చిక్కుదియ్యగ బట్టె। గరిమల గపటాల గలకాలము।
తిరువేంకటగిరి దేవుడైనహరి। దరిచేరా గొంతయు బొద్దులేదు॥

**355) వరాళి**

ప॥ ఎవ్వరు లేరూ హితవుచెప్పగ వట్టీ- । నొవ్వుల బడి నేము నొగిలేమయ్యా॥

చ॥ అడవి బడినవాడు వెడల జోటులేక। తొడరి కంపలకిందు దూరినట్లు।
నడుమ దురిత కాననములతరి బడి। వెడలలేక నేము విసిగేమయ్యా॥

చ॥ తెవులువడినవాడు తినబోయి మధురము। చవిగాక పులుసులు చవిగోరినట్లు।
భవరోగముల బడి పరమామృతము నోర। జవిగాక భవములు చవులాయనయ్యా॥

చ॥ తనవారి విడిచి యితరమైనవారి- । వెనక దిరిగి తావెర్రైనట్లు।
అనయము తిరువేంకటాధీశు గొల్వక। మనసులోనివాని మరచేమయ్యా॥

**356) ముఖారి**

ప॥ చిత్తములో నిన్ను జింతింపనేరక। మత్తుడనై పులుమానిసినైతి॥

చ॥ ఆరుత లింగము గట్టి యది నమ్మజాలక। పరువత మేగినబత్తుడ నైతి।
సరుస మేకపిల్ల జంకబెట్టుక నూత- । నరయుగొల్లనిరీతి నజ్ఞాని నైతి॥

చ॥ ముడుపు కొంగునగట్టి మూలమూలల వెదికే। పెడమతినై నేవ్యర్థుడనైతి।
విడువకిక్కడ శ్రీవేంకటేశ్వరుడుండ। పొడగానక మందబుద్ధి నేనైతి॥

**357) శ్రీరాగం**

ప॥ అన్నియును నతనికృత్యములే। ఎన్నియైనా నవు నతడేమి సేసినను॥

చ॥ అణురేణు పరిపూర్ణుడవలి మోమైతేను। అణువౌను కమలభవాండమైన।
ఫణిశయనుని కృపాపరిపూర్ణ మైతే। తృణమైన మేకువౌ స్థిరముగా నపుడే॥

చ॥ పురుషోత్తముని భక్తి పొరపొచ్చమైతే। ఎరవులౌ నిజసిరులు ఎన్నైనను।
హరిమీదిచింత పాయక నిజంబైతే। నిరతి బట్టినవెల్లా నిధానములే॥

చ॥ మదనగురునిసేవ మదికి వెగటైతేను। పదివేలు పుణ్యములు పాపంబులే।
పదిలమై వేంకటపతిభక్తిగలిగితేను। తుదిపదంబునకెల్ల దొడవవు నపుడే॥

**358) శ్రీరాగం / ద్విజావంతి**

ప॥ నిత్యానంద ధరణీధర ధరారమణ। కాత్యాయనీస్తోత్ర కామ కమలాక్ష॥

చ॥ అరవిందనాభ జగదాధార భవదూర। పురుషోత్తమ నమో భువనేశ।
కరుణాసమగ్ర రాక్షసలోక సంహార- । కరణ కమలాధీశ కరిరాజవరద॥

చ॥ భోగీంద్రశయన పరిపూర్ణ పూర్ణానంద। సాగరనిజావాస సకలాధిప।
నాగారిగమన నానావర్ణనిజదేహ। భాగీరథీజనక పరమ పరమాత్మ॥

చ॥ పావన పరాత్పర శుభప్రద పరాతీత। కైవల్యకాంత శృంగారరమణ।
శ్రీవేంకటేశ దాక్షిణ్యగుణనిధి నమో। దేవతారాధ్య సుస్థిరకృపాభరణ॥

**359) ముఖారి / రేవతి**

ప॥ అనుమానపుబ్రదుకు కది రోతా తన- । మనసెనయనికూటమి మరి రోతా॥

చ॥ అపకీర్తులబడి ఆడికెలోనై। అపవాదియౌట అది రోత।
వుపమ గెలిచెనని వొరు జెరుచుటలు। విపరీతపుగుణ విధమొక రోతా॥

చ॥ తనగుట్టెల్లా నెరిగిన వారలముందట। తనయెమ్మెలు చెప్పుకొనుట రోత।
వనితలముందట వదరుచు వదరుచు। కనుగవ గావనిగర్వము రోత॥

చ॥ భువి హరిగతియని బుద్ధిదలంచని। యవమానపుమన నదిరోత।
భవసంహరుడై పరగు వేంకటపతి-। నవిరళముగ గొలువని దది రోత॥

**360)దేసాక్షి / కాపీ**

ప॥ నిన్నుదలచి నీపేరు దలచి। నన్ను కరుణించితే నెన్నికగాక॥

చ॥ అధికుని గాచుటేమరుదు నన్ను-। నధముని గాచుట యరుదుగాక నీకు।
మధురమౌటేమరుదు మధురమూ, చేదు। మధురమౌటే మహిలో నరుదుగాక॥

చ॥ అనఘుని గరుణింప నరుదుగాదు నీకు। ఘనపాపుని నన్ను గాచు టరుదుగాక।
కనకము గనకము గానేల, యినుము। కనకమవుటే కడు నరుదుగాక॥

చ॥ నెలకొన్న భీతితో నిన్ను జెనకితిగాక। తలకొన్న సుఖినైన దలచనేల నిన్ను।
యెలమితో దిరువేంగళేశుడ నాపాల। గలిగి నీకృప గలుగజేతువుగాక॥

**361)రామక్రియ**

ప॥ శ్రీవేంకటేశ్వరుని సింగారము వర్ణించితే। యే విధాన దలచిన యిన్నటికి దగును॥

చ॥ కరిరాజు గాచిన చక్రము పట్టిన హస్తము। కరి తుండమని చెప్పగా నమరును।
వరములిచ్చేయట్టి వరద హస్తము కల్ప-। తరు శాఖయని పొలుప దగు నీకును॥

చ॥ జలధి బుట్టిన పాంచజన్య హస్తము నీకు। జలధి తరగయని చాటవచ్చును।
బలు కాళింగుని తోక పట్టిన కటి హస్తము। పొలుపై ఫణీంద్రుడని పొగడగ దగును॥

చ॥ నలిన హస్తంబుల నడుమనున్న నీయుర-। మలమేలు మంగ కిరవన దగును।
బలు శ్రీవేంకట గిరిపై నెలకొన్న నిన్ను। నలరి శ్రీవేంకటేశుడన దగును॥

**362)శుద్ధ వసంతం**

ప॥ కపటాలు వద్దు గాక కాంతలతోను। యిపుడు చెల్లదా నీకు యెంత సేసినాను॥

చ॥ తమకాన నాపెపేరుతడవితి వింతేకాక। మమకారము నామీద మరచేవా।
భ్రమసితినంతా నాతోబాసలుసేయ గనేల। జమళి నెందరైనా దోసములా నీకేమీ॥

చ॥ ననుపున నాతోడ నవ్వితి వింతేకాక। యెనసి నన్ను మన్నించ కేల మానేవు।
పని పరాకంతా నొడంబరచక నింతయేల। తనివి చాలకుండితే తగదా నీకేమీ॥

చ॥ సొలసి మొక్కగా నాపె జూచితి వింతేకాక। తలసితివి నన్ను నేకడమున్నదా।
తొలుతటి పొంతులంటా తొరలించ నిపుడేల। చెలితో శ్రీవేంకటేశ సిగ్గా నీకేమీ॥

**363)కురంజి**

ప॥ వేడుకొందామా వేంకటగిరి వేంకటేశ్వరుని॥

చ॥ ఆమటి మ్రొక్కుల వాడె ఆదిదేవుడే వాడు। తోమని పళ్యాలవాడె దురిత దూరుడే॥

చ॥ వడ్డికాసుల వాడె వనజనాభుడే పుట్టు। గొడ్డురాండ్రకు బిడ్డలిచ్చే గోవిందుడే॥

చ॥ ఎలిమి గోరిన వరాలిచ్చే దేవుడే వాడు। అలమేల్మంగా శ్రీవేంకటాద్రి నాథుడే॥

**364)పాడి / నీలాంబరి**

ప॥ ఈరూపమై వున్నాడు యీతడే పరబ్రహ్మము। శ్రీరమాదేవితోడ శ్రీవేంకటేశుడు॥

చ॥ పొదలి మాయాదేవిపట్టిన సముద్రము। అదె పంచభూతాలుండే అశ్వత్థము।
గుదిగొన్నబ్రహ్మాండాలగుడ్ల బెట్టెహంస। సదరపుబ్రహ్మలకు జలజమూలకందము॥

చ॥ అనంతవేదాలుండేటిఅక్షయవటపత్రము। ఘనదేవతలకు శ్రీకరయజ్ఞము।
కనలుదానవమత్తగజసంహరసింహము। మొనసి సంసారభారము దాల్చే వృషభము॥

చ॥ సతతము జీవులకు చైతన్యసూత్రము। అతిశయభక్తులజ్ఞానామృతము।

వ్రతమై శ్రీవెంకటాద్రి వరములచింతామణి। తతిగొన్న మోక్షపుతత్త్వరహస్యము॥

**365) శ్రీరాగం**

ప॥ పేరంటాండ్లు పాడరే పెండ్లివేళ। సారెసారె నిద్దరికి సంతోషవేళ॥

చ॥ చిత్తజు తల్లికి వేగ సింగారించరె మీరు। తత్తరించేరిది ముహూర్తపువేళ।
హత్తి తలబాలు నారాయణుని బోయమనరే। పొత్తుల నిద్దరికిని బువ్వపువేళ॥

చ॥ పాలవెల్లి కూతురుకు పసపుల నలచరే। చాలించరేజోలి వీడుచదివే వేళ।
పాలుపడీ పరపులు పరచరే దేవునికి। నాలుగోదినము నేడూ నాగవల్లి వేళ॥

చ॥ అంది బాగాలియ్యరే అలుమేలుమంగకును। కందువ శ్రీవేంకటేశుగలసే వేళ।
గందము గస్తూరి నీరె ఘనరతినలరసరి- । కుండకీ యిద్దరు నికగొలువుండేవేళ॥

**366) బౌళి / నారాయణి**

ప॥ పెట్టని కోటిందరికి బెండ్లికొడుకు బొమ్మ। బెట్టే నసురులకెల్ల బెండ్లికొడుకు॥

చ॥ పెల్లగించి భూమెత్తీ బెండ్లికొడుకు వాడే। పిల్లగోవి రాగాలపెండ్లికొడుకు।
పెల్లైన యీపులపెండ్లికొడుకు వాడే। పిల్లదీపు పెన్నుద్ధిపెండ్లికొడుకు॥

చ॥ పెంచెపుశిరసుపాగ పెండ్లికొడుకు గుం- । పించిన కోపగించీ బెండ్లికొడుకు।
పెంచకప్పుడే పెరిగె బెండ్లికొడుకు వల- । పించె జక్కని సిరి బెండ్లికొడుకు॥

చ॥ పెంటపెరుగులదొంగ పెండ్లికొడుకు భూమి। బెంటి పోతుల గూరిచె బెండ్లికొడుకు।
గెంటులేని వేంకటగిరి మీదను వాడె। పెంట వెట్టుకున్న వాడు బెండ్లికొడుకు॥

**367) హుసేని**

ప॥ వెట్టి వలపు చల్లకు విష్ణుమూరితి నాతో। వెట్టిదేర మాటాడు విష్ణుమూరితి॥

చ॥ వినయము సేసేవు విష్ణుమూరితి। వెనకటి వాడవెగ విష్ణుమూరితి।
వినవయ్యా మామాట విష్ణుమూరితి మమ్ము। వెనుకొని పట్టకుమీ విష్ణుమూరితి॥

చ॥ వెరపుగల వాడవు విష్ణుమూరితి నేడు। వెరగైతి నిన్ను జూచి విష్ణుమూరితి।
విరివాయె నీమాయలు విష్ణుమూరితి నాకు। విరులిచ్చే వప్పటికి విష్ణుమూరితి॥

చ॥ వెలసె నీసేతలెల్ల విష్ణుమూరితి మా- । వెలుపలలోన నీవె విష్ణుమూరితి।
వెలలేని శ్రీవేంకట విష్ణుమూరితి కూడి। విలసిల్లితివి నాతో విష్ణుమూరితి॥

**368) ఝుంఝూటి**

ప॥ జగడపు జనవుల జాజర। సగివల మంచపు జాజర॥

చ॥ మొల్లలు దురుముల ముడిచిన బరువున। మొల్లపు సరసపు మురిపెమున।
జల్లన బుప్పొడి జాగర బతిపై। చల్లె రతివలు జాజర॥

చ॥ భారపు కుచముల పైపైగడు సిం- । గారము నెరపెటి గందవొడి।
చేరువ పతిపై చిందగ బడతులు। సారెకు జల్లేరు జాజర॥

చ॥ బింకపు గూటమి పెనగేటి చమటల। పంకపు బూతుల పరిమళము।
వేంకటపతిపై వెలదులు నించేరు। సంకుమదంబుల జాజర॥

**369) శుద్ధవసంతం**

ప॥ దురితదేహులే తొల్లియును శ్రీ- । హరి భజించి నిత్యాధికులైరి॥

చ॥ అనంతకోటి మహామునులు ఈ- । సనకాదులు నిశ్చలయశులు।
ఇనశశినయనుని నితనిని మును- । గని భజించి గతకల్మషులైరి॥

చ॥ అతిశయమతులు మహామహులు సుఖ- । రతివిముఖులును చిరంతనులు।
హితవిచారమతి నితనిని స- । తతమును భజించి ధన్యులైరి॥

చ॥ దేవతాధిపులు దివ్యులును కడు- । బావనులును తగ బరహితులు।

యీవేంకటపతి నితనిని। సేవించి సుఖాంచితమతులైరి॥

**370)శ్రీరాగం / నీలమణి**

ప॥ ఇందిర వడ్డించ నింపుగను। చిందక యిట్లే భుజించవో స్వామి॥

చ॥ అక్కాళపాళాలు నప్పాలు వడలు। పెక్కైనసయిదంపు పేణులును।
సక్కెరరాసులు సద్యోఘృతములు। కిక్కిరియ నారగించవో స్వామి॥

చ॥ మీరినకెళంగు మిరియపు దాళింపు-। గూరలు కమ్మనికూరలును।
సారంపుబచ్చళ్ళు చవులుగ నిట్టే। కూరిమితో జేకొనవో స్వామీ॥

చ॥ పిండివంటలును బెరుగులు బాలు। మెండైన పాశాలు మెచ్చి మెచ్చి।
కొండలపొడవు కోరి దివ్యాన్నాలు। వెండియు మెచ్చవే వేంకటస్వామీ॥

**371)ఆహిరి / నారాయణి**

ప॥ వననిధి గురిసినవాన లివి మతి-। పనిలేని పనులభారములు॥

చ॥ అడవులవెన్నెల లారిడిబదుకులు। తడతాకులపరితాపములు।
వొడలొసగినహరి నొల్లక యితరుల। బడిబడి దిరిగిన బంధములు॥

చ॥ కొండలనునుపులు కొనకొనమమతలు। అండలకేగిన నదవదలు।
పండినపంటలు పరమాత్ము విడిచి। బండయితిరిగిన బడలికలు॥

చ॥ బచ్చనరూపులు పచ్చలకొలపులు। నిచ్చలనిచ్చల నెయ్యములు।
రచ్చల వేంకటరమణుని గొలువక। చచ్చియు జావని జన్మములు॥

**372)ఆహిరి / తోడి**

ప॥ పెంచబెంచ మీద బెరిగేటిచెలిమి। ఇంచుకించుక తాలిముల కెడలేనిచెలిమి॥

చ॥ అంటుముట్టులేక మనసులంటుకొన్న చెలిమి। కంటగంట నవ్వించే ఘనమైన చెలిమి।
వెంటవెంట దిరిగాడు వెర్రిగొన్న చెలిమి। యింటివారి చిత్తములకు నెడరైన చెలిమి॥

చ॥ చెక్కుచెమటపెక్కు వలెనే చిక్కనైన చెలిమి। యెక్కడౌటా తమ్ముదమ్ము నెరగనీని చెలిమి।
చక్కదనమే చిక్క మేనుచిక్కినట్టి చెలిమి। లెక్కలేనియాసలెల్లా లేతలయిన చెలిమి॥

చ॥ అంకురించినట్టితలపు లధికమయిన చెలిమి। అంకెలయిన యాసలెల్లా లావుకొన్న చెలిమి।
వేంకటాద్రివిభుని గూడి వేడుకయిన చెలిమి। పంకజాననలకెల్ల బాయరాని చెలిమి॥

**373)గౌళ**

ప॥ ఎన్నిలేవు నాకిటువంటివి। కన్నులెదుట నిన్ను గనుగొనలేనైతి॥

చ॥ అరయ నేజేసినయపరాధములు చూచి। కరుణించి వొకడైన గాచునా।
కరచరణాదులు కలిగించిననిన్ను। బరికించి నీసేవాపరుడ గాలేనైతి॥

చ॥ ఏతరినైనే నెరిగి సేసినయట్టి-। పాతక మొకడైనా బాపునా।
ఆతుమలోనుండి యలరి నోవొసగిన-। చేతనమున నిన్ను జెలగి చేరనైతి॥

చ॥ శ్రీవేంకటేశ నే జెసినయితరుల-। సేవ కొకడు దయసేయునా।
నీవే యిచ్చినయట్టి నే నీశరీరముతోడ। నీవాడ ననుబుద్ధి నిలుపనేరనైతి॥

**374)గుండక్రియ**

ప॥ ఎంతటివారలు నెవ్వరును హరి। జింతించక నిశ్చింతలు గారు॥

చ॥ అతిజితేంద్రియులు ననశనవ్రతులు-। నతులతపోధనులగువారు।
చతురాననగురుస్మరణము దొరకక। తతి నూరక పుణ్యతములు గారు॥

చ॥ అనఘులు శాంతులు సధ్యాత్మతతులు-। ననుపమపుణ్యులు యాజకులు।
వనజోదరు ననవరతము దలచక। వినుతిస్మృతిని విబుధులు గారు॥

చ॥ దురితవిదూరులు దుర్మతిహీనులు। నిరతానందులు నిత్యులును।

తిరువేంకటగిరిదేవుని గొలువక। పరమార్గమునకు బ్రహ్మలు గారు॥

**375) సామంతం**

ప॥ పరమపాతకుడ భవబంధుడ శ్రీ- । హరి నిను దలచ నే నరుహుడనా॥

చ॥ అపవిత్రుడ నే నమంగళుడ గడు- । నపగతపుణ్యుడ నలసుడను।
కపటకలుష పరికరహృదయుడ నే- । నపవర్గమునకు నరుహుడనా॥

చ॥ అతిదుష్టుడ నే నధికదూషితుడ। హతవివేకమతి నదయుడను।
పతిలేనిరమాపతి మిము దలచలే- । నతులగతికి నే నరుహుడనా॥

చ॥ అనుపమ విషయ పరాధీనుడ నే- । ననంత మోహభయాతురుడ।
వినుతింపగ దిరువేంకటేశ ఘను- । లనఘులుగాక నే నరుహుడనా॥

**376) నాదనామక్రియ**

ప॥ ఇన్నియు గలుగుటేజన్మమున నైన। జెన్నలర హరిసేవ సిద్ధించుకొరకు॥

చ॥ అరయ వేదాధ్యనమది బ్రహ్మశుద్ధికొర- । కిరవైన శాస్త్రంబులెరుక కొరక।
తరి యజ్ఞములు ఋణోత్తారమయ్యేడి కొరకు। సరిలేని దానములు జన్మములకొరకు॥

చ॥ మమకారదూరంబు మనసు గెలుచుటకొరకొ। సమవివేకంబు శాంతములకొరకు।
అమర శ్రీతిరువేంకటాద్రీశు మనసు నీ- । జముగెలుచు బ్రహ్మ విజ్ఞానంబుకొరకు॥

**377) సామంతం / కల్యాణి**

ప॥ ఏ నిన్ను దూరక నెవ్వరి దూరుదు నీ- । వాని నన్నొకయింత వదలక నను నేలవలదా॥

చ॥ అపరాధిగనక నన్నరసి కావుమని। అపరిమితపు భయమంది నీకు శరణంటిగాక।
నెపములేక నన్ను నీకు గావగనేల। అపవర్గరూప దయాంబుధి తిరువేంకటాధిపా॥

చ॥ ఘనపాపి గనక నీకరుణ గోరి నీ- । వనవరతము నాయాతుమను విహరించుమంటిగాక।
యెనసి నన్ను గాచుటేమి యరుదు నీకు- । ననఘుడ పరమతత్త్వానంద తిరువేంకటాధిప॥

**378) ధన్యాసి**

ప॥ వైష్ణవులుగానివార లెవ్వరు లేరు। విష్ణుప్రభావ మీవిశ్వమంతయు గాన॥

చ॥ అంతయు విష్ణుమయంబట మరి దేవ- । తాంతరములు గలవనేలా।
భ్రాంతి బొంది యీభావము భావించి- । నంతనే పుణ్యులౌట దప్పదుగాన॥

చ॥ యెవ్వరి గొలిచిన నేమిగొరత మరి। యెవ్వరి దలచిన నేమి।
ఆవ్వలివ్వల శ్రీహరిరూపు గానివా- । రెవ్వరు లేరని యెరుకదోచిన జాలు॥

చ॥ అతిచంచలంబై నయాతును గలిగించు- । కతమున బహుచిత్తగతులై।
యితరుల గొలిచైన యెదాయక యనాథ- । పతివేంకటపతి చేకొనుగాక॥

**379) శ్రీరాగం / ఖరహరప్రియ**

ప॥ మనసిజ గురుడితడో మరియు గలడో వేద- । వినుతుడు డితడుగాక వేరొకడు గలడో॥

చ॥ అందరికి నితడెపో అంతరాత్ముడనుచు- । నందురితడో మరియు నవలడొకడో।
నందకధరుడు జగన్నాథుడచ్చుతుడు గో- । విందుడీతడు గాక వేరొకడు గలడో॥

చ॥ తనర నిందరికి జైతన్యమొసగిన యాత- । డొనర నితడో మరియు నొకడు గలడో।
దినకరశతతేజుడగు దేవదేవుడు త- । ద్వినుతుడితడు గాక వేరొకడు గలడో॥

చ॥ పంకజభవాదులకు బరదైవ మీతడని। అంకింతు రితడో అధికుడొకడో।
శాంకరీస్తోత్రములు సతతమును గైకొనెడి। వేంకటవిభుడో కాక వేరొకడు గలడో॥

**380) బౌళి**

ప॥ ఏడ సుజ్ఞానమేడ తెలివి నాకు। బూడిదలో హోమమై పోయ గాలము॥

చ॥ ఇదె మేలయ్యేడి నాకదె మేలయ్యేడి నని। కదిసియాసచే గడవలేక।

యెదురు చూచిచూచి యెలయించి యెలయించి। పొదచాటు మృగమై పోయ గాలము॥
చ॥ ఇంతట దీరెడి దుఃఖమంతట దీరెడినని। వింతవింత వగలచే వేగివేగి।
చింతయు వేదనల జిక్కువడుచు నగ్ని- । పొంతనున్న వెన్నయై పోయ గాలము॥
చ॥ యిక్కడ సుఖము నాకక్కడ సుఖంబని। యెక్కడికైనా నూరి కేగియేగి।
గక్కన శ్రీతిరువేంకటపతి గానక। పుక్కిటిపురాణమయి పోయ గాలము॥

**381) గుండక్రియ**

ప॥ కొనుట వెగ్గళము దాదినుట యల్పము మీదు- । గనుట వినుట లేక దా కడచన్న భవము॥
చ॥ ఆపద వడ్డికినిచ్చి అనుభవింపబోయిన। యేపున నెవ్వరికి నిందేమిగలదు।
పాపపుపైరువిత్తిన పండినపంటలలోన। రూపింపగ నిందు రుచి యేమిగలదూ॥
చ॥ ఘనుడైన తిరువేంకట నాథుడిన్నిటికి- । యును భోక్తయు గర్మియును నైనవాడు।
పనిలేదు నిష్ఠూరపరుడు దానై వుండు। తనకుదానె కర్తతనమౌట గాన॥

**382) నాట**

ప॥ ఏదైవము శ్రీపాదనఖమున బుట్టినగంగ। త్రిలోకపావనము చేయును త్రిపథగామిని ఆయను॥
అప॥ ఏదైవము నాభినలినంబున జనియించిన అజుండు। అఖిలాండంబులు సృజియింప నధిపతి ఆయను॥
చ॥ యేదైవము వురస్థలంబు దనకును మందిరమైన యిందిర- । మాతయయ్యె యీజగంబులకెల్లను॥
యేదైవము అవలోకనమింద్రాది దివిజగణంబుల- । కెల్లపుడును సుఖంబు లాపాదించును॥
చ॥ యేదైవము దేహవస్తువని అనిమిషులందరు గూడి। శ్రీనారాయణ దేవుండని నమ్మియుందురు।
ఆదేవుడే సిరులకనంత వరదుడు తిరువేంకట- । గిరినాథుడుభయ విభూతినాథుడే నానాథుడు॥

**383) వరాళి**

ప॥ పుడమి నిందరి బట్టెభూతము కడు- । బొడవైన నల్లనిభూతము॥
చ॥ కినిసి వోడమింగెడి భూతము। పునుకవీపు పెద్దభూతము।
కనలి కవియు చీకటిభూతము। పొనుగు సోమపుమోము భూతము॥
చ॥ చేటకాళ్ళ మించినభూతము। పోటుదారల పెద్దభూతము।
గాటపుజడల బింకపుభూతము। జూటరినల్లముసుగు భూతము॥
చ॥ కెలసి బిత్తలేతిరిగేటి భూతము। పొలుపుదాంట్ల పెద్దభూతము।
బలుపు వేంకటగిరిపై భూతము। పులుగుమీది మహాభూతము॥

**384) ముఖారి / శుభపంతువరాళి**

ప॥ పసలేని యీబ్రదుకు। ఆసలు చొచ్చిచొచ్చి అలసినట్టాయె॥
చ॥ తొల్లిటిజన్మాదుల గానినరరూపు। వల్లించుకొన్న యీబ్రదుకు।
కల్లసుఖములచే కనలి కమ్మర। ముల్లుదీసి కొర్రు మొత్తినట్టాయ॥
చ॥ బూటకములనెల్ల బొరలి సంసారంపు- । పాటుదెచ్చిన యీబ్రదుకు।
నీటుగ నెద్దు దన్నీనని గుర్రము- । చాటుకేగిన యట్టివందమాయె॥
చ॥ పగగొన్న పొగకోపక మంట బడిపది। పగలు రేలైన బ్రదుకు।
తగువేంకటేశ్వరు దలచి నేలనుండి। యెగసి మేడమీద కేగినట్టాయె॥

**385) సామంతం / కానడ**

ప॥ చాలదా హరిసంకీర్తనాంగల- । మేలిది దీననే మెరసిరి ఘనులు॥
చ॥ తలప వేదశాస్త్రములు గానక। అలరుచు వాల్మీకాదులు।
తలకొని హరిమంత్రమే దగబేర్కొని। అలవిమీర గడునధికములైరి॥
చ॥ యితరదైవముల నెరుగనేరక। ప్రతిలేని మహిమ బార్వతి।
మతి దలపుచు హరిమంత్రమె పేర్కొని। సతతము హరులొ సగమై నిలిచె॥

చ॥ చదువులు బలుమరు జదువనోపక। అదివో నారదాదులు।
పదిలపు వేంకటపతి హరినామమే। వదలకిదియ జీవనమై మనిరి॥

**386) ముఖారి / చింతామణి**

ప॥ ఎంత మానుమన్న జింతలేల మానునే। పంతపుమనసు హరిపై నుంటేగాక॥

చ॥ తీరనిబంధాలు నేడే తెగుమంటే నేలతెగు। భారపుమమత బెడబాసినగాక।
వూరటగా మమత నేనొల్లనంటే నేలమాను। వోరుపుతో లంపటము లొల్లకుంటేగాక॥

చ॥ వేకపుగోపము నేడే విడుమంటే నేలవిడు। తోకచిచ్చయినయాస దుంచినగాక।
ఆకట నానేలమాను అన్నిటాను యిందరికి। మాకుపడి తత్తరము మరచుంటేగాక॥

చ॥ పెట్టనిది దైవమిట్టే పెట్టుమంటె నేలపెట్టు। యిట్టే వేంకటపతి యిచ్చినగాక।
యిట్టునిట్టు నీతడు దానిందరికి నేలయిచ్చు। వొట్టినవిరక్తినేమీ నొల్లకుంటేగాక॥

**387) నాట**

ప॥ ఇలయును నభమును నేకరూపమై। జలజల గోళ్ళు జళిపించితివి॥

చ॥ ఎడసిన నలముక హిరణ్యకశిపుని। దొడికిపట్టి చేతుల బిగిసి।
కెడసి తొడలపై గిరిగొన నదుముక। కడుపుచించి కహకహ నవ్వితివి॥

చ॥ రొప్పుల నూర్పుల రొచ్చుల కసరులు। గుప్పుచు లాలలు గురియుచును।
కప్పినబెబ్బులి కసరుహుంకృతుల। దెప్పరపసురల ధృతి యణచితివి॥

చ॥ పెళపెళనార్చుచు బెడబొబ్బలిడుచు। థళథళ మెరవగ దంతములు।
ఫళఫళ వీరవిభవరస రుధిరము। గుళగుళ దిక్కుల గురియించితివి॥

చ॥ చాతినప్రేవుల జన్నిదములతో। వాతెరసింహపు వదనముతో।
చేతులువేయిట జెలగి దితిసుతుని। పోతర మణపుచు భువి మెరసితివి॥

చ॥ అహోబలమున నతిరౌద్రముతో। మహామహిమల మలయుచును।
తహతహ మెదుపుచు దగువేంకటపతి। యిహము బరము మాకిపుడొసగితివి॥

**388) రామక్రియ / తోడి**

ప॥ వెలయునిన్నియును వృథావృథా। తలపున శ్రీహరి దడసినను॥

చ॥ ఎడయనిపుణ్యము లెన్నియైనా। విడువక సేయుట వృథావృథా।
బడిబడి నే శ్రీపతి నాత్మలో। దడవక యితరము దడవినను॥

చ॥ యెరపులతపముల నెంతైనా। విరవిర వీగుట వృథావృథా।
హరినచ్యుతు బరమాత్ముని। మరిగి తలచక మరచినను॥

చ॥ దైవము నెరగక తమకమున। వేవేలైన వృథావృథా।
శ్రీవేంకటగిరి చెలువునిని। సేవించక మతి జెదరినను॥

**389) సామంతం / అసావేరి**

ప॥ ఇతరము లిన్నియు నేమిటికి। మతిచంచలమే మానుట పరము॥

చ॥ ఎక్కడిసురపుర మెక్కడివైభవ- । మెక్కడి విన్నియు నేమిటికి।
యిక్కడనే పరహితమును బుణ్యము। గక్కున జేయగ గల దిహపరము॥

చ॥ యెవ్వరు చుట్టము లెవ్వరు బంధువు- । లెవ్వరిందరును నేమిటికి।
రవ్వగులక్ష్మీరమణుని దలపుచు। యివ్వల దా సుఖియించుట పరము॥

చ॥ యెందరు దైవము లెందరు వేల్పులు। యెందరిందరును నేమిటికి।
కందువెరిగి వేంకటగిరిరమణుని। చిందులేక కొలిచిన దిహపరము॥

**390) భూపాళం**

ప॥ పారితెంచి యెత్తివేసి పారవెళ్ళితివి। నీరసపు టెద్దవైననీకు నేముద్దా॥

చ॥ ఎద్దవై నన్నేల తొక్కి యేమిగట్టుకొంటివి। వొద్దనైన వచ్చి వూరకుండవైతివి।
వొద్దిక ఘూమెత్తిన యాయెద్దుకు నే ముద్దుగాక। నిద్దురచిత్తముతోడ నీకు నేముద్దా॥

చ॥ కాపురపు బాపపునాకర్మమును ధరించి। వీపువగులగదాకి విర్రవీగితి।
ఆపగ నెద్దేమెరుగు నడుకులచవి మూట-। మోపరివి నీకు నాముదము ముద్దా॥

చ॥ మచ్చరించి అల్లనాడు మాలవాడు కాలదన్ని। తెచ్చినయప్పటి ధర్మదేవతవు।
యెచ్చరించి తిరువేంకటేశు దాసుడని నన్ను। మెచ్చి తాకితివి నామేను నీకుముద్దా॥

**391) శ్రీరాగం**

ప॥ ఎందాక నేచిత్త మేతలపో। ముందుముందు వేసారితి ములిగి వేసరితి॥

చ॥ ఏమిసేతు నేడచొత్తు నేమని బోధింతును। నామాట వినదిదే నావిహారము।
యేమరినా దలపించీ నేమైనా గడించీ। సాముసేసి వేసారితీ జడిసి వేసారితి॥

చ॥ యేడ చుట్టాలేడ పొందులెవ్వరూ। తోడైనవారు గారు దొంగలు గారు।
కూడుచీరగానిచోటై కొరగానిపాటై। వాడివాడి వేసారితి వదిలి వేసారితి॥

చ॥ యెందున నున్నాడేమిసేసీ నెక్కడ భోగించీని। విందులకువిందయిన వేంకటేశుడు।
యిందరి హృదయములో నిరవై యున్నాడతడు। చెందినన్ను గాముగాక చెనకి వేసారితి॥

**392) ఆహిరి**

ప॥ ఊరికి బోయెడి వోతడ కడు-। చేరువతెరు వేగి చెలగుమీ॥

చ॥ ఎడమతెరువువంక కేగిన దొంగలు। తొడిబడ గోకలు దోచేరు।
కుడితెరువున కేగి కొట్టువడక మంచి-। నడిమితెరువుననే నడవుమీ॥

చ॥ అడ్డపుదెరువుల నటునిటు జట్టాలు। వెడ్డువెట్టుచు నిన్ను వేచేరు।
గొడ్డేరేచిన్న దిడ్డితెరువు వోక। దొడ్డపుతెరువువంక తొలగుమీ॥

చ॥ కొండతెరువు కేగి కొంచెపుసుఖముల। బండై తిరుగుచు బడలేవు।
అండనుండెడి పరమాత్ముని తిరుమల-। కొండతెరువు తెకువ నేగుమీ॥

**393) సామంతం / సావేరి**

ప॥ నాటికి నాడే నాచదువు। మాటలాడుచును మరచేటిచదువు॥

చ॥ ఎనయ నీతని నెరుగుటకే పో। వెనకవారు చదివినచదువు।
మనసున నీతిని మరచుటకే పో। పనివడి యిప్పటి ప్రౌఢలచదువు॥

చ॥ తెలిసి యితనినే తెలియుటకే పో। తొలుత గృతయుగాదుల చదువు।
కలిగియీతని గాదననే పో। కలియుగంబులో గలిగిన చదువు॥

చ॥ పరమై వేంకటపతి గనుటకే పో। దొరలగు బ్రహ్మాదుల చదువు।
సిరుల నితని మరచెడికొరకే పో। విరసపుజీవుల విద్యలచదువు॥

**394) ముఖారి**

ప॥ సిరిదొలంకెడి పగలూచీకటా యితడేమి। యిరవుదెలిసియు దెలియనియ్య డటుగాన॥

చ॥ తలపోయ హరినీలదర్పణంబో ఇతడు। వెలుగుచున్నాడు బహువిభవములతోడ।
కలగుణంబటు వలెనెకాబోలు లోకంబు। గలదెల్ల వెలిలోన గనిపించుగాన॥

చ॥ మేరమీరిననీలమేఘమా యితడేమి। భూరిసంపదలతో బొలయుచున్నాడు।
కారుణ్యనిధియట్ల కాబోలు ప్రాణులకు। కోరికలు దలపులో గురియు నటుగాన॥

చ॥ తనివోని ఆకాశతత్త్వమో యితడేమి। అనఘుడీ తిరువేంకటాద్రి వల్లభుడు।
ఘనమూర్తి అటువలెనె కాబోలు సకలంబు। తనయందె యణగి యుద్భవమందుగాన॥

**395) దేవగాంధారి**

ప॥ చెప్పుడు మాటలే చెప్పుకొనుటగాక। చెప్పినట్ల దాము సేయరెవ్వరు॥

చ॥ దొడ్డయిన శరీరదోషమైనయట్టి- । జడ్డు దొలగవేయజాల రెవ్వరును।
గడ్డబడి యీాతకాండ్లొటగాని। వొడ్డునడుమ నీద నోపరెవ్వరును॥
చ॥ శ్రీవేంకటేశుపై జిత్తమర్పణసేసి। యీావిధులన్నియు నెడయ రెవ్వరును।
చావుబుట్టుగులేని జన్మముగల సర్వ- । దేవతామూర్తులై తిరుగ రెవ్వరును॥

**396)ఆహిరి / శంకరాభరణం**

ప॥ తనవారలుపెరవారలు దాననియెడి వాడెవ్వడు। తమగుణముల దిగవిడిచిన ధన్యుడాతడెపో॥
చ॥ తెగబడి మదనసముద్రము దేహముతోడనె దాటిన- । విగతభయుండత డెవ్వడు వీరుండెవ్వడొకో।
పగగొని పంచేంద్రియముల ప్రాణముతోడనె బతికి। జగదేకప్రీతుండగు చతురుండాతడెపో॥
చ॥ యేచినపరితాపాగ్నుల నేమియు నొవ్వక వెడలిన। ధీచతురుండతడెవ్వడు ధీరుండెవ్వడొకో।
చూచినమోహపుజూపుల జరుచూండ్ల కెడమియ్యని। రాచరికపు నెరజాణుడు రసికుండాతడెపో॥
చ॥ చావుకుసరియగు ద్రవ్యవిచారపు తగులుల బాసిన- । పావనుడెవ్వడు బహుజన్మ బాంధవుడెవ్వడొకో।
శ్రీవేంకటగిరినాథుని చిత్తములోపల నిలిపిన- । దేవసమానుడు నాతడె ధీరుడు నాతడెపో॥

**397)సామంతం / బేగడ**

ప॥ నీవనగ నొకచోట నిలిచివుండుటలేదు। నీవనుచు గనుగొన్న నిజమెల్ల నీవే॥
చ॥ తనయాత్మవలెనె భూతములయాతుమలెల్ల- । ననయంబు గనుగొన్న యతడే నీవు।
తనుగన్నతల్లిగా తగనితరకాంతలను। అనఘుడై మదిజూచునతడే నీవు॥
చ॥ సతతసత్య వ్రతాచార సంపన్నుడై। అతిశయంబుగ మెలగునతడే నీవు।
ధృతిదూలి ద్రవ్యంబు తృణముగా భావించు- । హతకాముకుడైన యతడే నీవు॥
చ॥ మోదమున సుకదుఃఖములు నొక్కరీతిగా। నాదరింపుచున్న యతడే నీవు।
వేదోక్తమతియైన వేంకటాచలనాథ। ఆదియును నంత్యంబు నంతయును నీవే॥

**398)దేసాక్షి / ఖరహరప్రియ**

ప॥ వేసరితిమెట్ల నీవెంట దిరిగి। గాసిబెట్టక మమ్ము గావరారా॥
చ॥ తీసితివి కోరికల తెగనీక పంచలకు। తోసితివి యింటింట దోయదోయ।
చేసితివి నీచేత చెల్లె నికనైనను। ఆస నీపొందొల్ల మంపరాదా॥
చ॥ కట్టితివి కర్మముల కడదాక నాపదల। బెట్టితివి దుఃఖముల బెనచిపెనచి।
పట్టితివి చలము మము పాయనని యీాస నీ- । విట్లైన గొంత సుఖమియ్యరాదా॥
చ॥ కరపితివి పాపములే కడగి నానావిధుల। నెరపితివి దుర్దశలే నేర్పుమెరసి।
తెరగొసంగియును శ్రీతిరువేంకటేశ్వరుని- । నెరిగియును నెరగలేమింక నేతెరువో॥

**399)గుజ్జరి**

ప॥ సంసారినైన నాకు సహజమే। కంసారి నేనిందుకెల్లా గాదని వగవను॥
చ॥ నరుడనైననాకు నానాసుఖదుఃఖములు। సరి ననుభవించేది సహజమే।
హరిని శరణాగతులైనమీద బరాభవ- । మరయ నిన్నంటునని అందుకే లోగేను॥
చ॥ పుట్టిననాకు గర్మపు పొంగుకు లోనైనవాడ। జట్టిగ గట్టువడుట సహజమే।
యిట్టే నీవారికి మోక్షమిత్తునన్న నీమాట। పట్టు వోయీనోయని పంకించే నేనిపుడు॥
చ॥ మాయకులోనైన నాకు మత్తుడనై యిన్నాళ్ళు। చాయకు రానిదెల్లా సహజమె।
యీాయెడ శ్రీవేంకటేశ యేలితివి నన్ను నీవు। మోయరాని నేను మోపనివీగేను॥

**400)సాళంగనాట**

ప॥ అట్టివేళ గలగనీ దదివో వివేకము। ముట్టువడితే శాంతము మరి యేలా॥
చ॥ జడధులు వొంగినట్టు సందడించు నింద్రియములు। వొడలిలో జీవునికి నొక్కొకవేళ।
బడబాగ్ని రేగినట్లు పైకొనీ ముంగోపము। వుడికించు మనసెల్ల నొక్కొకవేళా॥

****************************************************************************************************

**************************************************************************************************************

చ॥ అరయ గొండయెత్తినట్టు వేగౌ సంసారము। వూరక కలిమిలేము లొక్కొకవేళ।
మేరలేనిచీకటియై మించును దుఃఖములెల్లా। వూరటలేనికర్మికి నొక్కొకవేళా॥
చ॥ పెనుగాలి వీచినట్టుపెక్కుకోరికలు ముంచు। వొనర నజ్ఞానికి నొక్కొకవేళా।
యెనయగ శ్రీవేంకటేశుదాసుడైనదాకా। వునికి బాయవన్నియు నొక్కొకవేళా॥

**401) ఆహిరి**

ప॥ ఎండలోనినీడ యీమనసు। పండుగాయ సేయబనిలేదు మనసు॥
చ॥ వానచేతకములవలెనాయ మనసు। గోనెబట్టిన బంకగుణమాయ మనసు।
మానజిక్కినకోలమతమాయ మనసు। తేనెలోపలి యీగతెరుగాయ మనసు॥
చ॥ గడిరాజబదుకాయ కడలేని మనసు। నడివీదిపెసరాయ నయమైనమనసు।
గడకుగట్టిన పాతగతిదోచె మనసు। అడసులోపలి కంబమై తోచెమనసు॥
చ॥ తెరువుచూపినజాడ దిరుగు నీమనసు। మరుగుజేసినచోట మరుగు నీమనసు।
తిరువెంకటేశుపై దిరమైన మనసు। సిరిగలిగినచోట జేరు నీమనసు॥

**402) కన్నడగౌళ**

ప॥ పాయక మతినుండి పరగ మేలుగీడును। సేయించి కర్మి దాజేయుటెవ్వరిది॥
చ॥ వెలయ జరాచరవిభుడైన విభునాత్మ। దలచుగాక ప్రాణి దానేమిసేయు।
తెలిసి నిర్మలభక్తి దీవించి తనుజేర। గొలిపించుకొనలేమి కొరత యెవ్వరిది॥
చ॥ కొందరు సుఖులై కొదలేక మెలగగ। కొందరిదుఃఖపుకొరత యెవ్వరిది।
అందరిమతి వేంకటాద్రివల్లభ నీవు। చెంది కర్మముల జేయుచేత యెవ్వరిది॥

**403) గుండక్రియ**

ప॥ కడుపెంత తాగుడుచు కుడుపెంత దీనికై। పడని పాట్లనెల్ల పడి పొరల నేలా॥
చ॥ పరులమనసునకు నాపదలు గలుగగ జేయ। పరితాపకరమైన బ్రతుకేలా।
సొరిదినితరుల మేలు చూచిసైపగలేక। తిరుగుచుండేటి కష్టదేహమిది యేలా॥
చ॥ యెదిరికెప్పుడు జేము హితమెల్ల దనదనుచు। చదివిచెప్పని యట్టి చదువులెలా।
పొదిగొన్న యాసలో బుంగుడై సతతంబు। సదమదంబై పడయు చవులు దనకేలా॥
చ॥ శ్రీవేంక్లటేశ్వరుని సేవానిరతి గాక। జీవన భ్రాంతి బడు సిరులెలా।
దేవోత్తముని నాత్మదెలియ నొల్లకపెక్కు। త్రోవలేగిన దేహి దొరతనంబేలా॥

**404) గుండక్రియ**

ప॥ నాటకమింతా నవ్వులకే। పూటకు బూటకు బొల్లైపోవు॥
చ॥ కోటి విద్యలును గూటి కొరకే పో। చాటున మెలగేటి శరీరికి।
తేటల నాకలి దీరిన పిమ్మట। పాటుకు బాటే బయలై పోవు॥
చ॥ మెరసేటి దెల్లా మెలుతల కొరకే। చెరల దేహముల జీవునికి।
అర మరవుల సుఖమందిన పిమ్మట। మెరుగుకు మెరుగే మొయిలై పోవు।
చ॥ అన్ని చదువులును నాతని కొరకే। సన్నెరిగిన సుజ్ఞానికిని।
యిన్నిట శ్రీవేంకటేశు దాసునికి। వెన్నెల మాయలు విడివిడి పోవు॥

**405) సాళంగనాట**

ప॥ పట్టము గట్టితివింక బ్రతుకరయ్యా। చిట్టకాలు లేవు మీకు శ్రీవేంకటేశుడా॥
చ॥ అలమేలు మంగకు సింహాసనము నీవురము। కలిత హారములే సింగారపు దండలు।
తొలుత నీహస్తములే తోరణ గంభములు। చెలి రాజ్యమే నీవు శ్రీవేంకటేశుడా॥
చ॥ పరగు తులసీదండ పచ్చ తోరణమాపెకు। మెరుగు గౌస్తుభమణి మించుటద్దము।
గరిమ నీసొబగులు కప్పములు గానికలు। సిరులు నీ కూరిమలు శ్రీవేంకటేశుడా॥

**************************************************************************************************************

చ॥ సంతతమైన విందులు సారె నీమోవి తేనెలు। వింత రతి భోగములు వినోదాలు।
కొంత నియ్యారును బొడ్డు కుంచెయు గాళాణి। చెంతలనన్నీ నమరె శ్రీవేంకటేశుడా॥

**406)గౌళ**

ప॥ ఎట్టు గూడె బెండ్లి యోగమిద్దరికి నీవేళ। అట్టు లక్ష్మీనారాయణ యోగము॥

చ॥ నెలత కమలవాసి నీవు కమలాక్షుడవు। పొలతి నీకు గూడె పొంతనాలు।
వలుద చక్రవాకాలు వనితకు చాలు నీకు। యెలమి జక్రాయుధుడ నిద్దరికి దగును॥

చ॥ తరుణి నీలకుంతల తగునీల వర్ణుడవు। సరుస మీకే తగు సమ్మంధము।
నిరతి హేమవర్ణకె నీవు పీతాంబరుడవు। పరవి నిద్దరకొక్క జాతియ్యము॥

చ॥ పాలవెల్లి బుట్టె నాకె పాలవెల్లి యిల్లు నీకు। మేలు మేలు యిద్దరికి మేనవావి।
యీలీల శ్రీవేంకటేశ యింతి నీవు గూడితివి। పోలి మాకు పెట్టరాదా సోబన విడేలు॥

**407)ధన్యాసి**

ప॥ తలచిన హృదయము ఝల్లను తరుణీమణి వొయ్యారము।
కలిగీనా యిక నొకపరి కన్నుల జూడగను॥

చ॥ మోమరవాంచీ పాదాంగుట మున నేలనొయ్యన వ్రాయుచును।
కోమలి కన్నీరెడ గ్రక్కును।
వేమరు నాదెస జూచిటు।
వీడ్కొన నొల్లని భావము॥

చ॥ చెక్కిట చేయిడి అలసతచే వదనము కడువాడగ।
వెక్కసమగు డగ్గుత్తిక వేడుక నణపుచును।
అక్కర తీరగ నాతోనాడిన సొలపుల మాటలు।
యెక్కువ పొగలుచు ధైర్యంబేగతి నిలుపుదును॥

**408)సామవరాళి / భైరవి**

ప॥ ఎన్నటి చుట్టమో యాకె నెరుగ నేను। అన్నిటా నేనే నీకు నాలనంటా నుందును॥

చ॥ నెలత యెవ్వతో కాని నిన్ను బొడగనవచ్చె। చెలప చెమటలతో సిగ్గులతోడ।
చెలుల చెప్పుమనుచు జేరి వాకిటనున్నది। తొలుత నీవాపె మోము తోగి చూడవయ్యా॥

చ॥ వాని నీకేమౌనో కాని, వలపుల మాటలాడి। వేవేగ దురుము జార విరులరాల।
దేవులవలె దలుపుదెరచి లోనికేతెంచె। భావించి యాపెగురుతు పరికించివయ్యా॥

చ॥ యెంత పనికోగాని యేకతము గద్దనీను। సంతసాలు గడునిండ జవులురేగ।
యింతలో శ్రీవేంకటేశ యే నలమేలుమంగను। చెంత నన్నేలితి వాకె జిత్తగించవయ్యా॥

**409)ధన్యాసి**

ప॥ నీకేల భయము నీకునీకే యులికేవు। చేకొన్న నీచేతలందు జెరిగున్నావా॥

చ॥ చనువు సేసుక ఆపె సారె నీమోము చూచితే। చెనక జాలక యేల సిగ్గుపడేవు।
కనుగొనబోతే నందు కళలింతే వుండేనవి। వెనుకొని కాంతలెల్లా వేలుకాడేరా॥

చ॥ మచ్చిక చేసుక ఆపెమాటలు నిన్నాడించితే। కొచ్చికొచ్చి నీవేల కొంక జూచేవు।
కచ్చుపెట్టి తోచేవి కల్లనిజములేకాక। అచ్చమై పొందిన సతులంటుకున్నారా॥

చ॥ చుట్టముసేసుక యింతి సొరిది నిన్నుగూడితే। యిట్టె శ్రీవేంకటేశ నీవేల మొక్కేవు।
గుట్టునను కొనగోళ్ళ గురుతులుండీ గాక। ముట్టిన కాంతలు మేన మూగుకున్నారా॥

**410)ధన్యాసి / అమీర్ కల్యాణి**

ప॥ వలచుటే దోసమా వనిత నీకాతడు। నలువంక మరియేటి నవ్వులు నవ్వవే॥

చ॥ పంతమెల్ల నీమాటపట్టు లోననే వున్నది। చింతలెల్ల నీచెక్కు చేతనున్నవి।

వింతలన్నియును నీ నివ్వెరుగులతో నున్నవి। యెంతకెంత పతినింకా యేటికి దూరేవే॥

చ॥ బిగువెల్ల నిపుడు నీపెదవులపై నున్నది। తెగువలు నీకన్నుల తేటనున్నవి।
ఆగడింతా నీ పొలయలుకలలో నున్నది। యెగసక్కేలాతని నేటికి నాడేవే॥

చ॥ గబ్బితనమెల్లాను నీ కౌగిటిలోనే వున్నది। నిబ్బరము నీవుండేటి నీటులో నున్నది।
అబ్బురమై శ్రీవేంకటాధీశుడు నిన్నుగూడె। వుబ్బున నీతనికెంత వొరటలు చూపవే॥

**411)ఆహిరి / సారంగ**

ప॥ విరహాన బడలెను విభుడు యిందాకాను। పురుషార్థమిందు వంక బొందేదేమే॥

చ॥ కంతునిదీపమువై ఘుమ్మని భ్రమయించేవు। పొంత నిండు వంక నేమిపుణ్యమే నీకు।
పంతమున వలపించి పలుమారు నలిగేవు। యెంత లాభము గలిగె నిందు వంక నీకు॥

చ॥ చెరకు సింగణివై చెలువుని నేచేవు। గురిగా నెంత ధనము గూడెనే నీకు।
వెరగువడుచు నీవు వెంటవెంట దిప్పేవు। నెర దొరతనమెంత నేర్చితివె నీవు॥

చ॥ పూవుల గాలమవై పురుషుని దగిలేవు। వేవే యెంత రాజ్యమేలితిదె నీవు।
యీవల శ్రీవేంకటేశుడితడిట్టె నిన్నుగూడె। కైవశమై యెంత కొడిగట్టితివె నీవు॥

**412)నాగస్వరాళి**

ప॥ ఎట్టున్నదో నీమనసు యేమిసేతురా। యెట్టనెదుట బాయలే నేమిసేతురా॥

చ॥ చూచుదాకా వేగిరింత సొంపుగా విభుడ నీతో। దాచి మాటాడిన దాక దమకింతును।
చెచేత దమకింతు చేరువ దాకానిట్లనె। యేచి తమకమేనిండె నేమిసేతురా॥

చ॥ అట్టె నీ చెనకులకు నాసగింతు దనివోక। ముట్టి యాసగింతు నీమోవి తేనెకు।
గట్టిగా నంతటి మీద కౌగిటికి నాసగింతు। యెట్లైనా నాసలే నిండె నేమిసేతురా॥

చ॥ ఆదన నీమేనంటి అట్టె పరవశమవుదు। వదలక కూడి పరవశమవుదును।
పొదలి శ్రీవేంకటేశ పొందితివి నన్ను నిట్టే। యెదిరించె బరవశాలేమి సేతురా॥

**413)హెజ్జజ్జి / హిందోళ**

ప॥ మాపుదాకా రేపకాడ మాటకు మాటాడగాను। యేపున దెగని పనికేల పెట్టేవాన॥

చ॥ నవ్వినవ్వి మానేవు నడుమ నడుమ నీవు। జవ్వని యెవ్వతేమైనా సన్న సేసెనా।
వువ్విళ్ళూర నీనిజము వొరసి చూచే నింతే। యెవ్వరిందుకు గురయ్యేరేల పెట్టేవాన॥

చ॥ చప్పిచెప్పి కొంకేవు సిగ్గులు పడుతా నీవు। వుప్పటించనీడ నెవ్వరున్నారు నీకు।
రెప్పలెత్తి చూచి నిన్నురేచి వెదకేనింతే। యెప్పటి వాడవే నీవు యేల పెట్టేవాన॥

చ॥ ముట్టిముట్టి చూచేవు మొరగి నాకుచములు। యిట్టె యెవ్వతెవైనా యీడు వచ్చెనా।
నెట్టన శ్రీవేంకటేశ నిరతి మెచ్చితినింతే। యెట్టకేలకైన పనికేల పెట్టేవాన॥

**414)హెజ్జజ్జి / శంకరాభరణం**

ప॥ అదినీకు దారుకాణము అవునో కాదోకాని। కదిసి చెప్పగబోతే కతలయ్యీగాని॥

చ॥ కలలోన నీరూపు కన్నుల గన్నట్లయ్యీ। చెలగి ఆసుద్ది చెప్ప జింతయ్యీగాని।
వెలయ నీపలుకులు వీనుల విన్నట్లయ్యీ। సెలవి గమ్మర జెప్ప సిగ్గయ్యీగాని॥

చ॥ మంతనాన నీతో మాటలాడి నట్లయ్యీ। అంతట జూచితే వెరగయ్యీగాని।
కంతు సమరతి నిన్ను గాగలించినట్లయ్యీ। పంతాన నేమనినాను పచ్చిదేరీగాని॥

చ॥ వరుస నీమోవితేనె చవిగొన్న అట్లనయీ। వొరసి చూపబోతే గోరొత్తీగాని।
ఇరవయిన శ్రీవేంకటేశ నీవు ద్రిష్టముగా। సరుగ గూడిన నదె చాలాయగాని॥

**415)మాయామాళవగౌళ**

ప॥ అప్పటికప్పుడే కాక అంత యేటికి। యెప్పుడూ మనకు బోదు ఇందవయ్య విడెము॥

చ॥ తక్కి మాటున నున్నంత తడవు నిను దూరితి। నిక్కిచూడ బోతేను నీవే నేను।

కక్కసించనిక నిన్ను కడు నాసవెట్టకిక। యిక్కువలు గరగేను ఇందవయ్య విడెము॥
చ॥ గుట్టుతో నూరకుండగా గుణము వెరపులాయ। నెట్టుకొని మాటాడితే నీవే నేను।
పెట్టను రట్ల నిన్ను పెనగకుమిక నీవు। ఇట్టే నీమాటలు వింటి నిందవయ్య విడెము॥
చ॥ అరయ దూరకున్నందు కటునిటు బిగిసితి। నేరిచి పొందు సేసితే నీవే నేను।
కోరి శ్రీవేంకటేశుడ కూడితి మిద్దరమును। యీరీతి బాయకుందము ఇందవయ్య విడెము॥

**416)మంగళకైశిక**

ప॥ సారె దూర జాలనూ చలముల కోపమా। చేరితిమా చనవోలి చెన్ను ని భ్రమలను॥
చ॥ యీడకు బిలుపించెను యేమిసేయుమనీ నే-। వోడక తన యెదుట నున్నదానను।
పాడితో నీట ముంచనీ పాలముంచనీ తాను। వాడు దనవలపుల వలకు లోనైతిని॥
చ॥ మాటనన్ను నాడించెను మనసెట్టు దెలిసీ నే-। యేటికైనా నియ్యకొంటి నిదివో నేను॥
నాటిమాట చెల్లించీనా నగనీ తెగడనీ। మేటి పాయము తనకే మీదుగా నెత్తితిని॥
చ॥ కాగిట నన్ను నించెను కళ దాకె నిక నేలే-। దాగక తనకు నిట్టె దక్కితి నేను।
వీగక శ్రీవేంకటాద్రి విభుడు దానన్ను గూడె। యేగించనీ రేగించనీ యిరవైతి నేను॥

**417)మలహరి**

ప॥ ఇంకనేల వెరపు యెదుటనే వున్నారము। వంకలొత్తకిక మరి వద్దువద్దు యిపుడు॥
చ॥ వాపులు నీకెంచనేల వాడల గొల్లెతలకు। దేవరవు గావా తెలిసినదే।
యీవలమావంక నిట్టె యేమి చూచేవు తప్పక। మోవ నాడితిమిదివో మొదలనే నేము॥
చ॥ చందాలు చెప్పగనేల సతి నెత్తుక వచ్చితి-। విందుకు రాజవు గావా యెరిగినదే-।
దిందుపడి మమ్మునేల తిట్టేవు పెదవులను। నిందవేసితి మిదివో నిన్ననే నేము॥
చ॥ వెలినవ్వేల పదారువేలపెండ్లాడితివి। బలిమికాడవు గావా భావించినదే।
చెలగి పులివిందల శ్రీరంగదేవుడవని। కలసితిమిదె శ్రీవేంకటరాయ నేము॥

**418)సామంతం / కురంజి**

ప॥ చాలు చాలు నీ జాజర నన్ను। జాలి బరచేనీ జాజర॥
చ॥ వలపు వేదనల వాడెమ యీ-। తలనొప్పుల చే దలకేను।
పులకల మేనితో బొరలేను కడు। జలిగొని చల్లకు జాజర॥
చ॥ ఒల్లని నినుగొని వుడికేను నీ-। చిల్లర చేతుల జిమిడేను।
కల్లగంద వొడిగా గేనుపై। జల్లకు చల్లకు జాజర॥
చ॥ తివిరి వేంకటాధిప నేను నీ-। కవుగిట కబ్బితిగడు నేను।
రవరవ చమట గరగినేడు యిదె। చవులాయెను నీ జాజర॥

**419)రామక్రియ / ఖరహరప్రియ**

ప॥ వద్దే గొల్లెత వదలకువే నీ-। ముద్దుమాటలకు మొక్కేమయ్యా॥
చ॥ యేలే యేలే యేలే గొల్లెత। నాలాగెరగవా నన్నునే చేవు।
చాలుజాలు నికజాలు నీరచనలు। పోలవు బొంకులు పోవయ్యా॥
చ॥ కానీ కానీ కానిలే గొల్లెత। పోనీలే నీవెందు వోయినను।
మాని మాని పలుమారు జెనుకుచు మా-। తోనిటు సొలయక తొలవయ్యా॥
చ॥ రావా రావా రావా గొల్లెత। శ్రీవేంకటగిరి చెలువుడను।
నీవె నీవె నను నించితి కౌగిట। కైవశమైతిని గదవయ్యా॥

**420)గుండక్రియ**

ప॥ ఏ పురాణముల నెంత వెదికినా। శ్రీపతి దాసులు చెడరెన్నడును॥
చ॥ హరి విరహితములు అవిగొన్నాళ్ళకు। విరసంబులు మరి విఫలములు।

నరహరి గొలిచిటు నమ్మిన వరములు। నిరతము లెన్నడు నెలవులు చెడవు॥

చ॥ కమలాక్షుని మతిగానని చదువులు। కుమతంబులు బహు కుపథములు।
జమళి నచ్యుతుని సమారాధనలు। విమలములేకాని వితథముగావు॥

చ॥ శ్రీవల్లభుగతి జేరనిపదవులు। దావతులు కపట ధర్మములు।
శ్రీవేంకటపతి సేవించు సేవలు। పావనము లధిక భాగ్యపు సిరులు॥

**421)రామక్రియ / ఆరభి**

ప॥ అంగన యెట్టుండినా నమరుగాక। సంగతే నీకు నాపె సాటికి బెనగను॥

చ॥ తనకు బోదైనచోట తగిలి మాటాడకున్న। మనుజుడావాడు పెద్ద మాకు గాక।
చనవున బెనగగా సమ్మతించకుండితేను। ఘనత యేది చులకదనమే గాక॥

చ॥ చెల్లుబడి గలచోట సిగ్గులు విడువకున్న। బల్లిదుడా వాడూ కడు పందగాక।
వెల్లివిరి నవ్వగాను వీడు దోళ్ళాడకున్న। చల్లేటి వలపులేవి సటలింతే కాక॥

చ॥ తారుకాణలైన చీట తమకించి కూడకున్న। చేరగ జాణడా గోడచేరుపు గాక।
యీ రీతి శ్రీవేంకటేశ యిట్టె రఘునాథుడవై। కూరిమి గూడితివిది కొత్తలింతే కాక॥

**422)శంకరాభరణం**

ప॥ అక్కలాల చూడుడందరును। నిక్కివారవట్టీ నేడు గృష్ణుడు॥

చ॥ ఆనవాలవుట్టి అడకులవుట్టి। పానకపుటుట్టి బలిమినే।
ఆనుక కోలలనందియంది కొట్టి। తేనెవుట్టి గొట్టి దేవకిసుతుడు॥

చ॥ పెరుగువుట్టి మంచిపేరిన నేతివుట్టి। సరివెన్నవుట్టి చక్కెరవుట్టి।
వెరవుతో గొట్టి వెసబాలులతో। బొరుగువుట్టి గొట్టీపొంచి రాముడు॥

చ॥ మక్కువ నలమేలుమంగగూడి నేడు। చొక్కి శ్రీవేంకటేశుడు వీధుల।
నిక్కి వుట్లెల్లా నిండా గొట్టివుట్టి। చక్కిలాలు గొట్టీ జగతీశుడు॥

**423)గుజ్జరి**

ప॥ ఎక్కడి పాపము లెక్కడి పుణ్యము- । లొక్కట గెలిచితి మోహో నేము॥

చ॥ ప్రపన్నులెదుటను బడినయాతుమకు। చపలత మరి నాశము లేదు।
ఉపమల గురుకృపనొనరిన మనసుకు। రపముల మరి నేరములే లేవు॥

చ॥ ఘనతరద్వయాధికారగు దేహికి। మినుకుల భవభయమే లేదు।
చనువుల హరిలాంఛన కాయమునకు। వెనుకొను కర్మపువెట్టియు లేదు॥

చ॥ శ్రీవేంకటేశ్వరు జేరిన ధర్మికి। ఆవల మరి మాయలు లేవు।
కైవశమాయను కైవల్య పదమును। జావు ముదిమితో నడ్డే లేదు॥

**424)దేసాక్షి**

ప॥ అనరాదు వినరాదు ఆతని మాయలు నేడు। దినదిన క్రొత్తలాయ ద్రిష్టమిదే మాకు॥

చ॥ ఆడెడి బాలుల హరి అంగలి చూపుమని। తోడనే వాండ్ల నోర దుమ్ములు చల్లి।
యీడమాతో చెప్పగాను యిందరము గూడిపోయి। చూడపోతే పంచదారై చోద్యమాయనమ్మా॥

చ॥ తీట తీగెలు సొమ్మంటూ దేహము నిండ గట్టి। తీటకుగాక బాలులు తెగి వాపోగా।
పాటించి యీసుద్దివిని పారితెంచి చూచితేను। కోటికోటి సొమ్ములాయ కొత్తలోయమ్మా॥

చ॥ కాకి జున్ను జున్నులంటా గంపెడేసి తినిపించి। వాకొలిపి బాలులెల్ల వాపోగా।
ఆకడ శ్రీవేంకటేశుడా బాలుల కంటి నీరు। జోకగ ముత్యాలుసేసె జూడగానే నేము॥

**425)శ్రీరాగం**

ప॥ ఇతరులకు నిను నెరుగదరమా॥

అప॥ సతతసత్యవ్రతులు సంపూర్ణమోహవిర- । హితులెరుగుదురు నిను నిందిరారమణా॥

చ॥ నారీకటాక్షపటునారాచభయరహిత- । శూరులెరుగుదురు నిను జూచేటిచూపు।
ఘోరసంసార సంకులపరిచ్ఛేదులగు- । ధీరులెరుగుదురు నీదివ్యవిగ్రహము॥
చ॥ రాగభోగవిదూర రంజితాత్ములు మహా- । భాగులెరుగుదురు నిను బ్రణుతించువిధము।
ఆగమోక్తప్రకారాభిగమ్యులు మహా- । యోగులెరుగుదురు నీవుండేటివునికి॥
చ॥ పరమభాగవత పదపద్మసేవానిజా- । భరణు లెరుగుదురు నీపలికేటిపలుకు।
పరగునిత్యానంద పరిపూర్ణమానస- । స్థిరు లెరుగుదురు నిను దిరువేంకటేశ॥

**426) నాట**

ప॥ ఎవ్వరెవ్వరివాడో యీజీవుడు చూడ। నెవ్వరికి నేమౌనో యీజీవుడు॥
చ॥ ఎందరికి గొడుకుగా డీజీవుడు వెనుక- । కెందరికి దోబుట్ట డీజీవుడు।
యెందరిని భ్రమయించ డీజీవుడు దుఃఖ- । మెందరికి గావింప డీజీవుడు॥
చ॥ ఎక్కడెక్కడ దిరుగ డీజీవుడు వెనుక- । కెక్కడో తనజన్మ మీజీవుడు।
యెక్కడి చుట్టము దనకు నీజీవుడు యెప్పు- । డెక్కడికి నేగునో యీజీవుడు॥
చ॥ ఎన్నడును జేటులేనీజీవుడు వెనుక- । కెన్నిదనువులు మోవ డీజీవుడు।
యెన్నగల తిరువేంకటేశు మాయల దగిలి। యెన్నిపదవుల బొంద డీజీవుడు॥

**427) శ్రీరాగం / తోడి**

ప॥ ఎన్నిబాధలబెట్టి యేచెదవు నీవింక యెంతకాలముదాక కర్మమా।
మన్నించుమనుచు నీమరుగు జొచ్చితిమి మామాటాలకించవో కర్మమా॥
చ॥ ప్రతిలేని దురితముల పాలుసేయక నన్ను పాలించవైతివో కర్మమా।
తతితోడ నాత్మపరితాపంబు తోడుతను తగులేల చేసితివో కర్మమా।
జితకాములకుగాని చేతికిని లోనయి చిక్కవేకాలంబు కర్మమా।
మతిహీనులైనట్టి మాకునొక పరిపాటి మార్గంబు చూపవో కర్మమా॥
చ॥ ఆసలనియెడి తాళ్ళ నంటగట్టుక విధికి నప్పగించితివిగదె కర్మమా।
వాసి విడిచితిమి నీవారమైతిమి మమ్ము వన్నె చెడనీకువో కర్మమా।
కాసుకును గొరగాని గతిలేని పనికిగా కాలూదనీవేల కర్మమా।
ఓసరించొక మారు వొయ్యనే వొకరీతి నొల్లనని తలగుమీ కర్మమా॥
చ॥ తిరువేంకటాచలాధిపుని మాయలచేత దెసల దిరిగినయట్టి కర్మమా।
హరిదాసులగువారి నాదరింతువుగాక అంత నొప్పింతువా కర్మమా।
వరుస నేనుగుమీదివాని సున్నంబడుగ వచ్చునా నీకిట్ల కర్మమా।
పరమపురుషోత్తముని భ్రమతబడి నీవిట్ల బట్టబయలైతిగా కర్మమా॥

**428) పాడి / ఝుంఝూటి**

ప॥ ఏలే యేలే మరదలా చాలుజాలు చాలును। చాలు నీతోడి సరసంబు బావ॥
చ॥ గాటపు గుబ్బలు గదలగ గులికేవు। మాటల దేటల మరదలా।
చీటికి మాటికి జెనకేవే వట్టి। బూటకాలు మానిపోవే బావ॥
చ॥ అందిందె నన్ను నదలించి వేసేవు। మందమేలపు మరదలా।
సందుకో దిరిగేవి నటకారివో బావ। పొందుగాదిక బోవే బావ॥
చ॥ చొక్కపు గిలిగింతల చూపుల నన్ను। మక్కువ సేసిన మరదలా।
గక్కున నను వేంకటపతి కూడితి। దక్కించుకొంటివి తగులైతి బావ॥

**429) శంకరాభరణం**

ప॥ ఛీ ఛీ నరులదేటి జీవనము। కాచుక శ్రీహరి నీవే కరుణింతుగాక॥
చ॥ అడవిలో మృగజాతియైన గావచ్చుగాక। వడి నితరుల గొలువగ వచ్చునా।

*****************************************************************************************************************************

వుడివోని పక్షియై వుండనైనవచ్చుగాక। విడుపకెవ్వరినైనా వేడవచ్చునా॥
చ॥ పసురమై వెదలేని పాటుపడవచ్చుగాక। కసివో నొరుల బొగడగావచ్చునా।
వుసురుమానై పుట్టి వుండనైనవచ్చుగాక। విసువక వీరివారి వేసరించవచ్చునా॥
చ॥ యెమ్మెల బుణ్యాలుసేసి యిల యేలవచ్చుగాక। కమ్మి హరిదాసుడు గావచ్చునా।
నెమ్మది శ్రీవేంకటేశ నీ చిత్తమేకాక। దొమ్ముల కర్మములివి తోయవచ్చునా॥

**430) శంకరాభరణం / హుసేని**

ప॥ జవ్వాది మెత్తినది తన। జవ్వనమే జన్నె వట్టినది॥
చ॥ ముద్దుల మాటలది చెక్కు- । టద్దముల కాంతి నలరినది।
గద్దరి చూపులది తన। వొద్ది చెలియమీద నొరగున్నది॥
చ॥ పుత్తడి బోలినది తన। చిత్తము నీ సొమ్ము చేసినది।
గుత్తపు గుబ్బలది అల। చిత్తజును లెక్కసేయనిది॥
చ॥ ఎమ్మెలు యెరుగనిది తన। కెమ్మోవి జిరునవ్వు గెరలున్నది।
కమ్ముకొనగా వెంకటరాయా నీ। నీకమ్మని కౌగిట గలసున్నది॥

**431) శంకరాభరణం**

ప॥ గురుతెరిగిన దొంగ కూగూగు వీడె। గురిలోనె దాగీనీ కూగూగు॥
చ॥ నెలతల దోచీనీ నీళ్ళాడగానే। కొలని దరిని దొంగ కూగూగు।
బలువైన పుట్ల పాలారగించీనీ। కొలది మీరిన దొంగ కూగూగు॥
చ॥ చల్లలమ్మగ చనుకట్టు దొడకీని। గొల్లెతలను దొంగ కూగూగు।
యిల్లిల్లు దప్పక ఇందరి పాలిండ్లు। కొల్లలాడిన దొంగ కూగూగు॥
చ॥ తావుకొన్న దొంగ దగిలి పట్టుడిదె। గోవులలో దొంగ కూగూగు।
శ్రీవేంకటగిరి చెలువుడో యేమో। కోవిదుడగు దొంగ కూగూగు॥

**432) గౌళ**

ప॥ తరుణి మేనికిని నీ తనువె మాటు। నిరుతపుటాసకు నిండు జూపె మాటు॥
చ॥ చెలియ సిగ్గులకు చెక్కు చేయే మాటు। పలుకులకును మోవి పండే మాటు।
నెలకొన్న చింతలకు నివ్వెరగే మాటు। బలు జవ్వనమునకును పయ్యెదే మాటు॥
చ॥ ముంచిన నవ్వులకును మొక్కులివే మాటు। మంచి నడపులకు మట్టెలే మాటు।
వంచిన శిరస్సునకు వాలుగొప్పే మాటు। కొంచని చనులకు కొనగోరే మాటు॥
చ॥ పొందుల రతులకును పుక్కిటి విడెమే మాటు। అందిన వేడుకకౌ నాయములె మాటు।
విందుల రతులకు వేవేలు వలపులె మాటు। యిందుముఖికై శ్రీవేంకటేశ నీ యింపె మాటు॥

**433) సాళంగనాట**

ప॥ నమో నమో దానవవినాశక చక్రమా। సమర విజయమైన సర్వేశు చక్రమా॥
చ॥ అట్టె పదారు భుజాల నమరిన చక్రమా। పట్టిన ఆయుధముల బలు చక్రమా।
నెట్టన మూడుగన్నుల నిలచిన చక్రమా। రట్టుగా మన్నించవే మొరయుచు చక్రమా॥
చ॥ అరయ నారుగోణాల నమరిన చక్రమా। ధారలు వేయిటి తోడి తగు చక్రమా।
ఆరక మీదికి వెళ్ళే అగ్ని చక్రమా। గారవాన నీదాసుల గావవే చక్రమా॥
చ॥ రవిచంద్రకోటి తేజరాసియైన చక్రమా। దివిజసేవితమైన దివ్య చక్రమా।
తవిలి శ్రీవేంకటేశు దక్షిణకర చక్రమా। యీవల నీదాసులము యేలుకోవే చక్రమా॥

**434) శుద్ధవసంతం**

ప॥ నీకేమయ్య నీకు నీవే దొడ్డవాడవు। చేకొని చెట్టడిచితే చేటడేసి వాపులు॥
చ॥ తలపోత లొక్కటైతే తమకమినుమడాయ। నిలువుకు నీవే బేరము।

కొలిచినందే కొలిచి గోపికల్ల కెల్లాను। వలప్వ దీసితిగా వలపులనీవు॥

చ॥ నగవులు మానెడైతే ననుపులడ్డె డేశాయ। నిగిడే నన్నిచోట్లా నీ బేరము।
అగడుగా నాగిచ్చి అంగనల కెల్లాను। జిగి వడ్డికొంటివి సిగ్గులెల్లా నీవు॥

చ॥ మోవితేనగ్గువలైతే ముదములు లాభమాయ। నీవు నన్ను గూడినదే నీ బేరము।
భావించి శ్రీవేంకటేశ పడతుల కెల్లాను। వావాత నమ్మితివిగా వయసులు నీవు॥

**435) పాడి**

ప॥ పుట్టుభోగులము నేము భువి హరిదాసులము। నట్టనడిమి దొరలు నాకియ్యవలెనా॥

చ॥ పల్లకీలు నందనాలు పడివాగె తేజీలు। వెల్లవిరి మహాలక్ష్మి విలాసములు।
తల్లియాకె మగనినే దైవమని కొలిచేము। వొల్లగే మాకే సిరులు వొరులియ్యవలెనా॥

చ॥ గ్రామములు వస్త్రములు గజముఖ్య వస్తువులు। ఆమని భూకాంతకు నంగభేదాలు॥
భామిని యాకె మగని ప్రాణధారి లెంకలము। వోలి మాకాతడే యిచ్చీ వొరులియ్యవలెనా॥

చ॥ పసగల పదవులు బ్రహ్మ నిర్మితములు। వెస బ్రహ్మతండ్రి శ్రీవేంకటేశుడు।
యెసగి యాతడే మమ్మునేలి యిన్నియు నిచ్చె। వొసగిన మాసొమ్ములు వొరులియ్యవలెనా॥

**436) రామక్రియ**

ప॥ రసికుడ తిరుపతి రఘువీరా। కొసరుగాదు నాలోని కూరిములు గాని॥

చ॥ వెలయ నీ విరిచిన విల్లువంటిది గాదు। విలసిల్ల నాబొమ్మల విండ్లు గాని।
చెలగి తపసుచేసీ చిత్రకూటగిరి గాదు। గిలుకొట్టు నా కుచగిరులు గాని॥

చ॥ మేటిపైన నీవు వేసిన మొకము చూపు గాదు। సూటి దప్పని నా కనుచూపులు గాని।
గాటమై నీవు సేతువుగట్టిన జలధి గాదు। చాటున నా చెమటల జలధులు గాని॥

చ॥ తగ నీవు గెలచిన దనుజ యుద్ధము గాదు। దగతోడి నా మదన యుద్ధము గాని।
నగు శ్రీవేంకటేశ కనకసతి పొందు గాదు। పొగడే సీతనైన నా పొందులు గాని॥

**437) రామక్రియ / బలహంస**

ప॥ సులభుడు మధుసూదనుడు మన-। మెలమి నమ్మిన నిట్టేనుండీ॥

చ॥ పడుచుమాటన కాప్రహ్లాదునెదుట। పొడచూపె నాదిపురుషుడు।
అడవిదేహనక ఆదంతిమొరకును। తడవికాచిన దైవముసుండీ॥

చ॥ ఆడుమాటలనక అంతలో ద్రౌపదిని। వాడిమి గాచినవరదుడు।
పోడిమి బేదనక పొందినకుచేలుని। వీడె సంపదిచ్చె విష్ణుడు సుండీ॥

చ॥ వీరువారన కిదె వేడినవరములు। సారెకు నిచ్చిన సర్వేశుడు।
మేరతో లోకముల మెరసె నిప్పుడును। యీరీతి శ్రీవేంకటేశుడేసుండీ॥

**438) ధన్యాసి**

ప॥ కింకదీర 'నదైవం కేశవాత్పర'మని। ఉంకువైననాలో నీవుపమలివే॥

చ॥ కంటి నీవొక్కడివే లోకములకు దైవమని। వొంటి మరి నిన్నుబోల నొకరిగాన।
వింటినీవే ఘనమని వేదాంతమందు నీ-। కంటె నితరము విన గరుణానిధీ॥

చ॥ తోచె నాకు నీసేవే తుదిపదమని, మరి। తోచదీబుద్ధికి, సరితూగ దెందును।
పూచి నాగురుడు నిన్నే బోధించేగాని మరి। దాచడాయ నీమహిమ ధరణీధరా॥

చ॥ సమ్మతించె నామతి జవియైనీకథలె। సమ్మతించ దెక్కడోరచ్చలసుద్దులు।
నమ్మిక శ్రీవేంకటేశ నంటున నీపాదాలే। నమ్మితి నేమియు నమ్మ నారాయణా॥

**439) దేవగాంధారి**

ప॥ విధినిషేధములకు వెరువగబనిలేదు। మధుసూదన నిమన్నన దాసుడైతే॥

చ॥ విడువరాని ధర్మవిధుల పురుషులను। విడిచి గోపికలు విచ్చనవిడి।

బడినిన్ను దగులుటే పరమధర్మమాయ। యెడయునితరధర్మా లికనేటికయ్యా॥

చ॥ మానరానికర్మమార్గములటు మాని। పూనినయతులే పూజ్యులట।
నీనారాయణనియతే ధర్మమాయ। యీనిజ మొకటియు నెరుగగవలయు॥

చ॥ యిన్నిట శ్రీవేంకటేశ నీదాసుడై-। వున్న విచారాల నొదుగనేలా।
నిన్నుగూర్చినట్టి నిజభక్తిగలదని। తిన్ననై తెలిపేటితెలివే కలది॥

**440) వరాళి / సింధుభైరవి**

ప॥ రామ రామచంద్ర రాఘవా రాజీవలోచన రాఘవా।
సౌమిత్రిభరతశత్రుఘ్నులతోడ జయమందు దశరథరాఘవా॥

చ॥ శిరసుకూకటులరాగవా చిన్నారిపొన్నారిరాఘవా।
గరిమ నావయసున దాటకి జంపిన కౌసల్యనందన రాఘవా।
అరిదియజ్ఞముగాచు రాఘవా అట్టె హరివిల్లువిరచినరాఘవా।
సిరులతో జనకునియింటను జానకి జెలగిపెండ్లాడిన రాఘవా॥

చ॥ మలయునయోధ్యారాఘవా మాయామృగాంతకరాఘవా।
చెలగి చుప్పనాతిగర్వ మడచి దైత్యసేనల జంపినరాఘవా।
సొలసి వాలి జంపి రాఘవా దండిసుగ్రీవునేలినరాఘవా।
జలధిబంధించినరాఘవా లంకసంహరించినరాఘవా॥

చ॥ దేవతలుచూడ రాఘవా నీవు దేవేంద్రురథమెక్కి రాఘవా।
రావణాదులను జంపి విభీషణు రాజ్యమేలించిన రాఘవా।
వేవేగ మరలి రాఘవా వచ్చి విజయపట్టమేలి రాగవా।
శ్రీవేంకటగిరిమీద నభయము చేరిమాకిచ్చిన రాఘవా॥

**441) గుజ్జరి**

ప॥ ఇటుగన సకలోపాయము లుడిగిన యీశ్వరుడే రక్షకుడు।
తటుకున స్వతంత్రముడిగినయాత్మకు తగునిశ్చింతయే పరమసుఖము॥

చ॥ ఆకటి కడుగనిశిశువుకు దల్లి యడిచిపాలు ద్రాగించినరీతి।
యీకడ గోరికలుడిగినయోగికి నీశ్వరుడే రక్షకుడు।
చేకొని బుద్దెరిగినబిడ్డలపై జింతింపరు తొల్లిటివలె దల్లులు।
యీకొలదులనే స్వయత్నదేహుల కీశ్వరుడును వాత్సల్యము వదలు॥

చ॥ తతిగరిరాజు గాచినయట్లు ద్రౌపదిమానము గాచినయట్లు।
హితమతి స్వతంత్రముడిగినయోగికి యీశ్వరుడే రక్షకుడు।
అతడును భస్మంబయ్యెననాడు అజునిశిరంబటు ద్రుంచిననాడు।
చతురుడు దానడ్డమురాడాయను స్వతంత్రముడుగని జీవుడుగాన॥

చ॥ దిక్కని యనిశము జిత్తములోన జింతించేటి శరణాగతజనులకు।
యిక్కడనక్కడ శ్రీవేంకటాగిరియీశ్వరుడే రక్షకుడు।
మక్కువతో దనయంతర్యామిని మరచినస్వామిద్రోహులకెల్లా।
అక్కరతో బుట్టుగులే భోగ్యం బహంకారము విడువరుగాన॥

**442) దేసాళం / ఖరహరప్రియ**

ప॥ పరులసేవలు చేసి బ్రదికేరటా। సిరివరుదాసులు సిరులందు టరుదా॥

చ॥ కోరి వొకనరుని గొలిచనవారలు। ధీరులై సలిగెల దిరిగేరట।
కూరిమి బ్రహ్మాండకోటులేలేడివాని-। వారలింతట జనవరులౌ టరుదా॥

చ॥ చేకొన్న తుమ్మిదచేపడ్డకీటము-। లాకడ దుమ్మిదలయ్యీనట।

శ్రీకాంతుని పాదసేవకులగువార- । లేకులజులయినా నెక్కుడౌ టరుదా॥
చ॥ ధరణీశునాజ్ఞల తమదేశములందు। సిరులనాణెపుముద్ర చెల్లినట।
తిరువేంకటాద్రి శ్రీదేవునిముద్రలు। ధరియింపగా నింతట జెల్లుటరుదా॥

**443)సాళంగం / తోడి**

ప॥ పనిమాలినట్టి వట్టిపరదుగాక మాకు। ననిచి యిదియు నొక్కనగుబాటా॥
చ॥ కన్నవారినెల్లా వేడేకష్టమే దక్కుటగాక। పన్ని దైవమియ్యనిది పరులిచ్చేరా।
యెన్నికతో దేహమిచ్చె నిహమెల్లా జెందనిచ్చె। వున్నవారింతటిపని కోపగలరా॥
చ॥ బడలి తానెందైనా బడ్డపాటేదక్కెగాక। కడగి రానిదిదే నొక్కరివసమా।
కడుపులో నుండగానే కలవి నుదుట వ్రాసె। తడవి దైవముచేత దాటవసమా॥
చ॥ దెప్పరపుసంపదకు దిమ్మటలే దక్కెగాక। యెప్పుడూ శ్రీవేంకటేశు డీకమానీనా।
చప్పుడుగా నతనికే శరణన్న జాలుగాక। తప్పులును వొప్పులు నాతనివేకావా॥

**444)దేసాళం / హిందోళ**

ప॥ వీనిజాచియైన నేము విరతిబొందగలేము। పూని మాబ్రదు కిందుబోలదాయగా॥
చ॥ పరుల వేడగబోవు పరనిందకు జొరవు। పరమపురుషార్థమే ఫలవృక్షతతులెల్ల।
నరులమై ఘనులమై నానాబుద్ధులెరిగి। పారి మాబ్రదుకు లిందుబోలదాయగా॥
చ॥ కామక్రోధాదులు లేవు కామతత్త్వ మెఅగవు। కామించినట్లవు నెక్కడనైనా శిలలివి।
దీమసము గలిగియు దెలివి గలిగియును। భూమిలో మాబ్రదుకు కిందుబోలదాయగా॥
చ॥ వొకరి గొలువబోవొ వొకపంట సేయబోవు। వొకమానిగూడు చేరివుండు పక్షులాడనాడ।
వొకశ్రీవేంకటపతి నమ్మియుండలేము। మొకమో మాబ్రదు కిందుబోలదాయగా॥

**445)గుజ్జరి**

ప॥ ఇంతే మరేమిలేదు యిందుమీదను। దొంతులకర్మాలు దుమ్ముదూరుపెత్తుట॥
చ॥ వుల్లములో నుండి దేహమొగి రక్షించేహరి- । నొల్లకున్న తన్ను దానొల్లకుండుట।
బల్లిదు డతని మానిపరుల వేడేదెల్లా। పొల్లకట్టు దంచిదంచి పోగుసేసుకొనుట॥
చ॥ యెయ్యెడా బుణ్యఫలము లేమి గలిగిన హరి- । కియ్యకున్న నది దైవమియ్యకుండుట।
చెయ్యార నాతని కొప్పుసేయని భోగములెల్లా। చయ్యన జెరకుబిప్పి చవిగొనుట॥
చ॥ శ్రీకాంతుడైనట్టి శ్రీవేంకటేశ్వరుని। జేకొంటె సిరులెల్లా జేకొనుట।
మేకులశ్రీహరినామమే నోరనుడుగుట। కైకొన్న యమృతపుగందు వగుట॥

**446)ఆహిరి**

ప॥ ఇతర ధర్మము లందు నిందు గలదా। మతి దలప పరము నీమతముననే కలిగె॥
చ॥ విదురునకు బరలోకవిధి చేసెనట తొల్లి। అదె ధర్మసుతుడు వర్ణాశ్రమంబులు విడిచి।
కదిసి నీదాసుడైన కతముననేకాదె యీ- । యెదురనే తుదిపదం బిహముననే కలిగె॥
చ॥ అంటరానిగద్దకుల మంటి జటాయువుకు నీ- । వంటి పరలోకకృత్యములు సేసితివి మును।
వెంట నీకైంకర్యవిధి కలిమినేకాదె। వొంటి నీహస్తమున యోగ్యమై నిలిచె॥
చ॥ యిరవైనశబరిరుచు లివియె నైవేద్యమై। పరగెనట శేషమును బహువిధములనక।
ధర దదీయప్రసాదపు విశేషమేకాదె। సిరుల శ్రీవేంకటేశ చెల్లుబడులాయె॥

**447)సాళంగనాట / జగన్మోహిని**

ప॥ దేవదేవు డెక్కెనదె దివ్యరథము। మావంటివారికెల్ల మనోరథము॥
చ॥ జగతి బాలులకై జలధులు వేరజేసి। పగటున దోలెనదె పైడిరథము।
మిగులగ గోపగించి మెరయురావణమీద। తెగ యెక్కి తోలెనదె దేవేంద్రరథము॥
చ॥ దిక్కులు సాధించి సీతాదేవితో నయోధ్యకు। బక్కన మరలిచె బుష్పరథము।

నిక్కి నరకాసురునిపై నింగిమోవ నెక్కి తోలె। వెక్కసపు రెక్కలతో విష్ణురథము॥

చ॥ బలిమి రుక్మిణి దెచ్చి పరులగెలిచి యెక్కె। అలయేగుబెండ్లి కల్యాణరథము।
యెలమి శ్రీవేంకటాద్రి నలమేలుమంగ గూడి। కలకాలమును వేగె ఘనమైనరథము॥

**448) కాంభోజి**

ప॥ ఏమిసేతువు దేవదేవ యింతయును నీమాయ। కామినుల జూచిమాచి కామించె భవము॥

చ॥ చంచలపు గనుదోయి సతులబారికి జిక్కి। చంచలమందెను నాదిచ్చరిమనసు।
కంచుగుత్తికలవారి గానములజొక్కిచొక్కి। కంచుబెంచునాయబో నాకడలేనిగుణము॥

చ॥ తీపులమాటల మించి తెరవలభ్రమ దరి-। తీపులపాలాయబో నాతెలివెల్లాను।
పూపలనవ్వులతోడి పొలతుల జూచిచూచి। పూపలుబిందెలునై పొల్లువోయ దపము॥

చ॥ కూటమి సతులపొందు కోరికోరి కూడికూడి। కూటువ నావిరతెందో కొల్లబోయను।
నీటున శ్రీవేంకటేశ నినుగని యింతలోనె। జూటరినై యింతలోనె సుజ్ఞానినైతి॥

**449) బౌళి**

ప॥ ఏమీ నడుగనొల్ల హెచ్చుకుందు లననొల్ల। కామించి నీవిచ్చితివి కైవల్యపదము॥

చ॥ పుట్టుగులకు వెరవ భువిలోన హరి నీకు-। నిట్టె నీదాసుడ నే నైతేజాలు।
వెట్టికి నేజాతియైన వెరువ నీనామములు। వొట్టి నానాలికమీద నుంటే జాలు॥

చ॥ దురితాలకు వెరవ తుద వేయైనా హరి నీ-। కరుణ గైంకర్యము గలిగితే జాలు।
నిరతి నింద్రియాలకు నే వెరవ నీవాత్మ। బెరరేపకుడవై పెరిగితే జాలు॥

చ॥ యేలోకమైనా వెరవ యెప్పుడూ శ్రీవేంకటేశ। పాలించి నీకృప నాపై బారితే జాలు।
కాలమెట్లయినా వెరవ కర్మ మేట్టయినా వెరవ। యేలిననీదాసులు నన్నియ్యకొంటే జాలును॥

**450) భూపాళం**

ప॥ కనియు గాననిమనసు కడమగాక। యెనలేని హరిమహిమకిది గురుతుగాదా॥

చ॥ కనుకలిగి హరిగొలిచి ఘనులైరిగాక మును। మనజులే కారా మహరుషులును।
మనసులో నిపుడైన మరిగి కొలిచినవారు। ఘనులౌట కిదియు నిక్కపు గురుతుగాదా॥

చ॥ భావించి హరిగొలిచి పదవులందిరిగాక। జీవులే కారా దేవతలును।
కావించి కొలిచినను ఘనపదవు లేమరుదు। యేవలన నిందరికి నిది గురుతుగాదా॥

చ॥ పన్ని హరిగొలిచి నేర్పరులైరిగాక ధర-। నున్నవారే కారా యోగివరులు।
యెన్నికల శ్రీవేంకటేశు నమ్మినవార-। లిన్నియును జేకొనుటకిది గురుతుగాదా॥

**451) మలహరి**

ప॥ వలెననువారిదె వైష్ణవము యిది। వలపుదేనెవో వైష్ణవము॥

చ॥ కోరికలుడుగుచు గురి నిన్నిటిపై। వైరాగ్యమెపో వైష్ణవము।
సారెకు గోపము జలమును దనలో। వారించుటవో వైష్ణవము॥

చ॥ సుడిగొను దేహపు సుఖదుఃఖములో। వడి జొరవిదెపో వైష్ణవము।
ముడివడి యింద్రియములకింకరుడై। వడబడనిదెపో వైష్ణవము॥

చ॥ వుదుటున దనసకలోపాయంబులు। వదలుటపో వైష్ణవము।
యెదుటను శ్రీవేంకటేశ్వరునామము। వదనము చేర్చుట వైష్ణవము॥

**452) పాడి**

ప॥ శ్రీహరిసేసినచిహ్నాలివి యీ-। మోహము విడుచుట మోక్షమది॥

చ॥ మలినంబేది మణుగననేది। కలుషపుమలముల కాయమిది।
కలిగినదేది కడులేందేది। చలనపుమాయల జన్మమిది॥

చ॥ తనిసినదేది తనియనిదేది। దినదినమాకలి దీరదిది।

కొనయిందేది గురిమొదలేది। పనిగొనుకర్మపు బంధమిది॥

చ॥ నిండినదేది నిండనిదేది। కొండలపొడపుల కోరికది।
అండనే శ్రీవేంకటాధిపు శరణని। వుండుటె యిహపర యోగమది॥

**453)సాళంగభైరవి**

ప॥ దైవమా నీకు వెలితా తలపువెలితేకాక। వేవేలు కర్మల వేసారగవలనె॥

చ॥ హరియంటే బాపేటి అన్నిపాపాలు సేసిన। పొరినందుపై నమ్మిక పుట్టుదుగాక।
నరసింహాయంటే వచ్చే నానాపుణ్యాలకు। తిరముగా ఋణములు దీర్చుకొనగలనా॥

చ॥ దేవ జగన్నాథయంటే తెగనిజన్మములేవి। కైవశము నామనసు గాదుగాక।
గోవిందయనియంటే గూడని పదవులేవి। కావిరిగాలమూరకె కడపేము నేము॥

చ॥ వేదనారాయణయంటే వీడేటి బంధములు। ఆదిగా మూడులోకాలనైనా నున్నదా।
శ్రీదేవిపతియైన శ్రీవేంకటేశ్వరుడా। యేదెసా నీవే నన్ను యీడేర్తువుగాక॥

**454)లలిత**

ప॥ సర్వాంతరాత్ముడవు శరణాగతుడ నేను। సర్వాపరాధినైతి చాలుజాలునయ్యా॥

చ॥ వూరకున్నజీవునికి వొక్కొక్క స్వతంత్రమిచ్చి। కోరేటియపరాధాలు కొన్ని వేసి।
నేరకుంటే నరకము నేరిచితే స్వర్గమంటూ। దూరువేసేవింతేకాక దోషమెవ్వరిదయ్యా॥

చ॥ మనసు చూడవలసి మాయలు నీవే కప్పి। జనులకు విషయాలు చవులుచూపి।
కనుగొంటే మోక్షమిచ్చి కానకుంటె కర్మమిచ్చి। ఘనము సేసేవిందు కర్తలెవ్వరయ్యా॥

చ॥ వున్నారు ప్రాణులెల్లా నొక్కనీగర్భములోనే। కన్నకన్న భ్రమతలే కల్పించి।
యిన్నిటా శ్రీవేంకటేశ యేలితివి మమ్ము నిట్టె। నిన్ను నన్ను నెంచుకుంటే నీకే తెలియునయ్యా॥

**455)దేవగాంధారి**

ప॥ మిక్కిలిపుణ్యులు హరి మీదాసులే హరి। తక్కినవారు మీకృపదప్పినవారు హరి॥

చ॥ వున్నతపుసంపదల నోలలాడేయట్టివాడు। మున్నిటజన్మాన నీకు మొక్కినవాడు హరి।
పన్ని పడనిపాట్ల బరులగొలిచేవాడు। వున్నతిమిము సేవించనొల్లనివాడు హరి॥

చ॥ పూని దేవేంద్రాదులై పొడవుకెక్కినవారు। శ్రీనాథ మిమ్మునే పూజించినవారు హరి।
నానారకముల నలగుచుండేవారు। నానాడే నీమహిమ నమ్మినవారు హరి॥

చ॥ పావనులై నిజభక్తిబ్రపన్నులయ్యినవారు। శ్రీవేంకటేశ మిమ్ము జేరినవారె హరి।
వేవేలుదేవతలవెంట దగిలేటివాడు। కావించి మిమ్మెరుగనికర్మి యాతడే హరి॥

**456)ముఖారి**

ప॥ చెప్పినంతపని నేజేయగలవాడ నింతే। అప్పటి నపరాధమా ఆదరించవలదా॥

చ॥ నీయాజ్ఞ దేహము నేమోచితి నింతే। యీయెడ విజ్ఞానమేల యియ్యవయ్యా।
వేయివేలై వేగుదాకా వెట్టిసేసి యలసితి। వొయ్యన కొంతైన వూరడించ వలదా॥

చ॥ నీవుసేసే కర్మము నేజేయువాడ నింతే। యీవల నానాందసుఖ మియ్యవయ్యా।
కోవరమై వెంటవెంట గొలిచినబంట్లకు। తావుల గొంతవడైనా దప్పిదీర్చవలదా॥

చ॥ మతిలో శ్రీవేంకటేశ మనికైనవాడ నింతే। తతి నాపాటుకు దయదలచవయ్యా।
యితవై పనిసేసేటి యింటిపసురమునకు। వెతదీర్చ బాలార్చి వెడ్డువెట్టదగదా॥

**457)బౌళి**

ప॥ వెర్రివాడు వెర్రిగాడు విష్ణుదాస్యము లేక। విర్రవీగేయహంకారి వెర్రివాడు॥

చ॥ నాలుకపై శ్రీహరినామమిట్టే వుండుగాను। జోలితో మరచిననీచుడే వెర్రివాడు।
అలరియీజగమెల్లా హరిరూపై వుండగాను। వాలి తలపోయనివాడు వెర్రివాడు॥

చ॥ కూరిమి బ్రహ్మాండాలు కుక్షినున్న హరికంటే। కోరివేరె కలడనేకుమతి వెర్రివాడు।

చేరి తనయాత్మలోన శ్రీరమణుడుండగాను। దూరమై తిరుగువాడే దొడ్డ వెర్రివాడు॥

చ॥ సారపు శ్రీవేంకటేశు శరణాగతి వుండగా। సారె గర్మములంటేడి జడుడు వెర్రివాడు।
చేరువ నాతనిముద్ర చెల్లుబడి నుండగా। మోరతోపైవున్న వాడే ముందు వెర్రివాడు॥

**458) మాళవి / బేగడ**

ప॥ నిత్యులు ముక్తులు నిర్మలచిత్తులు నిగమాంతవిదులు వైష్ణవులు।
సత్యము వీరల శరణనిబ్రదుకరో సాటికి బెనగక జడులాల॥

చ॥ సకలోపాయశూన్యులు సమ్యగ్జ్ఞానులు।
అకలంకులు శంఖచక్రలాంఛనులన్నిట బూజ్యులు వైష్ణవులు।
వొకటీ గోరరు వొరుల గొలువరు వొల్లరు బ్రహ్మాదిపట్టములు।
అకటా వీరలసరియన భపంబారుమతంబుల పూతతోకలన్॥

చ॥ మంత్రాంతరసాధనాంతరంబులు మానినపుణ్యులు విరక్తులు।
యంత్రపుమాయల బొరలుపరులకు యెంతైనా మొక్కరు వైష్ణవులు।
తంత్రపుకామక్రోధవిదూరులు తమనిజధర్మము వదలరు।
జంత్రపుసంసారులతో వీరల సరియని యెంచగ బాపమయ్య॥

చ॥ తప్పరు తమపట్టినవ్రత మెప్పుడు దైవమొక్కడే గతియనుచు।
వొప్పగుతమపాతివ్రత్యంబున నుందురు సుఖమున వైష్ణవులు।
కప్పినశ్రీవేంకటపతిదాసులు కర్మవిదూరులు సాత్వికులు।
చెప్పకుడితరులసరిగా వీరికి సేవించగ నేధన్యుడనైతి॥

**459) లలిత**

ప॥ మాకెల్ల "రాజనుమతో ధర్మ" యిది నీ-। యాకడ గలుగుటకేమరుదు॥

చ॥ అలగరుడగమన మహిశయనంబును। కలిసి నీయందె కలిగెనటా।
పొలసినపాపము బుణ్యము నరులకు। యెలమి గలుగుటకు నేమరుదు॥

చ॥ యిదె నీడకన్ను యెండకన్ను మరి। కదిసి నీయందె కలిగెనట।
సదరపునరులకు జననమరణములు। యెదురనె కలుగుటకేమరుదు॥

చ॥ శ్రీకాంత వొకదెస భుకాంత వొకదెస। కైకొని నీకిటు గలిగెనట।
యీకడ శ్రీవేంకటేశ యిహపరము। యేకమై మాకగుటేమరుదు॥

**460) భైరవి**

ప॥ తెలియరాదు మాయాదేహమా మమ్ము। పలువికారాలబెట్టి పనిగొన్న దేహమా॥

చ॥ దినమొక్కవయసెక్కే దేహమా సారె। పెనుమదముగురిసేబెండు దేహమా।
దినదినరుచిగోరే దేహమా నన్ను। ఘనమోహపాశాల గట్టెగదె దేహమా॥

చ॥ తెలివినిద్రలుగల దేహమా నీ-। పొలము పంచభూతాలపొత్తు దేహమా।
తిలకించి పాపపుణ్యాల దేహమా। బలుపుగలదాకా బదుకవో దేహమా॥

చ॥ తీరనిసంసారపు దేహమా యిట్టె। వూరట లేనిభోగాల వోదేహమా।
కూరిమి శ్రీవేంకటేశు గొలిచితినిక నాకు। కారణజన్మమవై కలిగిన దేహమా॥

**461) లలిత**

ప॥ తహతహలిన్నిటికి తానే మూలము గాన। సహజాన నూరకున్న సంతతము సుఖము॥

చ॥ భారమైపదివేలుపనులు గడించుకొంటే। సారెసారె నలయించకపోవు।
తీరనియాసోదము దేహములో నించుకొంటే। వూరూర దిప్పితిప్పి వొరయకమానవు॥

చ॥ వుండివుండి కిందుమీదు వుపమ జింతించుకొంటే। వుండుబో మంచముకింద నొకనూయి।
కొండంతదొరతనము కోరి మీద వేసుకొంటే-। నండనే యాబహురూపమాడకపోదు॥

*****************************************************************************************************

చ॥ మనసురానిపైన మంచిని చేసుకొంటే। తినదిన వేమైన దీపవును।
తనిసి శ్రీవేంకటేశు దాసానుదాసుడైతే। యెనయుచు నేపనికెదురే లేదు॥

**462) రామక్రియ**

ప॥ ఎంతవిచారించుకొన్నా నిదియే తత్త్వము హరి। వంతుకు నీకృపగలవాడే యెరుగు హరి॥
చ॥ నిన్ను నమ్మినట్టివాడు నిఖిలవంద్యుడు హరి। నిన్ను నొల్లనట్టివాడు నీరసాధముడు।
మున్ను దేవతలు నీకుమొక్కి బదికిరి హరి। వున్నతి నసురలు నిన్నొల్లక చెడిరి హరి॥
చ॥ యేపున నీపేరిటివాడిన్నిట ధన్యుడు హరి। నీపేరొల్లనివాడు నిర్భాగ్యుడే హరి।
కైపులనిన్ను నుతించి గెలిచె నారదుడు హరి। పైపై నిన్ను దిట్టి శిశుపాలుడు వీగెను హరి॥
చ॥ యిట్టె నీవిచ్చినవరమెన్నడు జెడదు హరి। గట్టిగా నీవియ్యనివి కపటములే హరి।
అట్టె శ్రీవేంకటేశ నీవంతరంగుడవు హరి। వుట్టిపడి కానకున్న దేహికి హరి॥

**463) దేసాక్షి**

ప॥ కొండో నుయ్యో కుమతులాల। తండుముండు తట్టుముట్టు తాకైన గనుడీ॥
చ॥ కాకివోటు జముచేత కందుకుందు మరుచేత। మా కాపని గాదు మనుజులాల।
పోకుమని యాపరాదు పొమ్మని చెప్పగరాదు। మీకుమీకే చూచుకొండు మీరే కనుడు॥
చ॥ గాములిల్లు పుట్టమీదికప్పు తోలుపైకప్పు। నేమా యెరుగము నిపుణులాల।
పాముసోరికడ మీప్రాణపుటూరుపుగాలి। జాము జాము మేలుగీడు చక్కజేయ గనుడు॥
చ॥ రచ్చమానిచింతకిందు రాపులకూటమిపొందు। ముచ్చో చిచ్చో మూఢులాల।
యెచ్చరికతోడ వేంకటేశుదాసుల గూడి। పచ్చిగచ్చుమేనితోడ భయమెల్ల బాయడు॥

**464) ముఖారి**

ప॥ మోసమున మాయావిమోహితుడైపోయి। కాసుసేయనిపనికి గాసిబడె బ్రాణి॥
చ॥ కన్నులనియెడి మహాకల్ప భూజములివి। తన్ను బుణ్యునిజేయ దగిలి వచ్చినవి।
వున్నతోన్నతబుద్ధి నొనగూర్ప కది దేహి। కన్నచోటికి బరపి గాసిబడె బ్రాణి॥
చ॥ చిత్తమనియెడి మహాచింతామణి దనకు। తొత్తువలె వలసి దోడుతేగలది।
హత్తించి హరిమిద నలరింప కది వృథా। తిత్తిలో సుఖమునకు తిరిగె నీప్రాణి॥
చ॥ కామతత్త్వంబనెడి కామధేనువు దనకు। వేమారు గోరికెల వెల్లిగొలిపెడిది।
యీమేను తిరువేంకటేశు జేరకపోయి। కామాంధుడై మిగుల గతిమాలె బ్రాణి॥

**465) ఆహిరి**

ప॥ ఏమీనెరుగనిమమ్ము నెక్కువసేసి। పామరుల దొడ్డజేసె భాష్యకారులు॥
చ॥ గతచన్నవేదాలు కమలజునకు నిచ్చి। ఆతనికరుణచేత నన్నియుగని।
గతిలేకపోయిన కలియుగమున వచ్చి। ప్రతిపాలించగలిగె భాష్యకారులు॥
చ॥ లోకమెల్ల వెల్లిబోగ లోననే సురల గాచి। ఆకుమీద దేలినయతనికృప।
కాకరిమతములెల్ల గాలిబుచ్చి పరమిట్టే। పైకొనగ గరుణించె భాష్యకారులు॥
చ॥ పంకజపుజేయి చాచి పాదపుబరమిచ్చిన। వేంకటేశుకృపతోడ వెలయు దానే।
తెంకినే వొడయవరై తిరుమంత్రద్వయాన। పంకమెల్ల బోగడిగె భాష్యకారులు॥

**466) సాళంగనాట**

ప॥ వాసివంతు విడిచినవాడే యోగి యీ-। ఆసలెల్లా విడిచిన ఆతడే యోగి॥
చ॥ గద్దించి పారెడు తురగమువంటి మనసు। వద్దని మరలించినవాడే యోగి।
వొద్దనే కొండలవంటివున్న దేహగుణాలు। దిద్ది మట్టుపెట్టువాడే ధీరుడైన యోగి॥
చ॥ ముంచుకొన్న యింద్రియపు మోహజలధిలోన। వంచన మునుగునట్టివాడే యోగి।
పొంచి పుణ్యపాపములు పొట్టువంటి కర్మములు। దంచి పారజల్లువాడే తత్త్వమెరిగిన యోగి॥

చ॥ వెగటుకామాదుల వెళ్ళగొట్టి శాంతుడై। వగలుడిగినయట్టివాడే యోగి।
నిగిడి శ్రీవేంకటపతి నిజదాసుడై భక్తి। దగిలి నిలుపువాడే ధన్యుడైన యోగి॥

**467) గుండక్రియ**

ప॥ తుదిలేని బంధము తోడుసీడై నేను। వదలినా వదలదేమి సేతు॥
చ॥ గులిమికొలుచు దీరగుడువనియ్యక కొత్త- । కొలుచు మీదమీద గొలువగా।
కలసినకర్మపు గలిమిచేత దృష్ణ। వెలితిగాక యిల్లువెడల దేమిసేతు॥
చ॥ అన్నియు నొకమాటే యనుభవింపగ జేసి। కొన్నివెచ్చము లొనగూడించి।
యిన్నిటా దిరువేంకటేశ నిర్మలునిగా। నన్నుజేసి నీవు నాకు గలుగవయ్య॥

**468) సాళంగం**

ప॥ తొలుబాపపుణ్యాలతోడ బుట్టితినట। బలువైనభవముల భడలేనా॥
చ॥ గాములయింటినే కాపనయితినట। పాముపుట్టనుండియైన బతుకలేనా।
గోమునహేయపుగుండకూడు నించితినట। గామిడినేగారేతిత్తి గానోపనో॥
చ॥ కట్లైనగుణములచే కట్టువడితినట। చుట్టపుబంధాలరొమ్ముచు నోపనా।
దట్టపుటాసల నేదాల్చితినట నా- । వెట్టకాయము మోవవెరచేనా॥
చ॥ నిగిడినలోపల నీ వుండుదువట। పగవారికి నే బగిలేనా।
తగువేంకటేశ నీదయవాడనట యీ- । వగల నిన్నిట గెలువగలనా॥

**469) శ్రీరాగం**

ప॥ ఈతడఖిలంబునకు నీశ్వరుడై సకల- । భూతములలోన దా బొదలువాడితడు॥
చ॥ గోపాంగనలమెరుగు గుబ్బచన్నులమీద। చూపట్టుకమ్మ గస్తురిపూత యితడు।
తాపసోత్తముల చింతాసౌధములలోన। దీపించు సుజ్ఞానదీప మితడు॥
చ॥ జలధికన్యాపాంగ లలితేక్షణములతో। కలసి వెలుగుచున్న కజ్జలంబితడు।
జలజాసనుని వదనజలధి మధ్యమునందు। అలర వెలువడిన పరమామృతంబితడు॥
చ॥ పరివోని సురతసంపదల నింపులచేత। వరవధూతతికి పరవశమైన యితడు।
తిరువేంకటాచలాధిపుడు దానె యుండి। పరిపాలనముసేయు భారకుండితడు॥

**470) పాడి**

ప॥ వెట్టిమోపువంటిమేను విడనాడి వీ- । డిట్టె దాటిపోయె నెటువంటిజాణే॥
చ॥ ఘోరమైన ఆసలనెడికూకటవేరు దవ్వి- । పారవేసి యిడుముల బడనొల్లక।
యీరసపుసంసార మింగలము దగిలించి। యేరు దాటిపోయె నెటువంటిజాణే॥
చ॥ కన్నవారి దన్ను బ్రేమ నన్నవారి దిగనాడి। వున్నతమైనచోట నుండబోయి।
తన్నుదా వేంకటపతి దాసులజేరి వాడు। యెన్నడు దిరిగిరాడే యెటువంటిజాణే॥

**471) లలిత**

ప॥ వలవని మోహావస్థల బొరలెడి- । మలినం బెన్నడు మానును॥
చ॥ ఘోర దురితంబుల- । కారణ మెన్నడు దీరును।
వైరముగొని తనువదలని బంధపు- । భారంబెన్నడు వాయును॥
చ॥ జడమగు జిహ్వా చాపల్యముగల- । పెడమతి యెన్నడు వీడును।
చెడని జీవునకు శ్రీవేంకటపతి- । కడ చూపెన్నడు గలుగును॥

**472) బౌళి**

ప॥ ఏమివలసిన నిచ్చు నెప్పుడైనను। యేమరిక కొలిచిన నీతడే దైవము॥
చ॥ ఘనముగా నిందరికి గన్నులిచ్చు గాళ్ళిచ్చు। పనిసేయ జేతులిచ్చు బలియుడై।
తనుగొలువుమని చిత్తములిచ్చు గరుణించి। వొనర లోకానకెల్ల నొక్కడే దైవము॥

****************************************************************************************************

చ॥ మచ్చిక తనుగొలువ మనసిచ్చు మాటలిచ్చు। కుచ్చితములేని కొడుకుల నిచ్చును।
చొచ్చినచోటే చొచ్చి శుభమిచ్చు సుఖమిచ్చు। నిచ్చలు లోకానకెల్ల నిజమైనదైవము॥

చ॥ పంతమాడి కొలిచిన బ్రాణమిచ్చు ప్రాయమిచ్చు। యెంతటిపదవులైన నిట్టె యిచ్చు।
వింతవింతవిభవాల వేంకటేశుడిదె మా-। యంతరంగమున నుండే అరచేతిదైవము॥

**473)గౌళ**

ప॥ ఈతని గొలిచితేనే యిన్ని గొలలును దీరు। చెతనబెట్టుపుణ్యాలు చేరువనే కలుగు॥

చ॥ పట్టి కాళింగుని దోలి పాముకొల దీర్చినాడు। బట్టబాయిటనే రేపల్లెవారికి।
అట్టె పూతన జంపి ఆడుగొల దీర్చినాడు। గట్టిగా గృష్ణుడు లోకమువారికెల్లను॥

చ॥ బలురావణు జంపి బాపనకొల దీర్చినాడు। యిలమీద గలిగిన ఋషులకెల్లా।
కొలదిమీరినయట్టి కోతికొల దీర్చినాడు। సొలసి రాఘవుడదె సుగ్రీవునికిని॥

చ॥ వొలిసి పురాలు చొచ్చి వూర గొల దీర్చినాడు। అల తనదాసులైన అమరులకు।
సిలుగుగొలలు దీర్చి సేన వరాలిచ్చినాడు। చెలగి పురుషులకు శ్రీవేంకటేశుడు॥

**474)గుండక్రియ**

ప॥ హరిభక్తివోడ యెక్కినట్టివారలే కాని। తరగు మొరగులను దాటలేరెవ్వరును॥

చ॥ నిండు జింతాజలధికి నీళ్ళు దనచిత్తమే। దండిపుణ్య పాపాలే దరులు।
కొండలవంటి కరళ్ళు కోరికెలెందు చూచినా। తండుముండుపడేవారే దాటలేరెవ్వరును॥

చ॥ ఆపదలు సంపదలు అందులోనిమకరాలు। కాపురపులంపటాలే కైయెత్తులు।
చాపలపుగుణములే సరిజొచ్చేయేరులు। దాపుదండ చేకొని దాటలేరెవ్వరును॥

చ॥ నలపై వుబ్బునగ్గులే నిచ్చలు బోటును బాటు। బలువైనయాళే బడబాగ్ని।
యెలమి శ్రీవేంకటేశుహితులకే కాల్నడ। తలచి యితరులెల్ల దాటలే రెవ్వరును॥

**475)తోడి**

ప॥ లేదు భయము మరి కాదు భవము। ఆదియు నంత్యము దెలిసిన హరియాజ్ఞేకాని॥

చ॥ తలపులుగడుగక వొడలటు తా గడిగిననేమి। వెలుపలి కాంక్షలు వుడుగక విధులుడిగిననేమి।
అలరుచు శ్రీహరిదాస్యము ఆతుమ గలిగినయాతడు। చెలగుచు పనులైన సేసిన మరియేమి॥

చ॥ పొంచిన కోపము విడువక భోగము విడిచిననేమి। పంచేంద్రియములు ముదియకపై ముదిసిననేమి।
వించినదైవము నమ్మిన నిర్భయుడయినాతడు। యెంచుక యేమార్గంబుల నెట్టుండిననేమి॥

చ॥ వేగమే లోపల గడుగక వెలి గడిగిననేమి। యోగము దెలియక పలుచదువులు దెలిసినన నేమి।
యీగతి శ్రీవేంకటపతి నెరిగి సుఖిండేటియాతడు। జాగుల ప్రపంచమందును నతమైనా నేమి॥

**476)కేదారగౌళ**

ప॥ నారాయణాచ్యుతానంత గోవిందా। నేరరాదు విజ్ఞానము నీ వియ్యక లేదు॥

చ॥ నిగమాంతవేదులైతే నిన్నెరుగుదురుగాక। మృగసమానులలేల మీమీదిభక్తి।
వెగటుగా గృపతోడ విశ్వరూపు చూసినాను। సగటుదుర్యోధనుడు బహురూప మనడా॥

చ॥ చిరపుణ్యులైతే మీసేవలు సేతురుగాక। దురితచిత్తులకు మీత్రోవ యేటికి।
గరిమ బ్రత్యక్షమై కంబములో గలిగినా। హిరణ్యకశిపుడు మిమ్మెంచి శరణనెనా॥

చ॥ దేవతలయితే మిమ్ము దెలియనేర్తురుగాక। యేవల నసురలు మిమ్మెరిగేరా।
శ్రీవేంకటాద్రిమీద సిరితో నీవుండగాను। కేవలసంసారు లెరిగియును మరవరా॥

**477)సావేరి**

ప॥ ఎక్కడిమతము లింక నేమి సోదించేము నేము। తక్కక శ్రీపతి నీవే దయజూతుగాక॥

చ॥ కాదనగ నెట్టవచ్చు కన్నులెదుటి లోకము। లేదనగ నట్టవచ్చు లీలకర్మము।
నీదాసుడ ననుచు నీమరుగు చొచ్చుకొంటే। యేదెసనైనా బెట్టి యీడేరింతుగాక॥

చ॥ తోయ నెట్టవచ్చు మించి తొలకేటి నీమాయ। పాయనెట్టవచ్చు యీభవబంధాలు।
చేయూర నిన్ను బూజించి చేరి నీముద్రలు మోచి। యీయెడ నీవే యీడేరింతుగాక॥
చ॥ తెలియగ నెట్టవచ్చు ద్రిష్టమైననీమహిమ। తలచగ నెట్టవచ్చు తగునీరూపు।
నెలవై శ్రీవేంకటేశ నీవు గలవనుండగా। యిలమీద మమ్ము నీవే యీడేరింతుగాక॥

**478) కాంభోజి**

ప॥ ఏమి చేచే మిక నేము యెంతని దాచుకొందుము। నీమహిమ యింతంతన నేరము నేమయ్యా॥
చ॥ అంది నిన్ను నొకమాటు హరి యని నుడిగితే। పొందిన పాతకమెల్లా బొలసిపోయ।
మందలించి మరి యొక మాటు నుడిగినఫల- । మందె నీ కప్పగించితి మదిగోవయ్యా॥
చ॥ యిట్టె మీకు రెండుచేతులెత్తొకమాటు మొక్కితే। గట్టిగా నిహపరాలు గలిగె మాకు।
దట్టముగ సాష్టాంగదండము వెట్టినఫల- । మట్టె నీమీద నున్నది అదిగోవయ్యా॥
చ॥ సరుగ నీకొక మాటు శరణన్న మాత్రమున। సిరుల ఋణ్యుడనైతి శ్రీవేంకటేశ।
ధరలోన నే నీకు దాసుడనైనఫల- । మరయ నీమీద నున్న దదిగోవయ్యా॥

**479) కన్నడగౌళ**

ప॥ కటకటా దేహంబు గాసిబెట్టగవలసె। నిటువంటిదెసలచే నిట్లుండవలసె ॥
చ॥ చంపనొల్లకకదా సంసారమనియెడి- । గంపమోపు గడించె కర్మసంగ్రహము।
లంపటము విరియించ లావుచాలక తుదిని। దింప నొకకొంతైన తెగుదెంపులేదు॥
చ॥ మనుపనోపకకదా మాయావిలంబమున। కనుమూసి కాంక్ష మరి కట్టె దైవంబు।
దినభోగములు విడువ దెరగేమిటను లేక। తనివిబొందించ నెంతయు వసముగాదు॥
చ॥ తెలుపనోపకదా తిరువేంకటేశ్వరుడు। వెలలేనివేదనల వేచె బ్రాణులను।
బలిమి నజ్ఞానంబు బాయలే కితనినే। తలచి భవబంధముల దాటంగరాదు॥

**480) సామంతం / భైరవి**

ప॥ అయ్యోపోయ బ్రాయము గాలము। ముయ్యంచుమనసున నే మోహమతి నైతి॥
చ॥ చుట్టంబులా తనకు సుతులు గాంతలు జెలులు। వట్టియాసల బెట్టువారేకాక।
నెట్టుకొని వీరు గడునిజమనుచు హరి నాత్మ। బెట్టనేరక వృథా పిరివీకులైతి॥
చ॥ అంతహితులా తనకు నన్నలును దమ్ములును। వంతువాసికి బెనగువారేకాక।
అంతరాత్ముడు శ్రీవేంకటాద్రీశు గొలువకిటు। సంతకూటముల యలజడికి లోనైతి॥

**481) ధన్యాసి**

ప॥ ఎంతవిభవము గలిగె నంతయును నాపదని। చింతించినదిగదా చెడని జీవనము॥
చ॥ చలము గోపంబు దను జంపేటిపగతులని। తెలిసినది యదిగదా తెలివి।
తలకొన్న పరనింద తనపాలి మృత్యువని। తొలగినది యదిగదా తుదగన్నఫలము॥
చ॥ మెరయువిషయములే తనమెడనున్న వురులుగా। యెరిగినది యదిగదా యెరుక।
పరివోనియాస దను బట్టుకొను భూతమని। వెరచినది యదిగదా విజ్ఞానమహిమ॥
చ॥ యెనలేని తిరువేంకటేశుడే దైవమని। వినగలిగినదిగదా వినికి।
అనయంబు నతని సేవానందపరులయి। మనగలిగినదిగదా మనుజులకు మనికి॥

**482) సామంతం / వసంత**

ప॥ అందరివలెనే వున్నాడాతడా వీడు। యిందుముఖుల గూడినా డీతడా నాడు॥
చ॥ యిందరూ నేటేట జేసేయింద్రయాగపు ముద్దలు। అందుకొని యారగించినాతడా వీడు।
చెంది మునులసతులసత దెప్పించుక మంచి। విందులారగించినాడు వీడానాడు॥
చ॥ తొలుత బ్రహ్మదాచిన దూడలకు బాలులకు। అలరి మారుగడించినాతడా వీడు।
నిలుచుండేడుదినాలు నెమ్మది వేలగొండెత్తి। యిల నావుల గాచినా డీతడా నాడు॥

********************************************************************************************************

చ॥ బాలుడై పూతనాదుల బలురక్కసుల జంపి। అలరియాటలాడిన యాతడా వీడు।
యీలీల శ్రీవేంకటాద్రి యెక్కినాడు తొలుతే। యేలెను బ్రహ్మాదుల నీతడానాడు॥

**483) కల్యాణి**

ప॥ నీయంతటివారెవ్వరు నీకు నెదురేది యెందు। చాయల నీసుద్ది విని శరణంటినేను॥

చ॥ కావలెనంటే దొల్లి కంభము చించుకవెళ్ళి। కైవశమై ప్రహ్లాదు గావవా నీవు।
తేవలనంటె బ్రహ్మదేవునికి వేదములు। సోవల సముద్రమయిన చొచ్చి తేవానీవు॥

చ॥ పట్టియెత్తవలెనంటే బాతాళాన బడ్డకొండ। తట్టియెత్తి పాలవెల్లి దచ్చవా నీవు।
మట్టుపెట్టవలె నంటే మరిభూమి చాపగాగ। చుట్టుకపోతే దెచ్చి సొంపుగ నిలుపవా॥

చ॥ పక్షపాతమయ్యేనంటే బాండవుల గెలుపించి। యోక్షితి నేలించి చనవియ్యవా నీవు।
రక్షించేనంటే గాచరావ శ్రీవేంకటాద్రి బ్ర-। త్యక్షమై మావంటివారి దగ గరుణించవా॥

**484) దేసాళం / ఖరహరప్రియ**

ప॥ నే ననగా నెంతవాడ నెయ్యపుజీవులలోన। యీనెపాన రక్షించీ నీశ్వరుడేకాక॥

చ॥ యెవ్వరు బుద్ధిచెప్పిరి యిలపై జీమలకెల్లా। నెవ్వగ బుట్టల గొల్చు నించుకొమ్మని।
అవ్వల సంసారభ్రాంతి అనాదినుండియు లోలో। దవ్వించి తలకెత్తే యంతర్యామేకాని॥

చ॥ చెట్టులకెవ్వరు బుద్ధిచెప్పేరు తతికాలాన। బుట్టికాచి పూచి నిండా బొదలుమని।
గుట్టుతో జైతన్యమై గుణములన్నిటికిని। తిట్టపెట్టి రచించినదేవుడింతేకాక॥

చ॥ బుద్ధులెవ్వరు చెప్పిరి పుట్టినట్టి మెకాలకు। తిద్దిచన్ను దాగి పూరిదినుమని।
పొద్దువొద్దు లోననుండి భోగములు మరిపిన। నిద్దపు వేంకటాద్రినిలయుండేకాక॥

**485) ధన్యాసి / బేగడ**

ప॥ హరిదాసులతోడ నల్పులు సరెననరాదు। గురుడు శిష్యుడననే గురిదప్పుగానా॥

చ॥ కోరినముత్యపు జిప్పల గురిసిన వానయు। సారె బెంకులలోవాన సరియౌనా।
శ్రీరమణుడన్నిటాను జేరియుంటే నుండెగాక। సారెకు బాత్రాపాత్రసంగ తంతాలేదా॥

చ॥ మలయాద్రి మాకులును మహిమీది మాకులును। చలమున నెంచిచూడ సరియౌనా।
అలరిదేవుడు అంతర్యామియైతే నాయగాక। తెలియగ క్షేత్రవాసి దిక్కులందు లేదా॥

చ॥ అమరులజన్మములు నసురలజన్మములు। బమళి బుట్టినంతలో సరియౌనా।
అమరి శ్రీవేంకటేశు డాతుమైతే నాయగాక। తమితో నధికాతిభేదములు లేవా॥

**486) లలిత / బిలహరి**

ప॥ తుద సమస్తమును దుర్లభమే। అదె సులభుడు మాహరి యొకడే॥

చ॥ సురలును నరులును సొంపగుసిరులును। వొరసిన నిన్నియు నుపాధులే।
నిరుపాధికుడును నిజకరుణానిధి। అరయగ నిదె మాహరి యొకడే॥

చ॥ అందరియావులు నఖిలకర్మములు। అందగరాని ప్రయాసములే।
యిందిరారమణి నేచినసేవిది। చెందరు సుజనులు చెప్పంగలదే॥

చ॥ యితరోపాయము లేవి చూచిన। శ్రుతివిరహితములు శూన్యములే।
రతి శ్రీవేంకటరమణునిమతి యిది। హితపరిపూర్ణంబిది యొకటే॥

**487) నాట**

ప॥ అతి సులభంబిదె శ్రీపతి శరణము అందుకు నారదాదులు సాక్షి।
ప్రతిలేదిదియే నిత్యానందము బహువేదంబులె యివే సాక్షి॥

చ॥ వేసరకుమీ జీవుడా వెదకివెదకి దైవమును।
ఆసపాటుగా హరి యున్నాడిదె అందుకు ప్రహ్లాదుడు సాక్షి।
మోసపోకుమీ జన్మమా ముంచినయనుమానములను।

******************************************************************************************

సేసినభక్తికి జేటులేదు యీనేతకెల్ల ధృవుడే సాక్షి॥
చ॥ తమకించుకమీ దేహమా తగుసుఖదుఃఖంబుల నలసి।
అమితము నరహరికరుణ నమ్మితే నందుకు నర్జునుడే సాక్షి।
భ్రమయకుమీ వివేకమా బహుకాలంబులు యీదీది।
తమితో దాస్యము తను రక్షించును దానికి బలీంద్రుడే సాక్షి॥
చ॥ మరిగివుండుమీ వోజిహ్వా మరి శ్రీవేంకటపతిసుతులు।
అరయగ నిదియే యీడేరించును అందుకు వ్యాసాదులె సాక్షి।
తిరుగకుమీ విజ్ఞానమా ద్రిష్టపుమాయలకును లోగి।
సరిలే దితనిపాదసేవకును సనకాదులబ్రదుకే సాక్షి॥

**488)ఆహిరి/తోడి**

ప॥ చెల్లుగా కిట్టు నీకే చింతింపగా పూరి- । పుల్ల మేరువుసేయ భూమిలో నిపుడు॥
చ॥ చెలగి నే మునుసేసినచేత లుండగా। మలసి నే తిరుగుతిమ్మట లుండగా।
తొలగదోసి తుప్పుడుతోడనే లోహంబు। వెలయ బంగారుగావించినగతిని॥
చ॥ బిగిసి నామైనున్న పెనుకట్లుండగా। జగడగాండ్లు పగచాటగను।
జిగిగలచేతి ముసిడికాయయగు నన్ను। మొగి గల్పకముఫలముగ జేయవసమా॥
చ॥ పొదలిన యింద్రియంబులు వెంట రాగా। మదవికారము నే మరుగగానే।
వదలక వేంకటేశ్వర నన్ను నిదే నీ- । పదపంకజములు చేర్పగ నిది వసమా॥

**489)వరాళి**

ప॥ వట్టియాసలకు లోనై వదలక తిరిగాడేవు।
బట్టబయలు యీసంసారంబని గుట్టుదెలియలేవు ప్రాణీ॥
చ॥ చాలనమ్మి యీసంసారమునకు సోలిసోలి తిరిగేవు।
బాలయవ్వన ప్రౌఢలభ్రమ బడి లోలుడవై తిరిగేవు।
మేలుదెలియ కతికాముకుండవై మీదెరుగక తిరిగేవు।
మాలెమీద పరువెందాకా నీమచ్చిక విడువగలేవు॥
చ॥ మానితముగ దురన్నపానముల మత్తుడవై వుండేవు।
నానావిధముల దుష్కర్మంబులు నానాటికి నాటించేవు।
మేనిలోని యేగురు నార్గురును మిత్రులనుచు నమ్మేవు।
ఆనందంబున నాకర్మమునకు అధిపతులని తెలియగలేవు॥
చ॥ పామరివై దుర్వ్యాపారమునకు పలుమారును బొయ్యేవు।
వేమరు దుర్జనసంగాతంబులు విశ్రామమనుచు నుండేవు।
ప్రేమతో హరిదాసులపై సంప్రీతి నిలుపగాలేవు।
తామసమతివయి వేంకటనాథునితత్త్వ మెరుగగాలేవు॥

**490)దేసాక్షి / అఠాణ**

ప॥ దేవ నీదయ యెంతునో దివ్యసులభమెంతునో। కావించి అంటగటుక కాచుకుండె విదివో॥
చ॥ వెదక నావసమా వేగుదాకా నిన్ను నేను। కదిసి నీమూరితి కానవసమా।
యెదుట శంఖుచక్రాల యెట్టిదైవమ నేనని। పొదుగుచు నీకు నీవే పొడచూపేవుగాక॥
చ॥ పొగడ నావసమా పురుణించి నీగుణాలు। తగుల నావసమా నీతలపెరిగి।
విగిడి వేదశాస్త్రాల నిన్ను నీవేచెప్పుకొని। పగటుమాయజ్ఞానము పాపేవింతేకాక॥
చ॥ కొలువ నావసమా గురుతెరిగి నీవెంట। చెలగి నాచేతుల బూజించవసమా।
నిలిచి శ్రీవేంకటేశ నీవే నాయదలో నుండి। మలసి పెరరేపుచు మన్నించేవుగాక॥

*********************************************************************************************************

491)భైరవి

ప॥ ఎంతపాపకర్మమాయ యెంతవింతచింతలాయ। వింతవారితోడిపొందు వేసటాయ దైవమా॥

చ॥ చూడజూడ గొత్తలాయ చుట్టమొకడు లేడాయ। వీడుబట్టు అలుచాయ వేడుక లుడివోయను।
జోడుజోడు గూడదాయ చొక్కుదనము మానదాయ। యేడకేడ తలపోత యెంతసేసె దైవమా॥

చ॥ నీరులేనియేరు దాటనేర దెంతేలోతాయ। మేరవెళ్ళ నీదడాయ మేటి జేరడాయను।
తోరమైన ఆసలుబ్బి తోవ గానిపించదాయ। కోరి రాకపోకచేత కొల్లబోయ గాలము॥

చ॥ తల్లిదండ్రి దాత గురువు తానెయైననాచారి-। వల్లభుండు నాకు మేలువంటిదాయ జన్మము।
కల్లగాదు వేంకటేశుఘనుని పాదసేవ నాకు। మొల్లమాయ నామనసు మోదమాయ దైవమా॥

492)శ్రీరాగం

ప॥ ఈభవమునకు జూడ నేది గడపల తనదు-। ప్రాభవం బెడలించి బాధపెట్టించె॥

చ॥ చెప్పించె బ్రియము వలసినవారలకునెల్ల। రప్పించె నెన్నడును రానిచోట్లకును।
నొప్పించె నాసలకు వోరంత ప్రొద్దునను। తిప్పించె కోరికల తిరిగి నలుగడల॥

చ॥ పుట్టించె హేయంపుభోగయోనులనెల్ల। కట్టించె సంసారకలితబంధముల।
పెట్టించె ఆసలను పెడకొడముల దన్ను। తిట్టించె నిజద్రవ్యదీనకులచేత॥

చ॥ బెదరించె దేహంబు పెనువేదనలచేత। చెదరించె శాంతంబు చెలగి చలమునను।
విదళించె భవములను వేంకటేశ్వరు గొలిచి। పదిలించె నతనికృప పరమసౌఖ్యములు॥

493)వరాళి

ప॥ ఏమందును యీమాటకు నిందరూ నిన్ను। నీమాయ యెంతైనా నిన్ను మించవచ్చునా॥

చ॥ నేను నిన్ను గొలిచితి నీవు నన్ను నేలితివి। పూని పంచేంద్రియాలేల పనిగొనీవి।
కానిలేనిబంట్ల దేరకాండ్లు వెట్టిగొనగ। దానికి నీ వూరకుండ ధర్మామా సర్వేశ్వరా॥

చ॥ పుట్టించినాడవు నీవు పుట్టినవాడను నేను। వట్టి కర్మమేల నన్ను బాధపెట్టీని।
వొట్టినసొమ్ముకు పెరొకరు చేయిచాచితే। తట్టినీవు వహించుకోదగదా సర్వేశ్వరా॥

చ॥ యెదుట నీవు గలవు యిహములో నే గలను। చెదరిన చిత్తమేల చిమ్మిరేచీని।
అదన శ్రీవేంకటేశ ఆరితేరినట్టినన్ను। వదలక రక్షించుకో వన్నెగా సర్వేశ్వరా॥

494)ముఖారి

ప॥ ఏల పొరలేవులేవే యింత లోనిపనికి। మాలయింటి తోలుకప్పు మాయ లిటువంటివి॥

చ॥ చిక్కులతమకముల చీకటిగప్పిననాడు। యెక్కువ వాసనలౌహేయపుమేను।
వెక్కసపు ప్రియమది విరిగితే రోతలౌ। లక్కపూతకపురు లీలాగు లిటువంటివి॥

చ॥ మించినచిత్తములో మేలుగలిగిననాడు। యెంచరానిచవులౌ నెంగిలిమోవి।
పెంచుకొంటే కష్టమౌ ప్రియముదీరిననాడు। చంచలపు చిత్తములచంద మిటువంటిది॥

చ॥ వెల్లిగొనుసురతపువేళ మరపులయింపు। కొల్లలాడుటౌ కొనగోరితాకులు।
నల్లితిండౌ మరి మీద మరగితే రోతలౌ। వుల్లమిచ్చేవేంకటేశువొద్ది కిటువంటిది॥

495)పాడి / ఝుంఝూటి

ప॥ వెన్నలు దొంగిలునాటి వెర్రివా నీవు। విన్నకన్న జాడగాదు వెర్రివా నీవు॥

చ॥ చేరి నిన్ను నొల్లనట్టిజీవుల నీవుదరాన। వీరుడవై మోచేవు వెర్రివానీవు।
నారపేరు నుడిగితే నాపేరంటా దగిలేవు। వీరాన జుట్టమై వెర్రివా నీవు॥

చ॥ బంటులైనవారికి బరతంత్రుడవై యీ-। వెంట వెంట దిరిగేవు వెర్రివా నీవు।
అంటే ననరాదు రెండు అడుకులకే చొచ్చేవు। వింటే మాకు నవ్వువచ్చీ వెర్రివా నీవు॥

చ॥ పావనులయి లోకమెల్లా బదుకుమంటా బేళ్ళు। వేవేలు వెట్టుకొంటివి వెర్రివా నీవు।
శ్రీవేంకటేశుడవై చెంది వరము లిచ్చేవు। వేవేగ నెవ్వరికైనా వెర్రివా నీవు॥

************************************************************************************************************

**496) శంకరాభరణం**

ప॥ ఇందుకేపోవెరగయ్యీ నేమందును। కందులేని నీమహిమ కొనియాడగలనా॥

చ॥ అటుదేవతలకెల్ల నమృతమిచ్చిననీవు। యిటు వెన్న దొంగిలుట కేమందును।
పటుగతి బలీంద్రుని బంధించినట్టి నీవు। నట రోలగట్టవడ్డచందాన కేమందును॥

చ॥ కలిగి యాకరిరాజు గరుణ గాచిననీవు। యిల నావుల గాచుట కేమందును।
తలవ బ్రహ్మాదిదేవతలకు జిక్కనినీవు। చెలులకాగిళ్ళకు జిక్కితి వేమందును॥

చ॥ భావించ నన్నిటికికంటే బరమమూర్తివి నీవు। యీవల బాలుడవైతి వేమందును।
కావించి బ్రహ్మాండాలు కడుపున నిడుకొని। శ్రీవేంకటాద్రినిలిచితి వేమందును॥

**497) దేసాక్షి / హరికాంభోజి**

ప॥ మరిహరిదాసుడై మాయల జిక్కువడితే। వెరపించబోయి తనే వెరచినట్లవును॥

చ॥ శూరుడైనవాడేడజొచ్చిన నడ్డములేదు। ఆరీతిజ్ఞానికి విధులడ్డములేవు।
కారణాన నప్పటినీ గలిగెనా నది మరి। తేరిన నీళ్ళవండు దేరినట్లవును॥

చ॥ సిరులరాజైతే నేమిచేసిన నేరమి లేదు। పరమాధికారియైతే బాపములేదు।
అరసి తనకుదానే అనుమానించుకొనెనా। తెరువే పో సుంకరి దెలిపినట్లవును॥

చ॥ భూమెల్లా మేసినా నాబోతుకు బందెలేదు। నేమపుబ్రపన్నునికి నిందలేదు।
యీమేర శ్రీవేంకటేశ్వరుని శరణని। సోమరి కర్మమంటితే జంటీగ కతవును॥

**498) కాంభోజి**

ప॥ సంతలే చొచ్చితిగాని సరకు గాననైతి। యింతట శ్రీహరి నీవే యిట దయజూడవే॥

చ॥ కాంతచనుగొండలు కడకునెక్కితిగాని। యెంతైనా మోక్షపుమెట్లు యెక్కలేనైతి।
అంతట జవ్వనమనే అడవి చొచ్చితిగాని। సంతత హరిభక్తనే సంజీవి గాననైతి॥

చ॥ తెగి సంసారజలధి దిరుగలాడితిగాని। అగడైవైరాగ్యరత్న మది దేనైతి।
పొగరుజన్మాలరణభూములు చొచ్చితిగాని। పగటుగామాదులపగ సాధించనైతి॥

చ॥ తనువనియెడికల్పతరువు యెక్కితిగాని। కొనవిజ్ఞానఫలము గోయనైతి।
ఘనుడశ్రీవేంకటేశ కమ్మర నీకృపచేత। దనిసి యేవిధులను దట్టుపడనైతి॥

**499) లలిత**

ప॥ శరణంటి మాతని సమ్మంధమునజేసి। మరిగించి మమునేలి మన్నించవే॥

చ॥ సకలవేదములు సంకీర్తనలుచేసి। ప్రకటించి నిను బాడి పావనుడైన।
అకలంకుడు తాళ్ళపాకన్నమాచార్యుల। వెకలియై యేలిన శ్రీవేంకటనిలయ॥

చ॥ నారదాది సనకసనందాదులవలె। పేరుపడి నిన్ను బాడిపెద్దలైనట్టి।
ఆరీతి దాళ్ళపాకన్నమాచార్యుల। చేరి యేలినయట్టి శ్రీవేంకటనిలయ॥

చ॥ సామవేద సామగాన సప్తస్వరములను। బాముతో నీసతినిన్ను బాడినయట్టి।
ఆముకొన్న తాళ్ళపాకన్నమాచార్యుల। వేమరుమెచ్చిన శ్రీవేంకటనిలయా॥

**500) రాగమాలిక**

ప॥ లాలనుచు నూచేరు లలనలిరుగడల। బాలగండవీర గోపాలబాల॥ -- (నీలాంబరి)

చ॥ ఉదుట గుబ్బల సరసము లుయ్యాల లూగ। పదరి కంకణరవము బహుగతులమ్రోగ।
వొదిగి చెంపల కొప్పు లొక్కింత వీగ। ముదురు చెమటల నళికములు తొప్పదోగ॥ -- (మోహన)

చ॥ సొలపు తెలిగన్నుగవ చూపులిరువంక। మలయు రవళులకు బహుమారును బెళంక।
కొలది కోవిగములు క్రోలుమదనాంక-। ములగ్రేణిసేయు రవములు వడిదలంక॥ -- (హుస్సేని)

చ॥ సరుస పదములు జంగ చాపుచే బాయ। గురులీల మీగళ్ళ గుచ్చెళ్ళరాయ।
కరమూలముల కాంతి కడుజాయజేయు। సరస నురుకుసుమ వాసన లెదురుడాయ॥ -- (సారంగ)

************************************************************************************************************

చ॥ కొలది నునుమేనుల కూనలసి యాడ। మెలకువతో నొకరొకరి మెచ్చి సరిగూడ।
తలలూచి చొక్కి చిత్తరు బొమ్మలాడ। అలరి యెల్లరు మోహనా కృతులు చూడ॥ -- (కాపీ)

చ॥ లలిత తాంబూల రసకలితంబులైన। తళుకు దంతములు కెంపుల గుంపులీన।
మొలక వెన్నెల డాలు ముసురు కొనితోన। చెలగి సెలవుల ముద్దు చిరునవ్వులాన॥ -- (లలిత)

చ॥ మలయ మారుత గతులు మాటికి జెలంగ। పలుకు గపురపు తావి పైపై మెలంగ।
పలుగాన లహరి యింపుల రాల్గరగంగా। బలసి వినువారి చెవి బడలిక దొలంగ॥ -- (మధ్యమావతి)

చ॥ లలనా జనాపాంగ రలిత సుమచాప। జలజలోచన దేవ సద్గుణ కలాప।
తలపు లోపల మెలగు తత్త్వప్రదీప। భళిర గండపరేశ పరమాత్మరూప॥ -- (సురటి)